ఆంధ్రమహిళ

సంపుటి 7 :: మే '50 :: సంచిక 1

ముఖచిత్రం—నర్తకి.

చిత్రకారుడు—శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే

ఆశీస్సులు, అనువాదాలు, గేయాలూ, గీతాలూ, చిన్నకథలూ, పెద్దకథలూ, వ్యాసాలూ,

సమీక్షలూ, ఇంకా ఎన్నో ...

త్రివర్ణ చిత్రం, ఛాయాచిత్రాలూ.

సంపాదకురాలు శ్రీమతి దుర్గాబాయి, యం. యే. బి. యల్.,

సహసంపాదకురాలు శ్రీమతి చన్నఘంటమ్మ, యం. యే., యల్. టి.

ఆంధ్రమహిళా సభ, మైలాపూర్

సంవత్సర చందా అయిదు రూపాయలు

ఆంధ్రమహిళ

సంపుటి 7 మే 1950 సంచిక 1

అర్ధపుష్కరం

మా "ఆంధ్రమహిళ" ఊహించుకున్న సేవా సౌధంలో 6 అంతస్తులు సక్రమంగా నిర్మాణమయ్యాయి. 7వ అంతస్తు అతి ఉత్సాహంతో ఉత్సవసరంజాముతో ఆరంభించుకుంది. గతంలో వీచిన ప్రచండ వాయువుల తాకిడిని ఎదిర్చి నిశ్చలంగా నిలువగలిగినదంటే, మా మహిళ యొక్క పునాది ప్రాబల్యమును లక్ష్యసుద్ధిని గూర్చి వేరుగా ప్రసంగించుట యనావశ్యకము. స్వార్థరహితమైన సేవాకాంక్ష దీనిపునాది. స్త్రీ జనాభ్యుదయదాయకమగు ఉత్తమ విద్యాసంస్కృతుల వ్యాప్తి దీని పరిశుద్ధలక్ష్యము. కుల మత వివక్షతలు, రాజకీయ కక్షలు, ధనవ్యామోహము అనే విష వాయువులు చొరని వాతావరణములో ప్రజామోదము, ప్రజానురాగము, ప్రజా సహకారమనే రాతి స్తంభములపై జరిగే నిర్మాణమిది.

వ్యక్తిగతం కానట్టి, సామాజికమైన, ప్రజలకు సంబంధించిన ఏ కార్య క్రమములోని నిజ తత్వాన్నైనా అవలీలగా కనిపెట్టగలిగిన చైతన్యం ప్రజలలో దినదినాభి వృద్ధిపొందుతూ ఉన్నది. అందువలన ఏ కార్యక్రమ విజయానికైనా ప్రజాదరణ, ప్రజానుమోదము, మరువరాని దోహదము లగుచున్నవి. ప్రజాయుగములో యిది గుర్తించవలసిన పరమ సత్యం. ఆశయములలోగాని, అనుసరణలోగాని, ఎట్టి సంకుచిత మంకురించినా, ఎట్టి కల్మషము కాలుపెట్టినా, ఎట్టి స్వార్థపరత ఉద్భవించినా, ప్రజలు వెంటనే గ్రహించగలరు. క్రమంగా వారిలో అసహనము కలుగుట, వారి సహకారము లోపించుట తత్ఫలితములౌతవి. అట్టి కార్యక్రమముయొక్క గతము ఎంత విజయవంతముగా సాగినా, భవిష్యత్తు శూన్యమనుటలో అతిశయోక్తిలేదు.

ఉదాహరణకు, మన కాంగ్రెసు సంస్థయే చూడండి ఇది ఎంత పవిత్రమైన ఆశయములతో ఎంత అపూర్వమైన లక్ష్యముతో ప్రారంభమైనది? ఎంతటి ఘనమైన స్వార్థత్యాగము, ఎంత నిశ్చలమైనదీక్ష, ఎంత అసమానమైన ఏకాగ్రత, ఎంత అద్వితీయమైన ప్రజానుమోదముతో వర్ధిల్లినది? దేశీయోద్యమమును లేవనెత్తి, ప్రపంచ చరిత్రలో ఇతః పూర్వము కని విని ఎరుగని శాంతి యుత

అర్ధపుష్కారం

మైన, రక్తపాత రహితమైన మహత్తర విప్లవమును సాగించి, ఎంతటి దిగ్విజయమును గాంచినది? అట్టి సంస్థయందు ఇప్పుడు ప్రజలకు విశ్వాసము క్షీణిస్తున్నదంటే, అసంతృప్తి కలుగుతున్నదంటే, కారణమేమి? ఉద్యమ సమయంలో తలచూపక అణగిమణగి పడియున్న స్వార్థం, ధనాకాంక్ష, పదవీకాంక్ష, అవినీతి, కుల మత వివక్షత, స్వపరభేదం, ఇప్పుడు సంస్థసభ్యులలో చెలరేగి, వాతావరణమును కలుషపరచి, బహువిధములైన అశిక్షణకు, చీలికలకు తావిచ్చుటయే దీనికి ప్రధాన కారణము కాదా? ఈ విషవాయువు తాకిడికి సంస్థయొక్క పునాదులే సడలిపోవుట లేదా? ఇట్టి ఊగులాడే సంస్థయందు ప్రజానురాగము క్షీణించుటలో ఆశ్చర్యమేమి కలదు?

అందులకే, ఈ ప్రజాయుగంలో ఏ నిర్మాణమునైనా సాధించాలంటే, ఆశయము అనుసరణ రెండూకూడ పరిశుద్ధముగ నున్ననాడే అది సమకూరగలదు ఈ పరమ సత్యమును గుర్తించుకొని, తన ఆశయములను మరియొకమారు స్ఫురించి, సేవాయాత్రలో అవక్రగతిలో సాగిపోదామని, యీ జన్మదిన శుభసమయంలో మా ఆంధ్రమహిళ తన దీక్షను పునరుద్ఘాటిస్తూ ఉన్నది. దైవ, కృపతో పెద్దల ఆశీర్వచనములతో, సహృదయుల శుభాకాంక్షలతో చిరకాలము తన కార్యక్రమాన్ని సాగించగలదని విశ్వసిస్తూ ఉంది.

జై హింద్

★

కృతజ్ఞత

మా ఆంధ్రమహిళ యందుగల అవ్యాజమైన ఆదరాభిమానములతో ఎంతోమంది రచయితలు, తమ చక్కటి రచనలను జన్మదిన సంచికలో ప్రచురించుటకై పంపియున్నారు. వారికి మా హృదయ పూర్వక కృతజ్ఞత.

స్థలాభావముచేతను, వ్యవధిలేకను, మాకందిన రచనలన్నియు మా మనసుకు తృప్తి కలుగునట్లు ప్రచురించ లేనందులకు మిక్కిలి చింతించుచున్నాము. ఈ మాచేతకామిని రచయితలు వేఱువిధముగా భావించకుందురని కోరుచున్నాము.

జన్మదిన సంచికకై ప్రత్యేకముగను, సాధారణ సంచికలకు తరచుగను తమ రచనలతోను, చిత్రములతోను సహకరించిన పలువురకు మా ధన్యవాదములు.

సంపాదకురాలు

స్త్రీ
చరిత్రలో ఆమెకుగల స్థానము

ఆచార్య ప్రతాపగిరి రామమూర్తి

స్త్రీకి యోగ్యమయిన స్థానము వంటయిల్లే యనుఅభిప్రాయము సాధారణముగా దేశమంతటను వ్యాపించియున్నది. ఆమె ఇంటిపనులు చక్కబెట్టుకొనుటలో నేర్పుగల ఇల్లాలును, బిడ్డలసంరక్షణ జాగ్రత్తతో నెరవేర్చుకోగల తల్లియును కావలెను; భర్తయాజ్ఞానుసారముగా భర్తసౌఖ్యమునకు తగినట్లు ఇల్లుతీర్చి దిద్దుచుండవలెను. అతనివలన అతని వంశాభివృద్ధికి సంతానవంతురాలయి, కన్నబిడ్డలను పెంచి పెద్దవారినిచేయవలెను. భర్తను దేవునిగాభావించి, భక్తితో సేవిస్తూ అతనికి కావలసిన పరిచర్యచేస్తూ, తనపాతివ్రత్యగరిమచే పరమపదమును పొందవలెను.

ఇదే పరమయోగ్యమయిన స్త్రీధర్మమను ఆశయము పూర్వకాలములో ఉదయించి నేటివరకును కొంతవరకైన నిలిచియున్నది. ఈఆశయమును సమర్థించు కొనియాడుటకు కావలసినంత అవకాశము లేకపోలేదు. పురుషధర్మమునుబట్టి పురుషునకొక విశిష్టస్థానమున్నట్లు, స్త్రీధర్మమునుబట్టి స్త్రీకి కూడా ఒక విశిష్టస్థానమున్నది. లేదని ఎవరునుచెప్పరు, చెప్పజాలరు. కొన్ని కార్యములను నెరవేర్చుటకు స్త్రీఅన్ని విధములా సమర్థురాలు; కొన్ని కార్యములను నెరవేర్చుటకు మాత్రము ఆమెకు సమర్థతలేదు. స్త్రీపురుషులకీ తారతమ్యము ప్రకృతిసిద్ధమయి, సృష్టిలో వ్యాపించి యున్నది; గనుకనే, సంఘమందును, ఇంటియందును స్త్రీ పురుషులు భిన్నమైనస్థానములను ఆక్రమించవలసి యున్నది.

పై వివరించిన కారణములనుబట్టి స్త్రీ పురుషుని మీద ఆధారపడి, పురుషునికి లోబడియున్నది. చరిత్రలో ఆమె ప్రసక్తిలేదు; ఆమెకు చెప్పదగిన స్థానములేదు. మానవజీవితమందు పరిణమిస్తుఉన్న నాగరికతకు, సంస్కృతికి పురుషుడే కర్తయయినట్లు, పురుషుల ఘనకార్యములేకాని స్త్రీల తోడ్పాటు చారిత్రక ప్రసంగములలో కనపడదు. మానవ చరిత్ర అనగా పురుషుని చరిత్రయేకాని స్త్రీచరిత్రకాదన్నట్లే చరిత్ర పరిణమించినది.

ఐతే, మానవోదయ కాలమునుండి నేటివరకును స్త్రీపురుషు లిరువురును కలిసిమెలసి సన్నిహిత సంబంధముతో జీవయాత్రసాగిస్తు వచ్చినవారే; ఇరువురును మానవ జాతివారే; ఇరువురును మానవాశయములు, మానవాభిమానములు సమముగా గలవారే, కనుక, మానవచరిత్ర ఎంతవరకు పురుషునిదో అంతవరకు స్త్రీదికూడాను.

దీనినిబట్టి తేలిన విషయమేమంటే: మానవులు చేయవలసిన కార్యకలాపములో కొంతవిభాగమేర్పడి స్త్రీలు కొన్నికార్యములను పురుషులు కొన్నికార్యములను చేస్తూ వచ్చినా మొత్తముమీద కావలసిన కార్యనిర్వహణ విధానములోను తత్ఫలితములోను భేదమేమీలేదు. మానవ జాతిధర్మములో ఎంతవరకు స్త్రీపురుషులు భాగస్థులో అంతవరకు మానవాభ్యుదయ చరిత్ర కిరువురును తోడ్పడినవారే. అయినా ప్రాభవములోను, అభ్యుదయ ఫలానుభవములోను పురుషునికిగల ఆధిక్యము స్త్రీకిలేకపోయినది. ఈతారతమ్యమును స్త్రీగుర్తించినా తనన్యూనత సహజమైనది, తప్పనిది అన్నట్లేభావించినది; గాని, తన ఆధిక్యమ్ము పురుషునితో సమానముగా నిలబెట్టుకొనుటకు తగవులాడలేదు; ప్రయత్నమైనా చేయలేదు.

ఇందుకనేక కారణములు కలవు. ప్రకృతిసిద్ధముగా స్త్రీ తక్కువ దేహదార్ఢ్యము కలది. బలము తక్కువయినవారు బలముగలవారికి లోబడుట సహజము. పశుప్రాయమైనా కండపుష్టిగల మనుష్యుని బలమును బలహీనులు పూజింపవలసి యుండుట చరిత్రలో కనబడుచునే యున్నది. యుద్ధములలో బలహీనరాజ్యములు బలవంత రాజ్యములవారికి ఓడి లొంగిపోవుట మన మెరుగుదుము. యుద్ధములవల్లనే

రాజ్యాభివృద్ధి జరుగవలసినదన్న ఆశయమున్నంత కాలము, యుద్ధములుచేసి గెలుపొందు బలశాలులకే కాని బలములేని వారికి, శాంతిప్రియులకు అభ్యుదయము కలుగనేరదు. ఆ విధముగానే స్త్రీ తన ఆధిక్యము, ప్రాభవము అధికారము పురుషునితో సమానముగా నిలబెట్టుకొనుటకు కావలసిన బలము, ఇచ్ఛ లేనంతకాలము పురుషునికి ఒదిగియుండక తప్పదు. అంతేగాక ఆర్థికముగా కూడా స్త్రీని పురుషుడు తనకు తక్కువగా' నుండునట్లు చేసుకొన్నాడు. స్త్రీకి సొత్తులో ఒక భాగమీయలేదు సరిగదా స్త్రీనే తన సొత్తులో ఒక భాగముగా పెట్టుకొని, అంతటితో తృప్తి పొందక ఆమెను తన సౌకర్యములకు పరిచారికగా కూడా వినియోగించు కొన్నాడు.

ఇట్టి దారుణమైన పరిస్థితులు నేడు ఆచరణలో గాని ఆదర్శముగా గాని అంతగాలేవని చెప్పవచ్చును. జీవనోపాధి కోసము పురుషుని మీద ఆధారపడి పురుషునకు బానిసయై యుండినస్త్రీ నేడు తనయందిమిడియుండిన సహజశక్తులను విడంబించుకొని పురుషునితో సమానమయిన ప్రాముఖ్యమునకు రాగలిగినది. ఆధునిక ప్రపంచమందు పురుషునితోపాటు స్త్రీకూడా కృషిచేసి, మానవాభ్యుదయములో సమానమైన సిరిసంపదలను అనుభవించు యోగ్యతగలదయినది.

నవీనకాలములో ఆర్థిక, మానసిక, నైతిక, వైజ్ఞానికాది బలములకు ప్రాముఖ్యత గలుగుట చేతను, ఈబలములను పురుషులతో పాటు స్త్రీలుకూడా సంపాదించుటకు అర్హత గలవారే కనుకను పురుషులతో స్త్రీలుకూడా ఇప్పుడన్ని రంగములందును సమానముగా కార్య నిర్వహణమునకు పూనుకొని కృతకృత్యులు కాగలుగు తున్నారు. ఇటీవల జరిగిన రెండవ ప్రపంచ మహాసంగ్రామమందు పురుషులు యుద్ధములందు పనిచేయుటకు దేశములను విడిచిపెట్టునప్పుడు, స్త్రీలు వారిస్థానములందు అన్నిరంగము లందును ప్రవేశించి పురుషులవలెనే, సకల కార్యములను విజయవంతముగా నిర్వహించ గలిగిరి.

ఆర్థికముగా కూడా స్త్రీ పురుషుని మీద ఆధారపడి ఉండనక్కర లేకుండ స్వతంత్ర జీవనము చేసుకొని జీవయాత్ర గడపుకో గలుగుచున్నది. అంతకంతకు అన్ని రంగములందును స్త్రీల సంఖ్య అధికమగుటచేత, స్త్రీలు తమతో పోటీపడి, తమ జీవనాధారములకు భంగము కలిగింతురేమో అన్న భయము పురుషులకు కలుగుతున్నవి. బానిసత్వము నుండి విముక్తురాలయి వైజ్ఞానికముగా ప్రాముఖ్యమును పొందిన స్త్రీ, ఆధ్యాత్మిక విద్యలోను, శాసననిర్మాణ కృషిలోను, మతసంబంధ విచారములోను, రాజ్య పాలనములోను, ఇంకా అనేక కార్యకలాపములందు తన బుద్ధి కౌశలము, కార్యాచరణ నైపుణ్యము పురుషునితో సమానముగా ప్రదర్శిస్తూ తన ప్రాభవమును నిలబెట్టుకొనుచున్నది.

దైవకృపవల్ల ఇంత కాలమునకైనను స్త్రీ తనకు అర్హతగల స్థానమునకు రాగలిగినది. అయినా స్త్రీ సంపూర్ణ స్వాతంత్ర్య సిద్ధికి చాలా దూరముగనే ఉన్నది. మన భారతదేశములో రాజకీయముగా స్త్రీ పురుషునితో సమానమైన స్థానమును, వోటింగ్ చేసే అధికారమును పొందినా, తన ఆర్థిక, సాంఘిక, రాజకీయ స్వతంత్రతను పొందుటలో తక్కిన మరికొన్ని దేశముల స్త్రీలకంటె ఇంకా ఎక్కువగానే వెనుక బడియున్నదని చెప్పవలెను.

మన దేశమందలి హిందూ ధర్మ శాస్త్రములలో ఆర్థిక విషయమైన నిబంధనలు ఎక్కువ చిక్కుగాను, స్త్రీ విషయములో ప్రతికూలముగాను ఉండుటచేతను, వాటి ననుసరించి నేటికిని వ్యవహారములు సాగుతూ ఉండటం చేతను స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యము సిద్ధించుట దుర్లభము. ఆ నిబంధనలు నేటి పరిస్థితుల కనుగుణముగా మారవలసి యున్నది. ఇక అధికారాది విషయములలో ఇంకా ఎక్కువ ప్రతిబంధకములు స్త్రీలకు గలవు. కుటుంబములో తండ్రికిని, భార్యాభర్తలలో భర్తకును అన్నిటను అధికార మెక్కువనే సిద్ధాంతము ధర్మశాస్త్రములలో నిలిచి ఉన్నంత కాలము, ఎంత యోగ్యతగల భార్యయైనను భర్తకు కట్టుబడి ఉండవలసి వచ్చును. ఈ చిక్కులు ఈ ప్రతిబంధకములు కొద్దిపాటి సవరణల వలన తొలగిపోగలవి కావు. స్త్రీ పురుషుల స్థానములకు సంబంధించిన ధర్మశాస్త్రములన్ని నవీన పరిస్థితులకు అనుగుణముగా మరల నిర్మించవలసి యున్నది. పురుషుడు తన ఆధిక్యము, ఔన్నత్యము నిలబెట్టుకొనుటకు ప్రదర్శిం

స్త్రీ. చరిత్రలో ఆమెకుగల స్థానం

చిన ఆశయములు, నిర్మించిన నిబంధనలు, బోధించిన ధర్మములు, నీతులు, పురాణకాలమునకు ఎంత అనుకూలమైనవను కొన్నా ఆధునిక కాలమునకు అనుకూలించగలవి కావు. గనుక, నవీన నింబధనల నేర్పరుచుటలో నిబంధన కర్తల దృష్టిపూర్తిగా మారవలసి యున్నది. అంతవరకును స్త్రీకి పురుషునితో సమానమైన ప్రతిపత్తి, గౌరవము, స్థానమును దొరకుట దుర్లభము.

వినా, ఆధునిక ప్రపంచచరిత్ర సంఘటనలు చూడగా ఇంతవరకును దుర్లభమనుకొన్న విషయము సులభము కాగల దన్న నమ్మకము కలుగుతున్నది. స్త్రీకిగల స్థానము గూర్చి పురుషులకుండిన దృష్టి మారినది. ప్రతి విషయము లోను స్త్రీ సహకారము అంతకంతకు ఎక్కువగుతున్నది.

ఇట్లనుటచే పూర్వము స్త్రీలు దేశసేవ చేయలేదనిగాని, దేశసౌభాగ్యమునకు తోడ్పడలేదనిగాని అనుకొన కూడదు. ఐతే స్త్రీలసేవ, సహకారము దృశ్యాదృశ్యములుగానుండెను. స్త్రీలు కొందరు మహోన్నతమైన సేవచేసి తమ ప్రాభవ మును చూపించినను వారి ప్రఖ్యాతి చరిత్రలో ప్రకటితము కాలేదు. ఏతన్జు నగరపాలకుడును, రాజనీతి వేత్తయునైన పెరిక్లీజు ధర్మపత్ని ఆస్పేష్యకు తగిన ప్రశంస చరిత్రలో కన బడదు. ఈమెవలెనే తమ ఘనకార్యములచే దేశమందలి తరతరములవారికి మేలుకలుగ జేసిన స్త్రీలుగలరు. వారిగొప్ప తనము ఏదో యదాలాపముగా సూచితమైనదేకాని, తగిన రీతిని చరిత్రలో నిరూపితముకాలేదు; గుర్తించలేదు. తెర చాటున వుండినట్లుండిన స్త్రీలు గనుక, వీరిఘనతం ప్రకాశి తము కాలేదనవచ్చును.

బహిరంగ రాజకీయరంగమున ప్రఖ్యాత రాజ్యపరిపాలకు రాండ్రుగా తమ ప్రభావమును ప్రకటించిన స్త్రీలు కూడా పూర్వకాలమున వుండిరి. అట్టి స్త్రీలు ఆట్టేమంది లేక పోయినా, వున్న ఆ కొద్దిమంది స్త్రీలందరును తమ దేశము లందు రాజ్యాభిషిక్తలయి, రాజ్యపాలనము మహోజ్జ్వల ముగా సాగించి ప్రఖ్యాతి బడసియుండిరి. ఆస్ట్రియా రాణి మరియా తెరీసా, రష్యామహారాణి కేదరిన్, ఇంగ్లండు దేశ ముందలి ట్యూడర్ వంశపు ఎలిజబెత్ రాణి మొదలయిన స్త్రీలు కొందరు పశ్చిమ దేశములలో రాజ్య పరిపాలకురాండ్రుగా ప్రఖ్యాత లయినారు. మన భారత దేశములో రజయా, చాంద్ బీబీ, అహల్యాబాయి అందరికంటె ఎక్కువగా రుద్రమదేవి మొదలయిన ప్రఖ్యాత రాజ్య పరిపాలకురాండ్రు గలరు. రుద్రమదేవి ఘనతనుగూర్చి మార్కొపోలో ఆశ్చర్య నిమగ్నుడై చేసిన ప్రశంస ఇంతింతకాదు. రాజ్య పరిపాలన మందేకాక, రాజనీతి విద్యయందును దొడ్డవారని ప్రఖ్యాతి పొందిన పురుషులతో సమాన ఘనతను బడసిన వారీ స్త్రీ రత్నములు.

స్త్రీ ఘనతకు తగినస్థానమును పురుషులు తాము రచిం చిన చరిత్ర గ్రంథములలో ఇచ్చుటకు సుముఖులయినను విముఖులయినను పైని పేర్కొన్న స్త్రీవతంసములు మాత్రము తమ గరిమచే చారిత్రక కథావళిలో తగిన స్థానముల నలంక రించియున్నారు. అట్టి స్త్రీల ప్రశస్తిలేని చరిత్ర గ్రంథము కొరతపడియుండుట తప్పదు. నవీనకాలమందలి చరిత్ర రచ యితలు అట్టి గొప్ప స్త్రీల ఘనకార్యములనే కాక, పేర్కొన దగిన తక్కిన స్త్రీలకును తగిన స్థానములను యిచ్చి దేశ సౌభాగ్యమునకు వారు చేసిన సేవను కూడ ప్రశంసించగల రని నమ్మవచ్చును. ఇది ప్రజా ప్రతినిధులు ప్రభువులయి వున్న ప్రజారాజ్యయుగము. అందుచేత ఇందులో పురుషు నితోపాటు స్త్రీకిని సమాన ప్రతిపత్తి కలదు. ఆధునిక యుగమునాటి స్త్రీ పూర్వదాస్యమునుండి విముక్త కాగానే వేయివిధముల, వేయిరంగములందు, వేయి వుజ్జ్వల వికాసము లతో ఒక్కుమ్మడిగా ప్రవేశించి తనలో లీనమై యుండిన ఘనతను విడంబించుకొనుచున్నది. నేటికంటె రానున్న కాలమందు ఆమె ప్రాభవము దేశ కళ్యాణమునకు ఎక్కు వగా తోడ్పడగలదు.

ఇంతవరకును బిడ్డ నుయ్యాలలో పెట్టి జోల పాటలు పాడుతూ వుండిన తల్లియే ఇకముందు ప్రపంచమేలగల విదు షీమ తల్లిగా విలసిల్లగలదు.

★

భారత పాకిస్థాన్ ఒడంబడిక

భారత పాకిస్థాన్ ఒడంబడికలో హిందూదేశ చరిత్రకు మరొక ప్రాముఖ్యమైన సంఘటన చేర్చబడింది. ప్రాముఖ్యమయినది మాత్రమే అది. ఈ ఒడంబడిక ఎంతవరకు ఫలవంతం కాగలదనే విషయము సులభముగా నిర్ణయించబడేదికాదు.

ఇటువంటి ఒడంబడికలు మనకేమీ కొత్తకావు. రెండు దేశాలు యుద్ధంచేయడం, అటో ఇటో తేలిపోయిన తర్వాత ఒడంబడిక చేసుకోవడం మనకు చిరపరిచితమే. ఈ ఒడంబడిక లేమైన ఫలించాయా అంటే లేదు సరిగదా, మరొక పోరాటానికి కూడా దారితీసేవి.

కాని చరిత్రలో ఇంతవరకు జరిగిన ఒడంబడికల వైఖరి వేరు. అన్ని ఒడంబడికలు పోరాటం ముగిసిన తర్వాత జరిగితే ఇది పోరాటానికి ముందే జరిగింది. ఇదే దీని విశిష్టత. అంటే పోరాటం సంభవించకుండా ఒక అడ్డంకిగా ఉపయోగపడిందన్నమాట.

పోరాటం సంభవించే పరిస్థితు లేర్పడ్డాయాయంటే ఏర్పడ్డాయనే చెప్పవలెను. పాకిస్థాన్ విభజనతోనే బెంగాలులోని హిందువులను భయమావరించుకొంది. పాకిస్థాన్ ప్రజాప్రభుత్వము కాదని హిందువులకు కాలక్రమేణా తెలిసివచ్చింది. హిందువులపట్ల పాకిస్థానుల అత్యాచారాలు, మతద్వేషము తెలిసికూడా పాకిస్థాన్ ప్రభుత్వం ఉదాసీనత వహించడం మన కందరికి తెలిసిందే.

ఇటీవల అల్లజడులు ప్రారంభమైన తరువాత తూర్పు బెంగాలులోని హిందువులు తండోప తండాలుగా, తమ ఆస్థి పాస్తులనన్నటిని వదలి కట్టుగడ్డలతో వచ్చేశారు. ఈ విధంగా ఎంతమంది వస్తారు? వచ్చిన వారందరికి ఇక్కడ ఏ విధంగా సహాయం చేయగలరు? కాందిశీకులు ఎన్ని రోజులని భారతదేశంలోనే ఉండగలరు? పాకిస్థాన్‌లో హిందువులకు చోటేలేదా? అంటే ప్రస్థుతం లేదు. శాంతి భద్రతల్లులేని ప్రదేశాలలో ప్రజలేవిధంగా ఉంటారు? అనుక్షణం భయోత్పాతాలతో ప్రమాదాన్ని ఎదురు చూస్తు ఉండడం సాధ్యమేనా? అందుచేతనే ఆస్తి పాస్తులను, ఉద్యోగములను లెక్కబెట్టక ఊపిరుంటే ఉప్పైనా అమ్ముకోవచ్చుననే ఆలోచనతో వచ్చేస్తున్నారు కాందిశీకులు. ఇవన్నీ కండ్లారాచూస్తున్న పాకిస్థాన్ ప్రభుత్వం పరిస్థితులను చక్కబెట్టడానికేమైన తలపెట్టిందా? చూచి చూడనట్టు ఉదాసీన భావం వహించింది.

కాని హిందువులను రక్షించే భారము మనపైన వుంది కనుక మన ప్రధాని నెహ్రూయే ముందుగా పాకిస్థాన్ ప్రధానిని ఈ విషయమై సంప్రదించడానికి ఆహ్వానించారు. లియాఖత్ అలీఖాన్ మొదట నిరాకరించినా తరువాత అంగీకరించారు. సంప్రదింపులకు ఢిల్లీవచ్చారు.

చెడ్డవారితో స్నేహంకంటె మంచి వారితో వైరమే మేలని మన పెద్దల అభిప్రాయం. పాకిస్థానుతో సంపదించి లాభమేమీ వుండదు. ఏదో ఒక విధంగా, వారితో తెగతెంపు చేసుకోడమే మేలని చాలమంది అభిప్రాయం.

నిజమేకాని ప్రస్తుత పరిస్థితులలో పాకిస్థాన్‌తో ప్రత్యక్ష వైరం సమంజసంగా తోచదు. ఏటమ్‌బాంబులు హైడ్రోజిన్ బాంబులు ఉపయోగింపబడే నవీనకాలపు యుద్ధంలో ఏ ఒక్కజీవికి కూడా ప్రాణసంరక్షణ ఉండదు. యుద్ధమే సంభవిస్తే దానిలో భారత పాకిస్థాన్ దేశాలు రెండేకాక ప్రపంచంలో మూడుభాగాల వారు పాల్గొన వలసి వస్తుంది. అంటే మూడవ ప్రపంచ యుద్ధానికి భారతీయులే కారకులౌతారన్నమాట.

యుద్ధంవల్ల ఎటువంటి ఫలితాలు కలుగుతాయో ఎవరికి తెలీదు. ఇప్పుడుండే శాంతి భద్రతలుకూడ కరువైపోతాయి. ఇవన్నీ ఆలోచించే ప్రధాని నెహ్రూ ఈ ఒడంబడికను తలపెట్టారు.

ఒడంబడికను స్థూలంగా పరిశీలిద్దాం. భారత పాకిస్థాన్ లలో, తమతమ దేశాలలోగల అల్పసంఖ్యాకులకు మత వివక్షతలేకుండా, వారి ప్రాణ విజ్ఞాన ఆస్థి పాస్తుల, గౌరవ మర్యాదల రక్షణ, న్యాయ శాస్త్రములకు, నీతికి భంగము కాకుండ, మత వృత్తి విషయములందు స్వేచ్ఛ అమలు జరుపబడుతాయి. అల్పసంఖ్యాకులకు అధిక సంఖ్యాకులతోబాటు

భారత పాకిస్థాన్ ఒడంబడిక

అన్ని విషయములయందు సమాన హక్కులు అమలు జరుపబడతాయని భారత ప్రధాని భారత దేశంలో అల్ప సంఖ్యాకులకు, పాకిస్థాన్ ప్రధాని పాకిస్థాన్‌లోని అల్పసంఖ్యాకులకు హామీ ఇచ్చారు.

అల్పసంఖ్యాకులు తమ ఇష్టమైన ప్రదేశాలకు వెళ్ళడానికి సంపూర్ణ స్వాతంత్ర్యం గలదు.

కాందిశీకులు వారితో వీలైనంత వరకు తమ ఆస్థిని తీసికొనిపోవచ్చును.

అల్పసంఖ్యాకుల తరపున ముగ్గురు సభ్యులు ఒక ప్రభుత్వ ప్రతినిధి కలసి ఒక కమిటీగా ఏర్పడి కాందిశీకుల ఆస్థి పాస్థులకు ధర్మకర్తృత్వము వహిస్తారు.

అలజడిగానున్న ప్రాంతాలలో శాంతిని నెలకొల్పడానికి తగిన ఏర్పాట్లు చేయడం, అలజడికి కారణభూతులుగానున్న వారిని తగువిధంగా శిక్షించడం, అపహరించబడిన ధనాన్ని తిరిగిపొందే ప్రయత్నం చేయడం, అపహృత స్త్రీల ఉద్ధరణ కొరకు అల్పసంఖ్యాకుల ప్రతినిధులతో కూడిన ఒక సంఘాన్ని ఏర్పాటు చేయడం ఇవి ఒడంబడికలోని ఇతర ముఖ్య విషయాలు.

ఇటీవల జరిగిన అలజడులకు కారణములను తెలిసికొని ఇకమీదట అటువంటివి జరుగకుండ చూచుకొనుటకు ఒక సంఘము నియమింపబడును; అల్ప సంఖ్యాకులకు ధైర్యము నిచ్చే బాధ్యత ఈ సంఘము మీద ఉంటుంది.

ప్రజలలో రేడియోల మూలంగా, పత్రికల మూలంగా వ్యక్తులమూలంగా, అన్యాయమైన అబద్ధపు ప్రచారము జరుగకుండా ప్రభుత్వము తగుచర్య వహిస్తుంది. ఈ విషయంలో నేరస్తులుగా కన్పించిన వారు కఠినంగా శిక్షింపబడుతారు.

కాందిశీకులకు నమ్మికకలిగించి, వారి స్వస్థానములకు తిరిగి వెళ్లునట్లు చేయుటకు భారత పాకిస్థాన్ ప్రభుత్వాలు రెండింటినుండి ఇద్దరు మంత్రులు అవసరమయినంత కాలం అలజడి గానున్న ప్రాంతాలలో ఉంటారు., ఉభయ బెంగాలుల ప్రభుత్వములోను అస్సాము ప్రభుత్వములోను అల్ప సంఖ్యాకుల ప్రతినిధి యైన మంత్రి ఒకరుండెదరు.

ఇదిగాక ఉభయ బెంగాలులలోను అస్సాములోను విడివిడిగా మూడు అల్పసంఖ్యాకుల సంఘములు నియమింపబడతాయి. ఆయా ప్రాంతాలలోని అల్ప సంఖ్యాకుల హక్కులు అమలుజరిపే బాధ్యత ఈ సంఘంపైన ఉంది.

ఈ ఒడంబడికవల్ల వెంటనే రెండు దేశాలలోని అల్ప సంఖ్యాకులకు శాంతి భద్రతలు లభిస్తాయని కాదు. రెండు దేశాల మధ్య సమరసభావము ఏర్పడడానికి ఈ ఒడంబడిక మొదటి సోపానంగా పనికి వస్తుంది. తరువాత మిగతా వాటిని సమయానుకూలంగా ఆలోచించుకోవచ్చు.

భారత పాకిస్థాన్ రెండు దేశములయొక్క భావి చరిత్ర ఈ ఒడంబడిక మీదనే ఆధారపడి యున్నది. ఒడంబడిక ఫలవంతంగా పరిణమించే బాధ్యత ఎక్కువగా ప్రజలమీదనే ఆధారపడి ఉన్నవి. ఇరువైపుల ప్రజలు స్నేహ భావంతో ఒకరినొకరు అర్థం చేసుకొన ప్రయత్నిస్తే ఇక ఎటువంటి బాధకూడా ఉండదు. ఒడంబడిక జరిగిన వెంటనే కాందిశీకులలో వారి పరిస్థితులు నిజంగా మారక పోయినా మారగలవనే ధైర్యం వారి శాంతి భద్రతలకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సంతోషము తప్పక కలుగుతాయి. ఒడంబడిక ఫలితంగా కలహాలు తగ్గుటయేగాక, భారత పాకిస్తానుల మధ్య వ్యాపార సమాధానము కుదిరి, కాశ్మీరు సమస్యాపరిష్కారమయ్యే జాడలప్పుడే పొడసూపుచున్నవనుట అత్యాశ కాదేమో!

గాంధి మహాత్ముని అహింసా చరణతోను, చరిత్రలో ఎప్పుడు సంభవించని క్రొత్తవిధంగా స్వాతంత్ర్యం పొందడంతోను, భారత దేశమంటే ప్రపంచంలో ఒక విధమైన గౌరవనీయమైన స్థానం సంపాదించుకొన్న మనం ఆ స్థానం నిలబెట్టుకోవడమే కాకుండా ఒకమెట్టు పైకే పోయినాము. ఇటువంటి క్లిష్టమైన సమయంలో ఉద్రేక పూరితులు గాక ధైర్యం వహించి శాంతియుతంగా అల్ప సంఖ్యాకుల సమస్యను పరిష్కరించిన మన ప్రధాని నెహ్రూ అహింసా మూర్తియైన గాంధి మహాత్ముని అపర శిష్యుడనడంలో అతిశయోక్తి ఏ మాత్రంలేదు.

మ. రా.

★

రూపకం

అద్దంమీద ఆవగింజ

శ్రీమతి కొత్తపల్లి లలిత

జానకి	—	రామం భార్య	మేనత్త, మేనమామ బిడ్డలు.
రామం	—	జానకి భర్త	
తాతయ్య	—	పై ఇద్దరికీ తాత	
వంటవాడు	—	పైవారి ఇంట్లో వంటవాడు	
డ్రైవరు	—	పైవారి కారు డ్రైవరు.	

మొదటి రంగము

(అందమైనతోట. తోటమధ్య ఒకమేడ. మేడమీది గదిలో మధ్య టేబులు. చుట్టూ కుర్చీలు. ఓకుర్చీలో రామం వయస్సు 25 సం|| పేపరు చూస్తూంటాడు. బల్లమీది రెండు కాఫీ కప్పు సాసర్లు. జానకి రేడియో ట్యూను చేస్తూం టుంది. వయస్సు 20 సం||).

రా : జానీ!

జా : ఊఁ.

రా : జానకీ!

జా : ఆఁ.

రా : ఊఁ, ఆఁలు తప్ప ఎందుకండీ అనలేవూ?

జా : (వేళాకోళంగా) ఎందుకండీ, బావగారూ!

రా : (కోపంతో) అదే, అనొద్దన్నాను. పెళ్లికాకపూర్వం బావ గాని పెళ్లయాక 'భర్త', తెలిసిందా?

జా : పెళ్లికాకపూర్వం 'జానీ' గాని పెళ్లయాక 'జానకి'

రా : మాటకి మాట. బాగా నే నేర్చుకొన్నావు.

జా: (వేళాకోళంగా) మాటకి మాట తెగులు; నీటికి నాచు తెగులు.

రా : మరి, నీకో!

జా : సరే, మీకంతకోపం అయితే 'బావగారూ' అన కుండా 'భర్తగారూ' అంటాను..... ఎందుకండీ భర్తగారూ!

రా : రామ, రామ. అందుకే మేనరికాలు వద్దన్నారు పెద్దలు.

జా : అదిగో, మీపేరేస్మరించు కొంటున్నారు. కానివ్వండి.

రా : ఏంకానివ్వను? భర్తంటే భయం, భక్తి ఏదీ! వెనకటికి నీలాంటిదే ఒకావిడ (మేనత్తకొడుకూ ఓమొగుడేనా, అందిట.

జా : రామ' రామ. నేనెప్పుడేనా అన్నానాండీ?

రా : అదిగో, నాపేరెందుకు స్మరిస్తావు? ఇల్లాకూడా వెట కారమూ!

జా : మీరేనేమిటి 'రామ' అంటే, నేను 'జానకీ రాముణ్ణి' స్మరిస్తూంటే! బాగుందండోయ్.

రా : వాడెవడు మధ్య పానకంలో పుడక?

(డ్రైవరు ప్రవేశించును)

డ్రై: అయ్యగారండీ! కారు సిద్ధంగాఉంది.

జా : (లేనికోపం తెచ్చుకొని) ఎవరు సిద్ధం చెయ్యమన్నారు!

డ్రై : (బిక్కమొగంతో) మరేమండీ! అయ్యగారండి.

రా : అవును. నేనే. స్టేషన్‌కి వెళ్ళాలి.

జా : (కొంచెం కోపంతో) నాతో చెప్పలేదేం? నేరావడం ఇష్టంలేదా! అవున్లెండి. మీపక్కని - ఇదివఱలో కూర్చోపెట్టుకొని ఊరంతా 'దుమ్మురేగేటట్టు' తిరిగేవాడు. ఇప్పుడు ఆలా తిరుగుతారా! ఇదివఱకు - ప్రేయసి, ప్రియురాలు - ఇప్పుడు - పెళ్ళాం, భార్య. అందులో మేనమామకూతురు భార్య. అందుకే ఆవిడెవరో "మేనత్తకొడుకూ......"

రా : అబ్బబ్బ. చాలు. (బుజ్జగిస్తూ) జానీ, నీతో చెప్పాలనే ఇప్పుడు సంభాషణ ప్రారంభించినా, అదివాగ్వాదంగా పరిణమించి, వాగ్యుద్ధంగా అంతం అవుతుంది. మరి. ...

జా : నేనేనా వాదాన్ని యుద్ధంగా చేసేది. మీరేమో మంచివారు. వాదించడం చేతయినవారు. వక్తలు. నేను చేతకాని ... (అని వెక్కి వెక్కి ఏడవబోతుంది)

రా : (డ్రైవరుతో) నువ్వు వెళ్ళవోయ్. ఇదిగో వస్తున్నాం.

డ్రై : చిత్తం (నిష్క్రమించును)

రా : (బుజ్జగిస్తూ) జానీ, ఛా. అలాఏడుస్తారా! నువ్వు నాకంటె బాగా వాదిస్తావు. నిన్నుఇప్పుడు కార్లో తీసుకు వెళ్ళటంలేదూ? నువ్వు భార్యవైతే మాత్రం ప్రియురాలివి కావా ఏమిటి! నేనే గనక కవినైతే...నీ మీద ఏ 'ప్రాణేశ్వరి' అనో 'వెన్నెలవెలుగు' అనో ఓ భావ కావ్యాన్ని వ్రాసి పారేసే వాణ్ణి. కాని—

జా : (తీక్ష్ణంగా) కానీలేదు అర్ధణా లేదు. మీరు, కవులవుతే ఏ 'అప్రాప్తమనోహరి', మీదో ఏ 'స్వప్న సుందరి', మీదో వ్రాస్తారుగాని నా మీద ఎందుకు వ్రాస్తారు! ఈ ఆడవాళ్ళమీద వ్రాసేవారందరూ, పెళ్ళాల మీదే కవిత్వం వ్రాస్తే, ఓ, దేశం ఎప్పుడో బాగుపడేది! ఆంధ్రరాష్ట్రం ఏనాడో వచ్చేది!

రా : నేనందరి లాంటి వాణ్ణి కాదుగా!

జా : ఆఁ. అందరు మొగాళ్ళూ ఆలాగే అంటారు.

రా : అయితే, నన్నేమి చెయ్యమంటావు?

జా : ఆచెప్పదలిచిందేదో చెప్పమంటాను.

(వంటవాడు ప్రవేశించును)

వం : అమ్మగారండీ, రాత్రికి.....

రా : ఉండవయ్యా, అప్పుడే రాత్రి సంగతి. ఇంకా కాఫీ తాగి గంటైనా కాలేదు.

జా : బాగుందండోయ్. మగాళ్ళకేం తెలుసు వంట సంగతి ఇప్పటి నుంచీ చేస్తే నేగాని......



శ్రీమతి కొత్తపల్లి లలిత.

రా : (నవ్వుతూ) మగవాళ్ళకి వంట సంగతి తెలియకపోతే మరి, మన వంటవాడు...(గొంతుసవరించును)

జా : నూటికి నూరుపాళ్లు మగవాడు గాని, నూటికి నూరు పాళ్లు ఆడదిగాని ఉండరు. అసంభవం

రా : అయితే మన వంటవాడు ...

వం : బంగాళాదుంపలున్నాయి. ఉల్లిపాయలు తెప్పిస్తే...

జా : (చిరాకుగా) సరేలే. నువ్వువెళ్లు. (కోపంతో) మీకు ప్రాణి శాస్త్రం ఏంతెలుసు! ఈవిషయం మీద ఎంత రిసెర్చి జరిగిందో!

(వంటవాడు నిష్క్రమించును)

రా : ఓహో. తమరు, జానకీదేవి. బి. యస్. సి; (జూఆలజీ) గారు కాదుమరీ!

జా : అదే వెటకారం. నాకిష్టంలేంది ... నేనుహాయిగా రిసెర్చి చేసుకొంటూ ఉండేదాన్ని ......

రా : (వెటకారంగా) పాపం. నేనే అడ్డం ఔచ్చాను. పెళ్లి పెళ్లి, అంటూ. "బావా నిన్నే పెళ్లిచేసుకొంటాను" అన్నదెవరో! నేనేనా!

జా : పెళ్లంటే ఇలా ఉంటుందనుకోలేదు......ఎంతో

(తాతయ్య ప్రవేశించును)

తా : (సంతోషంతో, ఉత్సాహంతో) ఏమిటుట్రా, మీవాదాలూ మీరూను. ఏమిటే, జానకమ్మా, పెళ్లి అయి ఆర్నెల్లేనా కాలేదు; అప్పుడే "పెళ్లంటే ఇలా ఉంటుందనుకోలేదు" అంటున్నావు.

జా : తాతయ్యా!

రా : అప్పుడే రైలు వచ్చేసిందా?

జా : ఉత్తరమేనా రాయకుండా వచ్చేశావు!

తా : రామానికి రాశానుగా. చెప్పలేదూ!

జా : నాకిలాంటివి చెప్పరులే.

తా : ఏంరా, రామం, కారుతీసుకొనివస్తావేమో అనుకొన్నాను.

రా : అందుకే బయలుదేరబోతూంటే...జానీతోవా...

జా : వాగ్యుద్ధం అనండి. అప్పటికి మీకు శాంతివస్తుంది. తాతయ్య వస్తున్నాడని నాతో చెప్పలేదు సరిగదా, నన్ను పైపెచ్చు తిట్టడంకూడానా? అనండి. అనండి చూశావా తాతయ్యా, మీమనుమడు?

రా : నేను జానీతో నువ్వు వస్తున్నావని చెప్పాలను కొంటూంటేనే వాదం ప్రారంభం అయింది. నాదేమీ తప్పులేదు. నన్ను చెప్పనిస్తేనా మీముద్దుల మనుమరాలు గారు?

జా : అనండి. అనండి. తప్పంతా నాదే. మీరు మంచివాళ్లు మర్యాదస్తులు ఎంతో గొప్ప............

తా : ఊరుకొండట్రా! మీవాదాలూ మీరూను......... ఏమిటే! అమ్మాయీ. ముసలాడికి కాస్త కాఫీ నీళ్లేనా పోస్తారా పొయ్యరా, చచ్చి చెడివచ్చాను.

జా : అయ్యయ్యో! తాతయ్యా, ఈ గొడవలో ఆసంగతి మర్చిపోయాను. కూర్చో. అయింది ఏదో అయిందిలే. తప్పంతానాది............ఒక్క నిమిషంలో కాఫీ తెస్తాను. ఉండు (అని వెళ్లిపోవును)

రా : నాసంగతి మర్చి పోవద్దండోయ్, కోపంలో.

జా : నేతెస్తే మీరు తాగరుగా! ఆవంటవాడే మీకు తెచ్చి ఇస్తాడు లెండి.

రా : ఎవరైనా సరే, కాఫీ బాగుంటే.

జా : మాఇద్దర్నీ ఒకటిగా జమకట్టేశారు. ఇంతే, మగాళ్లు.

తా : ఊరుకొండట్రా. చిలిపికజ్జాలు. (వెళ్లిపోవును)

(తెర)

రెండవ రంగం

(భోజనాల సావడి. మూడు పీటలు, ఆకులు వేసి వుంటాయి. తాతయ్య రామం చెరో పీటమీద కూర్చుని వుంటారు. వంటవాడు వడ్డనకి తయారవుతూ వుంటాడు)

రా : నువ్వు మేడమీదికెళ్లి అంతా సిద్ధంగా వున్నారని అమ్మగారితో చెప్పిరా "మీరు రావడమే తరవాయి" అన్నారని చెప్పు.

వం : చిత్తం (వెళ్లిపోవును)

తా : దానికి కోపం వచ్చినట్లుందిరా.

రా : నాకూ వచ్చింది. నేనే అంత తీసిపోయిన వాడినా?

తా : అబ్బెబ్బే! ఇద్దటి కిద్దటే. ఒకరి కొకరు తీసిపోతే ఎల్లా!

రా : సరేగాని తాతయ్యా, నాతప్పేముంది ఇందులో. సినీమాకి వెడదాం, వెడదాం అంటోంది నాలుగు రోజుల్నించి. మొదటి వారంపోనీ, తరవాత ఒత్తిడి తగ్గుతుంది, పోదాం, అన్నాను. సరే, ఈవేళనువ్వు

వచ్చావని బయలుదేరాం. మధ్యదారిలో ఆ కారు చెడి పోతుందని నేను కలగన్నానా!

తా: ఏడ్చేవులెద్దూ. ఇప్పుడన్నీ చిలకలాచెబుతావు. అది. కారు నడుపుతానంటే నువ్వెందుకు ఒద్దన్నావు.

రా: అది కారునడుపుతే! మనం ఇద్దరం ఈపాటికి ఆసుపత్రిలో, ఒళ్లంతా కట్లతోటి!

తా: ఏడిశావులెద్దూ. నువ్వేమంత గొప్పపనిచేశావు? వెడుతూ వెడుతూ వున్న కారునికాస్తా, పేవుమెంటు మీదికి ఎక్కించావు. చక్రంవంకరైనది.........

రా. (కోపంతో) అదే అనవద్దన్నాను. పేవుమెంటు మీదికి ఎక్కకపోతే, ఆ ఎదురుగా వచ్చే లారీని ఢీకొనేది. అప్పుడు మనం.........

తా: (వెటకారంగా) ఆసుపత్రిలో, ఒళ్లంతా కట్లతోటి

(వంటవాడు ప్రవేశించును)

వం: (తెల్లమొగంవేస్తూ) మరేనండీ ....అమ్మగారికి టండీ......ఆకలి లేదుటండీ.. .. ..

రా: ఉండదులే. సరేకానీ, మాకు వడ్డించు (పరధ్యానంగా ఉంటాడు.)

తా: ఒరే, రామం; నువ్వు వెళ్లిపిలవరాదు!

రా: నన్నెవరు పిలిచారేమిటి. ఆకలేస్తే అదేవస్తుంది. గారాబం గజ్జలికి ఏడ్చిందటు...... !

తా: ఒరేయ్, నువ్వు పారిజాతాపహరణం చదివావురా?

రా: ఆఁ. ఇంటరులో టెక్స్టు. ఆవిషయం ఎందుకు ఇప్పుడు? రామాయణంలో పిడకలవేట............

తా: నీకెవరు చెప్పారోగాని, ఆపుస్తకం అర్థం కాలేదురా నీకు. అర్థం అయితే ఈపాటికే మేడ మీదికి వెళ్లే వాడివి.

రా: వెళ్లి, ఆ పశులకాపరి లాగ తన్నులు తినాలంటావు. ఏం సలహా! తాతయ్యా, తాతయ్యా!

తా: అదికాదురా. అనవసరంగా వ్యాపారం ముదరనివ్వకురా ఏదో; నేను వచ్చానని నాదగ్గర తన కారు నడిపే చాక చక్యం చూపించాలని అది అనుకొంటే; నువ్వు ససేమిరా అని దానికి కోపంతెప్పించావు. పోనీ నువ్వేమన్నా అంత కంటె బావుకొన్నావా అంటే—— నువ్వూ కారుని చెడగొట్టావు. దానికి సినీమా లేకుండా చేశావు. ఒరేయ్. నామాటవిను. మెల్లిగా వెళ్లి బుజ్జగించి తీసుకురా!

రా: నేవెళ్లను. కావలిస్తే నువ్వే వెళ్లి మీమనుమరాలిగారిని బుజ్జగించి తెచ్చుకొని అన్నం తినిపించుకో.

తా: ఇప్పట్లో నేను కాదురా వెళ్లవలిసింది నువ్వుగాని.

రా: (వంటవానితో) ఏమయ్యా. ఇంకా వడ్డన పూర్తి కాలేదూ. ఎంతసేపు ఈమూలొచ్చేడం.

వం: చిత్తం అయిందండి.

(తెర)

(తరువాయి వచ్చే సంచికలో.)

తిక్కన ధర్మపత్ని పతి హృదయమున క్షాత్రధర్మమును పునరుజ్జీవింపజేసిన వీరవనిత. రాణి సంయుక్త, తారాబాయివంటి వీరవనితలు; యమునాబాయి, లక్ష్మీబాయి అహల్యాబాయివంటి దొడ్డయోధలు; చిత్రలేఖ పద్మావతివంటి కళానిపుణలు; భాస్కరాచార్యుని కూతురైన లీలావతివంటి గణితశాస్త్ర ప్రవీణులు; శశిరేఖవంటి రసాయన శాస్త్రధురీణులు; భోజుని భార్యయైన భానుమతివంటి ఐంద్రజాలికలు మొదలుగాగల విద్యా విశారదలు దేశములో అనేకులు వెలయకపోలేదు; గాని, ఎన్నిసారులు ఎందరు పేర్కొనా వీరిపేళ్ళే ఎక్కువగా పేర్కొంటున్నారు. ఈ కొలదిమంది ప్రఖ్యాత స్త్రీలనుబట్టి పూర్వకాలములో స్త్రీలలో విద్యావ్యాప్తి ఎక్కువగా ఉండేదని వాదించుటకు పూనుకొనుటకంటె విషమ పరిస్థితులలో ఎదురీతవలె ఈదుకొంటూ విదుషీమణులై వీరవనితలై విఖ్యాతిని బడసిన ఈ స్త్రీలను ఎక్కువగా మెచ్చుకొనుటమేలు.

స్త్రీల సారస్వతము

సారస్వతము, వాఙ్మయము, సాహిత్యము—ఈ మూడు మాటలున్ను సమానార్థకములయినట్టు, లిటరేచర్ అనే ఇంగ్లీషుపదమునకు సరియైన పదములుగా మన తెలుగువారు ప్రయోగిస్తున్నారు; గాని, ఈ మూడు మాటలున్ను సమానార్థములుకావు. "సంగీతంచతు సాహిత్యం సరస్వత్యాః కుచ ద్వయమ్। ఆపాత మధురమేక మన్యదా లోచనామృతమ్॥" అనే శ్లోకములో సారస్వతమందుగల ప్రధాన విషయములు రెండున్ను—అనగా సంగీతమున్ను సాహిత్యమున్ను పేర్కొనబడినవి. అందులో సంగీతమన్నది "ఆపాత మధురమ్" అనగా చెవిని పడుతూ ఉన్నంత సేపు మాత్రమే మధురముగా ఉంటుంది; ఆపైని మరేమీ ఉండదని భావము. సాహిత్యమన్నది మాత్రము ఆలోచనామృతము, అనగా ఆలోచించినకొద్దీ అమృతమువలెనె అతి మధురముగా ఉంటుందని భావము; సంగీత సాహిత్యములకుగల భేదము మనము వ్యవహారములో కూడా పాటిస్తున్నాము. ఏదైనా పాటపాడుతూ ఉన్నప్పుడు పాటలోని మాటలకు సాహిత్యమంటున్నాము; "గప్పా గరి సరిగా రిగ" అని స్వరాలు పలికినా లేక రాగమాలాపము చేసినా సాహిత్యములేని కేవల గానమంటున్నాము. కవితా చమత్కృతి, రసము మొదలయిన కవితా లక్షణములతో కూర్చినదంతా—పాటగానీ, పద్యముగానీ, వచనమేగానీ సాహిత్యమగుతున్నది. ఇక వాఙ్మయమంటే వాక్కంతా—పలికినదంతా, కవితా చమత్కృతి ఉన్నా లేక పోయినా రచించినదంతా వాఙ్మయమవుతున్నది; గనుక, వాఙ్మయము అపరిమిత ప్రయోజనము గలది, కడు విశాలవ్యాప్తిగలది. కవితా చమత్కృతి కలదే సాహిత్యము కాగలదు గనుక సాహిత్యము పరిమిత ప్రయోజనము గలది. సారస్వతములో ఒక భాగమైనట్లే, వాఙ్మయములోను ఒక భాగముగానె యున్నది.

ఈ చిన్న వ్యాసములో స్త్రీల విద్యా పరిణామము చెప్పిన తర్వాత స్త్రీల సంగీతమును గూర్చిన్ని సాహిత్యమును గూర్చిన్ని చెప్పదలచి, రెండున్ను చేరియున్న సారస్వతము పేరు వ్యాసమునకు పెట్టినాను.

నృత్యము, గానము మొదలయిన సంగీత సంబంధముగల కళలు పురుషులకంటే స్త్రీలకే ప్రకృతి సిద్ధముగా సాధ్యతరమయిన కళలు. సౌందర్యం సౌకుమార్యం, లాలిత్యం, మాధుర్యం మొదలయిన లక్షణములు పురుషులకంటే స్త్రీలకు సహజముగా అమరియున్నందున స్త్రీల నృత్య గానములు ఎక్కువ మనోజ్ఞముగా ఉంటవి. ఇందులో స్త్రీలకుగల ప్రావీణ్యము ప్రాచీన కాలమునుండిన్ని మెచ్చుకో దగినదిగా పరిణమిస్తూ ఉన్నది. అయినా, ఈ కళలకు సంబంధించిన లక్షణములు, శాస్త్రములు రచించినవారు పురుషులే కాని స్త్రీలు కారు. ఈ కళా ప్రయోగములలో పురుషులకంటే స్త్రీలే ఎక్కువ ఆకర్షణీయముగా నృత్యము చేయగలిగినా, పాడినా, వీరికి గురువులయి నేర్పగలిగిన వారు స్త్రీలకంటె పురుషులే ఎక్కువగా కన్పడుతున్నారు. కొంత కాలము గడచిన తర్వాత స్త్రీలలో దేవదాసీలే నృత్యము చేయదగినవారు, సంసార స్త్రీలకు నృత్యము తగదు అనే అభిప్రాయము బయలు దేరినది. అందుకు తగిన కారణము లేక పోలేదు. నృత్యమందు ప్రవీణులయిన దేవదాసీలు తమ జీవితములను భగవంతునికి అంకితమును చేసుకొని దేవాలయములో దేవుని యెదుట నృత్యము చేస్తూ పవిత్రముగా మెలగవలసినదన్న ఆశయముతో ఈ దేవదాసీవిధాన మేర్ప

(25-వ పేజీ చూడడు)

స్త్రీ విద్యా పరిణామము

(23వ పేజీ తరువాయి)

డినది. గాని కొంతకాలమునకు దేవదాసీలు నీచమైన వృత్తికి అలవడుటచేత వారి నృత్య కళ కూడా వారివలె నీచమైన కళగాను, వారికే కాని సంసార స్త్రీలకు తగని కళగాను పరిణమించినది. ఈ విధముగా నాట్యకళ అయోగ్యమైన వారి సంపర్కముచేత అయోగ్యమయినదే కాని, సహజముగా పవిత్రమయినదే అన్న భావము ఇటీవల కలుగుటచేత, ఇప్పుడిప్పుడు ఉత్తమజాతి బాలికలు ఈ కళను అభ్యసిస్తూ దీనికిగల గౌరవమును పునరుజ్జీవింప జేసినవారయినారు.

సాహిత్యకళా విషయములో కూడా ప్రాచీనకాలమందు స్త్రీ రచయితలు అట్టే ఎక్కువగా కనబడరు. ధీశక్తిలో గాని, భావగాంభీర్యములో గాని, పదలాలిత్యములో గాని స్త్రీలు పురుషులకే మాత్రమున్ను తీసిపోరు. అయినా, కవయిత్రుల సంఖ్య కడు తక్కువగా నుండుటకు కారణములు గలవు. కవితాకళ—అందులోను ఎక్కువగా మార్గ కవితకు భాషాపాండిత్యము, వివిధశాస్త్రజ్ఞానము, కళాభ్యాసమునకు కావలసిన తీరుబడి ఉండవలెను. ఇవి స్త్రీలకు దుర్లభములైనవి. అందుచేతనే ప్రతిబంధకము లెన్ని ఉన్నా తమశక్తి సామర్థ్యములచేతను, తమ అదృష్టము కొద్ది లభ్యములయిన అవకాశములను వినియోగించుకొనుటచేతను కవయిత్రులైన వారిని ఎక్కువగా మెచ్చుకోవలసియున్నది.

స్త్రీల సాహిత్యము రెండువిధములయినది : 1. స్త్రీలు రచించినది ; 2. స్త్రీల కోసముద్దేశించి రచించినది. మొదటి దానిలోని రచనలు స్త్రీ పురుషులలో ఎవరి కోసమైనను కావచ్చును ; రెండవదానిలోని రచనలు స్త్రీలవైనా కావచ్చును, పురుషులవైనా కావచ్చును. అన్ని రచనలున్ను హృద్యములుగా ఉండుటకు సాధ్యమయినా, స్త్రీల చిత్త ప్రవృత్తులు, మనోధర్మములు పురుషులకంటె స్త్రీలే అనుభవముచేతను, సాహచర్యము చేతను ఎక్కువగా తెలుసుకోగలరు గనుక, స్త్రీల విషయమై స్త్రీలు రచించిన గ్రంథములు—తక్కిన లక్షణములన్ని సమానముగా ఉన్నప్పుడు ఎక్కువ రసవంతమైనవి కాగలవు. అనుభవమున్నా లేక పోయినా ఊహించేశక్తి కవికిగాని, కవయిత్రికిగాని ఉండవచ్చును. అందుకు నిదర్శనముగా ఒక చాటు పద్యమున్ను దానికి సంబంధించిన ఒక కథయున్ను గలవు. ఒక రాజకుమారిక ఒక గ్రంథము రచించినది. రాజు పండిత సభ గావించి దానిని ఒక పండితుని చేతికిచ్చి చదివించాడు. అందులో ఒక యువతి "వనజాతాస్త్రుడేయు సాయకముల౯ వారింపఁగారాదు ; నూతన బాల్యోద్భవ యౌవనంబు మదికి౯ ధైర్యంబురానీయ ; దత్యనురక్తి౯ మిము బోంట్లతో దెల్పనాహా సిగ్గమై కోదు ; పావన వంశంబు స్వతంత్ర మీయదు ; సఖీ వాంఛల్ తుదల్ ముట్టునే ?" అని విలపించినట్లు ఒక పద్యముండెను. అది చదువగానే వివేకము లేని పండితుడొకడు "ఓహో ! స్వానుభవ విలసితముగానున్నదీ పద్యము ?" అని పలికినాడట. అందుకా రాజకుమారికి కోపము తెచ్చుకొని, తన గ్రంథము అడిగి పుచ్చుకొని, వెంటనే ఆశువుగా దారిద్ర్యమునుగూర్చి రెండు పద్యములుజెప్పి "జన్మ ప్రభృతి దారిద్ర్య మెఱుగని నేను దారిద్ర్యముగూర్చి ఊహించి పద్యములు చెప్ప గలిగి నప్పుడు ఈ పద్యము మాత్రమూహించి చెప్పజాలనా ? అందుకు అనుభవముండి తీరవలెనా ?" అని కోపముతో తన గ్రంథమును చింపి పారవేసినదనిన్ని, ఆ ఒక్క పద్యమున్ను చాటువుగా లోకములో నిల్చియున్నదనిన్ని ముచ్చటగా ఈ కథ చెప్పుకుంటూ ఉంటారు. ఇది వాస్తవముగా జరిగిన ముచ్చట కావచ్చును ; లేదా, కల్పితము కావచ్చును. ఏదైనా ఊహించి రచింపగల శక్తి కవికిగాని, కవయిత్రికిగాని కలదని నిరూపించుటకు తగిన ముచ్చట. అయితే సహజ సిద్ధముగా అలవడిన ఊహతోపాటు అనుభవము కూడా ఉన్నయెడల, రచన మరింత రమ్యముగాను, రసవంతముగాను రంజిల్లగలదు గదా ? ఇందుకు నిదర్శనములుగా ప్రౌఢ కవయిత్రులయిన మొల్ల, ముద్దుపళని మొదలయిన వారు రచించిన కావ్యములనుండి పద్యము లనేకములుగా ప్రదర్శింపవచ్చును.

మొన్న మొన్నటి వరకున్ను మార్గ కవితకుగల గౌరవము దేశకవితకు లేక పోవుటచేత దేశకవితగానుండిన గ్రంథములు అందులోను ఎక్కువగా స్త్రీలపాటలు మొదలయినవి ఎన్నో

స్త్రీ విద్యా పరిణామము

అచ్చుకాకుండా నశించినవి; కొన్ని గుజలీ ముద్రణములు గలవి; కొన్నియింకా అచ్చుకాక వ్రాతపుస్తకముల గ్రంథాలయములలో రామ బాణములకు గురియగుతూ ఉన్నవి. కొన్ని అనుశ్రుతముగా స్త్రీల కంఠములందు శ్రావ్యముగా నదిస్తూ ఉన్నవి.

ఇప్పుడిప్పుడు ప్రజాసంస్థలతోపాటు ప్రజాసాహిత్యము యెడల ఆదరము, గౌరవము, అభిమానము ఎక్కువగుతున్నవి గనుక స్త్రీల సాహిత్య మెక్కువగా విజృంభించ గలదని నా నమ్మకము.

స్త్రీల సాహిత్యమునకు సంబంధించిన గ్రంథములలో ముఖ్యమయినవి కొన్ని వివరిస్తూ మరియొక వ్యాసమురచింప సంకల్పించినాను గనుక ఇప్పటికీ వ్యాసము చాలించి స్త్రీలు పిల్లలు, పెద్దలు యథేష్టముగాను, యథోచితముగాను కథలు, కావ్యములు, విమర్శలు, వ్యాసములు రచింతురు గాక! మీ పత్రిక అన్ని విధములా అభివృద్ధి పొందునుగాక! అని నా ధన్యవాదములను అర్పిస్తున్నాను.

★



ఆంధ్ర మహిళకు

6 వ జన్మదిన సందర్భములో

రచయితలంపిన

శుభాకాంక్షలు

శ్రీమంతమై తొల్త శ్రీకృష్ణ రాయలు
ఆంధ్రను బాలించి అలరి నాడు,
సాహిత్య రాజ్యాన సర్దారులను బోలు
కవులెందరో మున్ను కదలినారు
పరదేశములలోన పరగ వాణిజ్యంబు
పేర్మితో గావించి వెలసి నారు
తదితర నృపులకు తలలొగ్గ కేనాడు
మెఱుగైన ధైర్యాన మెలసి నారు,
శిల్ప లతలను మోసిన చిత్ర ధరణి
కవిత లావణ్య మొప్పారు కాంతి జగతి
కమల తుల్యపు సొంపగు కళల నేర్పి
అలరి యుండె జుమి యొక నా డాంధ్రభూమి!
జగతి కంపుమ! సంస్కృతి శాశ్వతముగ
విమల చరితమె యెన్నెన్నొ వేలయేండ్లు
లిఖితమై మన కీర్తియేయది యఖిల మవగ
అమిత గమనాన సాగుమా! ఆంధ్రమహిళ!
మల్లమాంబయు మహాదాంధ్ర మహిళగాదె!
సోదరి రుద్రమ యలరె యశోనిధిగను
నాయకత్వాన కీర్తిలె నాగమాంబ
ఆంధ్రమహిళలే ఘన కీర్తి నందినారు,
అలర నభ్భంగి నాకాంక్ష ననుపుచుంటి.

—బి వీరభద్రరావు

గీ॥ పూవుబుట్టిన, తోడనె పొసగు, తావి
చిరత, ప్రాయంబు నందె నీ చెలువమెల్ల
ఆంధ్ర రమణుల హృదయాల, హత్తుకొనియె
అందుకొనుమిదె, ఆశీస్సు లాంధ్రమహిళ ॥
విమల విజ్ఞానకాంతితో వెలయు నీవు
అంధ తమసాన పడియుండు అతివలకును
మార్గ దర్శిని వైతివి, మాన్యచరిత
నీ రుణంబెట్లు, తీర్తురో నెలతలెల్ల ॥
దివ్యమగు నీదు పుట్టిన దినమునందు
కథలు, పాటలు, పద్యాలు, గద్యములను
సరసమైనట్టి భూవల సంతరించి
అందచందాల చిందుము ఆంధ్రమహిళ ॥
నవ్య సాహిత్య పథమున నడచినీవు
విద్య సంస్కృతి కలిగించి వెలదులకును
దిద్దుచుంటివి యువిదల తీరుగాను
విజయమగుగాక నీకు నీ విభవమునకు ॥
విదుషి యుచితజ్ఞ నేర్పరి నీదుజనని
అట్టి మాతకు మురిపెంపు పట్టె నీవు
సత్పథంబున చరియించు టబ్బురంబె
అస్తు శుభమస్తు దీర్ఘాయురస్తు నీకు ॥

—చుండూరి రమాదేవి

సీ॥ ఒక్కచో పుట్టెడి నున్నత వంశాలు భారతావనిలో లాభంబు కలిగి,
నారీమణులుపుట్టు నా వంశములయందు ఖ్యాతి కాంతులు కలుగంగ వేచి
విజ్ఞాన కరములు వీరిని సోకిన కవియొక్క తేజంబు గాంచు ఫలము,
ఆంధ్రరాష్ట్రపు దివి "నాంధ్ర మహిళ"నెడి పత్రిక వెలిగెడుగా మిత్రు విధము,
గీ॥ వనిత లనెడి చంద్రుల వదన కాంతి
"ఆంధ్ర మహిళ"ను సూర్యుచే నధికమగును!!
కమల దళనేత్రి పికముల కంఠములకు
"మహిళ" నవ్యచూతాంకుర మగును గాక!!!

—దే. వెం. రా భాస్కర శాస్త్రి

లేఖలో లోకాభిరామాయణం

శ్రీమతి గొల్లకోట కమలామణి

హేమా,

మొన్న నీవు వ్రాసిన ఉత్తరంవల్ల అందరి క్షేమం తెలిసి చాలా సంతోషించాను. మీకా పల్లెటూరుకు బదిలీ అయినప్పటినుంచీ, ఏ దేశంలో, ఏ భాగంలో, ఏ కాలంలో నున్నామో తెలియనట్టుగా చెట్లూ, చేలూ మధ్య మెల్లిగా కాలక్షేపం జేస్తున్నామనీ, ఇచ్చటి ముచ్చటలేమైనా వ్రాయమనీ అన్నావు. ఎంత అదృష్టవంతులే. కాని, అటువంటి ప్రశాంత జీవితం హాయిగా అనుభవిస్తూన్న నీకు, ఈ విరామంలేని పట్నవాసపు ముచ్చట్లు వినాలిని ఎలాగ మనసైనదా, అని మొదట కొంచెం ఆశ్చర్యం కలిగింది కాని ఆ తర్వాత ఆదిప్రకృతి ప్రబోధితమైన మానవ ధర్మమే గదా నుకున్నాను. అవును, పశు పక్ష్యాదుల కన్న విశిష్టమైన శక్తిని గలిగిన మానవులు, అన్ని దిక్కులూ పరిశీలనగా చూడాలి; ఆలోచనలు పెంపొందించుకోవాలి; అను క్షణమూ కదిలేకాలంతో ముందుకు అడుగులు వేయాలి, దే అభ్యుదయ లక్షణం!

నేను నీకొక విషయాన్ని గురించి వ్రాద్దామనుకుంటూ ండగా, నీ దగ్గరనుంచి, "అచ్చటి ముచ్చటలేమైనా తెలు దూ!" అన్న జాబు వచ్చింది. మంచి శకునమే! నీవడిగి ట్టుగా ఇచ్చటి ముచ్చటతోనే ప్రారంభిస్తానుగాని, దాని ని విషయం, పట్నం పల్లె భేదం లేకుండా, దేశాని ంతకూ సంబంధించినదే సుమా! శ్రద్ధగా చదివి, చక్కగా లోచించి, నీ అభిప్రాయాన్ని తెలియ జేస్తావు గాదూ?

ఈ మధ్య మా మహిళాసభవారి ఆహ్వాన మంగీకరించి, త్రెన్నేటి విశ్వనాథంగారు, మా సభకు వచ్చి, కేంద్ర సన సభలో ప్రవేశ పెట్ట బోయే హిందూ కోడు బిల్లు వరణలను) గురించి ఉపన్యసించారు. అబ్బ! ఎంత క్కగా మాట్లాడారనుకున్నావు! నీవు కూడా విన లేదే ని ఎన్నిమాట్లో [illegible]నుకున్నాను. కొన్ని కొన్ని సవరణలతో బిల్లు రాబోతూవున్నదని మన కందరికీ కొంత తెలుసును. తో మార్పు అనేసరికి, సందేహంతో ప్రతిఘటించడమో, సంతోషంతో ఆమోదించడమో చేస్తున్నామేగాని, దానిలోని బాగోగులు, మనం పూర్తిగా తెలుసుకోలేదు. అది ఎన్నో సాధక బాధకాలతో నిండివుంది. అందులోని విషయాలన్నీ విడమర్చి ఆయన చెబుతూవుంటే, ముళ్లుముళ్లుగా గుచ్చుకొంటూ జిగురుసాగుతూన్న పనసపండును, నేర్పుగా విడదీసి, తొనలు పళ్లెంలో పేరుస్తూన్నట్టుగా అనిపించింది. పండిత పామరబోధకంగా మాట్లాడిన, శ్రీ విశ్వనాథంగారికి క్లిష్టమైన విషయాన్ని కష్టంలేకుండా తెలుసుకునే సావకాశము కలిగించిన, మహిళా సభకూ, నా హృదయ పూర్వక అభినందనా లర్పించాను! (మనసులోనే సుమా!)

అయితే, ఆ విషయాలన్నీ ఇక్కడ మేమొకకొద్దిమందితో విన్నంత మాత్రమున ప్రయోజనము లేదు. దేశమంతటా ప్రచారం గావాలి. ఆపైన అన్ని వర్గముల వారు చర్చలో పాల్గొని, వారివారి అభిప్రాయములను వెలువర్చి, సత్ఫలితం సమకూర్చాలి. తరిస్తేనేగాదా చెదరివున్న వెన్నముద్ద చేతిలోనికి వస్తుంది! ఆ యుద్దేశంతోనే నేనిప్పుడిది నీకు వ్రాస్తున్నాను.

రాబోయే హిందూకోడ్ బిల్లులో ముఖ్యమైనవి మూడు సంస్కరణలు—

1. స్త్రీ పురుషులకు సమాన వారసత్వపు హక్కు.
2. సమిష్టి కుటుంబపద్ధతి నంతరింప జేయడము.
3. విడాకులు.

వీనిని గురించి, నాయకాగ్రేసరులే తీవ్రమైన అభిప్రాయ భేదాలు వెలిబుచ్చారు. ఆమోదించినవారి ఆశయాలు ఉన్నతమైనవనుట నిర్వివాదాంశము, ప్రతి ఘటించిన వారికి ప్రత్యేక కారణాలుంటా యనుట నిస్సందేహమే. కనుక, మనమంతా గూడా జాగ్రత్తగా, దేనికదే, వానిని విమర్శించుకోవడం అవసరం (మనది ప్రజారాజ్యం!)

సంస్కరణలన్నీ మంచివేగాని, అన్నిటికీ కూడా కొన్ని సవరణలు, మరికొన్ని కూర్పులు అవశ్యకమని నాయుద్దేశము.

మనది, 'సెక్యులర్ స్టేటు' అనీ, జాతి మత వివక్షతలు లేకుండా, మానవులందరికీ సమాన హక్కులు, అవకాశాలా యిచ్చి కాపాడ దలచుకున్నామనీ, మన నూతన రాజ్యాంగ ప్రణాళికలో అన్నమాటయే! అటువంటప్పుడు, మానవ జాతికే చెందిన స్త్రీలకు కూడా పురుషులతో పాటుగా వారసత్వం కలిగించడం, ఆర్థిక స్వాతంత్ర్యాని కవకాశ మియ్యడం, తప్పనిసరిగా చేయవలసినదే గాదూ? అలాగ కాదనడం చాలా అసందర్భం, అన్యాయమునూ. ఆడబిడ్డకు ఆస్తిలో వాటాబెట్టితే, ఆస్తి చీలికలై పోతుందనీ మరొక కుటుంబానికి సంక్రమించి పోతుందనీ, 'హాహా' కారాలు జేసేవారి మనస్తత్వ మేమిటో నాకెంత ప్రయత్నించినా పూర్తిగా అర్థంకాలేదు. మగపిల్లలు నలుగురూ పంచుకుంటె చీలికలయి పోదా? మరొక ఇంటి బాలిక తమ యింటికి వచ్చి, తానూ తనబిడ్డలు, ఆస్తినను భవిస్తూ అధికారం వహించడం సహించగలరుగాని, తన కడుపున బుట్టిన బాలికకూడ కొంత ఆస్తిని అనుభవించడానికి మనస్కరించక బాధపడు తున్నారా? చట్ట ప్రకారము కొడుకు ఆస్తిలో కోడలికి భాగముందిగాని, అమ్మాయివంతు మీద అల్లుడి కధికార మేమిలేదే. దేనికింత భయము? ఎందుకు వల్లగాదని వాదిస్తున్నారోగాని, ఇంకా తరవాత ఆడపిల్లకు ఎట్టిని ఏగానికైనా హక్కులేదనే తహతహతో నిర్దాక్షిణ్యంగా కట్నాలు వసూలుచేసే ఆచారంగూడా అంతరించిపోతుంది. పెళ్ళిళ్లు అన్నివిధాలా ఆనందకార్యా లవుతాయి.

అయితే ఆడపిల్లకుగూడా వారసత్వపుహక్కు గలిగించడము ధర్మమేగాని, సమానభాగ మియ్యడం సబబా అని కొంచెం సందేహంగానే వుంది. ఏమంటే, శ్రీమంతురాలైన భార్యనైనా పోషించవలసిన బాధ్యత భర్తది. ఎంత నిర్ధనుడయిన భర్తనైనా, పోషించవలసిన బాధ్యత భార్యకు లేదు. కనుక, కుటుంబమేర్పడిన నాటినుండి గూడ యింకొక వ్యక్తి భారం భరించవలసిన పురుషుడి కిచ్చే వాటాలో సగం స్త్రీకియ్యాలనే సవరణ సమంజసమేమో కూడా ఆలోచించవలసినదే. (గడించుకో గలిగిన పురుషుడికి అవసరమే లేదనీ, అబల అయిన ఆడుదానికే అవసరమనీ, అంతా ఆడువారికే చెందాలనీ అనేవాదం కూడా వున్నదిలే!)

ఈ సందర్భంలోనే యింకొక్కటి కూడా ఎలాగైనా చేర్చడం అత్యవసరము. ఈ వారసత్వపు లాభము, సంపన్న గృహస్థుల ఆడుబిడ్డలకేగాని, సామాన్య సంసారుల బాలికలకే ముపకరిస్తుంది? అన్ని చదువులు చదువటానికీ, అన్ని ఉద్యోగాలు చెయ్యడానికీ ప్రభుత్వమెన్ని హక్కులు స్త్రీలకిచ్చినా,—ఏ కొద్దిమందో, ఏ కొన్నాళ్ళో, బయటి ఉద్యోగాలు చేసినా, మొత్తం మీద స్త్రీలు, ఎప్పుడో ఒకప్పుడు, గృహిణులై, సంసారం నడపడం సామాన్య ధర్మం. అదివారి సహజవృత్తి! అయితే, అది ఒకవృత్తి అని, ఉద్యోగమనీ, సాధారణంగా ఏ భర్తలూ భావింపరు. కడుపుకింత తిండీ కట్టడానికి కొన్ని బట్టలూ, యిస్తాడన్న మాట నిజమే. (జీతం లేనిదే తిండి బట్ట యిస్తే పని చేసే రోజులు పోయాయి!) కాని ఇక తక్కినదంతా అతని సుముఖ విముఖత దయా ధర్మముల మీద ఆధారపడినదే. భర్త సంస్కృతిగలవాడై, పూరుకుంటే తప్ప తన యిష్టానుసారం అర్ధణాడబ్బు లొకరి కియ్యడానికిగాని, అరగజం రవికలగుడ్డ కొనుక్కుందుకుగాని, భార్యకు "నా" అన్న ధనంగాని, దేనిపైన హక్కుగాని లేదు. వంటలక్కకూ, వెలయాలికీ పురుషుని పైనవుండేపాటి హక్కు, ఆర్థిక స్వాతంత్ర్యము, అన్ని బాధ్యతలూ నిర్వహిస్తూ, కష్ట నిష్ఠూరాలన్ని పంచుకుంటూ, భార్యగావుండే దానికి లేక పోవడం, అనుచితంకాదూ! భర్త మరణించాక భార్యకు సగం వాటా మీద అధికారం ఇప్పిస్తూన్న మాట వాస్తవమే. కాని, అప్పుడువచ్చే ధనం జీవితం జరగ డానికిబ్బంది గాకుండా పనికి వస్తుందేగాని, జీవితం సుఖంగా అనుభవించ డానికవుతుందా? భార్య ధనం కావాలంటే, భర్త మరణించాలని కోరుకోవాలా? బలే! కాని, మళ్ళీ అదైనా, నిలవాస్తి వున్నవాళ్ళకేగాని, నెల జీతగాళ్లైతే ఎలాగ? ఇట్టువంటిది ఏ యిల్లాలికైనా అసంతృప్తి గలిగించక మానుతుందా? అందులోనూ చదువు సంధ్యలూ, శక్తి సామర్థ్యాలూ కలిగి, ఆత్మ గౌరవం ఆత్మవికాసం ప్రబలిన ఈ రోజుల్లో,— యువతులకిది మరీ అవమానకరంగా అగపడుతూ, పెండ్లిఆడి భార్య ఉద్యోగంలో ప్రవేశించడమంటే, ఒక విధమైన అసహ్యం, భయంకూడా కలుగుతున్నాయంటే ఏమీ అతి

శయోక్తి లేదు. కనుక, కన్నవారి దగ్గరనుంచి వారసత్వపు హక్కుతో పాటు, కట్టుకున్న వారి దగ్గరనుంచి కూడా, ఏదో ఒక లెక్కన యిప్పించే పద్ధతి ఏదైనా ఆలోచించి ఏర్పాటు చెయ్యడం భావ్యము. ఏమంటావు ?

2. సమిష్టి కుటుంబపద్ధతి నంతరింప జెయ్యడం : సమిష్టి కుటుంబాలు అపురూపంగావున్న యీరోజులలో అవి అంతరింపజేయడానికంటూ ప్రత్యేకం ఓ చట్టం కూడా దేనికి ? అని అనుకున్నాము, మొదట్లో. కాని, ఆ అపురూపమైన సమిష్టి కుటుంబము సాంఘికము, ఈ అంతరించ బోయే సంస్కరణ ఆర్థికము (ఇది చాలా గడుసుతనమనీ, ఆఖరున చేర్చబడినట్టగపడుతుంది) సమిష్టి కుటుంబ పద్ధతి నంతరింప జెయ్యడమంటే, స్వార్జితం మీదలాగునే పిత్రార్జితం పైన కూడా దానవిక్రయాది సర్వాధికారాలు కలిగించడం. ప్రస్తుతమున్న ప్రకారం, పిత్రార్జితమైన ఆస్తి అయితే, అంటే తాత గడించిన ఆస్తిఅయితే, మనుమలకు పుట్టుకతోనే ఒక భాగానికి హక్కు ఏర్పడుతూ వుంది. స్వార్జితంలాగ, తండ్రి తన యిష్టానుసారం అనవసరంగా విక్రయించడానికిగాని, (కుటుంబావసరాల నిమిత్తమైతే అమ్మవచ్చును) విల్లుద్వారా ఎవ్వరికి చెందజెయ్యడానికిగాని, అధికారం లేదు. ఈ పద్ధతిని అంతరింపజేసి, పిత్రార్జితపు ఆస్తిపైన కూడా సర్వాధికారాలు కలిగించే సవరణ ఇంతలో తేవడం, మొత్తం మీద కుటుంబానికి లెక్కలురాని పిల్లలకూ, ముఖ్యంగా ప్రస్తుతములో స్త్రీ సంతానానికి హానికరమూ, అన్యాయమూ, అవుతుందిగాని, అనుసరణీయంగాదని నా కనిపిస్తూ వుంది. తేరగావచ్చిన సొమ్ము, తేలికగా ఖర్చు చెయ్య గలగడం సామాన్యజన లక్షణం. అటువంటప్పుడు, దుర్వ్యయంచెయ్యడానికే విక్రయించే అధికారం లేనందున, అది విధిగా పసిపిల్లలకు ఆధారంగా కుటుంబంలో నిల్చి వుంటుంది. అదలాగుండగా, స్త్రీ కిచ్చిన వారసత్వపు హక్కు ఈ చేతితో యిచ్చి ఆ చేతితో తీసుకున్నట్టుగా పోలేదా ? ఆడపిల్లకు, కొడుకుతో వాటావుండరాదని ప్రతిఘటించే వారంతా, ఆస్తి తమకు సంక్రమించగానే వెంటనే, విల్లు ద్వారా గాని సెటిల్‌మెంట్సు గాని, అంతా మగ పిల్లలకే చెందజేసెయ్యకుండా వుంటారా ? తమ కష్టార్జితం, తమ యిష్టానుసారం జేసుకునే హక్కు న్యాయంగాని, తమకు కేవలం పుట్టుకతోనే ఏర్పడిన హక్కు అలాగే తమ బిడ్డలకూ వుండాలిగాని, లేకుండా చెయ్యడం పసిపాపలను అన్యాయం చెయ్యడంగాదూ ?

అయితే—ఇంగ్లడు, అమెరికా యిత్యాది విదేశాలన్నిటిలోనూ, రెండురకాల ఆస్తులుగాకుండా, అంతా ఒకే విధంగా సర్వాధికారాలతోనే అనుభవిస్తున్నారు గదా ? ఇక్కడమాత్రమదే విధంగా ఎందుకుండరాదంటే, అక్కడిలాగ ఇంకా ఎన్నెన్నో మార్పులు వచ్చిననాడు ఇదీ ఆచరణ యోగ్యమే కావచ్చును. రష్యాలో, ప్రత్యేక ఆస్తులన్నవే లేవట ! అయితే మాత్రము నష్టమేముంది ?— ప్రభుత్వం ప్రజాసౌకర్యాలన్నీ తమ బాధ్యతగా వహించిననాడు,— ఉచితవిద్యా వైద్యాది సదుపాయాలు విరివిగా రాజ్యమంతటా సాగించిననాడు—పసిపాపల పోషణ, అసహాయ స్త్రీలరక్షణ, వృద్ధులభారం భరించిననాడు—ప్రత్యేకాస్తుల పెరుగుదల తగ్గించి, దేశమొత్తంమీద సంపద నంతటినీ సర్దే విధానాలు నిజంగా అమలులోనికి తెచ్చిననాడు—స్త్రీలు కూడా ప్రత్యేక వ్యక్తులేగాని, ఆస్తులు గారనీ, భార్యాత్వం కూడా ఒక అత్యవసరమైన ఉద్యోగమేననీ గుర్తించి, ప్రజాసామాన్యంలో గట్టిగా నాటించిన నాడూ అయితే ఏ ఆస్తిని ఎవరిలా వినియోగించినా, అసలు ఆస్తియే లేకున్నా కూడా మరేం ప్రమాదంలేదు. అప్పుడది చినచిన్న కుటుంబాలతో ఏర్పడిన, పెద్దదేశ కుటుంబమవుతుంది. విశ్వ కుటుంబంగా విలసిల్లుతుంది !—దానిలోని భాగ్యం, ప్రవాహోదకంలాంటిది. దిగి స్నానం జెయ్యవచ్చును. బిందెలతో ముంచి, శక్త్యానుసారం తీసుకు వెళ్ళి, అనుభవించ వచ్చును. అలాగని మేడమీద కష్టపడి పంపుకొట్టి పెట్టిన, కుండలో నీళ్ళు అలాగ జెయ్యవచ్చునా ? మొదట వచ్చిన పెద్ద వారవన్ని తమ యిష్టానుసారం పోసుకునిపోతే, తరువాత లేచిన చిన్నపిల్లల సంగతేమిటి ? పెద్ద పిన్న తారతమ్యంతో, అందరికి వుండేలాగ నిబంధన లేర్పరచవద్దూ ! వండి పెట్టిన పరమాన్నం పంక్తిలో కూర్చున్న అందరికి గ్లాసులో పోసి యిస్తాముగాని, మొదట కూర్చున్న వాళ్ళనే దోసిళ్ళతో తీసుకొని త్రాగివేయ నిస్తామా ?—కనుక, ప్రభుత్వం అటు

వంటి ఏ బాధ్యతలూ వహించకముందే, ఇటువంటిమార్పులు తేవడం—సమర్థులైన వారికే మరికొన్ని హక్కులు వృద్ధి జేసి, అసమర్థులైన స్త్రీలకూ, నోరు మాలిన పసి వాళ్ళకూ, మహా అన్యాయం జెయ్యడమవుతుంది. హక్కులూ, బాధ్యతలూ సమానంగా పెరగవద్దా? ఈ సంస్కరణవల్ల ప్రభుత్వంగాని, కుటుంబ యజమానిగాని ఏ బాధ్యత అదనముగా వహిస్తున్నారు? ఈ విధంగా చెయ్యడం వల్ల, అణువును భిన్నంచేసితే కలిగే, అణుబాంబుతోలాగే, కుటుంబము భిన్నమైపోయి, అసలు కుటుంబాలన్నదే లేకుండా సర్వశూన్యంబయి పోతుందేమో! కనుక, అదిమాని, మరొక విధంగా సవరణ జేసుకుంటె బాగుండవచ్చును. తల్లి తండ్రులే, వారి జీవితకాలమూ సంపూర్ణంగా అనుభవించాలనీ, వారి తదనంతరమే బిడ్డలకు వానిపై హక్కేర్పడుతుందనీ అంటే, అందరికి కూడా న్యాయం జరగదూ?

3. ఇక, విడాకులను గురించి, ప్రస్తుతం ఎక్కువగా ఏమి చర్చించదలచుకోలేదు. (అసలు, రావలసిన రూపంలో రాక పోయిన,) ఈచట్టం అప్పుడే మనరాష్ట్రంలో అమలులోనికి వచ్చేవున్నది. ఎప్పటిలాగే కాలంగడచిపోతోందేగాని, సంసారాల్లో ఏవిధమైన అల్లకల్లోలాలు, అవి నీతులూ, క్రొత్తగా ప్రబలిపోలేదు. కనుక, ఈవిధమైనవి దేశమంతటా ప్రవేశపెట్టిన, సంభవించబోయే మహాపదగాని, విప్లవంగాని, మరేమీవుండదు. ఇదివచ్చినంతమాత్రాన, బలవంతంగా ఏ దంపతుల్నీ, ఎవ్వరూ విడదీసి విడాకులియ్యరు. బాధలున్నాగూడా, భరించలేని పరిస్థితి ఏర్పడితేనేతప్ప, ఏ భార్యాభర్తలు విడిపోవనూపోరు. ఎవరికివారు వారివారి సాధకబాధకాలాలోచించుకుని, కలిసివుండడం కష్టమనిపించి విడిపోతామంటే, అప్పుడు వారి కాస్వాతంత్ర్యమియడంలో అపరాధమేముంది? ఆమాటకువస్తే, ఇష్టంలేని ఇద్దరిని బలవంతంగా, నిర్బధించి, కట్టివుంచడమే అన్యాయం, హానికరమూ అనాలి! ఇకదీనివల్ల, ఆదర్శంగావున్న హిందూ స్త్రీ సౌంశీల్యం నాశనమై పోతుందనడానికి, - నిర్బంధం వల్ల కాపాడబడేదే అయితే, అదెంతపాటి సౌశీల్యం? దానికొక పెద్దవిలువేమిటి? స్వేచ్ఛగలిగిననూ, అది దుర్వినియోగం చెయ్యకుండా నిలిచినదేనీతి! కట్టివుంచినంత సేపేగాని, రవ్వంతసడలనిస్తే అంతర్ధానమైపోతుంది సౌశీల్యం అనడం హిందూస్త్రీలను కేవలం అవమానించడం, వారికి మహాపచారం చెయ్యడం! అవునంటావా, కాదంటావా?


హేమా, అనకోకుండానే బోలెడంత గ్రంథం పెరిగిపోయింది. ఇప్పటికిది చాలును. నీజవాబు కెదురుచూస్తూ వుంటాను

సోదరి.

అన్నట్టు,

ఇంకామహత్తరమైన మార్పొకటొన్నో రావాలన్నదలాగుండగా, ఈ తెచ్చేవిడాకుల చట్టంలోనే, ఒక అసందర్భపు అన్యాయముంది సుమా. భార్యాభర్తలు విడిపోతే, బిడ్డలు తండ్రికే చెందాలనడం, ఏమిన్యాయం? అష్టకష్టాలకూ ఓర్చి, ప్రాణా వసిష్టమైకన్న తల్లి ఆధీనంలోనే పిల్లలుండాలనే సవరణకూడా అత్యవసరంకాదూ?

★



చిరంజీవి గొల్లకోట వసంతకుమారి


శివతాండవ రహస్యం

రాగరంజితమైన సంధ్యాకాలము దైవమానవ ప్రకృతుల పరస్పరానురాగ బంధములకు అంతర్ద్వారము- నిరంత పరిశ్రమచే విసివి వేసట నొందిన జీవకోటిని సహజ వాత్సల్యముతో ప్రకృతి మాత తనయొడిలో జేర్చుకొని, జోకొట్టి నిద్రబుచ్చుటకు మౌన ముద్రతో లోకములు పిల్చునట్టి సమయము. అందు జగత్పితయు, సర్వ తేజోనిధానము నైన పరమశివుడు తన ఆనంద తాండవ లీలా విభూతిచే ఆశ్రితులకు పారవశ్యమును కలిగించును. అదే సమయమున ప్రణవనాద విలసితములైన సప్తస్వరమాతృకలు శృతి లయలతోకూడి అవ్యక్తమధురమైన నాదము నాలపించుచూ, స్వాగతమును పాడుచుండును. ఈ దివ్యతాండవ లీలానుభూతిచేతనే అనాదినుండియు ప్రాతపడిన యీ ప్రకృతిని దయామయుడగు పరమశివుడు నూత్న కళారంజితమగునట్లు చేయుచున్నాఁడు. అపుఁడుచేతనా చేతన భూతములందలి కళలు వికాసము నొందును.

ఆసంధ్యానటుని సర్వావయములందును, అన్ని అలంకారములందును, సమస్త నాట్యభంగిమములందును, ప్రపంచమున కాధారములైన దైవమానవ భౌతికశక్తులు మూర్తీభవించి, అంతర్లీనములైయున్నవి అరువది నాల్గుకళలు, అవ్యక్తరూపములతో, ఆ పరమశివుని పార్శ్వభాగమునందు లాస్యమొనరించుచున్నవి వేయేల ఆ జగన్మంగళ మూర్తియే, దృశ్యాదృశ్యప్రకృతులకు ఆధారమైన విరాడ్రూపము. సృష్టిస్థితి సంహారములను కళలు అతని లీలాకటాక్షప్రసారములు.

ఈపవిత్ర సమయమున, భారత. విజ్ఞానమునకు మూలకందమగు శివ తాండవానందమూర్తికి జోహారులర్పించి ధన్యులగుదుము.

ఇతి శివమ్.



సంధ్యారుణ శివతాండవము.

ఆంధ్రమహిళ.

చిత్రకారిణి :

స్వోత్కర్ష
పిల్లలను గూర్చి

శ్రీమతి అ చన్నఘంటమ్మ

'తన్ను తాపొగుడుకుంటే తన్నుకున్నట్లే'నని పెద్దలు సామెత చెప్పుతారు ఆత్మస్తుతి అనేది భారతీయ సాంప్రదాయరీత్యా అతిహేయం, నిందనీయం, లజ్జాకరం అర్జునుడంతటి వాడికికూడ, పాపపరిహారార్ధం, ప్రాణ త్యాగంతో సరిపోయిన శిక్ష ఆత్మస్తుతియని నిర్ణయించారు కాని ఆధునిక యుగంలో ఆత్మస్తుతి ఒక అత్యవసరమైన క్రియా కలాపంగా పరిణమిస్తూ వుంది జీవితంలో చలామణికిది అనుక్షణం ప్రయోగింపబడుతూంది తన పుట్టు పూర్వోత్తరాలు, ప్రతిభా విశేషాలు, తండ్రియొక్క ఆస్తి పాస్తులు, ఉన్నత పదవులలోనున్న బంధువుల వివరాలను పేర్కొంటే తప్ప, ఏ వుద్యోగానికీ దరఖాస్తు చెల్లదు ఎన్నికలలో ఓటు సంపాదనకు తనయొక్క సదాశయాలు, శక్తి సామర్థ్యాలు, గుణగణాలు, చేయదలచుకొన్న సంస్కరణలు, నిర్వహించిన ఘనకార్యాలు, సేవాపరత ఇత్యాదులన్నీ ఏకరువుపెట్టి, ఆట్టహాసంగా ప్రకటించటం ప్రజాంగీకారమైన ఒక పద్ధతిఅయింది ఇట్లా వివిధ వ్యవహార రంగాలలో చలామణియైన పద్ధతి, క్రమంగా సామాన్య దైనందిన కార్య క్రమాలల్లోకి గూడా జారి, అంతనిందా కారణంగా పరిగణింపబడుట లేదు కాని, సమయాసమయాలు, ఉచితానుచితాలు గుర్తించకుండా ఎదుటి వారిపై గుమ్మరించే స్వీయ చరిత్రలు చాలా అప్రస్తుతంగానుండి, వినువారిలో విసుగు కలిగిస్తాయి ఏదో ఒక ప్రధాన వ్యవహారం పరిష్కారానికని అయిన సమావేశంలో ఇంచుక సావకాశము చూచుకొని, "1920 లో నేను వాషింగ్‌టన్ లో ఉన్నప్పుడు" అంటూ స్వీయ అనుభవాలను పదే పదే ఏకరువుపెట్టాడొక మహానుభావుడు తను వుద్యోగములో ప్రవేశించి నప్పటినుండి చేసిన మంచి మార్పులన్నీ గుక్కతిప్ప కుండా వప్పగిస్తాడింకొక వ్యక్తి విద్యార్థులకు ఉపన్యసిస్తూ దోవతప్పి, తను ఏచికాగో యూనివర్సిటీలోనో చేసిన గొప్ప గొప్ప పనులన్నీ ఒక ఉపన్యాస ధోరణిలో విసరివేస్తాడొక అధ్యాపకుడు వర్తమానంలో తమశక్తి సామర్థ్యాలు క్రియా రూపంగా నిరూపించనేరని మహా వ్యక్తులు, ఇట్లా చరిత్ర ఘట్టాలను తిరిగి తిరిగి పరుల శ్రవణేంద్రియాలలోకి దూరి పోయటం మనం నిత్యం అనుభవిస్తూఉన్న ఒక క్రియా స్వరూపమే

పాశ్చాత్య సంపర్కము వలననూ, ఆధునాతన ప్రపంచములో పురుషులతోపాటు వివిధ వ్యవహార రంగాలలో ప్రవేశించిన స్త్రీలయందు, ఇట్టి అధునాతనులవలె నటించే యితర స్త్రీలయందు, యీ ఆత్మస్తుతి జాడ్యము పూర్తిగా ప్రవేశించింది దీనికితోడు తమ పుట్టింటినిగూర్చి, భర్తను గూర్చి పిల్లలనుగూర్చిన స్తుతిపాఠాలు, సామాన్యంగా వీరి నోట వింటూనే ఉంటాము

సనాతనులయిన వారు తమ బిడ్డలను గూర్చిన ఏ విషయమూ నలుగురి యెదుట ముచ్చటించేవారు కారు వారి రూపలావణ్యాలుగాని, తెలివి తేటలుగాని, ప్రతిభా విశేషాలుగాని, ఆహార విషయాలుగాని, తుదికి వయస్సుగాని, నలుగురిలో చర్చింపరానివి అట్టి ప్రసంగములు ఆయుఃక్షీణహేతువులు కనుక తల్లిదండ్రులుగూడ గట్టిగా యివి మనసులో పరికించరు సరిగదా, తమ పిల్లలలోని ఏ ప్రత్యేకత నయినా ఎదుటివారు గ్రహించిరేమోనని, దృష్టి పరిహారార్థము అనేక దిష్టులు తీయుటయుకద్దు కాని యీ కాలంలో, నలుగురు కలిసికొన్నచోట, తమ పిల్లలనుగూర్చిన కథలు ప్రతితల్లి నోటా వింటాం ఈ కథలలో కొన్ని నిజం కావచ్చుగాని, నూటికి 90 పాళ్లు కట్టుకథలూ, పుక్కిటి పురాణాలు, అతిశయోక్తులు అయిఉంటాయి

ఈ కథలన్నీ ప్రత్యేక వాతావరణలో, ప్రత్యేక సమయాలలో, ప్రత్యేక ప్రయోజనము కలిగి యుంటాయి సామాన్యంగా తమయొక్క గొప్పతనం, సమర్థత, దక్షత చాక

చక్యం తమ పిల్లలలో ప్రతిబింబించినవనే యుద్దేశం యీ విధముగా వెలిబుచ్చుతారు. ఒకొ్కక్కప్పుడు తమలోనున్న లోట్లను తక్కువతనాన్ని కప్పి పుచ్చటానికి అనేక కథలల్లుతారు. ఇంకొకమారు తమ ఎదుటి వారిని చిన్న బుచ్చాలనే కుత్రిమోద్దేశంతో యిట్టి ప్రసంగం ప్రారంభిస్తారు. ఒకొ్కక్కప్పుడు చలామణికై యీ విధంగా ప్రకటిస్తారు. ఉదాహరణలు మనకు నిత్య పారాయణమే.

ఒక బీద విద్యార్థిని వెళ్తుంది సంఘానికి సేవచేస్తూన్నాననే ఓ ఆవిడయొద్దకు సహాయం నిమిత్తం పరిచయ వాక్యాలయ్యాక ఆవిడ ప్రారంభిస్తుంది. "నాకు సంఘ సేవ అంటే చాలా యిష్టం - నా అనుభవాన్నంతా నా పిల్లలకు ఉగ్గుపాలతో నూరిపోసా పెద్దమ్మాయి శారద, బి. ఏ., చదివికూడ ఉద్యోగం చేయకుండా, సంఘ సేవలోకే దుమికింది చిన్నమ్మాయికి మొన్ననే కాలేజిలో సేవాపరతకు సువర్ణ పతకమును బహుమతిగా యిచ్చారు ఏవో మా జీవితమంతా యిలాగే గడుస్తూంది. విద్యార్థిదశలో గూడ మా శారద నీబోటి పిల్లల కెంతో సహాయానికి ఏర్పాట్లు చేసింది," అంటూ కుమార్తెవంకకు తిరిగి "అయితే శారదా యీ అమ్మాయికేమైనా ఏర్పాటు చేయగలమా? ఇది ఏ ఏర్పాటుకు తగిన సమయము కాదేమో కదూ," అని తన ప్రశ్నకు తనే జవాబు చెప్పుకొని, "ఇంకో రెండు నెలలు పోయాక ఒకమారువచ్చి కనుక్కో అమ్మాయి—ఇప్పటిలో ఉపాయమేమీ కనపడటంలే"దని మెల్లగా పంపించి వేస్తుంది. ఈ అప్రస్తుత సంభాషణనంతా, లేని చిరునవ్వు ముఖాన తెచ్చుకొని ఆలకించి, తుదికి చెవిని వేసిన చావు కబురును చల్లగా మూటకట్టుకుని నడిచి వెళ్ళుతుంది, పాపమా సహాయార్థమువచ్చిన బీదపడుచు. కేవలం ప్రకటనోత్సాహము తప్పితే యీ ప్రసంగానికి వేరు ప్రయోజనము కానరాదు.

'అయినా ఇంతవరకూ రావటానికి వీలులేక పోయిందండీ. కారురాలేదు. మా పెద్దమ్మాయి కాలేజిలో చదువుతూవుంది. ఆడవాళ్ళకి అంత చదువక్కర లేదనుకోండి. అయినా అది అంత శ్రద్ధగా అన్నింటిలో ప్రథమ శ్రేణిలో వస్తూవుంటే, ఎందుకు మాన్పటమని ఊరకున్నాను. మొన్న దాని ఫోటో చూశారు పేపరులో? కాలేజి డిబేట్ లో దానికన్నా పైక్లాసు వారికన్నా కూడా ఎంతో చక్కగా మాట్లాడిందట- దాని నాన్నగారు చాలా వాగ్ధాటిగల వారులెండి. అదేమంటే పైగా నీ చాకచక్యం వచ్చిందంటారండీ అందఱు! నాముఖం, నేనేం చదువుకొన్నానా, ఏడ్చానా?" అని అర గంట లెక్చర్ కొడుతుందావిడ, ఏ పేరంటానికో ఆలస్యంగా వెళ్ళి సమర్థించుకొనే మిషతో.

"ఒసే, కళ్యాణీ, ఏదీ నీవు మొన్న నేర్చుకొన్న కొత్త పాట అభినయించు-వీరు చూస్తా" రంటుంది ఒక తల్లి తన ఎనిమిదేళ్ల పిల్లను పిలచి గత్యంతరములేక చూస్తూ ఉంటే, "ఇంకా రెండు నెలలే అయిందండీ, నెలకు రూ. 50/- ఇచ్చి చెప్పిస్తున్నాము. నాట్యాచార్యులు దీని తెలివికి అబ్బురపడిపోతూ, 6 నెల లలో స్టేజి ఎక్కిస్తానని పంతంమీద ఉన్నాడండీ. అదేమో సంవత్సరపు పిల్లప్పటినుండి దీనిలో యీ కళ తెలుస్తూనే ఉంది. సరియైన ఉపాధ్యాయుడు లేక ఇప్పటి వరకూ పాపము దానికేమి ప్రోత్సాహమియ్యలేక పోయాం - అయినా చూచారూ! ఆ ముద్రలెంత లలితంగా వేస్తుందో! భావం ఎలాప్రకటిస్తుందో!" అని విపుల వాఖ్యానం విప్పుతుంది మరొకావిడ, తన కుమార్తె తప్పటడుగులు ప్రశంసిస్తూ. మర్యాదగల పెద్దమనుష్యులీ పరిస్థితిలో యేమిజవాబివ్వాలో మీరే ఆలోచించుకోవాలి.

తన ఐదేళ్ళ పిల్లవాడు గీసిన పిచ్చిగీత లన్నింటికి విచిత్రార్థము కల్పించి, ఒకటిన్నర గంటసేపు సునాయాసంగా ప్రసంగిస్తూ ఒక తల్లి "అయితే వాళ్ళ మామయ్య పేరు కెక్కిన చిత్రకారుడు గదండీ, ఆ మాత్రం పోలికలు రావటండీ" అని ముగిస్తుంది. చూచిన వారు తప్పని సరిగా తల వూపి భేష్ భేష్ అని తీరాలి.

"వేలెడి వెధవున్నాడో, లేడో వీడుఇంట్లో రామరామ ఒక సామానైనా నిలవనీయడండీ - అందుకని చూచిన ఆటవస్తువల్లా కొనితెస్తారు వాళ్లనాన్న. ఏమిఇచ్చి ఏమిలాభం? తెచ్చిన మరుక్షణం దానిని రెక్కకు రెక్క, ముక్కకు ముక్క విరచివేస్తాడు. పైగా దానిది దీనికి, దీనిది దానికి పెట్టి ఏవో కొత్త కొత్తవి చేస్తానంటాడు. వాళ్లనాన్న అసిస్టెంటు ఇంజనీరు అయితే మీవాడు ఛీఫ్ ఇంజనీరు పని చేస్తారంటారు చూచినవాళ్లంతా. వాడికి అన్నప్రాసన చేసి

నప్పుడు రకరకాలవస్తువులన్నీ దగ్గరపెట్టే, స్కేలు, పెన్సిలు పట్టుకున్నాడండీ." అని ఒక తల్లి నిండ మిమతో ప్రారంభించి, తన కొడుకు ప్రతిభను చాటుతుంది.

"మా పిల్ల వాడే నండీ-14 ఏళ్ళ వాడు మెట్రిక్యులేషన్ పరీక్ష కెళ్ళాడు వాడు వ్రాసే ఇంగ్లీషు బి.ఏ. వాళ్లుకూడా వ్రాయలేరంటారండి వాళ్ల టీచర్లు. అలాటిది ఇంగ్లీషులో నే పోయింది పరీక్ష. అదేమంటే, పేపర్ దిద్దేవాళ్ళకి వీడు వ్రాసింది అర్థమయ్యుండ దన్నారండీ మావాడి స్నేహితులు" అని అంటుందొకావె తన కొడుకు తెలివిలేమిని కప్పిపుచ్చ టానికో లేక అమా యికత్వములోనో

'చూడండీ, కమలమ్మగారు, నే చెప్పుతు న్నానని అను కోకండి - మీవాడు తింటుంటే ఇల్లూ వల్లంతా అసహ్యం చేస్తాడా! మావాడు వీడికన్నా 4 నెలలు చిన్న వాడే ననుకుంటూ - అయినా టేబిల్ దగ్గర కూర్చొని ఎంత క్లీనుగా తింటాడనుకొన్నారు. అలవాటులో, తరిఫీదులో ఉన్నదనుకోండి. ఏమో వాళ్ళ నాన్నగారు అమెరికా వెళ్లి వచ్చి నప్పటినుండి మేమంతా బల్లభోజనమే - ఆలాగే వాడికి అలవాటు చేశాము. మొన్న మాయింటికి వచ్చిన పాల్ గారు కూడా అన్నారు. మా అబ్బాయికి చాలా పరిశుభ్రమైన అలవాట్లు ఉన్నాయని" అంటూ వాళ్ళ వాడికి వంకలెట్టూ తనవాడిని కొండకెక్కిస్తుంది ఒక యిల్లాలు.

"అయినా దీని చమత్కారము చూడండి. అది కట్టి విడి చిన చీర తప్ప నేకట్టకూడదట. ఇప్పటివరకూ చెప్పొద్దు, దాని మాటే సాగుతుంది సుమండీ" అని తన కూతురు మాట ఎలా చెల్లించుకుంటుదో చెప్పుకుంటుంది ఒక తల్లి, మనమంతా ఈ సుగుణాన్ని చూచి హాయి హాయి అంటామనుకుంటూ, అనా లని సూచిస్తూ -

"ఇదిగో మావాడు ఇంగ్లండునుండి పంపిన కొత్తరకపు గవ్వ ఈ ఫొటోలో హెలెన్ సోదరిలతో కరస్పర్శ చేస్తున్నాడు. ఇది పికడిల్లీలో తన సుహృద్బృందంతో తిరుగుతూ ఉంటే తీసిన ఫోటో. ట్రైపాస్‌కు చదువుదామనే వెళ్లా డనుకోండి - అంత శ్రమ పడకుండానే, కొన్నాళ్ళక్క డుంటే ఏదో ఉద్యోగ్యం అక్కడే ఇస్తామంటున్నా రట - ఇక్కడకు ఇంతలో పంపరట," అని తన కొడుకు వార్త తిరుగుళ్ళను పొగుడుకుంటుంది ఒకామె.

"అయినా కామమ్మగారూ, అత్తవారింటికి వెళ్ళాక తప్పదని ఇప్పటినుండి దానితో పొయిలెలా అలికిస్తామండీ? ఏమోబాబు, మా పిల్లలను అతి గారాబంగా పెంచుతున్నాం. పన్నెండేళ్లు వచ్చేవరకు పావడా నే నేకట్టాను అన్నం కలిపి పెట్టాను తప్పనిసరియైతే నేర్చుకోక పోతుందా యేమిటి?" అని అంటుంది ఒక తల్లి, తన కూతురు తెలివి తక్కువను కప్పి పుచ్చటానికో, పక్కయింటి ఆమెను యెత్తి పొడవ టానికో.


"అయితే కామమ్మగారూ, ఆడపిల్లకు పని ముద్దా భాగ్యము ముద్దా అంటారు చిన్న చేతులతో అన్నిపనులు నేర్చుకుంటేగదా, పెద్దదైనప్పుడు సుళువు యేమో, మా పిల్లకు గారాబము పెట్టాము, పని నేర్పాము. దేనికదే సుమండీ! అత్తగారిని కూర్చో పెట్టి చేస్తుందిగాని, మొట్టి కాయలు పడదండోయి మా పిల్ల," అని సన్నగా బదులు చెప్పుతుంది పక్కింటామె.

ఇలాంటి ప్రసంగాలు విని, తను కూడా యేదో చెప్పా లనుకుంటూ, 'ఓలె అమ్మాయి, మా నాగుడు మూడేళ్ళప్పుడు ఒక పెరుగుముంత అమాంతంగా యెత్తి నేలమీద దబాలన పారేశాడేయి - అప్పుడే కునుకుతున్న వాళ్ల నాన్న కవ్వపు తాడెట్టి వీపుమీద వేశారు - ఆరు నెలల వరకూ ఆ వాతలు పోలేదు సుమా!" అంటుంది, ఒక పల్లెటూరి ఆమె.

ఇలాగే వినే వాళ్ళుండాలిగాని, తమ పిల్లల గూర్చిన ప్రసంగము చేయనితల్లి ఉండదు. వారి ప్రతి మాటలోనూ, ప్రతి పనిలోనూ, యేదో ఒక విచిత్ర భావం, గొప్పదనం, ప్రత్యేకత కనిపెట్టి, అదంతా తనయొక్క గొప్పతనంయొక్క ప్రతిబింబమేనని మురిసి పోతూ, అదును దొరికినప్పుడల్లా, వారినిగూర్చి ప్రసంగిస్తూ, పెక్కుమార్లు వినువారికి చాలురా అనిపిస్తూ ఉంటారు. ఇంకో ఒక మెట్టెక్కితే, ప్రస్తుతము తల్లుల చేతకాని నివర్ణిస్తూ, తమకు పుట్టబోయే పిల్లలను యే అధునాతన పద్ధతులలో పెంచబోయేది ఉపన్యసిస్తారు మరి కొందరు యువతులు.

(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

★



MY AMRUTANJAN
There are Millions of "My's" in that MY,
Applied to the 46 year old 'Pocket Doctor" of INDIA
నాది నాది నాది
నాది నాది నాది
అమృతాంజనము
గాని,
" యథాయథా కాళీధవళత్వ శంకయా."
అమృతాంజనమా! నీ కీర్తిముల్లోకములను దెల్పుఁజేయు పూనికతో పెరుఁగు
చున్నప్పుడెల్లను, నా నల్లని ముంగురులు, దెల్లబడునేమోయను భయముచే
నా హృదయము మిక్కిలి పరితాపమొందుచున్నది సుమా !!!

నాటిక

కాలక్షేపం

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

[మహాలక్ష్మమ్మగారి యింటి లోతట్టు పడమటింటి వసారాలో మహాలక్ష్మమ్మ, సోదెమ్మ, సుబ్బమ్మ, వత్తి ప్రత్తి చేసుకుంటూ కూర్చుండి ఉంటారు.]

సుబ్బమ్మ సోదెమ్మక్కా! రామ వనవాసం విని చాలా రోజులైంది. ఏదీ రెండుముక్కలు చెవిని వెయ్యవూ

మహాలక్ష్మమ్మ అవును వదినే! నీ పాటవిని చాలా రోజులైంది. యీ మధ్య యాత్రలతో మునిగి తేలుతూ కంటికే కలువై పోతివి. ఏదీ నాలుగు చరణాలుపాడు.

సోదెమ్మ ఆ! నా పాట లేం పాటలు లేవమ్మా. యీ పూర్వకాలపు పాటలువింటే యీ కాలపువాళ్ళు నవ్వుతారు గూడా.

మ : పోనీలే, నవ్వేది యీ కాలపువాళ్ళుగా. మేము యీ కాలపు వాళ్ళంకాముగా, పాడుదూ!

(పాట)

సో : దేవాసుర సంగ్రామమందూ
మీ తండ్రి రణము చేయుచునుండగా
అసుర మూకలు చుట్టుముట్టి
బహువిధ అస్త్రచయములు గుప్పగా
తేరు గడిపే సారధీ తలతెగి
ధరణిపైనా త్రెళ్ళెనూ
తేరులోనున్న మీ జనకుడూ
తెప్పనా మూర్ఛిల్లెనూ
ఆ రథంబులో నున్న నేనూ అంతట
అందుకొని పగ్గంబులూ
సీల విరిగిన చోటునూ నా
వ్రేలు నడ్డుగ బెట్టుచూ
వడి వడిగ గుఱ్ఱముల నడిపీ
రథమువ రణమున కెడగాను చేసి
మూర్ఛితుండైన మీ తండ్రినీ
కాచి రక్షించితిని రామా
అందులకు మీ తండ్రి మెచ్చి
అడుగుమనె రెండువరములూ
అవసరంబైన వేళనూ
అడుగుదునని నే నంటినీ
ఆ వరంబులను నేడూ
అడిగితిని మీ తండ్రినీ
ఒక వరంబునకు నీవు అడవిలో
పదునాలుగేడ్లుండ వలెనూ
రెండవ వరముగ నా సుతుడు
భరతునకు పట్టంబు గట్టవలెను

సు : (దుఃఖంతో రాపడిన కంఠంతో) అయ్యో! దీని కటికతనం కాలిపోను. వరాల తండ్రి ఆ రామచంద్ర మూర్తిని అడవికి పొమ్మనడానికి నోరెట్లావచ్చిందో.

మ కారణార్థం అట్లా వున్నప్పుడు నోరాడకేమి చేస్తుంది? కానీ వదినే!

(పాట)

సో అడవినున్న వేళనూ మునివలె
జడలు ధరియించి నీవూ
నార చీరలు గట్టి రేబవలు
కాయగసురులు మెసవుచూ
బ్రహ్మచర్య వ్రతమునూ ఓరామ
గడపవలె పద్నాలుగేండ్లూ
ఈ పగిది నీవు చేయకున్నా ఓ రామ
నీ తండ్రి చెడును సద్గతులకూ.

శారద (ప్రవేశించి) సోదెమ్మత్తా! ఏదో పాటలు పాడుతున్నావే.

సో : ఆ! ఏమిపాటే! మీ అమ్మావాళ్ళు పాడమని వేధిస్తే ఏదో నోరూరుకోక "రామ వనవాసంలో" రెండు ముక్క లంటున్నా.

శా : ఆపివేశావేం ? పాడూమరీ.

సో : ఏమి పాడనే నాకు మీవలె రాగాలు వచ్చునా ? తాళాలు వచ్చునా ? చదువులు సంగీతాలు నేరుస్తున్న మీ దగ్గర పాడితే నవ్వుతారు కూడాను.

శా : నవ్వనత్తా ! నీ పాటంటే నాకు చాలా యిష్టం.

సో : మీరు సినీమాలూ నాటకాలూ చూచీ, గ్రామఫోనులు, రేడియోలు, వినీ రకరకాల పాటలు నేర్చుకొని పాడుతారు మాకేమున్నది ? పూర్వ కాలపు వాళ్లం. మావన్నీ పాత పాటలు. ఊరికే ఉండలేక కృష్ణా రామా అనుకుంటాము

సు : (బుగ్గలు నొక్కుకుంటూ) అయ్యో వ్రాత. ఇప్పటి వారిపాటలూ సరే నా బ్రతుకుసరే. మా చిన్న పిల్ల ఆ నాలుగేళ్లది ఉన్నదే "తీయని వెన్నెల రేయీ" అని ఏమిటో వాగుతూ ఉంటుంది. వెన్నెల తెల్లగా ఉంటుంది చల్లగా ఉంటుందంటే అర్థమున్నది కాని, తీయగా ఉండుటమేమిటో తెలియదు.

సో : అదిసరే మా కుర్రాడు చూచావు ! 'కత్తులు దూసుకు పోనీ, నెత్తురు ఏరులు పారనీ, ఎండలో తిరిగావురా కుర్రోడ చెమటలో మునిగావురా కూలోడ' - అంటూ ప్రొద్దుగూకులు పాడుతూ ఉంటాడు. విన్నావో లేదో. అవేమి పాటలో పూర్వం యీ యీడు పిల్లలకు చక్కగా 'చేతిలో వెన్నముద్ద, చిన్న చెంబుతో నీళ్లు, శ్రీ రుక్మిణీశ కేశవ నారద సంగీతలోల' అని యెన్నో చక్కని పద్యాలు 'నంద నందనా, గోపాల బాల' అని చక్కని కీర్తనలు చెప్పేవాళ్ళు. ఇప్పుడివేమి పాటలో ! పుణ్యంలేదు పురుషార్థం లేదు వినడానికే అసహ్యం వేస్తాయి.

శా : ఏ కమ్యూనిస్టులో వీధిలో ఊరేగుతూ పాడుతూ ఉంటె విన్నాడు కాబోలు.

సు : శారదా కమ్యూనిస్టులంటె ఎవరే ?

శా : అదొక పార్టీ మన దేశంలో వెలిశిందిలే. దాని వాళ్లు ఆ పాటలు పాడుతూ ఉంటారు.

సో : అంతేలే దేని వాళ్ళు దాని పాటలు పాడుతూ ఉంటారు. మా యింట్లో చూడలే ఎప్పుడూ కాంగ్రెసూ గాంధీ జెండాలు, జేజేలు ! యీ కాలపు పాటలేయింత.

శా : అవునత్తయ్యా కాలానికి తగినట్టుగా పాటలూ పద్యాలు పాడరూ, కథలూ కావ్యాలు వ్రాయరూ, పురాణాలు శాస్త్రాలు చెప్పరూ ? ఎప్పుడో త్రేతాయుగం నాటి పాటలే యిప్పుడు పాడదామనుకుంటే ఎట్లా ? ఈ కాలానికి తగినట్టుగా యిప్పటి పాటలుండొద్దూ ?

సు : కాలానికో పాట ఉంటుందిటే శారదా !

శా : ఆఁ ఉంటుంది ఉండకేం ? ఇప్పుడేం పాట పాడా అనో పాడనా.

సో : పాడమ్మా ! పాడు మేమూ వింటాం.

(పాట)

శా : రేపునింగు రోజులోయి గోవిందారామ
నిముషమైన తీరదోయ్ గోవిందా
చేతులు జల్లెళ్లు గోవిందారామ
రోళ్ళు రోకళ్ళోయి గోవిందా
ఎప్పుడు చేతుల్లో గోవిందారామ
ఆడుతు ఉండాలే గోవిందా
తలచమురు లేదోయ్ గోవిందారామ
దీపపు చమురులేదు గోవిందా
పసిబిడ్డ పాలకూ గోవిందారామ
భాగ్యవంతుల కాఫీకి గోవిందా
పంచదార లేక గోవిందారామ
పాట్లుపడదామాయె గోవిందా
కట్టుబట్టకు గూడా గోవిందారామ
కష్టాలు పడనాయె గోవిందా
రేషన్ బియ్యం దెచ్చి గోవిందారామ
రేషన్ కట్టెలు పెట్టి గోవిందా
అన్న మొండు కుంటె గోవిందారామ
ఆకలే తీరదోయ్ గోవిందా

పాడిపంటల దేశమిట్లు గోవిందారామ
పాడయి పోయిందోయ్ గోవిందా
దేశపు జనులంతాను గోవిందారామ
డబ్బాశలేకుండా గోవిందా
తిండిగింజలు పండిస్తే గాని గోవిందారామ
తీరదండీ కఱువు గోవిందా.

సా }
సు } ముగ్గురు పక పకా నవ్వుతారు.
మ }

సా మంచిపాటే కట్టావే శారదా.

మ నిజంగా యిప్పటి కష్టాలట్లాగే ఉన్నాయి

సు అయ్యో! ఎంత మంచికాలం పోయిందమ్మా? పుట్లకు పుట్లు ధాన్యాలు అపరాలు పండించుకొని గాదెలకు గూనెలకు బోసుకొని హాయిగా తినే వాళ్ళం. ఇదేమి కాలమో నోటూరా తినడానికి, చెయ్యారా పెట్టడానికి లేకుండా బోయిందిగదా! ఏ రోజునా హవ్య కవ్యం అతిధీ అభ్యాగతీ, నలుగురు పంక్తిని లేనిది ఔపాసన పట్టేవారుకారు, మా మామగారు. రాత్రిజాము ప్రొద్దు బోయిన మాదాకబళమమ్మా అన్నమాట వినపడ నిచ్చే వారుకారు. శ్రీరామజయంతీ కృష్ణజయంతీ దేవీ నవ రాత్రులు ఎప్పుడు ఏదో సందర్భము, వడుగులు పెండిండ్లు సమారాధనలు సంతర్పణలు జరగడము, పిన్నా పెద్దారావ డము నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఉండేది ఏ యిల్లు చూచినా. వడ్డనకూ వంటకూ మా అత్తగారు ఎప్పుడు నడుం బిగ్గట్టే ఉండేది. ఆమె చేతికింద నలుగురు కోడళ్లము హూనం హూనం అయ్యేవాళ్లం. ఏడాది తిరిగేటప్పటికి ఎన్నిపుట్లు నలిగేవో! ఇప్పుడయితే ఏం జేసే వాళ్ళం?

సా : ఇప్పుడా మావాడు చెప్పితే వినలే. తద్దినానికి ముగ్గురికి శ్రాద్ధానికి పదిమందికి పెండ్లికి ముప్పైమందికీ బియ్యపుచీట్లు యిస్తారట. అయ్యో రాత కర్మంజాలక యింకో మనిషివస్తే ఏమవుతుందంట? ఆ పాడీ పంట యేమయిందో అన్నం నంచుకొని నెయ్యి వాసన చూచే రోజులు వచ్చాయి.

శా ఏమయింది? పాగాకైంది, వేరుశనగయింది. డబ్బు కాశపడి తిండి గింజలు పండించకుండా వాణిజ్యపు పంటలు పండించుకొని నోట్లు కట్టలుకట్టుకుంటూ ఉంటే బియ్యాలు పప్పులు ఎక్కడినుంచి వస్తాయి?

మ : అవునమ్మా తిండిగింజలు పండిస్తేగాదు ఆహార పదార్థాలు సమృద్ధిగా దొరికేది. అందరికి డబ్బురంధే అయిపోయె. ఆ డబ్బైనా వెండా బంగారమా!

శా యిక ఆ ఆటలు సాగవులే ఆహారపంటలు ప్రతిరైతు పండించి తీరవలసిందే

సు : ఏమీ!

శా పై దేశాలనుంచి తెప్పించే బియ్యం గోధుమలూ వగైరాలు యిక మన గవర్నమెంటువారు తెప్పించరు.

సు . అట్లాగా

సా అన్నట్టు మరచిపోయినా శాస్త్రులుగారు ఊరినుంచి వచ్చారు. మఠంలో పురాణం వినకుండా యీ పురాణాలు పెట్టుకొని కూర్చున్నారేం?

మ అప్పుడే పెండ్లిచేసుకొని వచ్చారటమ్మా వదినే.

సా : ఆ! ఆ! వచ్చారు చెట్టంత పిల్లనుచేసుకొని వచ్చారు.

మ ఈడేరిన పిల్లే.

సా . కాక చిన్న పిల్లలెక్కడున్నారు? శాస్త్రులుగారు కానీ చయనులుగారు కానీ.

శా పెద్దపిల్లని ఆశ్చర్యపడుతున్నారు. బ్రాహ్మణ పిల్లవునో గాదో.

మ : ఛా నోరుమూసుకో. మీ నాన్నగారువింటే కోప్పడుతారు.

శా . ఎందుకమ్మా నన్ను కోప్పడడం? అంత ముసలివాడు ఇంత చిన్న పిల్లను చేసుకున్నందుకు ఆ శాస్త్రులుగారిని కోప్పడరాదు?

సు ఆయన కష్టం నీకేమి తెలుసు కాచి పోసే దిక్కులేక చేసుకున్నాడు. ఏమంటావు?

శా : ఆడవాళ్ళకు గూడా కష్టాలుండవూ? బాల వితంతువుల పెండ్లంటే, ఆడవాళ్ళకు ఆస్తిలో భాగాలంటే వీరందుకు అడ్డపడడం?

కాలక్షేపం

మ అబ్బా ఏమిటే శారదా యీ లెక్చరు ? మీ నాన్న గారు కచ్చేరినుంచి వచ్చే వేళ గూడా అయింది ఊరుకోవు నీవేమో నదురు బెదురు లేకుండా యెట్లా వాగుతావు ఆయనేమో మేనమామ పోలికని వాడిని ఆడి పోసుకుంటారు

శా నిజం సంగతి చెప్పుతున్నానమ్మా ఇందులో తప్పేమున్నది ? సంగతి తెలుసుకోక పోతే ఎట్లా వుద్ధరింపబడుతాం ?

మ ఏదో మా కాలం యిట్లా వెళ్లి పోయింది ఇక మా బ్రతుకులిట్లా తెల్లవారవలసిందే ఎవరు ఉద్ధరించేదిలేదు.

సో అదేమిటి వదినే అట్లా అనుకుంటావు చదువుకుంటున్నదిగా, శారదే మనలనందరిని ఉద్ధరిస్తుంది దీని యీడులో మనమెట్లా వుండేవాళ్ళం ? గబ్బిళాయిల్లాగా పరికిణీ చొక్కాయయినా తిన్నగా కట్టుకోడం చేతయ్యేదీ ? శారద చూడు ఈ యీడు కప్పుడే ఎన్ని విషయాలు తెలుసుకున్నదో

సు అవునమ్మా తెలుసుకోదూ ! చదువుకున్న వాళ్లకు చదువుకోని వాళ్ళకు యిదే తేడా మరీ ! ఇంకా రెండేళ్లపాటు చదువుకున్నదా ఆడవాళ్ళను ఉద్ధరించనే ఉద్ధరిస్తుంది

మ ఆఁ యింకా రెండేళ్ళు చదువుకుంటుందిగా, ఈ యేడే బడికి పంపనంటే పంపనన్నారు, వాళ్ళ నాన్న బడికి పోకమానని యేడుస్తూ కూర్చున్నది ఆ బడికి పంపవలసిందేనని అన్నగారు వత్తాసిచ్చాడు అంతటితో యికనేమీ అనలేక వూరుకున్నారు

సు అన్నట్టు మీ అబ్బాయి పెళ్లెప్పుడమ్మా ?

మ పెండ్లిగానే ఉన్నది ఆయనగారికేమో వేల మీద దృష్టి, అతడికేమో చదువుకున్న పిల్లమీద

శా నీకేమో పనిచేసే కోడలిమీదా

మ ఇదమ్మా దీనిమాటలు

సో మీ మేనగోడలున్నదిగా, ఆ అమ్మాయి బియ్యేగూడా ప్యాసైందిగా

మ అయ్యో ! మేనగోడలే, బి ఏ ప్యాసైన పిల్లనే ! మీ అన్నగారు ఒప్పుకుంటారు ? మా తమ్ముడిదేమీ లేదు అడిగితే సరేనంటాడు మా మేనగోడళ్లైనా ఒకరివంటి వాళ్ళుగాదు అంత చదువు చదువుకున్నా ఎంతో అడకువగా ఉంటారు ఇంట్లో సమస్త పనులు చేస్తారు. చదువువచ్చినట్టే కనపడరు అయితేనేం ఈయనగారు ఒప్పుకుంటారు ? ఎందుకొచ్చిన భ్రమ.

సు సరేలే వ్రాసిపెట్టివుంటే ఎవ్వరూ తప్పించలేరు

సో సుబ్బమ్మక్కా లేస్తామా ఏమిటి ? అన్ని పురాణాల కాలక్షేపం యిక్కడేఅయింది అస్తమానంకా వచ్చింది పోదాంపద ఇంట్లో పనులు పిలుస్తున్నాయి

★

మన కళా సంపద

—: హంపి :—

[14 వ శతాబ్దంనుండి 3 శతాబ్దుల పాటు ఆంధ్రులు, విజయనగరం రాజధానిగా దక్షిణా పథాన్ని ఏకచ్ఛత్రంగా ఏలారు ఆకాలంలో ఆంధ్ర దేశం అన్నివిధాల ఉత్కృష్టదశలోనుండెను కవులు గాయకులు శిల్పులు ఒకరేమిటి అన్నిరకాల కళోపాసకులు పోషించబడేవారు రాజాస్థానంలో ఇప్పుడు విజయనగరంలో ఆనాటి శిల్ప సంపదయొక్క శిథిలములు మాత్రమేగలవు 14 15 శాతాబ్దములలో విజయనగర సామ్రాజ్య మేవిధముగానుండెనో రచయిత్రి ఈ వ్యాసమునందు తెల్పారు]

దక్షిణాపథాన్ని 3 శకములపైగా నేకచ్ఛత్రాధిపత్యముగ నేలిన విద్యానగర సామ్రాజ్యా రాజధాని హంపి, విజయనగర, విద్యానగర నికి నామములతో వర్ధిల్లింది సర్వ కళలు యీ ఆంధ్రకర్ణాట సామ్రాజ్యంలో వృచ్ఛ దశజెంది, హంపీలో చారుశిల్పరూపాన గత సకల వైభవమును వేనోళ్ల చాటుచున్నవి కృష్ణరాయల విద్యానగరము పెరిక్లిస్ నాటి ఏథెన్సుతో తులతూగింది

శ్రీ సీతారాములు విహరించిన దివ్యభూమిలో తుంగభద్రా దక్షిణతీరాన, విద్యారణ్యుల ప్రేరణచే హరిహరాదు లైదుగురు సోదరులు 1336 లో విజయనగర రాజ్యం స్థాపించారు 12వ శ॥ లోని ఆనెగొందిప్రభువు విజయధ్వజుని పేరిటది విజయనగరమని గ్రంథస్థము విజయనగర మధ్యభాగం విస్తీర్ణము 9 చదరపు మైళ్ళు, ప్రాకారములతో సహా 144 మైళ్లట పట్నము వలయాకారముగ ఒకదానిలోపల నొకటి యేడు ప్రాకారములు గల్గియున్నది లోపలి కోటలో రాజాంతఃపురమున్నది బయటి ప్రాకారం యివతల 50 గజముల స్థలములో మనుష్యులు, గుఱ్ఱములు సమీపించుటకు వీలు లేకుండ పెద్దబండలు, సగం భూమిలోకి, సగం పయికి మనిషి యెత్తున గుచ్చబడ్డాయి ప్రాకారమున కచ్చటచ్చట ద్వారాలున్నవి భీముని ద్వారంలో భీముని పెద్ద విగ్రహము, పడమటి ద్వారంలో ఆంజనేయుని విగ్రహం వున్నాయి సింహద్వారం క్రింది భాగంలో ముస్లిము శిల్పము, పై భాగంలో హైందవ శిల్పవ కన్పడుతోంది కృష్ణరాయలు 1520 ప్రాంతాన తల్లి పేరున నాగలాపురమను పేటను కట్టించాడు



శ్రీమతి యశోదాదేవి

డాక్టరు వారణాసి యశోదాదేవి, ఎమ్ ఏ , డి లిట్ ,

"అనంత ప్రతిభా సంపన్నులైన శిల్పకోవిదుల హస్తస్పర్శవలన చిద్రూపమును బొందిన ప్రస్తరఖండములు భాష లేకనే భావము వెల్లడింపుచున్నవి" విజయనగరం లాంటి మహాపట్నముయొక్క సమస్తైశ్వర్యముల నచట కనివిని యెరుగనన్నాడు, అబ్దుల్ రజాక్ ద్రావిడ యిండోసారసనిక్ రీతులు కలిసి వున్న విజయనగర శిల్ప ప్రత్యేకత మంటపములు, రాతికట్టడములు, నిగనిగలాడు ఆకుపచ్చ రాతితో నిర్మితమైన దేవ విగ్రహములలో కన్పడుతోంది స్తంభము పైభాగము క్రింద నూతగా నున్న రాయి పువ్వుల విరజిమ్మనట్లుంది యీశిల్పంలో

హంపీలో పంపాపతి గుడి పురాతనమైనది భువనేశ్వరి దేవళం 12వ శ॥ నాటిది నల్లరాతి చాళుక్య స్తంభాలు, మనోహర చాళుక్య శిల్ప రీతినున్న ఒక ద్వారం గలిగియున్నది విరూపాక్షాలయములో తూర్పున పడమట రెండు విశాలమైన సావళ్లు, మధ్య ఒక పెద్దగోడవున్నవి. తూర్పుననున్న మహద్గోపురమే సింహద్వారము పడమటి చావడి ప్రవేశానికి ఉత్తరాన గోపుర ద్వారమున్నది పంపాపతి, మిగత చిన్నగుళ్లు పడమటి చావడిల్లో నున్నవి హరిహరుడు ఆలయము వెనుక విద్యారణ్యులకు గుడికట్టించాడు కృష్ణరాయలు విరూపాక్షుని గర్భగుడి ముందు రంగ మంటపము కట్టించాడు విరూపాక్షుడు విజయనగరాధీశుల కులదైవము, వారి రాజముద్ర శ్రీ విరూపాక్ష నామాంకితము పర్వత పంక్తుల మధ్య భాస్కరక్షేత్రంలో హేమకూట పర్వతము మీదనున్నందున తురకలదాడి తప్పించుకొని ఆలయం చెక్కు చెదరకుండ వున్నది తర్వాతి రాజులు విరూపాక్షుని అలక్ష్యం చేసినందున, రక్కసతగ్గిడి యుద్ధంలో దేవుడు హిందువుల కపజయము కల్గించాడని ప్రతీతి

ఉదయగిరి దుర్గంగెల్చి తెచ్చిన బాలకృష్ణుని ప్రతిష్టించుటకై కృష్ణరాయలు కృష్ణస్వామి ఆలయం కట్టించాడు సుందర తరమైన యీ ఆలయం చుట్టు ప్రదక్షిణ మంటపము ముందు అర్ధ, మహామండపములు, విమానమున కుత్తరమున, మహా మంటపము ముందు భాగమున, దక్షిణమున మూడు చిన్న దేవళములు వున్నవి

హజార రామస్వామి ఆలయం రాజాంతఃపురానికి దగ్గరగా దేవరాయల కాలం నుంచి వున్నది ఇందులో కృష్ణరాయలు కొన్ని భాగాలు కట్టించెను ఆలయము చిన్నది, తూర్పునుండీ పడమరకు 200 అడుగులు, ఉత్తరమునుండీ దక్షిణానికి 110 అడుగులు విజయనగర శిల్పంలో నిచటి శిల్పం అసమానమైనది అర్ధ మండపము నాల్గు చిన్న స్తంభాలమీద రాతితో కట్టబడ్డది. మీది నాలుగు నల్లరాతి స్తంభాలు ఇండోకొరింథియన్ శిల్పం చూపు చున్నవి గర్భగుడి మీది విమానం శిల్ప శోభితము ఆలయము, మండపము యొక్క బయటి గోడల మీద, రామాయణము, కృష్ణునికథ శిల్పాంకితమైనవి తాటకా సంహారము, సీతారామ లక్ష్మణులు గంగ దాటుట, జటాయు పతనము, రాముడు సుగ్రీవుని ముందు ఏడుతాళ్ల నొక్క బాణంతో పడవేయుట, హనుమంతుడు తోకను ఆసనముగ చేసికొని రావణునితో ప్రసంగించుట, రావణుని మరణ వ్యథ,

ఎనిమిది హస్తములుగల కృష్ణుని వేణుగానము, గోపీ సహస్రంతో కృష్ణుడు-ఇత్యాదు లతి మనో హరములు గోడ బయటి వైపుగల శిల్ప ప్రస్త రములు మహర్నవమి మహోత్సవ దృశ్యముల జూపుచున్నవి క్రిందినుంచి నాలుగు వరుసలలో ఏనుగులు, గుఱ్ఱములు, భటులు, వేశ్యలు, గాయకులు చిత్రితమైరి విష్ణ్వాలయమైనప్పటికి యిందు సుబ్రహ్మణ్య, గణేశ విగ్రహములు గలవు ఒక స్తంభము మీద విష్ణువు గుఱ్ఱము మీద నున్నట్లున్నది ఇది కలికావతారము గా నోపు గర్భగుడి బయటి కుడ్యములమీద రెండు బుద్ధ ప్రతిమలున్నవి

విఠలాలయంలో దేవాలయ వాస్తుకళ పరి పక్వం పొందింది మహారాష్ట్రదేశంలో కృష్ణుడు విఠోబా, విఠలరూపాన పూజితుడై యిచట వెలి శాడు రెండవ దేవరాయులు కాలంలో ప్రోలు గంటి తిప్పన భోగమంటపం కట్టించాడు కృష్ణ రాయలు కొన్ని భాగాలు నిర్మించాడు ఆలయము అసంపూర్ణము 538 అడుగుల పొడుగు, 310 అడుగుల వెడల్పుగల చతురస్రం మీద రాతితో చాల ఎత్తుగా కట్టబడ్డది పడమటవినా, మూడు ప్రక్కల గోపురము లున్నవి ఇందలి శిల్పము సమాన రహితము, ఏక శిలనుండి చెక్కబడ్డ కంబముల పనితనము రీతి అత్యద్భుతము. కల్యాణమండప మోహనత్వము ఆశ్చర్య జన కము కొన్నేండ్ల క్రితం వరకు ఆలయం కోణ ములనుండి రాతిరింగుల గొలుసులు ఆకాశ మున వ్రేలాడుచుండెడివట సంగీతమండపంలో స్తంభనిర్మాణము బహు చిత్రంగా నున్నది. ఒక పెద్ద స్తంభము మధ్యవుంటే, దాని చుట్టు యేడు పిల్ల స్తంభాలున్నాయి అవి ఆరోహణావరోహణ క్రమంగా సప్తస్వరాలు పల్కును ఆలయావ రణలో యోగానంద నృసింహస్వామిని వ్యాస తీర్థులు ప్రతిష్ఠించారు మహా మంటముం కెదు రున్నన్న రాతిరథము శిల్పమూర్తియే ఇది 9 శిలలతో నిర్మితము చక్రములు రాతివే పైన గోపురం, దానిమీద రాతికోడి వుండెడివట

అచ్యుతరాయాలయమును 1539లో అచ్యుత రాయలు కట్టించెను లోపలి ప్రాకారం చుట్టు వరండాలో స్తంభములమీద యేనుగుల ప్రతిమ లున్నవి ఆలయం పడమటిద్వారం మీద దశా వతారములున్నవి లోపలి బయటి తలుపుల మీద రెండు ప్రక్కల గంగానది మకరముమీద నిల్చినట్లు, మకరము నోటినుండి వచ్చు పుష్ప లత ద్వార బంధముచుట్టు అల్లుకొన్నట్లు మనో హరముగ నున్నది

మాల్యవంతము రఘునాథాలయము మాల్య వంత పర్వతముక్రింద నున్నది రామ విగ్రహం ఒక పెనుబండమీద చెక్కబడ్డది ఈ ఆలయ మహా కల్యాణ మంటపములలో, శిల్ప లక్ష్మి నిల్చియున్నది ఒక శిల్పములో రెండుపాములు సూర్యునో, చంద్రునో సమీపిస్తూ గ్రహణము చూపుచున్నవి కోదండరామ, పట్టాభి రామా లయం యింతే అచ్యుత రఘునాథాలయములో స్తంభముల మీద యేనుగు, యెద్దు వాని దేహ ములు ఒకే శిరమున బహు చక్కగా చెక్క బడినవి ఈ దేవాలయముల పై భాగమున చూరును అమర్చిన రాళ్లవరస వర్ణనాతీతము.


"శిల్పి కర స్పర్శమున కఠిన శిలలు వెన్న ముద్దలుగామారి వాని మనోరాజ్యమందలి దేవాలయమును బహిర్జగత్తునందు వెల్లడించుట కనుగుణ్యమాయెను"

ఏకరాతి నృసింహ విగ్రహమును 1528 లో నొక బ్రాహ్మణుడు దొల్చాడు దీని యెత్తు 22 అడుగులు ఈ వుగ్ర నృసింహమూర్తి ప్రచండముగా నున్నది పై ఆలయమిప్పుడు గానరాదు ఈ కాలమందలి విగ్రహ నిర్మాణ కళౌన్నత్యము దెల్పు విగ్రహములు హంపి ఆలయములోగలవు రాజాంత పురము, భవంతులు, ఇతరకట్టడములు చాలవరకు శిథిలములు దిబ్బలుమాత్రం గలవు ఒక దిబ్బ ఆంతరంగిక ఆలయముగ వుండి యుండును దీనిపైన 60 స్తంభాలు 6 వరుసలుగ నున్నట్లు దిమ్మలున్నాయి ఇవి దేవదారు నిర్మితమైన కట్టడము ఒకటి రెండు అంతస్తులు గలిగి యున్నట్లు అబ్దుర్ రజాక్ సూచించాడు మరొకటి సింహాసనం దిబ్బ, దీనిపై కట్టడమే భువన విజయము, కృష్ణరాయలు గజపతిని జయించి వచ్చి కట్టించాడు దీని స్తంభములు గజ రూపమున భూమిని మోయు అష్టదిగ్గజములు సూచించునట్లున్నవి రాజులు యిచటి సింహాసనముమీద గూర్చుండి మహార్నవమి యుత్సవమును దిలకించు వారట ఇది చాలవరకు రాళ్ళు, పలకలతోను, ఒక ప్రక్కన ఆకుపచ్చ రాతితోను నిర్మితమైనది దీన్ని మహార్నవమి లేక దసరా దిబ్బ అందురు దీని మీది శిల్పము హజార రామాలయ ప్రాకారపు గోడలమీది శిల్పాన్ని పోలింది భటులు, గుఱ్ఱములు, ఏనుగులు, ఒంటెలు, వేశ్యలు వరుసగా చెక్కబడిరి ఏనుగుల వరుసలో యిద్దరు విదేశీయులు గడ్డములు, పర్షియన్ టోపీలు ధరించి సింహాసనాసీనులై ముగ్గురికి సలాం చేస్తున్నారు వీరు బహుశ పోర్చుగీసులై యుందురు ఇచ్చట శిల్పంలో జైన శిల్పము మిళితమైనది జైన బౌద్ధ శిల్పంలో ప్రసిద్ధమైన హంసలు మకరములు వరుసగ చిత్రింపబడినవి ఒక ప్రస్తరంలో వేట దృశ్యము రమ్యముగా నున్నది వేటకాడొకడు పులిని శూలంతో గ్రుచ్చుచున్నాడు, ఇద్దరు ఆయుధపాణులై వేట కుక్కలతో దుప్పిని వేటాడుచున్నారు, నడుమ నొక చెట్టుపై యిద్దరు సాయుధ భటులను ఒక మృగము బెదిరిస్తోంది, క్రింద ఒక వరాహము వున్నది, దిగువను యిద్దరు యోధులు మల్ల యుద్ధమును ప్రదర్శించుచున్నారు అస్సీరియను శిల్పము వలెనున్న ఒక ప్రస్తరములో ఒక యోధుడు వరాహమును లోనికి బాకుగుచ్చి చంపునట్లున్నది రౌతులతో గుఱ్ఱములు, నగారాలతో ఒంటెలు, ఏనుగులు, వేశ్యలు, గాయకులు చిత్రితమైరి దిబ్బ ప్రక్క లందున్న మహార్నవమి యుత్సవ దృశ్యములలో ఒక పురుషుడు ఇద్దరు వేశ్యలు కుసుంభానోటి గొట్టముల పట్టుకొని యున్నారు జలక్రీడలకు స్త్రీ పురుషులు ప్రత్యేక దుస్తుల ధరించినీటిలో దాగుడు మూతలాడు వారట

మరో దిబ్బ సమీపంనుంచి రాతి కాలువ దుర్గములోనికి పారుచున్నది ఇందులో నుంచి పిల్లకాల్వ రాణుల స్నానగృహములోనికి గలదు నలుచదరముగ చుట్టు కందకము గలిగి యీ

గృహము యిండోసారసినిక్ రీతిలో గట్టబడ్డది దుర్గములోని చంద్రశేఖరాలయమునకు పడమట అష్టకోణ జలక్రీడాగార మున్నది ఆంతరంగిక భవనమున కెదురుగ నున్న 4½' పొడుగు 3' వెడల్పు, 2' 9" మందముగల రాతితొట్టిలో రాయబారుల యేనుగులు, గుఱ్ఱములకై నీరు నింపుచుండిరట మరొక అష్టకోణ మండపములో మధ్య చిన్న జలధార వున్నది ఇచటి పెద్ద ఏకరాతి తొట్టిలో వుత్సవ దినములలో బీదలకయి పాలు నింపుచుండిరట

★



ఆంధ్ర మహిళా!

కవితావిశారద—అయ్యగారి విశ్వేశ్వరరావు బి ఏ,

ముందంజ వేయవే ముద్దు చెలియా నీవు!
సుందరాంగుల లోన శోభాయ మానవు!!

నీ జాతి విఖ్యాతి నిండె జగముల యందు
తేజశాలిని వమ్మ తెలియవే మహిళా!!
పలనాటి వీర్యంబు పగటి వేషము గాదు
చరితలో గలదమ్మ మనశౌర్య గాథ!

ముందంజ వేయవే! ముద్దు చెలియా నీవు!
సుందరాంగుల లోన శోభాయమానవు!!

తేనెలూరేభాష తెలుగు వారిది సుమ్మ
తెలుగు తిక్కన్నలే గనరారు యిదినమ్మ
ఒకనాడు మనకీర్తి ఉన్నతిని గాంచెనమ్మ
పాటలై పోయెనే మన ప్రాభవమ్ము!!

ముందంజ వేయవే! ముద్దు చెలియా నీవు!
సుందరాంగుల లోన శోభాయమానవు!!

కలిసిమెలిసే గడియ తెలుగు వారల కిమ్మ
తెలుగురాష్ట్రము వచ్చు దారినిక జూపుము!
తెలుగు సీమలబాధ తీరునను చాటుము
కలిమిగలదాన నీసరిలేదు జగాన!

ముందంజ వేయవే! ముద్దు చెలియా నీవు!
సుందరాంగుల లోన శోభాయమానవు!!

జనయిత్రివై వీరసంతానమును గనుము
ఘనుల మెప్పుల గాంచి గర్వపడవమ్మా
జవజీవముల నిమ్మ తెలుగు జాతికిని
జవరాల! నీ దీక్ష—తెలుగువారల రక్ష!!

ముందంజ వేయవే! ముద్దు చెలియా నీవు!
సుందరాంగులలోన శోభాయమానవు!!

విశ్వమానవ సమత వెలయించు గతి గాంచి
శాశ్వతంబగుకీర్తి జతపడగ నుతినంది
ఆంధ్ర శోభ నెజాటు నడుగు నిడవమ్మా
ఆంధ్రమహిళా నీకు విజయమే సుమ్మా!

★

విశ్వజ్యోతిలో విలీనమైన మరియొక జ్యోతి

మహాపురుషులు

మహర్షి రమణ

* ఎమ్ ఎమ్ రాజ్యలక్ష్మి *

ఉపన్యాసాలు, ఉపదేశాలు, లేకుండానే, కేవలం సాన్నిధ్య మాత్రంచే, భక్త హృదయాల్లో జ్ఞానజ్యోతులను ప్రసరింప చేసి, మనశ్శాంతిని కలిగించిన మహర్షి

పంచమహా లింగాలలో తేజోలింగానికి అరుణాచలం నివాసస్థలం తేజోలింగానికి ఆవాసం గావడం వల్లనే అరుణాచలానికి ఆ పేరువచ్చి వుంటుంది సంవత్సరాని కొకతూరి ఈ పర్వతంమీదనున్న దేవాలయంలో జ్యోతిని వెలిగిస్తారు ఈ జ్యోతిని దర్శించడానికి వేలాది తీర్థ యాత్రికులు తండోప తండాలుగా వస్తారు అపర భగవానులయిన శ్రీ రమణ మహర్షిగారు కూడ ఒక జ్యోతివలె ప్రకాశింప మొదలుపెట్టి నప్పటినుండి, అప్పుడు ఇప్పుడు అని లేకుండా జనం యెల్లవేళలా యీ పవిత్ర భూమియందు కిటకిటలాడు తుంటారు

మధుర జిల్లాలోని ఒక గ్రామములో 1879 లో జన్మించారు మహర్షి ఆయన చిన్ననాటిపేరు వెంకటరమణుడు మహర్షి తండ్రి న్యాయవాది రమణుడు చిన్నతనంనుండి కూడ విద్యలో ఎక్కువ ఉత్సాహం చూపించక, మహర్షుల జీవిత చరిత్రలు చదువుతుండే వారు బాల్యంలోనే "నేనెవరు? మరణించిన తరువాత ఈ శరీరమేమౌతుంది?" ఇత్యాది ప్రశ్నలు ఆయనను బాధించేవి ఈ ప్రశ్నలకు జవాబు పొందలేక 17 సంవత్సరాల వయస్సులో ఇంటినివదలి సరాసరి అరుణాచల శివుని సాన్నిధ్యానికి వచ్చారు

వెంకటరమణుడు కొన్ని నెలలు కఠిన తపము చేశారు. తన శరీరంలో కొంతభాగం క్రిమికీటకాదులచే తినబడుచున్న కూడా ఒళ్లు తెలియని పారవశ్యంలో ధ్యాన మగ్నులై యుండిరట అప్పుడే వెంకటరమణుడు సామాన్య బాలుడు గాడనియు, ఒక్క మహా వ్యక్తియనియు అందరికి తెలియ వచ్చెను తరువాత మహర్షి అచటనే ఆశ్రమమును నిర్మించుకొని, ఏప్రిల్ 14వ తేదీమహానిర్యాణం పొందేవరకు అక్కడనే నివసించారు


మహర్షి మొట్టమొదట గ్రంథాలు పఠించి అనుభవాన్ని పొందలేదు ముందు తనకు తానే స్వయంగా అనుభూతిని పొందారు తరువాత, తన అనుభూతికి అనుకూలమైన విషయాలు పురాణాది గ్రంథాలలో ఉన్నాయని తెలుసుకున్నారు.

మహర్షి బోధనలలో నూతనత్వమేమీలేదు మనవేదాంత గ్రంథాలలో ఉన్నమాటలే వేదకాలంనుండి మన ఋషులు చెప్పిన వాక్యాలే ఈయనకూడా చెప్పారు రమణ మహర్షి గారు ఎక్కువగ ఉపన్యాసము లివ్వలేదు. తన దర్శనానికి వచ్చిన వారిలో ఎక్కువగా వేదాంత విషయాలను గురించి చర్చించరు

మత విషయాలలో తరతరాలనుంచి ప్రాముఖ్యం వహించిన మౌనమునే ఈయన కూడ అవలంబించారు మౌనంలో మాత్రమే ఆత్మజ్ఞానం సిద్ధిస్తుందని ఈయన అభిప్రాయం

ప్రశ్నలు, అనుమానాలు అవిద్యకు లక్షణాలని ఆయన అన్నారు జ్ఞానసిద్ధిచేతగాని అవిద్య నశించదు అవిద్య వల్ల మానవుడు తనను తాను తెలిసికొన లేక పోతున్నాడు. ఈ అవిద్య నశిస్తే ఆత్మ స్వయంప్రకాశమౌతుంది దీనినే మోక్షమని అంటారు మోక్షమంటే మరణానంతరం సిద్ధించునది యని తలప బనిలేదు మోక్షానికి దేహం ఎప్పుడూ అడ్డు తగలదు అరిషడ్వర్గాదులను జయించి జీవి ఆత్మసిద్ధి పొందడమే మోక్షం అదే జీవన్ముక్తదశ జీవితయానం సాగిస్తూనే

మహర్షి రమణ



ఆశ్రమంలో రమణమహర్షి

ఏప్రిల్ 14-వ తేదీని పూర్ణ సిద్ధిని పొందిరి

మానవుడు సంసారసంసర్గ విముక్తుడై ఉండడమే జీవన్ముక్త దశ ఇటువంటి జీవన్ముక్తదశను పొందిన మహాత్ములను గురించి పురాణంలో చదవడమే కాకుండా, మన అదృష్టవశాత్తు మన కాలములో ప్రత్యక్షంగా అటువంటి మహర్షిని చూచాము

సంఘ సంస్కర్తలు, దేశభక్తులు మహర్షివద్దకు వచ్చి అనేక రకాల ప్రశ్నలు వేసేవారు తనతోడి వారిని బాగు చెయ్యడానికి, విజ్ఞానవంతుడైన ప్రతి వాడును కృషి చెయ్యవవసరం లేదా? లోక కళ్యాణానికి అందరూ పాటుపడ వద్దా? ఇటువంటి ప్రశ్నలన్నిటికి మహర్షి, "నిన్ను నీవు ముందు సంస్కరించుకొన్నావా, తరువాతనే నీవు ఇతరులను సంస్కరించడానికి అర్హుడవౌతావు," అని జవాబు చెప్పేవారు

"ప్రపంచంలోని అకృత్యాలన్నిటికి మూల కారణం అజ్ఞానం ఇది నశిస్తేగాని ఆత్మానుభూతి కలుగదు ఆత్మానుభూతికలిగి అహం నశిస్తేనేగాని మానవుని కర్మలు పరిశుద్ధములుకావు ఆత్మ సందర్శనానికి మానవుడు ముందు తనను తాను సంస్కరించుకొనవలెను జీవిత పరమార్థం తెలిసికొని జీవన్ముక్తుడైనవాడు లోక సంగ్రహణార్థ మాత్రమే కర్మలను చేస్తాడు" స్థూలంగా చెప్పాలంటే మహర్షిగారి బోధనఇది

"ఆత్మజ్ఞానానికి సాధన చెయ్యండి
ఆత్మజ్ఞానం మాత్రమే మోక్షము నివ్వగలదు'

★

రమణ మహర్షి

కైవల్య శబ్దమ్ము కేవలమ్మును మూర్తి
        మంతమై విలసిల్ల మౌనబోధ!
నిర్వాణ నామమ్ము నిరవధిక ప్రభా
        జ్యోతియై భాసిల్ల శుద్ధబోధ!
ప్రజ్ఞాన తేజమ్ము భవబంధ మోహ ని
        ర్మూలమై రాజిల్ల మూలబోధ!
పరమార్థ తత్త్వమ్ము బ్రహ్మస్వరూపమై
        సాక్షియై శోభిల్ల జ్ఞానబోధ!
సచ్చిదానంద నిశ్శ్రేయ సమ్ము శుద్ధ
బుద్ధ ముక్తమై యలరార పూర్ణబోధ
తనూ మనమ్ముల కనులకందని విధాన
రమణు శ్రీ చిన్మయావతారము వెలుంగు!!

ఆదియొక విశ్వరూపము మ
        హా మహిమమ్మతి లోక సుందర
మ్మది పరిపూర్ణమై విపుల
        మై విభవాతి శయమ్మునై మెదల్
తుది నెఱుగంగ రాక పతి
        థుల్ వివరింపగ రాక ముక్తికిన్
గదురయి చల్లనై హృదయ
        గోచరమై ప్రభనిండి వెల్గెడిన్

కన్నులు మూసి తారకము
        ఖమ్మయి చిత్త సంచలించిలో
గన్నులు విప్పి హృద్విమల
        కంజ సుఖాంతర భద్రపీఠిపై
కన్నుల నిండ కప్పరమ
        గమ్యు పరాత్పరు నప్రమేయునిన్
కన్నుల వెల్గు శ్రీరమణు
        కన్నులగోల్పి బ్రవర్తిచేసెదన్!

నీ చిరు నవ్వు వెన్నెలల చల్లనిబిందు
        వమరక్తి నానిన నాత్మ పదము
నీ సుప్రసన్నతా సౌమ్యము సందమ్ము
        ముచ్చట జూచిన ముక్తి పదము
నీనును పల్కు తేనీయల తీయని తేట
        చవులూర గ్రోలిన జ్ఞానపదము
నీ దొర గన్నుల నెనరు చిల్కెడుచూపు
        సూటిగా నందిన శుద్ధపదము
నీకృపాపయోధి నిండార నోలాడి
చిత్త సీమ జేర శివపదమ్ము
అంతరంగ గుహను హాయిగా విహరించి
భక్తి చేరి గొలువ పరమ పదము!

—శ్రీ పొణకా కనకమ్మ

[మహర్షి గత జన్మదినోత్సవ సందర్భమున రచయిత్రి వ్రాసికొన్న పద్యములు]



ఆంధ్రమహిళాసభ—హిందీ శాఖ 1949—50

భారతాధ్యాత్మికాకాశములో అవతరించిన బాలజ్యోతి : ఏ మహత్తర విజ్ఞానకాంతుల వెదజల్లునో ;

"ముమ్మిడివరం బాలయోగి"

❋ కె. సభా ❋

ఆరుమాసాల క్రితం బాలయోగి పేరు విన్నాను. ఇటీవల రెండు మాసాలనుండి వీరిని గురించి ఉత్తర సర్కారు జిల్లాలలో విరివిగా చెప్పుకోవడం జరిగింది. శివరాత్రి మరుచటి రోజున దర్శన మిస్తాడని పత్రికల్లో చూచాను. ఇందులోని నిజా నిజాలు సాధ్యమైనంత వరకు తెలుసుకోవాలనుకున్నా నేను చూచినది, విన్నది పరిశోధించినదిగూడా సామాన్య మానవుడి దృష్టితోమాత్రమే. హిందూమతస్థుడనైనా హిందువుగా మాత్రమే నేను ఆలోచించలేదు. సామాన్య మానవుడు తనశక్తిని ఎలా వృద్ధిచేసుకో గలుగుతాడో నిరూపించే విధానాల్లో యిదొకటై యుంటుందనే అభిప్రాయముతో వెళ్ళాను.

ప్రయాణం బహుకష్టంతో కూడుకున్నది. ఐదారు లక్షలకు తక్కువగాకుండా ఉత్తర భారతంనుండి, మైసూరు, దక్షిణాది మళయాళ ప్రాంతాలనుండిగూడా ప్రజలురావడం వల్లా బస్సులు, పడవలు, లాంచీలు ప్రజలతో నిండుకుపోయినవి. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం తాలూకాలో గోదావరి డెల్టా ప్రాంతంలో వున్న ఈ ముమ్మిడివరం ఆ మూడురోజులు ప్రజల ముమ్మరంలో మునిగి పోయింది. పదిహేనో తేది రాత్రి గ్రామాన్ని చేరుకున్నాను. బాలయోగి దర్శనార్థం వచ్చే ప్రజలకు చాలినన్ని యేర్పాట్లు చేయబడివున్నై.

బాలయోగిని గురించి చెప్పుకుంటున్న వాటిలో చాల మట్టుకు నిజమే. రామకృష్ణాశ్రమంనుండి, హృషీకేశంనుండి గూడా కొందరు వచ్చి పరిశీలించి వెళ్లారట. వీరిదర్శనార్థం నెహ్రూ పటేల్ ప్రభృతులకు సహితం ఆహ్వానాలు పంపబడ్డాయట. వారు తమ ఆనందాన్ని తెలుపుతూ రాలేకపోయినందుకు తమ చింతను తెలియ జేశారట. అలసట బడలికతో ఎటుదిరిగి ఉదయం దర్శించగలమనే సంతృప్తితో కుటీరంలో పడుకున్నా నిద్రపట్టలేదు. నేను ఆశ్రమంవైపు వెళ్లాను. వందలకొలది పోలీసులు, వాలంటీర్లు, స్కౌట్ జట్లు పనిచేస్తున్నా ప్రజలు విరుగబడుతున్నారు. ఉదయం ఐదుగంటలకు దర్శనమని ప్రకటించినా ఆశ్రమం చుట్టు ప్రజలు బైటాయించారు. లోపలికి వెళ్ళడానికి వీలుగాక పోయింది. ప్రజల్లో కొందరిని, యోగిసహచరుల్లో (మునుపు) కొందర్ని పల్కరిస్తే నిజమేనంటే నిజమేనన్నారు.

ఉదయం సరిగా నాలుగు ముప్పావుకు సమాధిపైగా నిర్మించిన మండపంలోకి బాలయోగి నడచివచ్చి కూచున్నారు. ఎక్కువ ప్రయాసతో ప్రజల్ని తప్పుకుని వీలైనంత దగ్గరకు వెళ్లాము. ఆకారం దండకారణ్యంలోని అత్రిమునిలాగా వుంటారు. శిఖముడి పెద్దది. కండరాలు మలిచినట్టున్నాయి. కూచున్న తీరులో ఎక్కువ రీవి కనబడుతుంది. కట్టుబట్ట తప్ప యింకేవీ ధరించలేదు. ముఖంలో కాంతి వున్నది. కళ్లుమూయబడినట్టే కనబడుతాయి. గంటకల్లా ఆసనంనుండి దిగిపొయ్యారు. ఆ నడవడం గూడా బహు చలాకీగా హుందాతో నడచినట్టుంది.



ముమ్మిడివరం బాలయోగి

పత్రికల్లో 20 గంటలపాటు కూచుంటారని ప్రచారం. కానీ లేచి వెళ్ళడంతో ప్రజలు నిరుత్సాహు లయ్యారు. ఇంతలో సాయంకాలం ఆరుగంటలనుండి పండ్రెండుదాకా వుంటారని అనడంతో అందరూ ఆగారు.

"ముమ్మిడివరం బాలయోగి"

అసలు విషయం

ఇరవైమంది బాలయోగి జీవిత చరిత్రను గురించి వ్రాశారు. వీరిలో కొందరు ఆశ్రమవాసులు, పత్రికారచయితలు, విద్యావంతులైయున్నారు. గద్యాలు, పద్యాలు, పాటలు, ద్విపదలు, ఏలపాటలు, పల్లెపదాలు, బుఱ్ఱకథలు, సంభాషణల రూపంలో వున్నాయి. వీటితోపాటు చిత్రపటాలు సహితం కొన్ని లక్షలుంటాయి.

ముమ్మిడివరం హరిజన వాడలోని గంగయ్య కుమారుడు బాలయోగి. తల్లి వెంకమ్మ చిన్నతనంలోనే చనిపోయిందట. జీవిత చరిత్రలో వీరి పుట్టుక 20-10-30అని, 23-10-30 అని, 23-10-33 అని కూడా వున్నది. ఈ మూడు తేదీలు బట్టిచూస్తే వయస్సు ఇరవై ఏళ్లకు లోపేనని నిర్ణయించుకోవచ్చు. పుట్టింది హరిజనవాడలో గనుక విద్యాగంధంలేని నిరక్షరాస్యుడయ్యారు. ఆర్థికంగా హరిజనులకున్న యిబ్బంది వీరికి వుండడంవల్లా దొమ్మేటి ఎఱ్ఱమ్మ అనే ఆమెవద్ద బాలయోగిని పశులకాపరిగా వుంచడం జరిగింది. వీరి మొదటిపేరు సుబ్బయ్యట.

చిన్నతనమంతా పశువులుకాయడంలోనే జరిగినా అతనిలో మంచితనం ప్రస్ఫుటించేదట. ఓనాడు భక్తపోతన చిత్రాన్ని చూశారట. ఆ రోజునుండి ఏదో పరధ్యానంగా వుండేవారని చెబుతారు. నలభయి ఆరు జూన్ మాసాంతంలో ఒక నారదుని బొమ్మను ఎప్పుడూ తనతోవుంచుకునేవారట. ఎంతో ఆప్యాయంగా చూచుకునేవారట. ఈ పరధ్యానంలో తన పశువులు పైర్లలోపడటం వారు మందలించడం కొట్టడం కూడా ఒకటి రెండుసార్లు జరిగాయట.

రాను రాను సుబ్బయ్య పిచ్చివాడయ్యాడని కూడా అనుకున్నారట. వరుసగా నాలుగైదురోజులు తిండిమాని వేయడము, ఎక్కడ బడితే అక్కడ గంటల కొలదీ కూచోడం, పరధ్యానంతో వుండి పోవడం తండ్రికి చికాకు కల్గించేదట. ఈ విధానాన్ని తొలగించడానికి తండ్రి ఎన్ని విధాల ప్రయత్నించినా సాధ్యంగాక పోయింది.

ఓ నాడు ఉన్నట్టుండి పశులకాస్తూ ఓ చెట్టు క్రింద కూర్చోడాన్నిచూచి ప్రజలువచ్చిచూడ్డం, యింటికి రమ్మని బలాత్కరించడం జరిగింది. ఎంతో ప్రయత్నంతో తండ్రి యింటికి తీసుకెళ్లినా మళ్ళీ అక్కడే కూచున్నారట.

ఆ నాటినుండి అప్పుడప్పుడూ పాలు మాత్రం పుచ్చుకోవడం, స్నానం చేయడం జరిగేవి. ఓ నాడు అక్కడనుండి బలవంతంగా కొందరింకో చోటికి తీసుకెళ్లి వుంచారట. ఉదయం గ్రామస్థులు ఆందోళనతో వారిని బాధించడం తగదని ఆయన తండ్రిగారితో ఆలోచించి ఒక పాక వేశారట. అప్పటినుండే అన్న పాన విసర్జన జరిగినట్టు తెలుస్తున్నది. స్నానంలేదు సరిగదా తిండి తీర్థం లేకుండా, కనీసం మంచినీళ్లైనా పుచ్చుకోకుండా మనిషికి అతీతుడై మలమూత్ర విసర్జనలులేక కూచున్న చోటు కదలకుండా వాయుభక్షణతోనే సమాధిలో వుండిపోయారు.

ప్రజల గుర్తింపు

అంతవరకు ఏదో దొంగాటలని, మాలాడిగోలని నిర్లక్ష్యంతో వున్న ప్రజలు, ఇతడెవరో మానవాతీతుడనే విస్మయంతో ఆయనకేమీ భంగం కల్గించకుండా ఓ గదిని చూపెట్టారు. ఆ గదిలో వున్నప్పటికీ రోజూ ప్రజలువందల కొలదిగా రావడం, చీకటిలోనున్న అతని ముఖంవేపు టార్చిలైట్లను ఫోకస్‌చేయడం కొద్దిమంది భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణాలు చేయడం జరిగేవట.

ఆ గోడలను రిపేరు చేయడంలో ఎంత మట్టి రాలినా, చీమలు బల్లులు ప్రాకినా తుడుచుకునే వాడుకాడని ధర్మకర్తలు చెబుతారు.

10-2-49 తారీఖున గరిమళ్ళ కృష్ణమూర్తి గారు (సబ్ జడ్జి కాకినాడ) వీరిని కలుసుకున్నారట. మళ్ళీ 17-2-49 తారీఖున కూడా కలుసుకున్నారట. వారితోమాత్రం తానూ మానవుడనేనని తన్ను చూడ్డానికి ప్రజలు రావడంలో ప్రయోజనం లేదని పూలలోకూడా ప్రాణాలున్నాయని చెప్పినట్టు తెలుస్తున్నది. అంతకు క్రితం రోజూ ఉదయం ఐదారు గంటల మధ్య ప్రజలుదర్శనం చేసుకొనేవారట. ఇక మీద ఏడాది కొకసారి కనబడుతానని, శివరాత్రి మరుచటి రోజున దర్శన మిస్తానని చెప్పారట. ఆ ప్రాంతంలోని పోలిరెడ్డిగారు దర్శనమిచ్చే సమయంలో కూచోడానికని ఒక మండపాన్ని నిర్మించారు.

"ముమ్మిడివరం బాలయోగి"

అప్పటినుండి సమాధిగది మూసివేయమనడం వల్లా మూసివేశారట. 26-2-49, 2-7-49 తేదీలలో తలుపులు తెరవడానికి ప్రయత్నించినా రాలేదట.

దీనినంతా పరిశీలిస్తే వయస్సులో పిన్నయైనా బాలయోగి అమోఘమైన శక్తిని సాధించారనడంలో ఎంత మాత్రం అతిశయోక్తిలేదు. బాపూజీ నిగశనవ్రతాలు సాగించారు. మరికొందరుగూడా పరిశోధించారు. కాని మంచి నీరైనా అవసరముండేది. కానీ బాలయోగిగారిది యోగం. ఈ యోగాభ్యాసంలో తిండి తీర్థాలతో నిమిత్తంలేక, వెల్తురు గూడా అవసరం లేక పరిమితమైన గాలితోనే ప్రాణాలను నిలుపుకోవడమేగాక ప్రకాశవంతమైన తేజస్సు, పుష్టిగల్గిన కండరాలు, అందమైన రూపము సాధించడం జరిగింది. స్నానం లేక పోయినా శరీరం అత్యంత పరిశుభ్రంగావుండడం ఎంతో ఆశ్చర్యకరం.

ఎందుకీ తపస్సు ?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేము. అయినా నాస్తికులు సహితం యిందులో వుపయోగముందని ఒప్పుకొని తీరాలి. భోగలాలసులై, సుఖాలకోసం మనిషిని చంపడానికి మారణాస్త్రాలు తయారు చేస్తున్న ఈ యుగంలో మానవుడు దేవునితో నిమిత్తంలేకనే బ్రతుకగలడని అనుకుంటే, తిండితీర్థాలు గూడా అవసరం లేదని బాలయోగి నిరూపించాడు. ఆశలు వదలి భోగాలను త్యజించి, కేవలం ఆహారాన్నిగూడా వర్జించడానికి మానవుడు సిద్ధపడినపుడు ఆయుధాలకు ఆస్పదముండదని, విశ్వశాంతిని సాధించడానికి ఈలాంటి యోగాలు యెందుకు మార్గదర్శకులు కాకూడదని లోకాన్ని ప్రశ్నిస్తున్నాడని, అనుకోవచ్చు.

రాజకీయరంగంలో, ఆర్థికరంగంలో ఏ విధంగా వెనుకబడిన జాతులు ముందుకు పోతున్నారో అలాగే ఆధ్యాత్మిక రంగంలో బాలయోగి విజయాన్ని సాధించి ఆధ్యాత్మిక విప్లవమూర్తి కాగలడని ఆశించవచ్చు.

ఇది గర్వ కారణం

ఆనాడు నందుడు హరిజనుల్లో విప్లవాన్ని లేవదీసి హరిజనులకు దేవాలయ ప్రవేశమిప్పించడానికి ప్రయత్నించాడు. కానీ నందుడు భగవదాంశుడని యితరులకా శక్తిలేదని మళ్ళీ పంచమజాతిని పరమ నీచంగానే చూడడం జరిగింది. ఈనాడు ఆ హరిజన బాలునికే వేలాది వేలు ధనవంతులు, లక్షలాది సవర్ణులు, మునులు మహర్షులని పించుకున్న వారు సహితం సాగిలపడ్డారు. అతనిని ఆజ్ఞాపించిన చేతులే నమస్కరించాయి. అతనిని దండించిన చేతులే జోడించ బడ్డాయి. అతనిని నిందించిన నాలుకలే స్మరించినై. నీచాతి నీచుడు అన్నవారే మహానుభావుడు, శాంతిదూత అనడం జరిగింది.

వితండ ప్రచారాలు

"అతడు యోగి నిజమైతే చచ్చిన మనిషిని బ్రతికించాలి. లేకుంటే ఈ యోగాభ్యాసం యెందుకు ?" అన్నారు కొందరసూయాపరులు. చచ్చిన మనిషిని బ్రతికించిన వాడెవరూ మనలో ఉదయించినట్టు వాస్తవిక దృష్టితో చూచినపుడు కనబడదు. కానీ కొన్ని మూలికల సాయంతో (సంజీవి) ఒకరిద్దరు బ్రతికినట్టుమాత్రం తెలుస్తున్నది. అంత మాత్రానికే అతడు యోగికాడని చెప్పగలమా ? వివేకానందుడెందరిని బ్రతికించాడు ? ఆయన బ్రహ్మచర్యాన్ని జ్ఞానాన్ని శంకించగలమా ? ఏసు ప్రవక్త మూడు రోజులు సమాధిలో వున్నందుకు ఆశ్చర్యపడింది ప్రపంచం. నెలల పర్యంతం సమాధిలోనుండిన బాలయోగిని నేను క్రీస్తుతో పోల్చడం లేదు. కానీ సమాధిలో నుండడంలో అతనికంటే అతీతుడని చెప్పడానికి నేను జంకను. మనకు అనుమాన-దృష్టి వుండ వలసిందే అయినా అది విపరీతాలకు దారితీయ గూడదు. క్రీస్తుకు టైప్‌రైటింగ్ రాదని, శ్రీరామునికి సైకిల్ త్రొక్కడం రాదని, గౌతమునికి వంట చేయడం రాదని, గాంధీజీకి తెలుగులో మాట్లాడలేదని విమర్శించవచ్చు. అయినా అందులో ప్రయోజనము వుంటుందనుకోవడం భ్రమమాత్రమే.

విచిత్ర ప్రచారాలు

అతిశయోక్తులకు మనది పెట్టింది పేరు కావడంవల్లా అసలు సత్యమే అనుమానమై కూచుంటుంది. బాలయోగిని గురించి విచిత్రాలు బయలుదేరాయి. కొందరతడు శ్రీకృష్ణుడన్నారు. కృష్ణుడు పశుల కాపరి. స్వయం కృషితో

మహాత్ముడయ్యాడు. ఆ నాటి మతకర్త బిరుదును (విష్ణువు) పొందగలిగాడు. ఆయన మళ్ళీ అవతరించడం ఎలాగా సంభవమో విచిత్రం... ఇంకో రచయిత సాయిబాబా మళ్ళీ పుట్టాడన్నారు. ఇంకొక గ్రంథకర్త వీరబ్రహ్మంగారు అవతరించాడన్నారు. అసలు కాలజ్ఞానతత్వంలోనే బాలురు సహితం యోగులు కావచ్చునని చెప్పబడింది. అలాంటప్పుడు యిదెలా సంభవమో విపరీతం. ఈలాగే ఎవరికి తోచినట్టు వారు ప్రచారం చేయడం, ప్రమాదమే కాదు. అసలువ్యక్తిత్వమే నశింపజేయడానికి కారణమౌతుంది. ఒక పుస్తకాల వ్యాపారి తను ప్రచురించిన బాలయోగి జీవిత సంగ్రహంలో యిలా వ్రాసుకున్నాడు "సాయి మహాశయులు చెప్పగా, వీరభద్రస్వామి వ్రాయగా, శ్రీరామచంద్రుడు, శ్రీ తిరుపతి వెంకటేశ్వరులు శుద్ధప్రతి వ్రాయగా, శ్రీ కృష్ణమూర్తి అందజేయగా, శ్రీమన్నారాయణమూర్తి అందు కొనగా, శ్రీ సుందరరామునిచే ప్రచురింపబడినదిగాన పవిత్రవంతముగా నెరుగదగినది"

ఇందులో గ్రంథకర్త వీరభద్రస్వామి. పబ్లిషర్ సుందర రాం అండ్ సన్సు తెనాలి. నిజానికి వీరిద్దరి మధ్య యింత పురాణం జరిగిందని ప్రజలచేత నమ్మించడం జరిగింది. ఒక సమయం అడిగితే రామచంద్రుడు వెంకటేశ్వర్లు శుద్ధంగా వ్రాశారని, కృష్ణమూర్తి తెచ్చి యిస్తే నారాయణమూర్తి పుచ్చుకొన్నాడని వీరందరూ మనుష్యులేనని చెప్పవచ్చు. కానీ చదివే వారికిది దేవుళ్లులాగానే కనిపిస్తుంది. ఎందుకింత నాటకం? అర్థంగాదు.

ఈ ప్రచారాలతోపాటు యింకో ప్రచారం జరగడం అందరు గమనించ దగడమేగాక విచారించ దగింది కూడా. బాలయోగి పూర్వ జన్మంలో బ్రాహ్మణుడని ఏదో కర్మ చాలక మాలాడికి పుట్టాడని. ఇది మామూలే కిరాతకులలో ఉదయించిన మహాకవి వాల్మీకుని గూడా యిలాగే అన్నారు. ఇలాంటివి చాలా కనబడుతాయి పురాణాల్లో. ఈ నాడు గూడా అలాంటి ప్రచారం జరగడం శోచనీయము. కూటికి గుడ్డకు నోచుకోక పూరికొంపల్లో దారిద్ర్యంతో కుములుతున్నంత మాత్రంలోనే, వారిలో అంబేద్కర్ లాంటి మేధాసంపన్నుడు పుట్టడంగూడా మన మనస్సుకు ద్వేషాన్ని కల్గిస్తే ఎలాగా? చివరికి నేడు విని, కని, నిజం తెలుసుకుని, యిప్పటికీ కన్నతండ్రి ప్రాణాలతో వుండగనే, తాను నివసించిన పూరిపాక శిథిలంకాక ముందే, తాను మేపిన పశువులు ప్రాణాలతోవుండగనే, తన అన్నలు సహచరులు మామూలు మాలలుగా వుండగనే, యిలాంటి ప్రచారాన్ని లేవదీయడం చాలా శోచనీయం. పైగా యిది విద్యావంతుల దంటే మరీ విచారకరంగా వుంది. మాలాడికి మగబిడ్డా అన్నట్టు మాలాడు మహాయోగి అయ్యాడా అంటూ ఉలిక్కిపడ్డంలో లాభంలేదు.


అయ్యాడు బాలయోగి మహాయోగి కావచ్చు. ఆ నాటి శంబుక హత్యలు యీనాడు జరిగే అవకాశాలులేవు. జాతి మత భేదాలు నశించేకాలం వచ్చింది. దేవాలయ ప్రవేశం యివ్వడానికి ఏడు చెరువుల నీరు కార్చిన సనాతనులీనాడు ఆ హరిజనునే దేవుడుగా భావించి సాగిల పడటం మనము చూస్తున్నాము. దీనినంతా బ్రాహ్మణ ద్వేషమనుకోవడం పొరబాటు. బ్రాహ్మణులే కాదు వారికంటే హరిజనుల్ని నీచాతి నీచంగా చూస్తున్న తదితర కులాలను ఉద్దేశించి, పిచ్చి సనాతనత్వాన్ని గురించి మాత్రమే వ్రాశాను. నేనూ బాలయోగిని చూచాను. అయినా లాభంలేదు. నేను హరిజనుని యింటిలో ప్రవేశించినా నా యింటిలో హరిజనుడు అడుగెట్టరాదు. అలాటి సంకుచితావస్థలోనే మనకుటుంబాలున్నాయి.

అపూర్వమైన పట్టుదలతో యోగాన్ని అభ్యసించ గలిగాడు. మానవుని శక్తిని పరిశోధిస్తున్నాడని మాత్రం మనం అనుకోవాలి. బాలయోగి పేరుతో ఎవరుకానీ డబ్బులు ప్రోగుచేయడం, విచిత్ర ప్రచారాలు చేయడం తగనిపని. ప్రభుత్వం ఇలాంటి వాటిలో గూడా జోక్యం కలిగించుకోవడం చాలా అవసరం. తీయబడినాయి. జిల్లా కలెక్టరు ప్రభుత్వము విచారించి బాలయోగి నిజమైన చరిత్రను అన్ని భాషలలోనూ ప్రచురించే యేర్పాట్లు చేయడమేకాక, ఆయన పరిశోధనలకు అవరోధాలు కలుగకుండా చూచుకోవడం అవసరం. భారతదేశంలో జరుగుతున్న ఇలాంటి సాధనలను ప్రపంచానికి తెలియచేయడం గూడా చాలా అవసరము.

★

నవలానిక:

[కులపతి అడవి బాపిరాజుగారు "జాజిమల్లి" అనునవలానికను, మా ఆంధ్ర మహిళ ద్వారా, 12 సంచికలలో, చదువరుల కందజేయనున్నారు. ఇందులకు వారికి మాకృతజ్ఞత. ॥ సం ॥]



జాజిమల్లి

అడివి బాపిరాజు

ఆమె జీవితంలో ఈనాడు పూవులు వికసిస్తున్నవి. వికసించే పూవులు తియ్యని వేదనతో, రాలిపోయే పువ్వులు నిట్టూర్పు పూరితమైన ఆనందంతో నిండి ఉన్నాయి.

ఆమెకు పూవుల బ్రతుకులు యిన్నాళ్లకు అర్థమయినవి. ఇంతవరకు ఆమెకు పూవుల అర్థము పూవులే! చిన్నతనాన్నించి పూవుల్ని చూస్తే కిలకిలా నవ్వుకొనేది. ఉప్పొంగుతూ గంతులు వేసేది. కాని ఆ ఆనందం ఏదో దూరాల మోసాలనుండే!

పువ్వులను చూస్తే ఆనందం పడని బాలిక ఎవరు? పువ్వులు ఆజన్మ చాలించి పూబోడులై పుడతాయో, పూబోడులే అవతారాలు చాలించి పువ్వులే అయి పుడతారో! ఆమె చిన్నతనంలో వాళ్లింటి దగ్గరవున్న నాగమల్లిచెట్టు పువ్వులు వానాకాలంలో జల్లులు జల్లులుగా రాలుతూ వున్నప్పుడు, తెల్లవారుతూనే లేచి, ఆ చిరిగిపోయిన తాటాకు బుట్టలో పోగుచేసి, ఏవేవో అర్థంకాని, అర్థానికి అతీతమైన, చిన్నబిడ్డల వెర్రిపాటలు పాడుకుంటూ పోగుజేసేది. "అమ్మా! యీయాళ ఎన్ని పువ్వులు దొరికాయో! ఏంటనుకున్నావు, ఈఏళ ఈ పువ్వులన్నీ ఎట్టి జడేసుకుంటానమ్మా! అని వాళ్ల పూరిగుడిసెలో గంతులు వేసేది.

"మల్లెలు మల్లెలు నాగామల్లెలు
తీయ తీయనీ తెల్లని మల్లెలు"

అని తాను విన్న పాట సంపూర్ణమైన యాసతో పాడుతూ ఆ బుట్టను తన హృదయానికి అదుముకొని "ఓ అమ్మా! జడ యెయ్యవంటే?" అని తల్లిని ప్రశ్నించేది.

ఇంక ఏమి పువ్వులుంటాయి ఆమె ఆ చిన్ననాటి జీవితంలో! వాళ్ల అయ్య పనిచేసే ధశరథరామి రెడ్డి పొలంలో సంక్రాంతి రోజులలో వికసించే బంతిపూవులు, బొంగడ బంతిపూవులు, సీతామ్మవారిజడ పూవులు! అవి బంగారం ముద్దలు, పొద్దు పొడపు అరుణ బిందువులూ!

రకరకాల గోంగూర పూవులు చెవుల్లో పెట్టుకొనడానికి ఎంత అందంగా వుంటాయి. అందుకనే వాటిని పూర్వకవులు కర్ణికాపుష్పాలనేవారు. గోంగూర పూవులలో ఎన్ని రంగులున్నాయి. ఎరుపు, నీలం, తెలుపు,

పసుపు పచ్చలూ, చంద్రబింబంలా విచ్చియున్న ఆ పువ్వుల హృదయంలో మధురరాగము, రాగవర్జిత విరాగహారితమై పుప్పొడులు ప్రసరిస్తూ పొలయించి వుంటుంది. దూరాన కావలికి ఆవలి చిట్టడివిలో కొండ తంగేడు పూవులూ, మోదుగ పూవులూ, వానకాలంనాటి దిరిశెన పూవులూ, ఆమెకు ఎంతో ఇష్టం!

ఆమెకు తల దువ్వడానికి నూనె లేదు. వాళ్ల దొర రెడ్డిగారింట్లో యిచ్చిన నువ్వులనూనె కూర తాలింపు కోసం మాత్రంసరి పోయేది.

బిరుసైన ఉంగరాలజుట్టు, తుమ్మెద రెక్కలలా నిగనిగ లాడుతూవున్నా, సంస్కారంలేక బాగా పెరగక, తొలకరిచిరుమబ్బుల్ని నలుదిక్కులకు ప్రసరిస్తూ ఉండేది. దొర బండ్లకు చక్రాల యిరుసులకు చుట్టిన నార తడప డానికి చిక్కని ఆముదం తెచ్చేవాడు తన అయ్య. అది నవ్వుకుంటూ చేతులకు రాసుకొని తలంతా పులుముకొనేది. తల్లి దువ్వుకొనే కర్ర దువ్వెనతో చేతులు పడిపోయేటట్లుగా దువ్వుకొని, తల్లిదగ్గరకు పరుగెత్తి జడ వేయించుకొనేది. అమ్మయ్య! అప్పుడు పెట్టుకొనేది పువ్వులు. ఆనాడు ఆ బిడ్డ "పద్ది" పల్లెవాళ్ల ఎఱ్ఱ చందనం బొమ్మ!

౨

ఈనాడు ఆమె గీతాదేవి! జాజిమల్లె పొదదగ్గర నిలుచున్నది. ఆ తోట ఆమె సొంతతోట. ఆమె తోటనిండా ఎన్నిరకాల పువ్వులున్నాయ్! గేటు దగ్గిరనుంచీ ఈవలావల నాలుగు రకాల బోగైన్విలా పువ్వులు గుత్తులు గుత్తులై కుంకుమ, ఊదా, బంగపండు గులాబి రంగులు ప్రసరిస్తూ గాలిలో ఆడుకుంటున్నాయి. జాజి, సన్నజాజి, విరజాజి, చెట్టుమల్లె, బొడ్డుమల్లె, గుత్తులమల్లె, జంటమల్లి రేకమల్లి మొదలైన మల్లి జాతులలో అనేక రకాలైన గులాబి జాతులతో డాలియా, జినియాలు, దయాంతస్‌లు, ఈలా తన తోటంతా పువ్వులతో నింపుకుంది.

ఎంత నికృష్టమైన జన్మ తన జాతి వారిది? తమ్ము పల్లీ లంటారు. తమలో పెద్దలు కొందరు అగ్నికుల క్షత్రియులమని పిలుచుకుంటారు. అలాంటివాళ్లు యజ్ఞోపవీతాలు కూడా వేసుకుంటారు. తమ గ్రామం 'కావలి'కి నాలుగు మైళ్ల దూరములో ఉంది. అది గ్రామమేమిటి? అది పల్లె వాళ్ల చిన్న పల్లె. తన పూర్వీకులు అనాది కాలంనుంచీ సముద్రంలో పడవలు కట్టుకుపోవటం సాయంత్రానికి పడవడు చేపలతో తిరిగిరావడం, ఆ చేపలు ఎండబెట్టి ఎండు చేపల క్రింద ఎగుమతి చేయటం, లేక పచ్చి చేపలుగా ఎగుమతి చేయటమో, అలాంటి వ్యాపారము చేసి జీవితం సాగిస్తూండేవారు.

ప్రాణాలుఒడ్డి, పడవడు చేపలు పట్టుకొని వచ్చినా మధ్య వర్తుల పాళ్లన్నీ పోగా ఇంకా తమకు మిగిలేది ఏముంటుంది కనుక? అందుకని తన అయ్య దశరథ రామిరెడ్డిగార్కి పాలేరు పనిచేస్తుండేవాడు. దానా, దీనా తన పెద్ద కుటుంబం ఆకలిగీత దాటకుండా బ్రతుకుదారిలో ప్రయాణం చేస్తుండేది.

తన తాత, అవ్వ, పెద్దయ్య, అయ్య, చిన్నయ్య వాళ్లందరి బిడ్డలు తన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు మొత్తం తమ రెండు మూడు గుడిసెల్లో తామందరూ ముప్పైఆరుగు రుండేవారు. ఏటిలో వలలువేసి చేపలు పట్టినా సముద్రంలోకి పోయి చేపలు పట్టినా ఆ పాటుఅంతా మగవాళ్లదే. తట్టలతో కావలీ, బిట్రగుంటపోయి అమ్ముకురావడం వంతు ఆడవాళ్లది.

తమ బట్టలన్ని చేపలవాసన కొట్టేవి. తమ యిండ్లచుట్టు చేపలవాసన. యిల్లంతా చేపలవాసన. చివరికి వళ్లంతా చేపల వాసనే. తమ పూర్వీకురాలైన మత్స్యగంధి చరిత్ర ఎవరు వినలేదు! ఆమె జీవితములో పరాశరుడు ప్రవేశించి ఆమెను యోజన గంధిని చేసినాడు. తన జీవితములో నరసింహామూర్తి పరాశరుడే!

గీతాదేవికి అప్పటికింకా పెండ్లికాలేదు. అప్పుడు ఆమె పద్ది. పద్దమ్మగనుక పద్దీ అని పిలిచేవారు. ఆమెకి పెండ్లి కాకపోవుటకు రెండు మూడు కారణములుండేవి. అప్పటికే ఆమెకు పదహారేండ్లు వచ్చినవి. చిన్ననాటి చింపిరి జుట్టు పోయి ఒత్తైన కాటికి కొండలాంటి జుట్టు ఆ ఉంగరాల తోనే ఆ నొక్కుల నొక్కులతోనే చీకట్లు కమ్ముకొని వచ్చింది.

ఆమెకు పదహారోఏడు వచ్చిన సంవత్సరము 1945. అంతవరకు ఆమెకు పెండ్లి కాకుండా ఉండటానికి కారణం స్పష్టంగా ఉండనే ఉన్నది. ఆ పల్లెవాళ్లలో పల్లె నాయకుడు వీరాస్వామి కొడుకు బుచ్చి వెంకన్న. అతనికి పద్దిని ఇవ్వడానికి వారిరువురి చిన్నతనంలోనే నిశ్చయం చేశారు పెద్దలు. ఉక్కు విగ్రహంలాంటి బాలుడు, సముద్రం మొసలిలాంటి శక్తివంతుడు, నల్ల మద్దిచెట్టులా కమ్మెచ్చులు తిరిగిన కండలు కట్టిన దేహంతో బార ఈతలో సముద్రములో ఎంతదూరానికైనా వెళ్లేవాడు.

బుచ్చివెంకులంటే పద్దికి ఎనిమిదో ఏటినుంచీ ప్రాణమే. నాటికే వాడు ఒక్కడూ తెరచాప ఎత్తి నావ నడుపుకు పోయేవాడు! ఎంతదూరమైనా సముద్రంలోనికే మాటలు తక్కువ. చేతకు ఎప్పుడైనా సిద్ధమే. తన పల్లెలో ఏ పని వచ్చినా, అంత చిన్నతనంలోనూ అతడు ఎన్నడూ వెనుదీయ లేదు. ఆమెకు పన్నెండు వచ్చింది. అతనికి పదహారో ఏడు వచ్చింది.అప్పుడే వీళ్ళిద్దరి పెండ్లి చేయడానికి సంకల్పించారు. పెళ్లి మూడురోజులుందనగా బుచ్చి వెంకన్న పడవ సముద్రములో మాయమై పోయింది. ఆ చుట్టు ప్రక్కల పల్లెవాడలలో పల్లె నాయకులందరూ అతని కోసం ఆ తీరమంతా గాలించారు. ఆ బాలకుని కోసం పల్లెవాడలన్నీ గగ్గోలు పుట్టాయి.

పద్దమ్మ దుఃఖానికి మేరలు కనుక్కొనే వారెవరు? ఆ లేత హృదయం చితికిపోయినట్లే అయింది. వారంరోజులకి పెన్న సముద్రంలో చేరే ప్రదేశానికి తెర చాప ఎత్తుకొని కొనవూపిరితో ధైర్యంచెడకుండా వచ్చి చేరుకున్నాడు బుచ్చివెంకన్న. ఈ సంగతంతా చెప్పి కావలిలో ఉన్న ఒక అయ్యవారిని అడిగితే ఆయన బుచ్చి వెంకన్న రోజులు మంచివికావనీ, రెండేళ్ళవరకూ బుచ్చి వెంకన్నకు పద్దమ్మకూ పెండ్లి చేయవద్దని సలహాయిచ్చాడు.

పద్దమ్మకు పదిహేనోఏట బుచ్చి వెంకన్నకు పందొమ్మిదవయేట వాళ్ళిద్దరకు పల్లెపాకలలో ఎన్నడూ ఎఱుగని వేడుకలతో పెళ్లి చేశారు. కెరటమూ కెరటమూ కలసిపోయినట్లు, గాలీ, గాలీ ఒరుసుకు పోయినట్లు, ఏరులో ఏరుసంగమించినట్లు, వారి జీవితాలు కలిసినవి. రెండు తిమింగిలములులా, వారు ఉప్పొంగు సముద్రాలు ఈదులాడినారు. రెండు కృష్ణ డేగలలా వారు మైమరపు ఆకాశాల తేలిపోయినారు!

ఇంతలో ప్రపంచపు బ్రతుకు మార్గాల జటల మారెమ్మ యుద్ధము, ఢాకినీదేవి అవతరించింది. జపాను యుద్ధరంగంలోకి దిగింది. భారతీయ యువకులెంతమందో కడుపు కోసం యుద్ధంలోకి జేరేరు. ఎంతమందో సరదాకోసం యూనిఫారము వేసికొన్నారు. చాలామంది ఏ సంగతి తెలియకుండా మాయమాటలునమ్మి సైన్యాల జట్టులలో జేరి పోయినారు. ఆలాగే యుద్ధములోకి వెళ్లి పోయినాడు బుచ్చివెంకన్న.

చేరిన ఆరు నెలలో కోహిమారంగానికి వెళ్ళవలసివచ్చింది. మరి ఆరునెలలు తిరగకుండా యుద్ధంఆగి పోయింది. టకటక సైనిక వేషములో జేబునిండా డబ్బుతో సంచులనిండా చిత్రచిత్రమైన వస్తువులతో సువాసన నూనెలతో, రంగు రంగుల సబ్బులతో, పేసుపౌడర్లతో, రిబ్బన్లతో, లోలకులతో అనేక రకాల వెన్నెలలులాంటి చీరలతో యింటికి వచ్చాడు బుచ్చివెంకట్రావు జమాదారు.

తన పల్లెలో, తనవాళ్ళతో ఉండడానికి యిష్టం లేక పోయింది. వచ్చి కావలిలో మకాము పెట్టాడు. తాను చేపల వర్తకము ప్రారంభించాడు. పెళ్ళానికీ తనకూ చదువు చెప్పటానికి ఒక మాష్టర్ని పెట్టుకున్నాడు. పెళ్ళాన్ని పద్మావతీ అని పిలిచాడు. తాను బుచ్చివెంకట్రావయినాడు కదా! పద్మావతి కంఠం ఎంత మధురమైనది? ఆమె చిన్నతనంలోనే

"ఏడుకలూ పెళ్ళి ఏడుకలూ
భూమంతా పందిరే
పువ్వుల తోరాణాలు
బూరాలు ఊదారు
ఏడుకలూ పెళ్ళి ఏడుకలూ
పడవెక్కి తెడ్లేసి
నడి సముద్రాన్ని జేరి
ఆలిచిప్పల మద్దె ముత్యాల జాలరులు
ఏడుకలూ పెళ్ళి ఏడుకల్లూ"

అని తల్లితోపాటు చేపలు ఎండవేసె టప్పుడుగాని, అయ్యయిచ్చిన చేపల్ని బుట్టలో తీసుకొనివచ్చి అమ్మకు అందిచ్చే

టప్పుడుగాని సన్నటి రొయ్యపప్పు రంగూన్ యెగుమతి కోసం తండ్రితో పోయి బుట్టలలో కట్టేసేటప్పుడు గాని వెన్నెలరాత్రులు ఒడ్డుకు తేలుకుంటూ వచ్చి పాట పాడేటి ఉప్పునీటి కెరటాలతో కలిపి ఆమె గొంతెత్తి ఎన్నో పాటలు పాడుతూ ఉండేది. ఆ పల్లెవార్ల వేడుకలలో, ఉత్సవాలలో పద్దమ్మ పాడకపోతే అవన్నీ పరిమళాలు లేని పువ్వులులా అయిపోయేవి. అడవి పువ్వులకు దోహదాలు కావాలా! అందమైన సువాసనలను వెదజల్లడానికి కావలిలో ఆ బాలిక గొంతుకు విని ప్రయివేటు మాష్టరు "ఏమండీ వెంకట్రావు గారు మీ వారికి సంగీతం చెప్పించండి" అని ప్రోత్సహించాడు. అప్పుడే పద్మావతి జీవితములో నరసింహామూర్తి ప్రవేశించాడు.

సముద్రపు ఒడ్డున పాలసముద్రపు కెరటాలలా ఉబికి ఉన్న ఆ ఇసుక తిన్నెలలో ఆటలాడుకొంటూ నత్తగుల్లలు ఏరుతూ, శంఖాలుప్రోగు చేసుకుంటూ, రంగురంగుల పీతల్ని తరుముతూ కూరకుపనికివచ్చే పెద్దపీతజోలికి పోకుండా ఆటలాడుకునే పల్లెబాలికలకు ఆ సముద్రం అవతలి ఒడ్డు ఏమున్నదో ఏమితెలుసు? కెరటాలు ఎందుకు పుడతాయోవాళ్లు ఆలోచిస్తారు. సముద్రపు లోయల్లో ఏ రాక్షసి నిట్టూర్పులు విడుస్తూవుంటే ఆ కెరటాలు ఏర్పడుతాయో, పద్దికి ఏం తెలుస్తుంది! ఊతుకు ఎఱుగని పేలికలైన పరికిణీ చొక్కాలు ధరించి మహారాజు కుమార్తెలా గంతులు వేస్తూ ఆడుకొనే పద్దాలకు, సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు సముద్రానికి ఇవతల ఒడ్డు, అవతల ఒడ్డు, సముద్రుని పోటూపాటూ సముద్రుని పెండ్లాము రాకపోక, తోలు బొమ్మల ఆటలులా జరిగిపోయేవి.

ఎందుకు అందమైన ఖట్టలు కట్టుకోవాలో తెలియక పోయినా రంగురంగుల కొత్తపరికిణీ చక్కని చక్కని వల్లెవాటులను, చుక్కచుక్కల రవికెలు కావాలని చిన్నతనం నుంచీ వాంఛించేద్ది పద్దాలు.

పెద్దవాళ్ళయిళ్ళలో తిండికోసము ఏమి వండుకుంటారో అని పద్దాలు ఎప్పుడూ ఊహించుకోనయినా ఊహించుకోలేదు. అనుకుంటే ఇంకా చిక్కటి గంజీ, ఇంకా చిక్కటి కంకటీ, ఇంకా పెద్దవి చేపలు, కోడి మాంసపుకూరలు ఉంటాయి. అంతకన్నా ఏమిటో అని ఎప్పుడైనా అనుకొన్నదేమో! కాని కావలి పట్టణపు బజారు లలో మిఠాయి అంగడుల మీద అమ్మే ఆ నోరూరిస్తూ ఘుమఘుమలాడే ఆవేవో పకోడీలు, కారంపూసా, అవి తన అయ్యపాలి పని చేసే రెడ్డిగారింట్లో తింటారు కాబోలు అని అనుకుండేది.

(సశేషం)

సాహితీవిహాయసంలో :

కథావీధి

"ఉషశ్రీ"

జరుగుతూన్న కాలాన్ని "అటంయుగం" అంటారు. శాస్త్రపరిశోధకులు. "విప్లవయుగం" అంటారు ఐతిహాసికులు. "కథానిక యుగం" అంటారు సాహితీ వేత్తలు.

ఐతిహాసిక, వైజ్ఞానికుల అభిప్రాయాలతో మనకు సంబంధములేదని త్రోసి పారవేయటానికి వీలులేదు కాని ఈ ప్రకరణంలో మాత్రం అనవసరం. ప్రస్తుతం మనం కథానిక యుగంలో పర్యటిస్తున్నాం.

సాహితీ వాహినిని సహృదయ సమాలోచనా దృక్పథంలోంచి చూస్తే కథానిక తరంగాలు పొంగులు వారుతూ వస్తున్నై. ఆ తరంగాలు ఏరులుగా, నదులుగా పోయి పోయి సాహితీ సముద్రంలో సమ్యక్ సమ్మిళితములయి భాసిస్తున్నై.

ఈ కథానికా వాహిని దేశ, దేశాంతర సాహితీ క్షేత్రాలలోనూ మహోజ్వలంగా శోభిస్తూ, ఆ యా సారస్వత చరిత్రలలో ప్రముఖ ఘట్టంగా చిత్రింపబడింది; బడుతోంది కూడా. వైదేశికంగా కథా సాహిత్యానికి ప్రాముఖ్యత రావటం, అదొక విశిష్ట స్థానాన్ని కూర్చుకోవటం కూడా జరిగిపోయింది. ఆ యా దేశాల వైజ్ఞానిక, ఐతిహాసికులకు యెంతటి మహోన్నత స్థానమున్నదో, కథా నిర్మాతలకు కూడా అంతటి స్థానమూ ఉన్నది. పద్య, గద్య, ప్రబంధ, నాటక, నవలా కారులు ఏ శిఖరాలను అందుకున్నారో, కథాకారుడు కూడా ఆ శిఖరాలకు ఎగ బ్రాక గలిగాడు. శతాబ్దాల క్రితం నాటకాలు వ్రాసి స్వర్ణయుగ నిర్మాతలలో ఒకడైన 'షేక్స్పియర్' మనకి ఎంత సన్నిహితుడో ఈ నాడు కథలు వ్రాసే 'మపాసా' కూడ అంతటి పరిచితుడే. ఆ యీ నిదర్శనాలను సమీక్షించే భావుకులకు వైదేశిక కథాసాహిత్యపు ఔన్నత్యం విదితం కాక తప్పదు.

ఒకే ఒక్క మాటలో స్పష్టీకరించుకోవాలంటే: వైదేశిక కథా సాహిత్యం ఈ నాడు సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా చిత్రించబడింది. కథకుడు స్వర్ణ సింహాసనాసీనుడయి ఉత్తమకవుల స్థానంలో, స్థాయిలో నిలబడ్డాడు—

ఉపాఖ్యానాలే కథలు :

ఎవరెరుగుదురు? ఎవరు పరిశీలించారు! ఎవరికి కావాలి శ్రమ! అంతకుమించి మన కథా సాహిత్యపు పుట్టు పూర్వోత్తరాలను గురించి విశదీకరించిన వారు కనబడరు. ప్రాచీన కాలంనుంచి ఉన్నదా? మధ్యలో ఉద్భవించిందా? ఈ నాడే పుట్టి పెరిగి పోయిందా? లేక వైదేశికుల భిక్షయా? ఈ కథా సాహిత్యం!

అనే సమస్యలు ఉత్పన్నమైనై. ప్రాచీన సాహిత్యం మీద, అస్పష్ట కారణాలవల్ల, జనించిన జుగుప్సా నీరస భావాలవల్ల పూర్వ సాహిత్యం వైపు యాదృచ్ఛికంగానైనా చూడకుండా :

"పాశ్చాత్య సంపర్కం వల్లనే 'కథ' మనకు లభించింది" అన్నారు కొందరు. అనుభవం, స్వయం వ్యక్తిత్వం, ప్రతిభ లేక అనువాదాలు, అనుకరణాలుచేస్తూ యిచ్చే వీరి అభిప్రాయాన్ని స్వీకరించడం భావిని ఆశించే యువరచయితలకు శ్రేయస్కరమో-కాదో నిర్ణయించుకోవలసి ఉంది.

స్వదేశ, విదేశీయ, చరిత్ర కారుల దృష్ట్యా బహు పురాతన కాలానికి చెందినదైన ఋగ్వేదంలోనే కథలున్నై అనే విషయం విస్మరించరానిది. ఉపనిషత్తులలో కూడా కథలున్నై అని చాలామందికి తెలిసి ఉంటుంది. (ఆ యా కథల వివరాలు వ్రాసే ఉద్దేశ్యం రచయితకు లేదు.) భారత రామాయణాది యితిహాసాలలోనూ, భాగవతం మొదలైన అష్టాదశపురాణ ఉపపురాణాలలో కూడా కథలున్నై. అయితే వాటికి కథ, కథానిక అన్నే శీర్షిక లుంచబడనిమాట మాత్రం వాస్తవం. అయినా ఆ యీ ఆఖ్యానాలలోని ఉపాఖ్యానాలన్నీ 'కథ' శీర్షిక క్రిందకే వస్తయ్. ఈ నాడు. అంతే కాకుండా "కథాసరిత్సాగరా"ది కథల

సంపుటీలు కూడాఉన్నై. "బృహత్కథ" అనే పదాన్ని విన్నవారెవరూ (ఆ గ్రంధం చదవకపోయినా) 'కథ' మనకి పాశ్చాత్య దేశాలనుండి అయిన దిగుమతీ వస్తువు అని అన లేరు.

కాని ఆ నాడు ప్రత్యేకించి 'కథ' అనే శీర్షికతో వ్రాయ లేదనే మాట మాత్రం సత్యం. బహుశః పంచ త్రంతంలోకాని ఉద్దేశింప బడిందో? ఎటు చూసినా కథా సాహిత్యం అమాంతంగా ఉద్భవించటం కానీ, ఈ నాడే రూపునందడం కానీ, విదేశీ దిగుమతి కానీ ఎంత మాత్రం కాదనీ, ప్రాచీనకాలంనుంచి (ఋగ్వేదకాలంనుంచి) కూడా ఉన్నదనీ విశ్వసించవచ్చు. విశేషాంశమేమంటే నాటి జనత మహాఖ్యాయికల కిచ్చిన గౌరవ ప్రతిపత్తి ఉపాఖ్యానాలకు ప్రత్యేకంగా యివ్వలేదు. అందుచేతనే ఈ ఉపాఖ్యానాలు (కథలు) మహాఖ్యానాలలో చొప్పింపబడినై—

ఔ త్త రా హు ల క థ లు

ప్రాచీన కాలంలో కథలు వ్రాయటంగాని, కథలకు ప్రాముఖ్యంగాని, కధాకారులుగాని ఉన్నట్టు ఐతిహాసికంగా ఏమీ ఆధారాలులేవు. (ఒక్క సూతుడుమాత్రం "సుప్రసిద్ధ కథకుడు"గా యిప్పటికి పల్లెలలో కనబడుతూ ఉంటాడు.) అంతకు మినహా మరేప్రాధాన్యమూ కథకులకి లేదు.

ఈ నాడు కూడా వైదేశిక కథలకూ, కథకులకూ ఉన్న విశిష్టతకానీ, లభించే ప్రోత్సాహంగానీ మనదేశంలో ఉన్న టులు కనబడదు. సామాన్యులకు ఈ విషయం సులభ గ్రాహ్యం కాకపోయినా పేరుపడ్డ మన కథా రచయితలు ఈ విషయాన్ని కాదనలేరేమో?

ప్రస్తుతం దీన్ని రెండు విభాగాలు చేద్దాం.

- ౧. ఉత్తర భారతం
- ౨. దక్షిణ భారతం (ముఖ్యంగా ఆంధ్రదేశం)

ఈ రెంటినీ పోల్చిచూసుకుంటే ఉత్తర భారత కథకుల కున్న ప్రాముఖ్యత ఆంధ్రకథకులకి లేదు. ఉత్తర భారతీయు లకు కూడా విదేశీయులకున్నంత లేదు. వైదేశిక దృష్ట్యా ఉత్తర భారతకథకు లెంతటివారో, ఔత్తరాహుల దృష్ట్యా మనము అంతటివారం.

ఔత్తరాహులలో పేరెన్నికగన్న కథా రచయితలు—

ప్రేమచంద్, రవీంద్రనాథ్, శ్రీమతి. ఉషాదేవి మిత్రా, జయశంకర్ ప్రసాద్, అబ్బాస్ మొదలైన వారు యింకా ఉన్నారు. వీరందరిలోనూ "కథక చక్రవర్తి"గా పేరెన్నిక గన్నవాడు ప్రేమ్‌చంద్. ఇతని సాహిత్యం (దాదాపు) భారతదేశంలోని అన్ని భాషలలోకి అనువాదం చేయబడింది మిగిలిన వారికంటే యితనికున్న ప్రతేకతల్లో అది కూడా ఒకటి.

ఇంత కథక చక్రవర్తిగా పేరు గాంచి నప్పటికీ అతని అభిమానం 'నవల' మీదే ఉన్నట్లు గోచరిస్తోంది. అతని కథలకంటె 'నవల'లకే జనత ఎక్కువ ఆదరణ చూపు తోందేమో ననే సందేహానికి కూడా ఆస్కారాలు లేక పోలేదు. రవీంద్రుని విషయం కూడా అంతే. అతన్ని కథ కుడుగాకంటే 'కవి'గా జనత గుర్తించిది. ఇతరులవిషయం కూడా ఆలాగేఉంది. జయశంకర ప్రసాద్ నాటకాలకున్న విలువ జనతావిదితం. అబ్బాస్ వ్యాస, సమీక్షలకున్న విలువతో కథల్నితూచరు. ఇదే రీతిగా అందరికీ పరిచితు డైన "శరత్"కూడా నవలాకారుడే! ఆంధ్రుల దృష్టిలో 'శరత్'కున్న విశిష్టత మరెవరికీ కనపడదు. దీన్నిబట్టి ఉత్తర భారత కథకులకున్న స్థానం తెలుస్తుంగి—

వె న క చూ పు :

దక్షిణభారతంలో (ముఖ్యంగా మన దైన) సాహి త్యంకూడా సమగ్రంగా చూద్దాం. ఐతిహాసిక దృష్ట్యా నేమి, జానపద గాథల దృష్ట్యా నేమి మనసాహిత్యం చాలా భాగం అనువాదమే. ఏ కారణాలవల్లనో తెలుగువారు స్వతంత్ర రచనకు పూనుకోలేదు. అయినా స్వీయ ప్రతిభని మాత్రం మాటుపరచకుండా, జాతీయాలను త్రొక్కి వేయకుండా తమ తమ శేముషీ విశేషాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. అను వాదాలు అనువాదాలుగా కనపడకుండా స్వీయరచనలుగానే కనిపించేలా వ్రాసారు. ఈ విధానం స్వేచ్ఛానువాదానికి యింకా పైశ్రేణిలో ఉంటుంది. అయినప్పటికి ఆధారం లేని కావ్యాలు అరుదు. అక్కడక్కడ "కళా పూర్ణో దయం"వంటి స్వకపోల కల్పిత కళా ఖండాలు ఉన్నా

స్వీయశిల్పం లేదనే అనాలి. అందుచేత మనవాళ్లు శిల్పం కంటే శిల్పంపై మెఱుగులు దిద్దటంలో ప్రసిద్ధ హస్తులు అనవచ్చు.

ఈ విధానం నన్నయనుండి నేటివరకూ సాగుతూనే ఉంది. ఒకనాడు సంస్కృత భాషావాహినికి పిల్లకాలువలు తీసి పంటబోదెలుచేసి ఆంధ్రవాఙ్మయ క్షేత్రాన్ని సస్యశ్యామల భరితంచేస్తే, ఈ నాడు హిందీ, ఆంగ్ల భాషాసాగరాల్లోంచి తోడుకొస్తున్నారు. ఇంతకుమించి నాడు నేడులలో భేదం గోచరించటం లేదు. ఇక్కడే మరొక్క సూచన రేఖామాత్రంగా యిచ్చి వదిలేస్తా. జరిగిన కాలలలోని అనువాదాలు జాతీయమైనవి, స్వదేశీయాలు కావటంవల్ల జనతకు సులభ గ్రాహ్యమయేవి. కాని ఈ నాడు ఏ అత్యల్ప విషయిక సాంప్రదాయాలలోనూ మనతో ఏకీభవించని పశ్చిమఖండీయుల రచనలు అనువదించటంవల్ల వానికి అర్థం తెలుసుకుందుకి నేటిపఠిత చాలా కష్టపడవలసి వస్తోంది. వెనుక సమాన పద పటాటోపంతో భాషపై 'సర్కస్' చేయడంవల్ల దాన్ని అర్థం చేసుకుందుకు బాధ పడవలసి వచ్చింది. అయినా నిఘంటు సాహాయ్యంవల్ల ఆ బాధా నివారణ అయేది కాని, ఈ నాడు భాష సులభ గ్రాహ్యమైనా భావాలు సాంప్రదాయ విరుద్ధాలు కావటంవల్ల ఆ సమస్య క్లిష్టమైంది. అందుచేత ఈ అనువాద సాహిత్యం ఆయా శాఖలకు చెందినవారికి తప్ప సామాన్య పఠితలకు చిక్కనే కలిగిస్తోందని చెప్పకతప్పదు.

ఈ నాటి మన సాహిత్యంలో అనువాదాలు అనవరతము దిగుమతీ అవుతూన్నప్పటికీ స్వతంత్రరచనా ప్రతిభులు లేరని భావంకాదు. అధిక సంఖ్యాకులు వారేననే ఉద్దేశ్యంతోనే ఈ చర్చ నడిచింది—

మ న క థ కు లు :

మనసాహిత్య సామ్రాజ్యంలో 'కథక చక్రవర్తి' శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయన కథలలో ప్రత్యేకత సంభాషణ. మొత్తంకథని జిగిబిగిగా వాస్తవికతకు దూరం కాకుండా రసవత్తరమైన సంభాషణలతో నడిపించగల కథకులలో ఆయనకు ఆయనే సాటి. సజీవమైన మధుర భాషణ ఆయన కలంలో యిమిడిపోయింది. "సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు" చదువుతూంటే పాఠకుడికి కలిగే అనుభూతి ఒక దివ్యానుభూతియే, మధురసాస్వాదమే.

మునిమాణిక్యం నరసింహారావుది ఒక విచిత్ర శిల్పం. ఆయన శిల్పాన్ని సాహిత్య పారిభాషికులు 'మునిమాణిక్యం ముద్దుహాస్యం, అంటారు. ఆయన ఒకానొక సందర్భంలో చెప్పిన :

"మానవ జీవితము నలముకొనిన దుఃఖాంధకారమును హాస్యమరీచికలచే బారద్రోలవచ్చు" ననే వాక్యం ఆయనకు సమగ్రంగా అన్వయించి తీరుతుంది. రస ప్రస్తారంలో 'హాస్య రసం' చాలా కష్టమైనది. చాలామంది హాస్యం "మొద్దు హాస్యం"గా అసభ్యంగా (సినిమాలోవలె) తయారౌతుంది. 'ముద్దుహాస్యం' చెప్పగలవాడు ఒక్కడే ఒక్కడు; మునిమాణిక్యం. ఆయన్నే కొందరు "కాంతం మొగుడు" అంటారు కూడా. వారి "కాంతం (కథలు)" ఏకాంతంలో ఎంతో కాంతినీ హృదయశాంతిని కలిగిస్తూంటే ఆయన చక్కిలిగింతలు పెడ్తూంటాడు. ఈ మధ్య శర్మ, జానకి వస్తూన్నారు ఆ కలంలోంచి.

అడవి బాపిరాజు చేతిలోనిది ఊట కలమో, ఊటు 'కళ'యో యిప్పటికి సందేహమే. ఆయనతో కళ, ఆయనలో కళ, కళతో ఆయన, కళలో ఆయన-ఆయన ఏ కథ తీసికున్నా కళాశిల్పమే. శిల్పానికి శిల్పం చెక్కే కథకుడు బాపిరాజు. పాత్రలను ప్రవేశ పెట్టడంలో పాత్ర సమగ్ర రూపాన్ని దర్శింపచేసి, ఆ పాత్రను పాఠకుని కళ్ల ఎదుట నిలబెట్టి మరోకథ చెప్పుతాడు. ఇతర కథకులకీ ఈయనకూ ఉన్న విశిష్టత యిదే. సామాన్యంగా ప్రతి కథకుడూ కన్నుతీరూ ముక్కుతీరూ యివ్వక మనసు తీరు యిస్తారు. ఈయన మనసుతీర్చు మనమీద వదిలి పెడతాడు. నవలలో సిద్ధహస్తుడు కూడ!

కొడవటిగంటి కుటుంబరావుది మనస్తత్వాల నన్వేషించే తత్వం. ఆయనకలం మనుష్యుల బాహ్య వికారాలపై మానసిక సంచలనం ఏమిటో, మనస్సుయొక్క బాధ్యత ఎంత వరకో ? చూస్తూంటుంది. సామాన్యజనతలో ఉత్పన్నమయే సమస్యల్ని వాస్తవిక దృక్పథంలోంచి చూస్తూ పరిష్కార

విధానాల్ని సహజంగా చిత్రిస్తాడు. జీవితంలో అనుభవం ఎక్కువగా ఉన్నట్లు కన్పిస్తై. రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థలన్నిటినీ చూచుకుంటూ నడుస్తై అతని కథలు. (నవలా కారుడు కూడ!)

చెలం-గుడిపాటి వెంకటచలం యొక్క వాడుక పేరు 'చెలం' తెలుగు దేశంలో—భారత దేశంలో ఏమో కూడా—ఒకవింత మనిషి మాత్రమే కాదు—విప్లవవ్యక్తి కూడా. స్త్రీ జగత్తుపై ప్రపంచం చూసేచూపు ఈయన్ని రెచ్చగొట్టింది. ఆ విప్లవం ఈయన కథల్లో ప్రధానవస్తువు. చెలం పేరుక్రింద వచ్చే ప్రతికథలోనూ కూడా ప్రపంచమంటే స్త్రీ పురుష సమ్మేళనం-వాంఛ- ఆర్థిక వవ్యస్థతో, సమాజంతో ఈయన కథల్లోని పాత్రలకు సంబంధంలేదు. అయనేరాస్తూంటాడు. "చెలం కథలు చదివింది కాబోలు-లేచి పోయింది" అనే రకంగా ప్రధానాంశమేమంటే ఈయన కథకీ, నవలకీ తేడా లేదు. నవల "పెద్ద కథ" అయితే కథ "చిన్న నవల" తంతులో ఉంటుంది. ఈయన కథలకంటె నవలకు యువ లోకం పరిచితం—

ధనికొండ హనుమంతరావుని పత్రికా పాఠకుల్లో ఎరుగనివారరుదు. కథా వీధిలో ఈయన కూడా ఒక డాబా వేసాడు. ఈయన కథలు వాస్తవికతకు కొద్ది దూరంలో ఉన్నా అతివాస్తవికతలోకి, అధిక వాస్తవికతలోకి మాత్రం పోవు. శైలిలో భావంలో కల్పనలో చమత్కృతి ఉన్నది. ఇంకా ముందుకు రావలసిన కథకుల్లో వాడు ఈయన. పూర్తి పేరుతో కాకుండా "ధనికొండ" అనే పేరుతో వ్రాస్తూంటాడు.

మధుమూర్తి—"పడోసి" పాఠకులకు చిరపరిచితుడు, పత్రికా పాఠకులకు పరిచితుడు. ఈయన కూడా కథా వీధిలో యిల్లుకట్టాడు కాని యింకా "అలంకరణ" పూర్తి చేయలేదు.

—వెం. చ్వా. శా; జీవి, జగం వగైరాలు చాలా మంది కథావీధి విహారం చేస్తున్నారు. చింతా దీక్షితులు గారిది బాలసాహిత్యంలో (కథలు, పదాలు) సిద్ధహస్తం—

ఆ ఖ రి మా ట :

ఆ, యీ వ్యక్తులందరికీ (ఏ ఒకరిద్దరో తప్ప) కథా ప్రపంచంలోకంటె నవలా ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులున్నై.

అడవి—నారాయణరావు—

కొడవటిగంటి—కులంలేని మనిషి......

వగైరా! నవలలు బాగా ప్రచారంలో ఉన్నవి. ఈ నిదర్శనాల్ని బట్టి సమాలోచిస్తే తెలుగు నాట కథా వీధిలో హృదయ పూర్వకంగా అడుగు పెట్టిన వారు కనబడరు—లేకపోతే కథకుల్ని యింకా ఆంధ్రజనత గుర్తించలేదో!

ఈ విషయమై వివిధ పత్రికా సంపాదకులు సమాలోచించి కథారచయితలకు తగ్గ ప్రోత్సాహమిచ్చి, అన్య రాష్ట్రీ వైదేశిక కథా సాహిత్యంతో మన కథా సాహిత్యాన్ని పోటీ చేయిస్తారని ఆశిద్దాం. అందుకు తగ్గ కృషి త్వరలో ప్రారంభించమని తెలుగు రచయితలకు నా సూచన—హుషార్!

★



మూలం : మైకేలు జోషెంకో

అనువాదం : "శివం"

ప్రయాణీకుడు

మాస్కోకు వెళ్ళే ప్రయాణీకులను సామానులు పెట్టుకునే బల్లల పయిన ఎందుకు కూర్చోనిస్తున్నారో నాకు అర్థము కాకుండా వుంది. సామాను బల్లలు సామానుల కోసమే. ప్రయాణీకులు వాటిపయిన ప్రయాణం చేయడానికి వీలులేదు.

మన దేశములో విజ్ఞానము, నాగరికత వుండాలని వాళ్లు అంటుంటారు. పయిగా యిటువంటి అనాగరికపు కార్యాలు రైలు పెట్టెలలో జరుగనిస్తూనే వుంటారు-అనుదినమూ.

ఇటువంటి ప్రయాణాల్లో మరొకరి తలకాయను పగల కొట్టడము చాలా సులభము. పయినుండి పడి పోవడము కూడా చాలా సులభమే. ఒక వ్యక్తిపడితే క్రిందకు పడతాడు గాని పయికి పడడు గదా? ఆ పడటములో చాలా ఎత్తునుంచి కూడాను.

నాకు మాస్కో వెళ్ళవలసిన అవసరము ఏ మాత్రము లేక పోవడము నిజమే. అది, వాస్కా—దరిద్రపు వెధవ—నా బుర్రలో ప్రవేశ పెట్టేడు.

"ఇదిగోరా! ఫ్రీటికెట్టు, వెళ్ళాలని వుంటే దీనితో వూరికే మాస్కో వెళ్ళరా" అన్నాడు.

"నేను ఎందుకు వెళ్ళాలిభాయి? మాస్కో వెళ్ళాలని నా కింతమాత్రము కోరికగా లేదు. మాస్కోలో నాకు బంధుమిత్రులు ఎవ్వరూ లేరు. ఒక వేళ వెళ్ళినా రాత్రంతా ఎక్కడ గడపాలో నాకే మాత్రము తెలియదు" అన్నాను నేను.

వాడు అన్నాడు: "సరదాకు వెళ్ళిచూడు. ఫ్రీ టికెట్టే గదా—పయిసా ఖర్చులేదు. అదృష్టము తన్ను కొస్తూంటే దౌర్భాగ్యుడవు అనుభవించలేక కాల తన్నుతున్నావు."

అందుచేత, వక శనివారము రాత్రి ప్రయాణ మవ్వక తప్పిందికాదు. బండీ లోపలకు ఎక్కేను. ఎక్కి కుడివైపు బల్ల చివరను కూర్చున్నాను. మూడు మైళ్ళయినా మేము దాటేమోలేదో కడుపు కుతకుతలాడ సాగింది ఆకలితో. కాని తినడానికి ఏమయినా వుంటేగదా?

"ఆహా" నాలో నేను అనుకున్నా "ఇదంతా వాస్కా తప్పు. వాడే నన్నీదూరపు ప్రయాణానికి బలవంతము చేశేడు నేను గనుక ఏ బీరుషాపులోనో, ఎక్కడో కూర్చునివుంటే హాయిగా వుండివుందును—యీ రైలుబండితో సమానంగా దొర్లుతూపోయే కంటె."

ఇంతలోనే రైలుపెట్టె ప్రయాణీకులతో నిండిపోయింది పొడుగుపాటి గడ్డపు మనిషి ఒకతను కిటికీ ప్రక్కగా-నాకు ఎదురుగా కూర్చుని వున్నాడు. నా ప్రక్కనే వక ముసలి స్త్రీ కూచునివుంది. విషసర్పమని చెప్పొచ్చు. అస్తమానం నన్ను సతాయించ సాగింది.

"తోస్తావెందుకు దెయ్యంలా? సరిగా కూచో కదలకుండా. నీ మూలాన నాకు వూపిరి కూడా ఆడటములేదు" అంటుంది.

నేను అంటాను "నన్నెందుకు తోస్తున్నావు...ఓమహాతల్లీ-సరిగాకూచో. నా అంతట నేను యీ ప్రయాణానికై బయలుదేరలేదు. యీ దురుద్దేశాన్ని నాబుర్రలోకి వాస్కా ఎక్కించేడు తెలుసా?" కాని ఆమె నాయందు యే మాత్రము సానుభూతి చూపదల్చుకో లేదు.

సాయంత్రము అవవస్తూంది. ఇంజనునుంచి నిప్పు రవ్వలు వర్షపు చినుకుల్లా వస్తున్నాయి. చుట్టురా ఎక్కడ చూచినా సౌందర్యమే—ప్రకృతి అదీను. అయినా నాకేమో ప్రకృతిని చూచి ఆనందించేంత వుత్సాహముగ లేదు. నాకు కావలసినదల్లా పడుకు నేందుకు కాస్తస్థలమూ-నెత్తి మీదకు వక వెచ్చటి దుప్పటీను.

కాని పడుకు నేందుకు ఎక్కడా స్థలము లేదుగా? బెంచీలనిండా జనము ఆక్రమించుకుని వున్నారు.

అప్పుడు నేను ప్రయాణీకులతో అన్నాను.

"సోదరులారా! నాకు యీ మధ్య ఎక్కడయినా కూర్చు నేందుకు కొద్దిగా స్థలము యిప్పించండి. ఈ బెంచీ చివరగా నేనిట్లా కూర్చునివుంటే ఏ క్షణాన్నయినా పడి

పోవచ్చును. నేను మాస్కోకు వెళ్లుతున్నానని మీకూ తెలిసే వుంటుంది.”

“ఇక్కడవున్న వాళ్ళంతా మాస్కోకే వెడుతున్నారు. ఈ పెట్టెలోని ‘సీట్సు’ ఏమీ రిజర్వు చేయ బడలే” అంటారు వాళ్ళు.

అందుచేత అక్కడే కూర్చున్నా. రైలు బండి వెళ్ళి పోతోంది ముందుకు. ఇంకో మూడుమైళ్ళు మేము వెళ్ళి వుంటాము. యింతలోనే నా కుడికాలు తిమ్మిరెక్కి మొద్దు బారి పోసాగింది. లేచినిలబడ్డా. నిలబడేసరికి నా తలపైనే వున్న సామానుల బల్లపయి వక బుట్ట వుండటము అగుపించింది.

నేను అడిగేను “సోదరులారా యిదేమయినా బాగున్నదా? ఒక సామాన్యమయిన బుట్ట ఆ ఖాళీ బల్లనంతా ఆక్రమించుకోగా-యిక్కడ అంగుళ ప్రదేశములో సోదర మానవుడు కాళ్ళన్నీ తిమ్మిరెక్కి పోయేట్లు కూర్చొని బాధ పడటము న్యాయమేనా? ఎంత చెడ్డా మానవుడు వకవస్తువు వక బుట్టకంటె, ఎక్కువ ముఖ్యమా కాదా? ఆ బుట్టని తీస్తారా, తీయరా? ఎవరిదా బుట్ట?”

నా ప్రక్కనే కూర్చునివున్న ముసలమ్మ గర్జిస్తూ లేచి బుట్టను తీసుకొని కాళ్ళ దగ్గర పెట్టుకుంది. అంతటితో వూరుకోక అన్నదికదా “పిశాచాల్లాగు రాత్రయినా పగలయినా...వక్కళ్ళనీ సుఖంగా కూర్చోనివ్వరు కదా. ఎక్కు. బుట్టను తీసేనేను. ఎక్కెక్కి నిద్ర పోతుండగా తలకాయ పగిలేట్లు క్రిందపడితే బాగుండును-బుద్ధి వస్తుంది.”

మాట్లాడకుండా నేను పయికి ఎక్కేను.

ఇంకో మూడుమైళ్ళు రైలు వెళ్ళిందో లేదో నాకునిద్ర వచ్చేసింది.

అకస్మాత్తుగ ఏదో వచ్చి నా ప్రక్క ఎముకల్లో గట్టిగా పొడిచి నట్లువ్వగా, నేను తల క్రిందులయి క్రిందకు జారి పోయేను. నేను క్రిందకు తలక్రిందులుగా జారి పోతుండగా నిద్రమత్తులో “క్రిందకు పడిపోవడం అంటే ఎట్లా వుంటుందో” అని అనుకున్నా.

క్రిందకు జారిపోతూండగా తలకు, చేతులకు, కాళ్ళకు, నడుముకు ఏవేవో ఘన పదార్థాలు చాలా అడ్డు తగిలేయి. నేను పడుతుండగా నాకంటె ముందుగా నాకాళ్ళు రైలు పెట్టె క్రిందభాగాన్ని చేరుకొని, నన్ను కొంత వరకు దెబ్బ తగులకుండా కాపాడటము వక విధమయిన అదృష్టమేనని యిప్పుడనుకుంటున్నా.

నేలపయిన చలికిలపడి రెండుచేతులతోను తలను తడిమి చూచుకున్నాను. తల వుండవలసిన ప్రదేశములో నే వుంది.

కాని ఆ సమయానికే పెట్టెలోని ప్రయాణీకులంతా వులిక్కిపడి లేచి తమ సామానులను ఎవరో దొంగిలించుకు పోతారేమో యీ హడావడిలోనని ఖంగారు పడసాగేరు.

ఒక లాంతరుతో అరడజను రైల్వే మనుష్యులు వచ్చేరు. గడబిడ ఏమిటో చూదామని. టిక్కట్లు తనిఖీచేసే అతను అడిగేడు; “ఎవరు పడిపోయేరు?” అని.

“నేనే. సామానుల బల్లమీదనుంచి పడ్డాను.” ఇంకా చెప్పేను, “నేను మాస్కో వరకు వెడుతున్నా. వాడున్నాడే—మాస్కో వెధవ-వాడే నన్ని ప్రయాణానికి బలవంతము చేస్త!”

అక్కడేవున్న ఛీఫ్‌కండక్టరు చెప్పేడు “ప్రయాణీకులు యెప్పుడూ ‘బొలోగా’ వద్ద పడిపోతుంటారు. అకస్మాత్తుగ అనుకోకుండా ఆగుతుంది బండి అక్కడ. మామూలేయిది.”

“ఇటువంటి సమాచారము దెబ్బతినిన వాడికి ఆనందము కలుగజేసే విషయంకాదు. మీ గార్డులూ, మీరూ, ప్రయాణీకులను సామానులు పెట్టుకొనే బల్లలపయిన ఎందుకు పడుకోనిస్తారు? ఎవరయినా అట్లా ప్రయాణము చేస్తూంటే జబ్బపుచ్చుకొని వాడిని కిందకు ఎందుకు లాగియ్యకూడదు? లేక పోతే వాడికిఎందుకు నచ్చచెప్పకూడదూ మీరు. వాడు అక్కడనుంచి పడిపోతాడనయినా మీరు ముందుగా చెప్పవచ్చునుగా?” అన్నాను.

అప్పుడే వృద్ధ స్త్రీ అరవ సాగింది. “నీ తలకాయతో కొట్టి నా బుట్టను చితుకకొట్టేసేవు” అంటూ.

“బుట్ట ఎక్కువా? మనిషి ఎక్కువా? బుట్ట పోతే

తిరిగి కొనుక్కోవచ్చును. మనిషి తలకాయ పోతే క్రొత్త తలకాయ ఎక్కడనుంచీ వస్తుంది ?”


ఇంకో పావుగంట యీ విషయములు తర్జన భర్జన జరిగేక, వాళ్లు నా తలకొక గుడ్డపేలికను కట్టేరుగాని రైలును మాత్రము ఆపేరుకారు

ఆఖరుకు మాస్కో చేరేము నేను బయటపడి స్టేషనులో కూలబడ్డాను. కడుపునిండేటట్లుగ పైపులోని నీళ్ళుత్రాగేను. తర్వాత బయలుదేరే బండీలో ఎక్కికూచున్నా.

నా తలకాయ విషయం చెప్పాలంటే—దానిలోంచి ఏవేవో ధ్వనులు, రాగాలు, తాళాలు, వస్తున్నాయి. వీటికి తోడు విచిత్రమయిన ఆలోచనలు అనేకంకూడా బుర్రలో తిరుగుతున్నాయి.

“ఆహా ! ఈ క్షణములో గనుక వాస్కా నా కంటబడితే, వాడి పక్కలో విరుగకుండా ఎన్ని ఎముకలుంటాయో చూసి వుండేవాణ్ణి దరిద్రుడు-వాడే కారణము, యీ అర్థములేని ప్రయాణానికి.” అని ఆలోచించు కుంటూండగా లెనిన్‌గ్రాడు చేరుకున్నా. స్టేషనులోని పైపులోని నీళ్ళను కడుపునిండా త్రాగి, నీరసముతో తూలుకుంటూ యింటి దారి పట్టేను—వాస్కా అగుపిస్తే మొట్ట మొదట చేయవలసిన పని ఏమా అని ఆలోచిస్తూ

★



బొమ్మల పేర్పులో, కూర్పులో, ఇతర అలంకారాలలో ఎంతో ఊహ, కళ విశదమౌతాయి

బొమ్మల కొలువు.

దసరాలలో దేవీ నవరాత్రి ఉత్సవములకు బాలికలు, పుణ్యవతులు, బొమ్మల కొలువుల నట్టహాసంగా పెట్టి, వ్రతము పేరంటము, తొమ్మిది దినములు జరుపుకుందురు ఆంధ్ర దేశంలోనూ దక్షిణాదినికూడ, ఇది ముఖ్యమైన పండుగ

ఆంధ్ర దేశంలో దీపావళికికూడ బొమ్మలుపెట్టి, బాలికలు పిడతలు, పప్పు బెల్లములు, పండ్లు, తమ చెలికత్తెలకు పంచిపెట్టుదురు.

సంక్రాంతికి, ఆంధ్ర యువతులు బొమ్మల నోము నోయుదురు. అట్లతద్ది, శ్రావణ మాసపు నోములవలె, ఈ బొమ్మల నోముకూడ పుణ్యవతులాచరించవలసిన ముఖ్యవ్రతం.



చిత్రకళా విశారద శ్రీమతి రత్నాల కమలాబాయిగారు

ఈమె కీ॥ శే॥ ఆర్ అబ్బాయినాయుడుగారి పుత్రిక సంగీతమందును, చిత్రకళయందును, చిన్నతనమునుండి సహజాభిరుచిమెండు కర్ణాటక సంగీతములో మంచి ప్రావీణ్యత గడించి, శాంతి నికేతనములో వంగదేశ సంగీతము, చిత్రరచన మున్నగు లలిత కళలను చాలకాల మభ్యసించిరి మదరాసు చిత్రకళా ప్రదర్శనములో స్వర్ణపతకమును, యూనివర్సిటీలో ఫిడేల్ వాయిద్యమునందు మొదటి తరగతి యోగ్యతా పత్రమును పొందిరి 1939లో చిత్రకళా ప్రావీణ్యతకై శ్రీ కేసరిగారిచే స్వర్ణకంకణ బహూకరణను బడసిరి

ఈమె ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకులలో నొకరు గత దశాబ్దమునుండియు మహిళాసభ లలిత కళాశాఖ నిర్వహణ వీరిదే మిక్కుటమైన సేవాభిలాషతో, అపూర్వమైన కళాభిరుచితో, మహిళాసభ ప్రతి ప్రత్యేక కార్యక్రమములోనూ, దైనందిన కార్యకలాపములోనూ కూడ, అతిసహనంతో పాల్గొంటూ, అందచందములూ, కళాకాంతులూ, కలిగించేది వీరి హస్తమే

ఈ సంచికలో ముద్రించిన "సంధ్యారుణ శివతాండవము" ఆంధ్రమహిళకు వీరి కానుక

ఈమె సేవాపరాయణతకు అభినందిస్తూ, కృతజ్ఞత తెలుపుచున్నాము

ఆంధ్రమహిళ

ముఖచిత్రము-నర్తకి-శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖ్లేగారి కానుక వీరికి మా కృతజ్ఞత

ఆంధ్రమహిళ



శ్రీమతి చుండూరి రమాదేవిగారు
ఆంధ్రమహిళకు తమ గేయములను తరచు పంపుచుందురు.



శ్రీమతి అదుర్తి భాస్కరమ్మగారు
వీరి వ్యాసములు, కథలు, మా మహిళ మూలంగా చదువరులకు సుపరిచితములే.



శ్రీమతి బారు సరోజినీదేవిగారు—రచయిత్రి
పెద్దాపురమున శ్రీ కస్తూర్బా మహిళా పాఠశాలను స్థాపించి ఉచిత విద్య గఱుపుచున్నారు.




పశ్చిమ గోదావరి జిల్లా మహిళా సంఘ పట్టణ, జిల్లా సంయుక్త కార్యవర్గ సమావేశమునకు శ్రీ ముల్పూరి చుక్కమ్మగారు అధ్యక్షత వహించిరి. సమావేశమున వివిధ విషయములను గూర్చి చర్చించి తీర్మానించబడెను.

*　　　*　　　*


హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ చట్టం భారత స్త్రీలకు అత్యవసరము కాబట్టి, వెంటనే శాసనము చేయవలసినదిగా పశ్చిమ గోదావరి జిల్లా మహిళాసంఘము వారు ప్రధాని నెహ్రూకు, రాష్ట్రపతిగారికి, మద్రాసు ప్రధానికి తంతులు పంపిరి.

*　　　*　　　*

మా చిన్న రచయిత్రిలు.



ఆర్. లక్ష్మి.



జి. ప్రభ.



1949-50, ఆంధ్రమహిళాసభ కళాశాల—నర్సింగ్‌హోమ్ సహాయార్థం, జనవరి 28 వ తేదీని
చాచా ప్రదర్శనమును జయప్రదముగా జరిపించిరి

ALL BLOCKS BY KLEIN AND PEYERL.



U S I S

66 ఏండ్ల అమెరికన్ అధ్యక్షుడు భార్య కుమార్తెలతో

12-4-1950కి ట్రూమన్ అధ్యక్షత వహించి 6 వ సంవత్సరము ప్రారంభమైనది. ఇంత వృద్ధుడయ్యీ పరిపూర్ణ ఆరోగ్యవంతుడై తన కార్యభారాన్ని అత్యంత సామర్థ్యముతో నిర్వహిస్తున్నాడనటం నిర్వివాదాంశం.

ఏటమ్ బాంబుతో రెండవ ప్రపంచ యుద్ధాన్ని అంతమొందించాడు—

మరి హైడ్రోజన్ బాంబుతో—ప్రపంచాన్నే అంతమొందిస్తాడో! పరిపూర్ణ శాంతినే స్థాపిస్తాడో!!



P I B

భారతీయ నౌకాదళ ప్రధాన శాఖాధికారియైన వైస్ ఎడ్మిరల్ పారీగారి సతీమణి లేడీ పారీగారు

బెంగుళూరులో ఇటీవల క్రొత్తగా స్థాపితమైన ఫ్యామిలీ వెల్‌ఫేర్ కేంద్రమును ప్రారంభించునప్పటి దృశ్యము

సైనిక దళ ఉద్యోగుల కుటుంబముల కొరకై సైనికదళ స్థానములలో ఇట్టి రక్షణ కేంద్రములు స్థాపితమవుతున్నవి



P I B

శ్రీమతి పంత్ సతి జింజియా (తూర్పు ఆఫ్రికాలో) భారత మహిళా సంఘపు నూతన భవనమును ఆవిష్కరించినప్పటి దృశ్యము

ఈమె తూర్పు ఆఫ్రికాలో భారతీయ కమిషనర్‌గా నున్న ఏ బి పంత్‌గారి సతీమణి

పిల్లల శిక్షణ శాస్త్రీయ దృక్పథం

శ్రీమతి దరిసి సుభద్రమ్మ

శిశు మనోవిజ్ఞానము

వికాస దశలు —

మనుజుని జీవితంలో బాల్యదశ ప్రధానమయినది అమోఘమైనది ఈ దశలోనే మానవుని మహోత్కృష్ట సాధనమైన 'బుద్ధి తత్వము' (తెలివి) రూపొందుతుంది బుద్ధి మాత్రమే గాదు. మానసిక సంబంధమైన సర్వ శక్తులు నిర్మిత మవుతున్నాయి

బాల్యదశలో రెండు ఉపదశలున్నాయి మొదటిది— శిశు జననకాలం నుండి 3 ఏళ్లవరకు రెండవది—3 ఏళ్ళ నుండి 6 ఏళ్ళవరకు

మానవుని జీవితంలో బాల్యదశయే ప్రధానమైతే అంత కన్న ప్రధానమైనది ప్రథమ ఉపదశ ఈ మొట్టమొదటి ఉపదశలోనే బిడ్డ తన మానవ వ్యక్తిత్వమునకు పునాది వేసుకొని, మానవ సహజ శక్తులన్నిటిని నిర్మించుకుంటుంది అనగా, బుద్ధితత్వము, మానసిక శక్తులయొక్క నిర్మాణానికి, వికాసమునకూ, అత్యంత చురుకుదనంతో అవిరామమైన కృషిని సల్పుతుంది అందువలననే, ప్రథమ ఉపదశ అత్యంత ప్రధానం, అసమానం, అని ఆధునిక మనస్తత్వవేత్తలు వెల్లడించారు

బిడ్డ పుట్టినప్పుడు ఏడ్పుతప్ప మరేవిధమైన చలనములు అంతగా కానరావు కాళ్లు చేతులాడించటం, ఊపిరి పీల్చటం సహితం చేతకానంత అసహాయ స్థితిలో (బహు కొద్ది కాలం) ఉన్నట్టు గోచరిస్తుంది శూన్యంనుండి బయలుదేరి నట్టుగా బయలుదేరి ఏడాది నిండేటప్పటికి, పరిసరముల పరిచయము, పరిజ్ఞానము—(చేతనాచేతన స్వరూపములను గురించి అనగా, ఇంటా బయిటా వున్న వివిధ వస్తువులు, చెట్లు ఆకులు, కుక్క, పిల్లి, పశువు, పక్షి మున్నగునవి)— బంధుజనముల పరిచయ ప్రేమల నవగతం చేసుకొనే శక్తి, ఎంతో అద్భుతంగా అభివృద్ధి చెందుతాయి

అయితే బిడ్డ శూన్యంనుండి బయలుదేరలేదనీ, అసలు అది అమ్మకడుపుననున్న కాలంలోనే దానికి మానసిక జీవిత మనేదివుందనీ గెసెల్, మాంటిసోరి మున్నగు సుప్రసిద్ధ శిశు మనస్తత్వవేత్తలు ఎంతో కాలం పరిశోధించిన ఫలితంగా, నిశ్చితాభిప్రాయమునకు వచ్చారు అయితే శిశువు తల్లి



శ్రీమతి దరిసి సుభద్రమ్మ

గర్భంలోనున్నప్పుడుకాని, జననకాలానికి కాని దానికి 'మానసిక శక్తులు' వున్నవని కాదు—అనగా, కొంతబుద్ధి జ్ఞాపక శక్తి, సంకల్పశక్తి మున్నగునవి ఉన్నవనికాదు. వీటి కన్నిటికీ ఆధారభూతమైనట్టి ఒక విధమైన మానసికతత్వం అంకుర ప్రాయంగా వున్నదని భావం అది నివురుగప్పిన నిప్పులాగు శిశు హృదయంలో దాగివుండి, పుట్టిన కొన్ని ఘడియల నుండియే బాహ్యపరిసర పరిస్థితుల సంసర్గంచే ప్రజ్వలిస్తుంది ప్రజ్వలితమైన ఈ జ్యోతివలననే, బుద్ధిని, మానసిక శక్తులను

వనితా విజ్ఞానము

బిడ్డ స్వయం కృషిచేత సృష్టించుకొని వికసింప చేసుకొంటుం దని ఆధునిక శాస్త్రజ్ఞుల యభిప్రాయము,

శిశువు, పుట్టిన కొన్ని ఘడియలనుండియే తన మానసిక శక్తులను సృజించు కొనుటకేవిధంగా కృషిచేస్తుందో పరికించుదాము.

అంత పసిపాపలో, బుద్ధినీ, మానసికశక్తులనూ సృజించు కొనునట్టి మహత్తరమైన శక్తిని "గ్రహణ శీల మనస్తత్వం" అని సుప్రసిద్ధ శిశు మానసిక శాస్త్రజ్ఞురాలు డాక్టరు మాంటిసోరి పేర్కొన్నది. దీని మూలకంగానే శిశువు జనించిన కొన్ని ఘడియల నుండియే బుద్ధినీ, మానసిక శక్తులను నిర్మించుకోటానికి అతిచురుకుగా అవిచ్ఛిన్నమైన కృషి సల్పుటకు ప్రారంభిస్తుంది అయితే ఈ నిర్మాణ కార్య కలాపం స్పష్టచైతన్యంతో జరగదు: (ఎఱుకతో) అస్పష్ట చైతన్యంతో కొనసాగించుతుంది

శిశువు తన 'గ్రహణశీల మనస్తత్వ' మూలకంగా పరిసర స్వరూపములను, పరిస్థితులను జ్ఞానేంద్రియముల ద్వారా— (అనగా, చక్షురింద్రియము, శ్రవణేంద్రియము, ఘ్రాణేంద్రియము, స్పర్శేంద్రియము, రసనేంద్రియము) వీటిలో మొదట కొన్నిటిద్వార, తరువాత తక్కిన వాటి ద్వార ఆకర్షించుకొని తనలో లీనం చేసుకొంటుంది. తదనుసారంగా మనస్సు పరివర్తన మొందుతూ పోతుంది అన్నిటినీ ఒకేమారు ఆకర్షించుకోదు. అనుక్షణం తన శక్తులను నిర్మించు కొనుచున్న శిశువు తనకెప్పుడెంత అవసరమో అంత మాత్రమే ఆకర్షించు కొంటుంది ఏవి అవసరమో వాటినిమాత్రమే పరిగ్రహించు కొంటుంది. పరిసర స్వరూపములు పరిస్థితులను ఆకర్షించు కొనటంలో ఎంతఅవసరం, ఏవిఅవసరం, అను విషయాన్ని నిర్ణయించుకొనే శక్తి శిశువులోనే అంతర్గతంగా వున్నది. ఏలాగంటే—

శిశు హృదయంలో, ఒక విధమైన ఇంద్రియబోధ లేక ఇంద్రియగోచరత అనేది వున్నది అది అప్పుడప్పుడు పరిసరము, సంసర్గమువలన, జ్యోతిలాగు వెలుగుతుంది బిడ్డ హృదయం ఆవేశ పూరితమైపోతుంది దీనిని అతి తీవ్రమైన తృష్ణతో పోల్చవచ్చును. కాబట్టి, దీనిని 'జ్ఞానతృష్ణ' అని పేర్కొందాము. ఈ విధమైన జ్ఞానతృష్ణ కలుగుతుండగానే బిడ్డ అత్యంత ఉద్వేగంతో జ్ఞానేంద్రియము ద్వారా పరిసర సిపరిస్థితులను తన సృష్టికార్యమునకు అవసరమైనవాటి ఆకర్షించుకొని తన తృష్ణను తృప్తిపరచుకొంటుంది. అనగా, మొదట తృష్ణకలగటం, దాని ప్రేరణ ద్వారా పరిసరస్వరూపమును ఆకర్షించుకోటం, వాటిలో తనులీనమై పోవటం, లేక మనస్సు ఆ స్వరూపంలాగు పరివర్తన చెందటం ఈ రెండుకార్యముల సమ్మేళన ఫలితంగా దాని బుద్ధీ, మానసిక శక్తులు నిర్మితమవుతాయి.

ఈ విధంగా "ఇంద్రియ బోధ" (లేక ఇంద్రియ గోచరత) అనేది బిడ్డ మానసిక శక్తులన్నీ నిర్మాణమయ్యేదాక అప్పుడప్పుడు ఉద్భవించుతుంది. ఆ విధంగా కలిగే దశకే సూక్ష్మ గ్రాహ్య కాలమంటారు ఈ దశలలోనే, క్రమక్రమంగా బిడ్డ తన బుద్ధినీ, తక్కిన మానసిక శక్తులను సృష్టించు కొంటుంది. ఈ విధమైన మనస్తత్వం పెద్దవాళ్లకుండదు. ఈ గ్రహణ శీల మనస్తత్వమునకున్న శక్తి, అమోఘం, అసమానం. ఇట్టి శక్తిచేతనే బిడ్డ తన యావజ్జీవితమును సృష్టించు కొంటుంది. అనగా శారీరకంగా, ప్రతిచలనమునూ, మానసికంగా మానవ సహజ శక్తులను నిర్మించుకొంటుందన్నమాట. వీటి నన్నిటిని ఆహ్లాదంగా ఆడుకొంటూ, అవ్యక్త చైతన్యంతో అనుక్షణం నిర్మించుకుంటూ పోతుంది.

శిశువు తల్లి గర్భంనుండి బాహ్య ప్రపంచంలో ప్రవేశించటం, కొంతకాలం తల్లిమీద అనుక్షణం ఆధారపడి వుండటము, క్రమక్రమంగా ప్రాకటం, దోగాడటం, నడవటం, స్వేచ్ఛగా అటునిటు తిరగటం, చుట్టిరావటం, చేతులనుపయోగించి ఏవోపనులు చేసుకోటం, చక్కనిభాష నలవరచుకోటం, పిన్న పెద్దల చెలిమి సంపాదించుకోటం, ఆనందంగా ఆడుకోటం, ఇవన్నీ బిడ్డకు వినోదక్రీడలే! ఈ విధమైన క్రీడల మూలకంగా తన మానసికశక్తులను, బుద్ధినీ నిర్మించుకోటం అనేది ఎంత అబ్బురమైన విషయం!

బిడ్డ పుట్టిన కొన్ని ఘడియలకే కదలటం, ఏడ్వటం, ఊపిరిని పీల్చటం మున్నగు చలనములు కలుగుతవి అవి ప్రారంభమయినపుడే, బిడ్డలోనున్న గ్రహణశీల మనస్తత్వం

(తరువాయి 69వ పేజీలో)

మదరాసు రాష్ట్రం, ఆర్థికాభివృద్ధి

— ఆత్మకూరి గోవిందాచార్యులు, ఎమ్ ఎల్ సి —

మన మదరాసు రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి దిన దిన ప్రవర్ధమానమగుచున్నదా? రాష్ట్ర మొత్తంమీద ప్రజల ఆర్థికాభివృద్ధి గ్రహింపవలెనన్న ప్రభుత్వార్థికము నొకమారు సింహావలోకనం చేయుట ప్రథమ విధి.

ప్రజల పన్నుల మూలకంగా, మదరాసు ప్రభుత్వమునకు సాలు సరి వచ్చుచున్న సొమ్మును ఈ పట్టికవలన గ్రహింపగలము —

సంవత్సరాలు	లక్షల రూపాయలు
1937—38	16,00—62
1938—39	16,13—45
1939—40	16,65—90
1940—41	18,07—51
1941—42	19,54—82
1942—43	21,92—19
1943—44	29,84—20
1944—45	41,23—73
1945—46	47,98—89
1946—47	56,99—53
1947—48	50,71—10
1948—49	53,33—52
1949—50	56,91—30
1950—51	55,21—25 అంచనా,

(ఆదాయ వ్యయశాసనములనుండి)

ఈ అంకెల ననుసరించి క్రమక్రమంగా, ప్రతిసాలున, ప్రజలనుండి ప్రభుత్వ మధికంగా సొమ్ము వసూలు చేసినట్లు తేలుచున్నది గత 13 సంవత్సరాలలోను (అనగా 1937 నుండి 1950 వరకు) 16 కోట్లనుండి, ప్రభుత్వాదాయము 56 కోట్లవరకు పెరిగినది. పన్నుల మూలకంగా ప్రజలు రూపాయకు మూడున్నర రూపాయలధికంగా యిచ్చుచున్నారు మూడున్నర రెట్లన్నమాట —

ఈ విధముగా రాష్ట్ర ప్రభుత్వమునకే కాక, అపరోక్షముగ, కేంద్ర ప్రభుత్వమునకుకూడ, ప్రజలు పన్నుల నిచ్చుచున్నారు ఈ పన్నులు ఆ యేటికాయేడు వృద్ధియేయైనవి. ఇవికూడ మదింపువేయుచో, ప్రజలు, మరింత హెచ్చుగా పన్నుల నిచ్చుచున్నట్లు తేలును. ఇట్లు ప్రతి సాలున హెచ్చుచూ వచ్చిన, యీ పన్నులను ప్రజలెట్లు భరించుచున్నారు? పన్నులు హెచ్చినట్లే ప్రజల ఆదాయముకూడ హెచ్చినదా?

జాతీయాదాయము - అసలురాబడి 1938-39—1948-49

రాష్ట్రములు	జాతీయాదాయం		జాతీయాదాయము అసలురాబడి 1949—50	1938—39 లో పోల్చిన 100 కి 1949 - 50 లో అసలురాబడి ఎంత తగ్గినది? లేక ఎంత హెచ్చినది?
	1938 39 కోట్లు రు లు	1949—50 కోట్లు రు లు		
మదరాసు	369 5	1370.4	364.3	—1 41
బొంబాయి	235 8	807.1	227.8	—3 39
మధ్యరాష్ట్రములు	140 0	558.8	148.5	+6.07
సంయుక్తరాష్ట్రములు	318 4	1245 7	331.1	+3 99
బీహారు	147 3	581 3	154 5	+4 89
అస్సాము	62 1	249 3	66 3	+6.76
ఒరిస్సా	55.9	212 9	56 6	+1.25
తూర్పు పంజాబు	66 6	257.5	68.5	+2 85
పడమర వంగం	86 8	324.5	86 3	—0 58
ప్రభుత్వం	1482 4	5657 5	1503.9	+1 45

(From Madras Finances 1949—50)

మదరాసు రాష్ట్రం, ఆర్థికాభివృద్ధి

ఈ అంకెల ననుసరించి, ఏమి తేలుచున్నది? భారతవర్షము నేకదృష్టితో జూచిన 1 45 కోట్ల రూపాయల ఆదాయము పెరిగినది ఈ పెరుగుదలలో, మదరాసు, బొంబాయి, వంగ రాష్ట్రములకు భాగమేమియు లేదు తదితర రాష్ట్రములలో జాతీయాదాయము వృద్ధికాగా, మదరాసు రాష్ట్రమున జాతీయాదాయము తగ్గినది. (1 41 నూటికి) ఆదాయము తగ్గినను, గత పదియేండ్లలోను పన్నులు హెచ్చినవి ఈ స్థితినే, మరొకవిధంగా, యీ దిగువ పట్టికవల్ల గ్రహింపగలము

తల 1-కి అసలురాబడి 1938-39-లో—1949-50-లో

తగ్గుదలా ? హెచ్చుదలా ?

రాష్ట్రములు	తల 1 కి రాబడి 1938—39 రు	అ	పై	1949—59 రు	అ	పై	తల 1-కి అసలురాబడి రు	అ.	పై	1938 39 లో పోల్చిన 49 50 సంవత్సరమున తల 1 కి 100కి ఎంతసరి అసలురాబడి తగ్గినది లేక-హెచ్చినది ?
మదరాసు	77	5	11	254	8	1	67	10	5	—12 56
బొంబాయి	115	4	1	369	4	9	98	2	8	—14 83
మధ్యరాష్ట్రాలు	84	15	5	306	14	11	81	9	5	—3 96
సంయుక్త రాష్ట్రాలు	59	0	9	209	1	3	55	9	3	—5 88
బీహారు	41	5	9	147	11	6	39	4	3	—5 06
ఒరిస్సా	65	5	7	224	12	3	59	11	11	—8 58
తూర్పు పంజాబు	70	13	0	221	15	9	59	4	4	—16.30
ప॥ వంగము	50	4	9	153	1	8	40	11	2	—19 08
భరత దేశం	67	8	10	228	10	0	60	12	0	—11 10

(From Madras Finances 1949—50

ఈ అంకెలవల్ల భారత ప్రభుత్వ మొత్తమున, దేశమందెల్లయెడల గల జనాభా ననుసరించి తల 1కి సగటు యాదాయము గత పది సంవత్సరములకంటె నేడు క్షీణించినది. అన్ని రాష్ట్రములలోను క్షీణదశయే మన మదరాసు రాష్ట్రములో, జాతీయాదాయమే క్షీణించినపుడు తల 1కి సగటాదాయము క్షీణించుటలో ఆశ్చర్యము లేదు ఆర్థిక దుస్థితి దినదిన ప్రవర్ధమానమగు చున్నది

ఈ దుర్భరార్థిక దుస్థితియే, మరొక విధముగగూడ, ప్రస్ఫుటు మగుచున్నది

మన రాష్ట్రమున ప్రజలు 100కి 75 వంతులమంది, వ్యవసాయి పరిశ్రమపై ఆధారపడువారు ఈ రైతుల రుణ సమస్యను సింహావలోకన మొనరింపదగును.

మామూలుగ, రైతులు (1) షావుకార్లనుండి, (2) సహకార పరపతి సంఘములనుండి, (3) భూమి తణకా బ్యాంకులనుండి, అప్పులను తీసుకొనుచున్నారు.

షావుకార్లనుండి తీసికొనుచున్న అప్పుల వయనం మనకు లభింపదు లభింపకున్నను, షావుకార్లు (100 కి రు. 1 వంతున), వడ్డీ పుచ్చుకొనుచు అప్పుల నిచ్చుచునే

మదరాసు రాష్ట్రం ఆర్థికాభివృద్ధి

యున్నారు దీని ననుసరించి, షాహుకార్ల పెట్టుబడి, అప్పుల రూపముగ హెచ్చుచున్నదనియే తలంపనగును అయినను, షావుకార్ల పెట్టుబడి ఋణరూపముగ లేదనియే వాత సౌకర్యమునకు తలంతుము ఇక సహకార పరపతి సంఘముల ఋణములు హెచ్చినవా? తగ్గినవా? అను విషయం యోచింపదగును

మదరాసు సెంట్రలు లాండు మార్టిగేజు బ్యాంకు 1938-39లో 58 53 లక్షల రూపాయల ఋణ మొసంగినది 1947-48లో 61 58 లక్ష లొసంగినది దీని, అనుచర సంస్థలగు ప్రయిమరీ సొసయిటీలుకూడా, 1938-39లో 54 43 లక్షలు 1947-48లో 62 33 లక్షలు ఋణ మొసంగినవి ఈ అంకెల ననుసరించి, గత పది సంవత్సరములలోను, రైతుల ఋణము పెరిగినట్లు తేలుచున్నది ఇట్లే సహకార పరపతి సంఘము లొసంగిన ఋణమును పరిశీలించినను, రైతుల ఋణము పెరిగినట్లే తేలుచున్నది

మదరాసు సెంట్రలు కో ఆపరేటీవు బ్యాంకు యిచ్చిన అప్పులు గత దశలో 88 24 లక్షలనుండి 453 31 లక్షలకు పెరిగినది నాలుగున్నర రెట్లు ఒక్క సహకార సంఘపు ఋణమే పెరిగినది

(1) ఆదాయము తగ్గినది

(2) ఋణము హెచ్చినది

(3) పన్నులు హెచ్చినవి

ఈ విషయములు మూడును, పై అంకెల ననుసరించి రుజువైనది. అనగా, మదరాసు రాష్ట్రమున మన ఆర్థికాభివృద్ధి అధోగమనమునందున్నది ఇది శోచనీయము

★

(66వ పేజీ తరువాయి)

పరిసర పరిస్థితులను ఆకర్షించుకోటం ప్రారంభ మవుతుంది. ఈ మనస్తత్వమునకు సంబంధించిన సూక్ష్మ గ్రాహ్య దశలు ప్రారంభ మవుతవి. ఈ దశలలోనే బిడ్డ తన బుద్ధితత్వము నిర్మించుకోటానికి అత్యంత అద్భుతంగా ప్రవర్తిస్తుంది. పరిసరముల నన్వేషించుటలో, వివిధచెట్లు, చేమలు, పువ్వులు, పశుపక్షి మృగాదులు, వివిధ వస్తువులు వున్నప్పటికీ, ఆ ప్రత్యేక సూక్ష్మగ్రాహ్య దశలో అవి అవసరం లేనియెడల ఎవరెంత నిర్బంధించినను బిడ్డ దృష్టి వాటివైపుకు ఆకర్షింపబడదు తన సృష్టి కార్యమునకు అవసరమయితే, నేలమీద ప్రాకు అత్యల్ప ప్రాణులగు చీమలు, క్రిమి కీటకాదులు, పువ్వు, ఆకు, అతి సూక్ష్మమైన ఇసుక రేణువు మున్నగులు, పదార్థాలు బిడ్డదృష్టి నాకర్షిస్తాయి అనగా ఆలాంటి అతి సూక్ష్మ వస్తువులను ఆకర్షించుకోటానికి ప్రత్యేకమైన సూక్ష్మ గ్రాహ్యాదశ ఆవిర్భవించినదను విషయం తేటతెల్లం

[శ్రీమతి దరిశి సుభద్రమ్మగారు వనితా విజ్ఞానమును గూర్చి, ప్రతి సంచికలోను వ్యాసములు ప్రచురించుచున్నారు ఈ శీర్షికలో ఇది 13-వది]

★



USIS

ఆధునిక శిశు మనస్తత్వ ప్రవీణులు శిశువుయొక్క ఆరోగ్యము ఎంత ముఖ్యమో, శిశువులో, సామాజిక వ్యక్తిత్వమును పెంపొందించుటకూడ అంత యవసరమని గ్రహించి దానికి తగిన శాస్త్రజ్ఞానమును, సహకారమును ప్రతి గృహిణికి, వార్తా పత్రికలద్వారా, పుస్తకములద్వారా ఉపన్యాసములద్వారా అందించుచున్నారు

ప్రతి తల్లియు, ప్రత్యేకమైన శ్రద్ధతో శిశువుల్లను సామాజిక వ్యక్తులుగా జేయుటకై అవకాశములను కల్పింతురు పై చిత్రములో తల్లి తన బిడ్డలను దాదికి ఒప్పగింపక, స్వయముగా ఓర్పుతో తానే వాహ్యాళికి తీసికొని వెళ్లుట గమనింపదగును

ఒకవరలో

* శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ *

ఒకవరలో రెండుకత్తులు ఇముడవు అన్న సామెత ఆడవారి పక్షాన అవుపిస్తూవుంది సామెత లసలు సార్వజనీనంగానే ఉంటూవుంటాయి అయినా—కొన్ని వారికీ వీరికీ ప్రత్యేకం కావడం కద్దు ఇవి మత సంబధంగానూ, జాతి సంబంధంగానూ కూడా వున్నాయి

సామెత సంక్షిప్త వాక్యమే గాని—దాని భావార్థమేమి, అవయవార్థమేమి విపుల వివరణ



శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ

సంపుటీకరణ బృహద్గ్రంథ మనడంలో సందేహమేమీ లేదు కాని ప్రతి సామెతా అలాంటిది కాదు

దానికి సాహిత్యంలో ఒక చక్కని సోదాహరణ స్థానమే కాకుండా కళాస్థానం ఉందనడం ఉత్తమం జాతీయ ప్రతిబింబం సామెత దీన్ని కీలెరిగి వాడినచో రసతన్మయత్వం కలుగుతుంది

సమయ స్ఫురణమూ తార్కాణమూగాని సామెత సరస స్ఫోరకముగాక విరస స్ఫోరకమై పోతుంది వీటిలోని సాంప్రదాయార్థములు గుర్తెరుగని వారు కష్ట నష్టాలకులోను కావడంతప్పదు కష్ట నష్టాలకు కారణం వాక్యగతార్థం అవగతం చేసుకోలేక పోవడమే వాక్యగతార్థ మెరిగిన వారికి ఆత్మ సుఖం అంతలోనే వుంటుంది ఇలాంటి సందర్భాల్ని మహా మహులు కూడా గుర్తించడం లేదు

రసవత్తర సాహితీ పదాలు చాలా మట్టుకు కాల క్రమాగత భావార్థాలు అలాంటివి బుద్ధిమదగ్రులకు ఒకానొప్పుడు వ్యగ్రా వ్యగ్రతలను కలిగిస్తూ వుంటాయి

కాగా—

పై సామెత—ఒక మగవానికి ఇద్దరుపెళ్లాలు ఉండడం ప్రమాద జనితమనే సందర్భంలో వాడుతూ వుంటారు దీన్ని లకించుకుని అనగా ఈ అర్థాన్నే గ్రహించుకుని స్త్రీలు—కయ్యాలకు కాలు దువ్వడం—'ఇక పొసగదు—తుద నెగ్గదు' అనుకుంటూ నిరంతరాగ్ని హోత్ర ధూమావృతంగా మెలగడం—తద్వారాసంసార విచ్ఛిత్తికి కారకులవుతూ వుండడం మనం తరచు కంటూ వింటూవున్న సంగతే.

(తరువాయి 72వ పేజీలో)

వయోజన విద్య :: ::

విద్యావతుల కర్తవ్యం....

శ్రీమతి డి రాజేశ్వరీ పట్నాయక్

మన దేశంలో స్త్రీలలో చదువుకొన్నవారు నూటికి నలుగురు అందులోను 3½ మందికి సామాన్య అక్షరజ్ఞానమే! పోతే ఇక ఆ అర్ధభాగం కొంచెం ఉన్నత విద్య చదివివుంటారు, తత్ఫలితంగా తమ విజ్ఞానాన్ని ఉద్యోగకాంక్షతో బలీకృత మొనర్చుకుంటారు నేడు యెన్నో స్త్రీ సంఘాలు నెలకొల్పబడుతున్నాయి అవి శుభదాయకములే కావచ్చును, గాని స్త్రీ పురోగమన మునకై ఉపన్యాసాల కంఠశోష తప్ప ఆచరణలో చూపే ఉత్సాహశక్తి నేటి విద్యావతులలో కలుగకపోవుట శోచనీయం! మహిళాభ్యుదయానికై పాటుపడినవారిని విద్యావతులై సేవా సంస్థలలో కృషి చేసినవారిని, దేశం మొత్తంలో వ్రేళ్లమీద లెక్కించవలసిందే! ఉదాహరణకు మన ఆంధ్ర మహిళాసభవంటి ఏ ఒకటి, రెండు సంస్థలలో తప్ప ఉన్నత విద్య బడసిన సోదరీమణులు ఉద్యోగకాంక్ష లేక మహిళా సంస్థల పురోభివృద్ధికి సహాయ సానుభూతుల నందిజేయటం అరుదు

దీనికి కారణమేమిటి? ఎక్కడ వున్నది ఈ ఇబ్బంది అని ప్రశ్నించుకొంటే ప్రధాన కారణం విద్యావతిలోనే యున్నది డిగ్రీధారిణులైన స్త్రీలకు అక్షరజ్ఞాన మెరుగని తమ సోదరీమణుల నుద్ధరించాలనే కాంక్షవుంటే మనకు యింకా యెన్నో ఆదర్శవంతములైన స్త్రీ సంస్థలు వెలసి యుండేవి కాని ఉన్నత విద్య బడసిన సోదరీమణులకు వయోజన విజ్ఞాన వ్యాప్తియందు అంత తహ తహ వున్నట్లు కనుపించదు. అట్లు వున్న పక్షంలో స్త్రీలలోకంలో ఈ పాటికి మనకు ఎంతో మెలకువకలిగి యుండెడిది. ఈనాటి స్త్రీ సంఘాలు స్త్రీల విజ్ఞాన వాంఛను పూర్తిగ గమనించుట లేదని అనటానికి వీలులేదు ఆంధ్ర మహిళాసభను స్థాపించిన శ్రీమతి దుర్గాబాయిగారివంటి విదూషీమణుల హయాములో స్త్రీ జనోపయుక్తములగు గృహ పరిశ్రమలు, గాన కళ మొదలు విశ్వ విద్యాలయ పరీక్షలవరకు ధృఢ ప్రతిజ్ఞతతో, అకుంఠిత దీక్షతో, శిక్షణ జరుగుతూనే వుంది అట్టి సంస్థల నాదర్శంగా తీసుకొని నేటి విద్యావతులు ప్రయత్నించిన స్త్రీల విజ్ఞానధారుధ్యానికి కొంతయైన అవకాశం వుండెడిదేమో! సామాన్య అక్షరజ్ఞానం వుండేవారికి అసలే విశాల దృష్టిలేదు. వుండటానికి అవకాశంకూడా లేదు విశ్వ విద్యా



శ్రీమతి డి రాజేశ్వరీ పట్నాయక్

లయ పట్టభద్రులలోగూడ తమవరకే విద్యాపరిధులను యేర్పరచుకొనే నిర్లక్ష్య దృష్టి నిలచివున్నంతవరకు మన స్త్రీజాతి నడువ వలసినంత వేగంగా ఉన్నత పథాల్లో నడువలేదు విద్యావతియగు స్త్రీ దృష్టే సంకుచితంగా వుంటే అజ్ఞానావస్థలో వేలకొలదిగనున్న తోడి సోదరీమణుల భవిష్యత్తును తీర్చి దిద్దటానికి యెవరు పూనుకుంటారు? ఉన్నత విద్యలందిన స్త్రీ కేవలం తన ఆదర్శం ఉద్యోగానికనేభావం విడనాడి వీలైనంతవరకు సంస్థలద్వారా తన విజ్ఞానమును తోడి సోదరీమణుల ఉన్నతికై ప్రసరింపజేయాలి ఒక సంస్థ నిర్వహించడమంటే వ్యక్తిగతంగా సాగుతుందా? ప్రజలయొక్క ఆశక్తి చొరవా లేని ఏ సంస్థ

వయోజనవిద్య, విద్యావతుల కర్తవ్యం

అయినా జయప్రదమవుతుందా ? ఆచరణలోనికి వస్తుందా ? అనే ఆలోచనాదృష్టితో జూస్తే ప్రస్తుతం అక్కడక్కడ వెలసియున్న స్త్రీ సంఘాల ఉపన్యాసాలూ, వేసే ప్లానులు కంఠశోషలుగానే యెందుకుంటున్నాయో అర్థమవుతుంది నేటి స్త్రీ సమాజాలను పరికిస్తే, అధ్యక్షురాలి గౌరవ పరిచయం, కార్యదర్శిని తొలిపలుకులు, ఒకరిద్దరి ఉపన్యాసకుతాండ్ర (ఉపన్యాస మివ్వగలిగామని) ఒక విధమైన సంతృప్తి—"కార్యదర్శిని మాట తప్పలేక వచ్చాం గాని లేక పోతే యెందుకొస్తాం ?" అనే ప్రేక్షక నారీలోకం నిస్పృహాల మధ్య శ్రీమంతురాండ్ర కరస్పర్శాహ్లాదములచే జనించే కోలాహాలాలతో సభ సమాప్తి ఇవే నేటి స్త్రీ యభ్యున్నతిని కాంక్షించే సమావేశాలు ! యిలా వ్రాయడంలో శ్రీమంతురాండ్రను హేళన చేయడంగాని సంస్థల నసహ్యించుకోవడంగాని కాదు

మానవ హృదయమే ఒక విజ్ఞాన నిలయం మాటల కందని అద్భుతశక్తి మానవ హృదయాల్లో విద్యాజ్యోతి ప్రకాశమాన మొనర్పడానికే పాఠశాలల వయోజనవిద్యా సంఘాల ఆవశ్యకత. ముఖ్యంగా మన స్త్రీలలో స్వర్ణాభరణాల మీద వున్నంత ఆసక్తి విద్యోపార్జనపై లేకుండుటచే కేవలం అసహాయులై అల్లాడు చున్నారు విద్య లేక పోయినా ఫరవాలేదుగాని ఆభరణాలు లేక పోతే మాత్రం అది తమకు చిన్నతనమని భావిస్తారు అట్టి స్త్రీల అజ్ఞానావస్థనుండి రక్షించి సుహృద్భావముతో బీదా, గొప్పా తారతమ్యాన్ని పాటింపక సమదృష్టిని చూపి విజ్ఞానకాంక్షను పురికొల్పి ఆమెలో మార్పు గలిగించే ఔదార్యం విద్యావతులకు సంఘ నిర్వాహకుల కర్తవ్యమై యున్నది స్త్రీ సమాజాలు ఈ చిన్న విషయాలను గుర్తించాలి "నేటిసంస్థలో ధనవంతులకే సంఘంలో ప్రాముఖ్యత బీద స్త్రీల నాదరించే దృష్టేలేదు సమాజాశయాలు గంభీరంగా వున్నా ఆచరణలో లోపం ! అటువంటి సంస్థల్లో ప్రజాహృదయాల విలువంటూ వుంటే వాటి ప్రభావం ఆ సంఘవ్యవస్థకోసం పాటుపడే వాళ్ళ మీద వుండకపోవటం 'చిత్రాల్లో' అతి విచిత్రమైన సంగతి ! విజ్ఞాన ప్రభావాలను రేకెత్తించే ఏ ఆశయాలకైనా సంస్థల ద్వారా ప్రచారం, ప్రభావం లేదని నేను చెప్పడం లేదు. విజ్ఞానం గురించి మనం ఎంతలౌకిక దృష్టితో చూచినా ఆ విద్యలో కనిపించే విజ్ఞానపు విలువలకు ఏ మాత్రం రజావు లేనప్పుడు వాటిని శంకించక తప్పదు. ఈ విషయాన్ని ముఖ్యంగా "మహిళా సంఘాలు గుర్తించాలి లేనప్పుడు నేతి బీరకాయలోని నెయ్యి చందాన అర్థంలేని వ్యర్థ సంస్థలనడం అసహజంకాదు కావున విద్యావతులగు సోదరీమణులు స్త్రీ సంస్థలకు చేయూతనిచ్చి తద్వారా మహిళోద్ధరణకు వయోజన విద్యావ్యాప్తికి కృషి చేసెదరు గాక !

★


(70వ పేజీ తరువాయి)

నిజంగా సామెతలోని అభూతార్థాన్ని లంకించుకుని రసాభాస స్థితికి వచ్చే స్త్రీలను చూస్తే జాలివేస్తుంది ఏమంటే—వారందరి యదార్థ పదార్థ జ్ఞానము కలవారు కాకపోవేడమే

ఆలోచిస్తే స్త్రీక్షమకు భూమివంటిదన్నారు భూమి—సమస్తాన్నీ భరిస్తుంది కదా ! ఒక పతిని భరించలేదా ! అంత ఓర్మి, కూర్మి ఆమెకుతప్పితే అతనికి కద్దా ?

చూడండి—ఒకవరలో రెండుకత్తు లెన్నడూ ఇముడవన్నమాట వాస్తవమే అంటే--బహుభర్తృత్వం అనగా, ఒక సతికి బహు పతులు, కూడదనే కాని—బహు పత్నీత్వంమును గూర్చి కాదు అయినప్పుడు—సంఘర్షణ మగవారిల్లో కలుగుతుందేకాని-స్త్రీలలో కలగడానికి అవకాశంలేదు

కాబట్టి—ఈ సామెత సతుల పక్షంలోవాడవలసిన పనికానరాదు అంతేకాకుండా—ఇలాంటి సామెత లందలి ఉపమానోపమేయాలను బట్టెన్నీ, ప్రతి పదార్థ భావార్థ స్ఫురలణను బట్టెన్నీ, అనుభవముల బట్టెన్నీ గ్రహిస్తూ పరిశోధనలు సాగించవలసిన పనియున్నది.



కంసాలి యుక్తి

* కుమారి సరోజిని *

ఒక వూరిలో శర్మ అనే బ్రాహ్మణుడుండేవాడు అతడు చాలా పేదవాడు ఒక పూట తింటేవుంటే రెండవ పూట వుండదు అతని వద్ద భిక్షాటనము చేయుటకు ఒక రాగి పాత్ర తప్ప వేరేమియులేదు ఈ స్థితిలో అతనికి పెండ్లిచేసుకోవాలని బుద్ధిపుట్టింది కాని అతనికి పిల్లనెవరిస్తారు? శర్మకు కంసాలి స్నేహితుడొకడుండేవాడు శర్మ అతనివద్దకు వెళ్లి తన అభిప్రాయమును చెప్పాడు కంసాలి అదివిని ఇలా అన్నాడు "నీ రాగిపాత్ర నాకియ్యి నేను దానిని కరిగించి కడ్డీలవలె చేస్తాను అంతవరకు నీవు నాయింట్లో వుండు" శర్మ సరే అని తన రాగి పాత్ర కంసాలికిచ్చి అతనింట్లో వుండటానికి ఒప్పుకున్నాడు

కంసాలి అతని రాగిచెంబును కరిగించి పదునైదు కడ్డీలుపోసి బంగారపు పూతపెట్టాడు

ఆ ప్రక్క గ్రామములో రామశాస్త్రియనే బ్రాహ్మణుడుండేవాడు అతనికినలుగురు కుమార్తెలుండేవారు శాస్త్రి పేదవాడగుటచే ముగ్గురు కుమార్తెలకు ఓలి తీసుకొని పెండ్లి చేశాడు నాల్గవ అమ్మాయి చాలా అందమైనది అంచేత శాస్త్రి ఎక్కువ ఓలి తీసుకొని పెండ్లి చేయాలనుకున్నాడు ఒక రోజున ఏదో పని మీద రామశాస్త్రి కంసాలివద్దకు వచ్చాడు కంసాలి దగ్గర కడ్డీలు చూశాడు శాస్త్రి కంసాలిని ఆ కడ్డీలెవరివని యడిగెను కంసాలి చెప్పాడు—
"ఈ కడ్డీలు శర్మయనే బ్రాహ్మణునివి అతనికెవ్వరు లేరు నాకు ఈ కడ్డీలిచ్చి యెక్కడయినా పిల్లనుచూచి పెండ్లి చేయమని చెప్పాడు శాస్త్రిగారు, మీరెరిగిన పిల్ల యెవరయినా వుంటే చెప్పండి వీటిలో పది కడ్డీలిచ్చి పెండ్లి చేస్తాను"

ఆ మాటలువిని శాస్త్రి తనకుమార్తె వుందని పదిహేను కడ్డీలు యిచ్చేస్తే పెండ్లి చేస్తానని చెప్పినాడు కంసాలి కొంచెం బెట్టు చేసినట్లు నటించి చివరకు ఒప్పుకున్నాడు కంసాలి

కంసాలి యుక్తి

తొందరలో పెండ్లి నిశ్చయించి కడ్డీలు అతని కిచ్చివేసాడు శాస్త్రి కడ్డీలు తీసుకొని జాగ్రత్తగా పెట్టెలో పెట్టాడు

పెండ్లయి పోయింది పాన్పు దగ్గర పెండ్లి కుమార్తె తరపువారు యిలా పాడారు—

“బంగారు కడ్డీలు మా సొమ్ము, పిల్లా మీ సొమ్ము ”

శర్మతరపున కంసాలి యిలా పాడాడు

“పిల్లా మా సొమ్ము, లబ లబలు మీ సొమ్ము.”

రామశాస్త్రికి యది వినగా అనుమానం కలిగింది గాబర్గాగా పెట్టె తెరచిచూశాడు. ఇంకేముందీ, కడ్డీలు నల్లబడిపోయాయ్! రామశాస్త్రి చాలా దుఃఖించాడు—

★

దురలవాటు

కె. పార్వతి

ఒక గ్రామములో ఒక బ్రాహ్మణుడు కలడు ఆ బ్రాహ్మణుడు గ్రామములో పాండిత్యము చెప్పతూ వుండెడి వాడు దాని వలన వచ్చిన డబ్బుతో జీవితమును గడుపు చుండెడి వాడు గ్రామము లోని ప్రజలు బ్రాహ్మణుని పంతులుగారు అని పిలిచెడివారు ఆ బ్రాహ్మణుని యింటియెదుటనే ఒక కోమటి కూడా వుంటూఉండెడి వాడు వారు ఇద్దరు స్నేహముతో నుండెడి వారు కాని ఆ కోమటికి ఒక చెడ్డబుద్ధి వుండెడిది అది ఏమిటి అంటే వాడు ఎప్పుడయిన ఎదుటి వారి వద్ద నున్న మంచి వస్తువును చూచినట్లయితే దానిని దొంగలించెడివాడు

ఒకసారి పంతులుగారు ఒక అందమైన బంగారపు వుంగరము చేయించినారు ఆ వుంగరమును చూచినప్పుడు కోమటి మనస్సులో దురాశపుట్టినది వాడు ఆ బంగారపు వుంగరమును ఏదో విధముగా దొంగలించవలెను అనియోచించెను పంతులు చాల తెలివిగల వాడు అతను కోమటి యొక్క ఆలోచనను కనిపెట్టెను

ఒకరోజు ఉదయమున కోమటి పంతులు యింటికి వచ్చెను పంతులు కోమటి యెదుటే ఉంగరమును వొక పెట్టెలో వుంచెను కోమటి చాల సంతోషపడెను ఆ రాత్రి వచ్చి ఆవుంగరమును దొంగిలించుకొని పోవలెనను కొనెను కోమటి తన యింటికి వెళ్ళిపోయెను పంతులు ఆ వుంగరమును పెట్టెలోనుండి తీసి అందులో ఒక తేలును వుంచెను ఆ రాత్రి పంతులు తన యింటి తలుపులు తీసి మంచము మీద పండుకొనెను కొంతసేపటికి కోమటి పంతులు యింటి దగ్గరకు వచ్చెను తలుపులు తీసి వుండుట వలన లోనకువచ్చి పెట్టెతీసి వుంగరము కొరకు చేతిని పెట్టెలో పెట్టెను అందులోగల తేలు బాగుగా చేతిని కఱచెను అప్పుడు కోమటి బాధతో కుయ్యో మొర్రో అనుచుండెను పంతులు నిద్ర పోకుండ యీ తమాషా అంతా చూచు చుండెను అతను అప్పుడు లేచి “కోమటి గారు, వుంగరము ఎట్లున్నది?” అని ప్రశ్నించెను. కోమటి చాలా సిగ్గుపడెను వాడు పంతులుని క్షమార్పణకోరి అతని యెదుటనే ఆ రోజు మొదలు దొంగ తనమును “ చెడ్డ అలవాటు ”ను వదిలి వేసెదనని ప్రతిజ్ఞపట్టెను

★

ఈర్ష్య

డి వి నాగేశ్వరరావు (1వ ఫారము)

అనగా అనగా ఒక రాజు, ఆ రాజుకు నలుగురు కుమార్తెలు గలరు వాళ్ళ పెద్ది వాళ్ళై నాక పెళ్ళిళ్ళు చేసేడు వొక రోజున నలుగురు అల్లుళ్ళను రాజుగారు పిలిచి ఇట్లన్నారు "ఆ దిక్కున మూడు సముద్రముల అవతల వొక చెట్టుకలదు ఆ చెట్టుతొఱ్ఱలో ఒక నాగుపాము కలదు దాని నెత్తి మీదకల మణిని మీలో ఎవరైనా తెచ్చి నా కత్తిపిడికి వేయవలెను అప్పుడు నాకు విజయము కలుగును తెచ్చిన వానికి సగము రాజ్యమును ఇత్తును"

అప్పుడు నలుగురు తోడి యల్లుండ్రు నాలుగు దిక్కులకు బయలు దేరారు 'కాంత' అనే అమ్మాయి భర్త ఉత్తర దిక్కునకు వెళ్ళినాడు త్రోవలో ఒక అడవి వచ్చినది ఆ అడవిలో నుండి ఒక పెద్ద కొండచిలువవచ్చి వానిని మ్రింగి వేసెను మిగిలిన ముగ్గురు మూడు దిక్కులలోను వెదకి సముద్రములను చూడక కాంత భర్త వెళ్ళిన దిక్కుకే వెళ్ళిరి ఆ దిక్కులో మూడు సముద్రములను దాటి మణిని తీసుకొని వచ్చిరి వచ్చుచుండగా ఆ కొండచిలువ వీరిని మ్రింగ బోయినది అప్పుడు వారు దానిని చంపగా కొయ్యగా బారిన తోడి యల్లుడు బయటపడెను వానినిసేద తీర్చి మణితోబాటు తీసుకొని ఇంటికి వెళ్ళిరి అందుచే కాంత భర్తకుతక్క, మిగిలిన వారికి సగము రాజ్యమును రాజు ఇచ్చెను దీనికి కాంత ఓర్వలేనిదయి భోజన సమయమున ఆ ముగ్గురికి అన్నములో విషము కలిపిపెట్టెను కాని, ఆ విషము వాసన కలదగుటచే వారు గ్రహించి, కాంతను పట్టుకొనిరి రాజుగారు విచారణ చేసి కూతురని యాలోచించక మరణ దండన కాంతకు విధించెను పాపము! కాంతను, ఓర్వలేనితనము కారణముగా వురిదీసిరి

అందుచే ఈర్ష్య పనికిరాదు



చిరంజీవి నాగేశ్వరరావు

★



ఆంధ్రమహిళాసభ వారిచే స్థాపితము కానున్న నర్సింగ్ హోమ్ సహాయార్థము ప్రదర్శించిన శకుంతల నాటకములోని పత్రలేఖన దృశ్యం •

ఇందు శకుంతల

చిరంజీవి గొల్లకోట వసంతకుమారి

గాలి (3)

శ్రీ వసంతరావు వెంకటరావు

"విశాలా!"

"ఆ!"

"గాలిని గురించి నీకు కలిగిన అనుమానం ఇప్పటికైనా తీరిందా లేదా?"

"ఏమో! కాని, గాలియొక్క యునికే మన కంతగా తెలియదు కదా! అట్టి గాలి చదరపు టంగుళానికి 5 వీశెల వొత్తిడి కలిగిస్తూందంటే ఆశ్చర్యంగానే ఉంది నాన్నగారూ!"

"మన కంటికి కనిపించక పోయినా, మన కంత తెలియకుండ ఉండ లేదమ్మా, గాలి! నీ నోటిముందు చేతిని పెట్టుకొని నోటితో గబగబ దాని మీద ఊదు ఏమైంది?"


"చల్లటి గాలి తగిలిందండి"

"చేతులు జాచి గిర్రున వడిగా తిరుగు"

"చేతులకు గాలి తగిలిందండి"

"అంతవర కెందుకు? శీతకాలంలో చల్లటి గాలినుండి రక్షించుకోడానికై ఉన్ని బట్టలు కట్టుకొని, ఉన్ని శాలువలు కప్పు కొంటారు వేసవిలో చెట్లాకులైనా అల్లలాడని సమయములో విసనకఱ్ఱతో విసురుకొని, విద్యుత్ ఫాను వేసి కొని గాలిలో చలనం కలిగిస్తాము గాలి బాగా వీచి నప్పుడు కాని, గాలి బంధించి నప్పుడు కాని గాలి గురించి మనమేదో ప్రయత్నం చేస్తూనే ఉంటాము అయితే మన జీవితంలో ఈ గాలి మనకెంత సహాయం చేస్తుందో ఎరుగుదువా?

లైమ్‌జూస్ త్రాగినప్పుడు వొక గొట్టాన్ని ఉపయోగిస్తాము కదా! గ్లాసులో ఆ కాగితపు గొట్టాన్ని పడేసి, దానిపై కొన నోటిలో పెట్టుకొని పీల్చగా, నోటిలోనికి లైమ్‌జూస్ వస్తుంది దానికి కారణం పైనున్నగాలి గొట్టాన్ని పీల్చినప్పుడు, దానిలోనున్న గాలి కొంత నోటిలోనికి తీసికొన్నావు పైనున్న గాలి గ్లాసులో నున్న ద్రవంపై వొత్తిడి కలిగిస్తూనే ఉంది గొట్టంలో గాలిని నీవు పీల్చగానే పైగాలివొత్తిడికి ఆ ద్రవం



గొట్టంలోనికి ఎగ బ్రాకుతుంది నీవు పీల్చక ముందు గొట్టంలో నున్న గాలియొక్క వొత్తిడి, పైనున్న గాలియొక్క వొత్తిడి సమానమే. గాలిని లోనికి పీల్చగానే గొట్టంలోనున్న గాలి తగ్గిపోయి, దాని వొత్తిడి కూడా తగ్గింది అందు చేత పైనున్న గాలి వొత్తిడి ఎక్కువ ,కాగా

ద్రవాన్ని గ్లోట్టంలోనికి నెట్ట కలుగుతుంది వస్తు వులపై గాలి బలాన్ని వినియోగించగలదని, శాస్త్రీయంగా ఈ విషయాన్నే 'గాలి వొత్తిడి కలిగిస్తుంది' అంటాము"

"అయితే వస్తువులన్నీ గాలివల్ల కదలి పోవ డము లేదేమండీ?"

"గాలివల్ల వొక వస్తువు కదలాలి అంటే ఆ వస్తువుకి ఒక వయిపునున్న గాలి వొత్తిడి కన్న రెండవ వయిపునున్న గాలి ఒత్తిడి ఎక్కువగా నుండాలి ఉదాహరణకి ఒక తలుపుకి రెండు వైపుల ఇద్దరు పిల్లలు నిలబడి ఎవరి కెదురుగా వారు నెట్టుచున్నారనుకో అప్పుడా తలుపు ఒక వైపు కదలవచ్చు, లేక కదలకుండా ఉండి పోవచ్చు ఇద్దరూ ఒకే బలంతో త్రోస్తే తలుపు కదలదు ఒక పిల్లవానిబలం ఎక్కువైతే తలుపు వానిచే త్రోయ బడుతుంది ఇట్లే, వాతావర ణంలోనున్న గాలి, సామాన్యంగా, ప్రతి వస్తు వును అన్ని వైపులా ఒకే బలంతో తోస్తుంది, అందుచేత వస్తువులు కదలవు గట్టిగా గాలి వీచి నప్పుడు వీచిన దిశలో వస్తువులు కదులుతాయి తుపాను గాలి చెట్లనుగూడ విరిచి ఇండ్లను నాశ నము చేయగలదు ఏమంటే ఒకేదిశలో ఎంతో బలంతో ఆ గాలి వీస్తుంది"

"అసలు, గాలి ఒత్తడిని ఎందుకు కనిపించా లండీ!"

"గాలియొక్క ఒత్తిడి అంటే బరువని చెప్పే నుకదూ! బరువుగానున్న వస్తువులు చాల భార ముగా నున్నా యంటాము. వస్తువుల యొక్క భారానికి కారణ మేమంటే వాటిపై భూగోళానికి గల ఆకర్షణం ప్రతి వస్తువుని—చిన్న పెద్దఅను తారతమ్యం లేకుండా—భూమి తనవైపు లాగు తుంది మన భూగోళం బంతివలె గుండ్రముగా నుంది ఈ బంతికిసరిగా మధ్యను కేంద్రముంది ఆ విషయం మీరు బడిలో నేర్చుకొనేవుంటారు చిత్రం 2 లో చూడు "భూ" భూగోళం అనుకో, దాని మధ్య నున్న "కే" కేంద్రము భూతలం పైనున్న ప్రతివస్తువుని, భూమి "కే" వైపు లాగుతుంది అది భూమి యొక్క స్వభా వము 'ర' అనే ఒకరాయి భూమి మీాద ఉంద నుకో దానిని భూమి 'కే' వైపు ఆకర్షిస్తుంది నీవు పైకెత్తడానికి ప్రయత్నిస్తావు అప్పుడా రాయి ఎంతో బరువుగా నుంటుంది ఏమంటే, భూమి కెదురుగా నీవు లాగడానికి యత్నిస్తు న్నావు. భూబలం కన్న నీ బలం అధికమైతే, నీవు గెలిచి, రాతిని పైకెత్తగలవు లేదా నీవువోడి పోతావు భూతలం పైనున్న వస్తువులను తన కడుపు లోనికి లాగుకొనడానికై భూమి విని యోగిస్తున్న బలాన్నే 'గురుత్వాకర్షణ బలం' అంటారు

ఈ బలమే గాలిమీాద కూడ ప్రవర్తిస్తుంది ఎంత తేలిక పదార్థమైనా గాలికి కూడ బరువుం దని గ్రహించేము అయినప్పటికి అది రాయి కాదు నీరుకాదు కంటికి కనుపించదు కదా గాలికి బరువేమిటి అనిపిస్తుంది నిజమే కాని, భూతలంపై 200 మైళ్ళ వయిగా గాలి వార వ్యాపించి ఉంది అంత జాస్తిగా నున్న గాలికి బరువుండదూ? ఇన్ని మైళ్ళ యెత్తున భూమి

చుట్టూ గాలి సముద్రం ఆవరించుకొని ఉంది భూతలంపయి నున్న మనలను, జంతువులను, చెట్లను, ఈ గాలి పీడిస్తుంది

"అయితే, మనం ఆలోకాని కెగిరి పోతే గాలి ఒత్తిడి మనమీద తగ్గాలి కదండీ ?"

"ఔనమ్మా! బాగా ఊహించేవు ఒక కొండ మీద కెక్కగానే ఆ కొండ యెత్తునగల గాలిని క్రింద విడిచి పైకొచ్చే మన్న మాట కాబట్టి కొండపైనున్న గాలియొక్క బరువు, దాని ఒత్తిడికూడ కొండక్రిందనున్న బరువు ఒత్తిడిలకంటె తక్కువే ఆ విషయం ఋజువుచెయ్యవచ్చు పాదరసంతో నింపిన గాజు గొట్టం—భాగమితి అంటారు దానిని—లోనున్న పాదరసం ఎత్తు గాలి బరువుని తెలియ జేస్తుందని తెలిసికొన్నాం కదూ! అట్టి భారమితిని కొండ పైకి తీసికొని పోతే దానిలోనున్న పాదరసపు ఎత్తు తగ్గుతుంది దీనినిబట్టి కొండల ఎత్తు కని పెట్టడానికి వీలౌతూంది"

★

పూవులోయ్

అద్దేపల్లి లక్ష్మి

పూవులమ్మ పూవులోయ్
తావిగల్గిన పూవులోయ్
జాజిపూవులూ మరివిర
జాజిపూవులోయ్ సన్న
జాజిపూవులోయ్, పూవులూ!
నీలాంబర కనకాంబర
గులాబీ, మల్లె మాలతి సంపంగి
బంతీ చేమంతీ పూవులోయ్
పూవులమ్మ పూవులోయ్!
ముద్దమందార రేకమందార
తెల్లమందార ఎర్రమందార
మకరంద మొసగేటి మందార
పూవులోయ్, పూవులూ!
రంగురంగుల పూవులూ
రకరకాల పూవులూ
వింతవింతల పూవులూ
బంతీచేమంతీ పూవులూ
పూవులమ్మ పూవులోయ్!
కమ్మని వాసనలూసగే
తీయని తేనియలూనే
గుప్పున గుబాళించే
సుగంధ పరిమళ మొసగే
పూవులమ్మ పూవులోయ్!
దేశసేవకూ జాతిసేవకూ
మరివలపులరాశి ప్రేమసేవకూ
సాటిలేని మేటి పూవులోయ్!
బాలికకోరే పూవులూ
కన్నియకోరే పూవులూ
పడుచుకోరే పూవులూ
ముసలిముత్తైదువ కోరే
పూవులమ్మ పూవులోయ్!
పావనమాత చరణ పూజకు
వలపులరాశి ప్రేమపూజకు
తెనుగు తల్లి కురులతురిమే
రంగురంగుల పూవులోయ్
రకరకాల పూవులోయ్
కమ్మనివాసన పూవులోయ్
జాజి విరజాజి సంపంగి
బంతి చేమంతీ పూవులూ
పూవులమ్మ పూవులోయ్ పూవులూ!!!

పోస్టు చెయ్యని ఉత్తరం

✻ శ్రీ గోపీచంద్ ✻

నా వైఖరి చూస్తే నాకు హేతువాదం మీదకూడ నమ్మకం పోయినట్టు కనిపిస్తూవుందా ? మంచిది. నీకు ఇలా అనిపించడానికి కారణం లేకపోలేదు అనిమాత్రం నేను ఒప్పు కుంటాను కాని నాకు హేతువాదంమీద నమ్మకం పోలేదు. పోతే సహజజ్ఞానంమీద ఇదివరకు వున్న ఏహ్యాభావంమాత్రం ఇప్పుడు లేదని చెప్పగలను.

నీకుజ్ఞాపకం వుంటే వుంటుంది. మనం మన చిన్నతనంలో సహజజ్ఞానాన్ని చాల అసహ్యించుకుంటూ వుండేవాళ్లం. హేతువాదం మానవులకు సంబంధించింది అనీ, సహజజ్ఞానం జంతువులకు సంబంధించింది అనీ చెప్పుకొని, ఇతరులతో వాదిస్తూవుండే వాళ్లం గాంధీగారు, మాటిమాటికీ తాను చేసేపనులకు కారణాలు చెప్పకుండా, 'నా అంతర్వాణి చెప్పింది' అంటూవుంటే, మనం ఎంతగా హేళన చేసేవాళ్లం! 'ఆయన అంతర్వాణి అటు చెపితే మాఅంతరాత్మ ఇటు చెప్పింది,' అనేవాళ్లం. 'ఉత్తమ పురుషుల అంతర్వాణికి విలువవుందిగాని, నీఅంతర్వాణికి విలువలేదు,' అని ఎవ్వరైనా అంటే, 'నేనూఉత్తమ పురుషుణ్ణే,' అనేవాళ్లం ఈఅంతర్వాణిని గురించి అనిబిసెంట్ గాంధీగారిని విమర్శించి నప్పుడు, మనం హృదయ పూర్వకంగా ఆమెను వందించాం.

ప్రస్తుతం నాకు హేతువాదంమీద నమ్మకం పోలేదుగాని సహజజ్ఞానాన్ని గురించిమాత్రం అభిప్రాయం మారింది. ఇది వొకప్పుడు మనం అనుకున్నంత పనికిమాలిన గుణంగా నాకు కనపట్టంలేదు. అంతేకాదు. మనం భ్రమ పడటంతప్ప, ఈగుణం మనలను విడిచి పెట్టిందీ లేదు. మనకు సహజజ్ఞానం ఎక్కడనుంచి వొచ్చింది ? పరిణామం వల్ల వచ్చింది. దానిని తెలుసుకునే శక్తిమనకు లేకముందే, అదిమనకువుంది. అనుభవం వల్ల వొచ్చిన ఈ జ్ఞానం వొక జాతినుంచి మరొక జాతికి అందజెయ్య బడుతూనేవుంది. ఇది జంతువుల దాకా వొచ్చి అంతటితో ఆగి పోలేదు. మనం హేతువాదులం అయినంత మాత్రాన, మనకు సహజజ్ఞానం లేదు అనుకోవటం పొరపాటు.

"శారీరక జీవితానికి సుముఖంగా, అనాలోచితంగా రియాక్టు అయ్యేగుణాన్నే, ఇన్‌స్టింక్ట్ అంటున్నాం" అన్నాడు రసెల్. ఇదినిజమయితే మానవుడు దీనివల్ల పొందే సహాయం ఏమీ లేదనుకోవంటగాని, ఇదేదో పశులక్షణం అనుకొని దీన్ని దౌర్జన్యంగా అణచుకోటానికి ప్రయత్నించటంగానీ, ప్రమాదకరంగా పరిణమిస్తుంది అని అనుకోటానికి ఏమాత్రం సందేహించనక్కరలేదు అనుకుంటాను. అంటే నేనుఅచ్చగా సహజజ్ఞానంమీద ఆధారపడమంటున్నాననీ, హేతువాదాన్ని నిర్లక్ష్యం చెయ్యమంటున్నానని నీవుభ్రమపడవలసిన అవసరంలేదు సహజజ్ఞానం, తనస్వభావాన్నిబట్టి మామూలు పరిస్థితుల్లో తనపనినితాను సక్రమంగా నిర్వర్తించవచ్చుగాని, విపరీతపరిస్థితుల్లో తప్పటడుగు వేస్తుంది. దీన్నిమనం ఎప్పటికప్పుడు మనఅనుభవంలో పోల్చి చూచుకొని సరిచేసుకుంటూఉండాలి ఇంతేకాకుండా, మరొకవిధంగాకూడా దీనిఅవసరం మనకుఉంది. మనం నేర్చుకొనేశక్తిని ఎంతసంపాదించినా నేర్చుకోటానికి ప్రేరేపణఇచ్చేది ఈ సహజజ్ఞానమే. కాబట్టిమనజీవితాలకు దీని అవసరం ఎప్పటికప్పుడు ఉంటూనేఉంటుంది. ఇదిఉట్టుడియంగా కొట్టివెయ్యదగ్గగుణంగా కనపట్టంలేదు. Analisis of the devil అనేగ్రంథంలో బెర్ట్రాండ్ రస్సెల్ దీనిప్రయోజకత్వాన్నిగురించి ఈవిధంగావ్రాశాడు- "బోనుల్లోవున్న జంతువులు, తప్పించుకోటానికని, ఇటూఅటూతిరుగుతై. ఈ తిరగడం, వాటికున్న సహజజ్ఞానంవల్ల జరుగుతుంది కాని, ఈ విధంగా తిరగటం అనేదే జరక్కపోతే తప్పించుకునేవిధానం తెలుసుకోలేవు అన్నవిషయం మనంజ్ఞాపకంఉంచుకోవాలి. ఈవిషయం మనుష్యులకుకూడా వర్తిస్తుంది. పిల్లలు తాముకోరిన మాటవచ్చేవరకూ అనేకధ్వనులుచేస్తారు ఈ విధంగా ధ్వనులుచెయ్యకుండా మాటలు నేర్చుకోలేరు ఈ ధ్వనులుచెయ్యటం సహజజ్ఞానంవల్ల జరుగుతుంది. ఇక పెద్ద

వారివిషయం మనఅలవాట్లలోను, రుచులలోను, సహజజ్ఞానం యొక్క ప్రాబల్యం కనిపిస్తూనేఉంటుంది". అన్నాడు

కాబట్టి సహజజ్ఞానాన్ని ఏజంతులక్షణంక్రిందా జమకట్టి దానికి మనజీవితాలలో ఏమాత్రంచోటు లేదనుకొని తోసివెయ్యటానికి వీలులేదు దానిశక్తికి హద్దులున్నమాటనిజమే! కానిదాని అవసరం ఉండనేఉంది. హద్దులప్రమేయంవస్తే, ఈప్రపంచంలో దేనికి హద్దులులేవు? హేతువాదానికిమాత్రం హద్దులులేవా? ఆధ్యాత్మికవాదులు హేతువాదంమీద సత్యాన్వేషణకు ఆధారపడరనే విషయం నీకు తెలిసినవిషయమే! హేతువాదం సరైనసాధనంకాదు అంటారు ఆధ్యాత్మికవాదులు హేతువాదం యొక్క అసంపూర్ణ స్వభావాన్ని గురించి నళినీకాంతగుప్త ఈవిధంగావ్రాశాడు - హేతువాదం అంటే ఏమిటి? హేతువాదం మనకిచ్చేజ్ఞానం ఎటువంటిది? మనం సంపాదించేజ్ఞానం మంచిచెడుగులు మనంఅనుసరించే విధానం మీదా, ఉపయోగించే సాధనంమీద ఆధారపడి ఉంటాయి గదా! కాబట్టి హేతువాదం స్వభావాన్నిముందు మనం తెలుసుకోవాలి హేతువాదం మనకు అందుబాటులోవున్న విషయాలను తీసికొని వాటినిబట్టి సిద్ధాంతీకరిస్తుంది అన్ని విషయాలూ మనకు అందుబాటులో వుండవు అనేవిషయం నీవు అంగీకరిస్తావు అనుకుంటాను కాబట్టి హేతువాదంవల్ల మనంపొందేజ్ఞానం యదార్థజ్ఞానం కాకపోవచ్చు మరొక విషయం ఏమిటంటే హేతువాదం విలువచూసేవారి చూపునిబట్టి ఉంటుంది ఈప్రపంచంలో ఎవరిచూపు వారిదే! ఏఇద్దరి చూపు ఒకటిగావుండదు. ఈవిషయం సైన్సుకూడా అంగీకరిస్తుంది అందువల్ల పూర్తి సత్యాన్ని తెలుసుకోవటం హేతువాదంవల్ల కాకపోవచ్చు.

★

స్కెచ్

నిద్రలేని రాత్రి

ఆచంట శారదాదేవి

ప్రపంచమంతా హాయిగా నిద్రపోతుండగా తనుమాత్రం మేలుకొని ఉండడం ఎంత బాధ!— అందులో, ప్రక్కన మనిషి హాయిగా గుర్రు పెడుతూ ఉంటే



ఆచంట శారదాదేవి

ఆవేళ రాత్రి నాటకానికి వెళ్లారు నాటకం చూస్తూ వచ్చిన తలనొప్పి ఇంకా పోనేలేదు ఏమి నాటకం! 'బెనిఫిట్ షో" అట!

చాతా వాతా కాని వాళ్ళంతా నాటకాలాడి, హాయిగా బ్రతుకుతున్న వాళ్ల నెత్తిన రుద్దకపోతే ఏమో! ఊరికే, 'ధర్మమని' అడగకూడదూ?

అబ్బా! నిద్దరరాక పోతే ఏవేవో ఆలోచనలు వస్తూనే ఉంటాయి తలనొప్పికితోడు ఈ ఆలోచనలతో మెదడు దిమ్మెక్కిపోతుంది

ఏవేవో పిచ్చి ఊహాలు!

ఆ రోజంతా జ్ఞాపకం వస్తుంది! తను అసలు ఆ నాటకానికి వెళ్ళాలనుకో లేదు ప్రొద్దున్నే మాలతి వచ్చింది "ఏమండీ! ఇవ్వాళ మా కాలేజీలో నాటకం వేస్తున్నాం బెనిఫిట్ షో! మీరు తప్పకుండా రావాలి!"

"ఓ! అల్లాగే! అల్లాగే!"—అంటున్నారతను, అనవసరంగా గట్టిగా నవ్వుతూ

లిప్‌స్టిక్కూ, జార్జెట్టు చూస్తే ఈ మగవాళ్లకు ఉన్నమతి కూడా పోతుంది

"రెండు పాతిక రూపాయల టిక్కెట్లు ఇస్తున్నానండి" అని మాలతి—

వంట ఇంటిలోనుంచి వింటూన్న తనకు గుండెలో రాయి పడినట్లయింది ఎంత మాటచాతుర్యం చూపినా, అధికారం చెలాయించినా, భార్య దగ్గరే! పరాయి స్త్రీలను చూస్తే, మంత్రముగ్ధులైనట్టు పెదవి కదపలేరు! మెదలకుండా తీసుకొని ఊరుకుంటారు కాబోలు! ఏంచేస్తారో అనుకుంటూండగానే, భర్తలోపలికి వచ్చారు

"చూడు! జానకీ! మాలతి వచ్చింది"

"ఆ! అంతా వినపడింది. 'ఇవ్వాళ వేరే పని ఉంది, రావడానికి ఏమాత్రం వీల్లేదు ఏం అనుకోవద్దు అని చెప్పి పంపివెయ్యి కూడదూ! పోనీ నేను చెప్పనా?"

'అబ్బే—పాపం! చిన్నబుచ్చుకోదూ?'

'ఐతే ఏం చేద్దాం మరి?'

'నీదగ్గిర ఉన్న ఏభై రూపాయలు ఇవ్వరాదూ? ని చీర తరువాత కొనుక్కో-వచ్చు చీర కిప్పుడు తొందర లేదుగా!'

—ఎన్నాళ్లనుంచో ఆ చీర కొందామను కోవటం! మొగ మాటం కొద్దీ ఇబ్బంది పడ టమూ!

—ఏది వచ్చినా తిరిగి తిరిగి తన నెత్తినే పడుతుంది కాదంటే అతను బాధపడుతాడేమో నని అన్నింటికి తనే సర్దుకు ఊరుకుంటుంది. ఎన్నాళ్ళనుంచి ఆ గులాబీ చీరకొనాలని ప్రయ త్నం! అతనికి ఆ రంగు ఇష్టం లేదు అసలు అందుకనే, ఎప్పుడూ ఏదో వంకతో అది వెనక్కు- వెళుతూనే ఉంటుంది

'సరే! మీ యిష్టం కాని, ఒక్క- టిక్కెట్టె కొనండి. నేను రావడానికి వీలులేదు సుబ్బ లక్ష్మమ్మగారితో ఇవ్వాళ సినీమాకి వస్తానని చెప్పాను. నేను వెళ్ళకపోతే, పాపం, ఆవిడా మానుకొంటుంది'

"ఓస్! పోనిద్దూ! ఇప్పుడు ఆవిడతో వెళ్ళ కపోతేనేం చూద్దాంలే"

ఎప్పుడో ఒకసారి విశ్వప్రయత్నం మీద తప్ప, సుబ్బలక్ష్మమ్మగారికి ఇల్లు కదలడానికి అవకాశమే దొరకదు ఇవాళ్ళ, తన మూలాన, ఆవిడ ప్రయత్నమంతా వృధాఐంది వస్తానని చెప్పి, రానందుకు ఏమనుకుందో!

—నాటకంలో ఉన్నంత సేపూ ఇదే ఆలో చన

'మాలతితో తప్పకుండా వస్తామని చెప్పా నుగదా, వెళ్ళకపోతే ఎలాగ' అని అతనివాదన.

మరి, తనూ, సుబ్బలక్ష్మమ్మ గారితో 'తప్ప కుండా వస్తానని' చెప్పిందిగా! అది ఫరవా లేదేమో! సుబ్బలక్ష్మమ్మ చదువుకోలేదుగా— ఆవిడతోమాట తప్పితే మాత్రం ఏం!

అసలు అతనికి తను ఆవిడతో స్నేహంగా ఉండడమే ఇష్టం లేదు. "ఆవిడతో ఏమిటీ కబుర్లు! ఎంతసేపూ వంటయింటిని గురించేగా మాటలు!"—ఎంత హేళన!

...చదువుకున్న ఆడవాళ్ళంతా దేనినిగురించి మాట్లాడుతూ ఉంటారో! అసలు ఈ చదువు కున్న మగవాళ్ళంతా మాత్రం దేనిని గురించి మాట్లాడుతారు! ఇరవై నాలుగు గంటలూ తమ ఆఫీసు విషయాలు కాకపోతే! తనకు ఆఫీసు లేదాయె! రోజంతా తప్పనిసరిగా, వంట ఇంటి లోనే కాలక్షేపం చేస్తూ ఇంక దేనిని గురించి మాట్లాడ కలుగుతుంది—ఎంత చదువు చదివితే ఏం!

వీధిముఖం చూడడానికైనా తీరిక లేదే. ఐనవేళ, కానివేళ, ఎవరో స్నేహితులు దిగు తూనే ఉంటారుగా—కాఫీకి, భోజనానికి ఎన్ని సార్లు, విస్తట్లో పెట్టుకోబోయిన అన్నం ఆవచ్చి

నవారికి వడ్డించి, తాను మళ్ళీ వంట మొదలు పెట్టలేదు! రాత్రి తొమ్మిదింటికైనా సరే, ఎవ రైనా వస్తే కుంపటి రాజేయవలసిందే గదూ కాఫీ కని ఈ స్నేహితులు కులాసాగా కబుర్లు చెప్పు కోటానికి వస్తారో లేక కాఫీ కోసరమే వస్తారో! చాదస్తం!! హాయిగా భోంచేసివచ్చిన వాళ్ళ చేత బలవంతంగా కాఫీ త్రాగించడం దేనికో!

మర్యాదట! మాట్లాడితే, "నీదంతా పూర్వ కాలం పద్ధతి—నీకేం తెలుసు' అంటారు ఏం అహంభావం!!

ఆలోచిస్తో, ఆలోచిస్తో, జానకికి అతను తనను నిజంగా అన్యాయం చేస్తున్నాడేమో అనిపిం చింది తనకూ ఏవో అభిప్రాయాలూ, ఊహాలు కోరికలు ఉంటాయనీ, అవి ఫలించకపోతే తనకూ కాస్తో కూస్తో బాధ కలుగుతుందని, అతని కెందుకు తోచదో!

తన ఆశలు, అభిరుచులు అన్నీ అతని భావా లకనుగుణంగా మారి పోవాలనుకుంటాడు అతని కిష్టంలేని రంగులు కట్టకూడదు అతనికి నచ్చని సినిమాలు చూడ కూడదు, అతనికి బాగున్న పుస్తకాలే తనకూ బాగుండాలి తనకు ఎంత ప్రియమైన పుస్తకాలైనా సరే, అతనికి నచ్చకపోతే, చాటుగా చదువుకో వలసిందే— అతని వెక్కిరింపుకు భయపడి

తన అభిరుచులు కొన్నైనా వేరుగా ఎందుకు ఉండకూడదో! ఇది ఎక్కువ సంస్కారమున్న దన్న గర్వమో లేక పురుషులందరికీ స్వభావ సిద్ధంగా ఉండే అహంభావమో! తనకోసం అతను మార కూడదూ? అతని అలవాట్లను కొంచమైనా ఎందుకు మార్చుకోలేరో! రెండే ళ్లైనా, ఈ సిగరెట్టు వాసన ఇంకా భరించలే కుండానే ఉంది— 'తల తిరుగు తోంది' అ చెప్పినా ఎందుకు వినరో!

అతనికోసం, అతని ఆనందం కోసం, తను ఎంత ఉత్సాహంతో ప్రయాస పడుతోంది! అతనికోసం, అతని ఆనందం కోసం ఎన్ని ఇబ్బం-దులు సహిస్తూంది!

ఎన్ని విషయాలలో, తన కిష్టంలేక పోయినా మనసు సరిపుచ్చుకుంటున్నదో, అతనికి ఎప్పటి కైనా తెలుస్తుందా? తనకే తెలియదు, అసలు, — ఎప్పుడో ఇల్లాగ నిద్రరాని రాత్రి ఏవేవో ఆలోచనలు రేగినప్పుడు తప్ప

—ఉన్నట్టుండి, గాలికి కిటికీలు తెరుచుకు న్నాయి. లోపల వెన్నెల పడింది. బయట పందిరి మీదనుంచి జాజిపువ్వుల వాసన గుప్పుమంది

వెన్నెట్లో ఆమె హృదయం కాస్త శాంత పడింది రాత్రంతా, ఇంత మనోహరంగానే వెన్నెల కాస్తూన్నది కాబోలు! నిద్ర మత్తులో ఉన్న ప్రపంచానికి వెన్నెల ఎందుకో!

ఎవరు చూచి సంతోషించను!— 'అడవి గాచిన వెన్నెల' అంటే, ఇదేనేమో!

అబ్బా! నిద్రలేక తలదిమ్మెకింది దూరాన మువ్వలమ్రోత పాలవాళ్ళు ఆవుల్ని తోలుకు వెళుతున్నారు కాబోలు .

తెల్లవార వచ్చింది అబ్బా! ఒక్క పావు గంటైనా నిద్రపడితే బాగుండును! ఈ కళ్ల మం టలు కొంచెమైనా తగ్గునేమో! లేక పోతే, తెల్లవారి పనే చెయ్యలేదు.

'జానకీ! కాఫీ తెస్తావా?' నిద్రమత్తులోనే ఆ కోరడము! రోజూ కాఫీ కప్పు చేతికి వస్తేనే గాని అతనికి మెలుకువ రాదు ఒక్కొక్కప్పుడు, ఆమెను లేపి, కాఫీ కాచమని, తాను మళ్ళీ నిద్రపోతుంటాడు!

ఇవ్వాళమాత్రం జనకి వినిపించుకో లేదు ఆమె కప్పుడే కొంచెం నిద్ర పడుతోంది కాని, అవతలి మంచం మీదనుంచి ఇంకా, 'కాఫీ' కాఫీ!' అనే ఆర్తనాదం వినబడుతూనే ఉంది—జానకి లేచేవగకూ ఆగలేదు

"ఊ! అమ్మా!"—పూర్తిగా మెలకువ తెచ్చుకోలేక, ఆ బాధ

కప్పు చేతికిచ్చి, జానకి వెళ్ళిపోయింది

"చూడు! ఇవ్వాళ ఆదివారం కాదూ? శ్యామలరావునీ, గణపతినీ భోజనానికి రమ్మన్నాను—ఇక్కడే పేకాడుకో వచ్చని వంట పిండలాడే అవుతుందా?"

జానకి ముఖం వాడింది—ఒక్క క్షణం మాత్రమే! మళ్ళీ, మామూలు ఉత్సాహం తోనే అన్నది

'ఓ! కాకేం చేస్తుంది పేపరు పైకి తేనా? లేకపోతే క్రిందికి దిగి వస్తారా?"

"ఇదుగో వస్తున్నాను"

—ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ మేడ దిగారు

ఆమె నిద్రలేనికళ్ళు చూశాడు అతను కాని, "రాత్రి సరిగా నిద్రపట్ట లేదా? వంట్లో కులాసాగా ఉన్నదా!" అని అడగాలని అతనికి తోచలేదు

"నాకు రాత్రంతా నిద్రపట్టలేదు ఒక్కటే తలనొప్పి వంట్లో ఏం బాగుండ లేదు' అని చెప్పాలని ఆమెకూ తోచలేదు

నవ్వుతూ, రెండోకప్పు కాఫీ అతనిచేతి కందించింది జానకి

కాఫీ తాగుతూ, అతను పేపరులో తల దాచుకున్నాడు!

★

చిన్న కథ

ఒంటిగా

*** శ్రీమతి క్రొవ్విడి ప్రేమకుమారి ***

మా నాన్నగారు ఏవో పాటలు పాడుకుంటున్నారు. ఆ పాటలు కొన్ని నాకు ఎంతో బాగుంటాయి కొన్ని నాకు అర్థం తెలియవు కాని బాగుంటాయి మా నాన్నగారు పాడే పాటల్లో ఏవో కథలు స్ఫురిస్తాయి కథలంటే నాకు చాలా ఇష్టము

నిన్నసాయంకాలం మా నాన్నగారు "ఒంటిగా ఉయ్యాల లూగితివా, నా ముద్దు కృష్ణా! జంటగా నను ఎల్వ తగదోయీ' అనే పాట పాడుతున్నారు

'శ్రీ కృష్ణుడు ఒంటిగా ఉంటాడా నాన్నా! రాధా, గోపికలూ ఎప్పుడూ అతనితో ఉంటారుగా "అన్నాను



శ్రీమతి క్రొవ్విడి ప్రేమకుమారి

"ఓరి కన్నతండ్రీ! మంచి ప్రశ్న వేశావు వాళ్ళందరూ కూడా ఉన్నా! భగవంతుడు ఎప్పుడును ఒంటిగానే ఉంటాడు" అన్నారు మా నాన్న

* * *

భగవంతుడేమిటి మనం అందరమూ ఒంటిగానే ఉంటాము మా డాక్టరుగారి అమ్మాయి ఒంటిగానే మా సునందా ఒంటిగానే మా నవనీతా ఒంటిగానే మా అక్కా ఒంటిగా, మా పాపవదినా ఒంటిగానే, మా ఇంటికి పనిచెయ్యడానికివచ్చే అవ్వ కూతురు ఒంటిగానే ఉన్నట్లు కనబడుతుంది

ఒంటిగావుంటే పద్యాలూ పాటలు పుట్టుకొస్తాయి. ఎన్నో బొమ్మలు కనబడుతాయి మా యింటికి ఎదురుగా చెట్టుకిందవున్న బిచ్చపు



శ్రీమతి టి రాధావసత (దీపాంటరి కథ వ్రాసిన ఆమె)

మనిషి ఎంతో ఒంటిగా ఉంటుంది ఆ అమ్మాయికి ఎన్నో పాటలు వస్తాయి కాబోలు

ఒంటిగా

"ఓ రాజా ఏ దేశ మెళ్ళినావురా !
నీరాణి ఈ అడవిలోన వదలిపెట్టి రాజా !"

పాపం ఆ అమ్మాయి ఎంత ఒంటిగా ఉంటుందో !

ఆ అమ్మాయికి బొమ్మలు కనపడతాయా ! ఎప్పుడూ ఈతాకు బుట్టలు, ఖర్జూరపు ఆకు బుట్టలూ అల్లుతూ ఉంటుంది

ఎప్పుడూ పాటలు పాడుతూ ఉంటుంది

"ఎదురుగా మేడపై ఎక్కింది భామా
నుదురుమీదా చెదురుముంగురులు మూడు"

అని నా మీద పాటపాడింది నా కెంతో సంతోషం వచ్చి, మా అమ్మగారి పాత రవికె ఒకటి ఇచ్చాను

* * *

మేమంతా ఆంజనేయ స్వామి గుడికి వెడితే, అక్కడవున్న బిచ్చగాళ్ళలో యీ అమ్మాయి ఒక్కత్తే! నే నిచ్చిన మా అమ్మ రవికె తొడుక్కుని ఉంది పాపం ఆ బీదవాళ్ళకు ఒకళ్ళకీ మంచిబట్టలు లేవు అన్నీ చిరుగులే! మాసి ముద్దలై వాసన వేస్తున్నాయి

నేను ఒంటిగా అయి పోయాను "ఒంటిగా ఉయ్యాలలూగే కిట్టమ్మకు బట్టలు అక్కర లేదు వీళ్ళందరికి వద్దా! కిట్టమ్మా ? అనే ఆలోచన వచ్చింది ఆంజనేయులకు ఒక్కపొట్టిలాగు చాలు ఆడవాళ్ళయిన ఈ బిచ్చపు అవ్వలకు చీరలు వద్దూ ?

వీళ్ళ తలలు దువ్వుకోరు పువ్వులు పెట్టుకోరు హనుమంతునికి ఇచ్చే నెయ్యి, మా యింటి కెదురుగానున్న బిచ్చపు అవ్వ కిచ్చా! ఆ అమ్మాయి ఆ నెయ్యినాకి తినివేసి ఉట్టి రావి ఆకు తలకు రాసుకుంది హనుమంతుడికి ఇచ్చే పూలదండ ఆ అమ్మాయికే ఇచ్చా! ఆ అవ్వ అవి తలలో పెట్టుకుంది.

ఆ నెయ్యి హనుమంతుడు తిన్నట్టే! ఆ పువ్వులూ ఆ దేవుడి తల్లో పెట్టినట్లే!

* * *

ఆ మర్నాడు ఆ బాలిక మా ఇంటికి ఎదురుగా ఉంది ఎప్పుడయినా స్నానం చేస్తుందా ? ఒంటిగాఉన్న శ్రీ కృష్ణుడు స్నానం చెయ్యడూ ? పాలల్లో స్నానంచేస్తాడు

ఒంటరిగా నున్న బిచ్చగత్తెని జంటగా ఎవ్వరూ పిలవరూ ?

* * *

ఆ మర్నాడే ఇంకో బిచ్చగాడు ఆ చెట్టు కిందే చేరాడు వాడు ఒంటిగానే ఉన్నాడు కాబోలు అస్తమానం ఒక కొబ్బరిచిప్ప వెదురు బొంగూ ఒంటి తీగ ఫిడేలు మీద చిన్నివిల్లు గుర్రపు వెంట్రుకల కమానుతో వాయిస్తూ పాడుకుంటూ ఉంటాడు

"ఎడతెగని బయలులోనే
ఎందుకే పోయావు పిల్లా
ఎనక తిరిగి నన్నూ
ఈడుజోడూ మనకి కుదిరినే!"

అని పాడడం సాగించాడు

ఆ బిచ్చ గాడు అలాంటి కొబ్బరి చిప్పల ఫిడేళ్ళు ఎన్నో చేసి అమ్మేవాడు నేనూ రెండు అణాలకు ఒకటి కొన్నాను మా సునందా కొంది మా అక్కాకొంది మా పాప వదినా కొంది మా డాక్టరుగారి సదా కొంది. సీతారామయ్య పెద్దనాన్నగారు వాళ్ళమనమడికి ఒకటి కొన్నారు మా బావ లిద్దరూ చెరోటికొన్నారు

నేను "ఓరేయి అబ్బాయి, నువ్వు ఒంటరివాడవా "అని కేక వేసి అన్నాను

"అవునమ్మా !" అని నవ్వి ఆ భిక్షుకురాలిని చూశాడు ఆ భిక్షుకురాలు నవ్వింది.

* * *

(తరువాయి 88-వ పేజీలో)

గీతిక

మంగళాంబిక (గురుజాడ)

నాటి పున్నమ రేయి
కోటి వెన్నెలలోయి
మధుర భావమ్మేదో
మనసులో మెరిసింది!
నాటి

తోటలో సుమతరులు
కోటి పూవులు విచ్చె
నా బ్రతుకులో ఒక్క
నవ పరిమెళము దరిసె!
నాటి

పొదరింటి ఛాయలో
సొదలాడు ఏటిదరి
దివ్య శబ్దమ్మేదో
భవ్యమయె నాలోన!
నాటి

కనువిచ్చి చూతునా
కళల సామివి నీవు
చూపు వెన్నెలప్రేమ
రూపింప తోచావు!
నాటి

ప్రేమ వెలిగెడు మోము
ప్రియము తొణికెడి మూర్తి
నీ మ్రోల వాలగా
నీ వేల నిలబడవు!
నాటి

పలుకరించెద మన్న
ప్రభు! ఏ కడకుబోదు,
ఏల నీ దర్శనము
ఏల నీ ప్రణయమ్ము!
నాటి

ఒంటిగా నను జేసి
కంటికే కనబడవొ
జంటగా నను జేర్చి
సాగవా మనదారి
నాటి

పరమ సుందరములే
పదములని ప్రభునీవి
మరచి నేమనగలన
హిమజలధి సదృశగురూ!

నాటి పున్నమ రేయి కోటి వెన్నెలలోయి
మధుర భావమ్మేదో మనసులో మెరిసింది

★

(86 వ పేజీ తరువాయి)

నాలుగు రోజులయింది వాళ్ళిద్దరూ పాడుకుంటూ బయలు దేరారు

"మీరు ఇప్పుడు ఒంటిగాలేరా" అని అడిగాను "లేదు తల్లీ! మేమిద్దరము లగ్నం చేసుకున్నామండి" అన్నారు "వాళ్ళిద్ధరూ భార్యాభర్తలయ్యారా" అని నాన్నగారిని అడిగాను "అవును తల్లీ" అన్నారు

వాళ్ళిద్ధరూ ఇప్పుడు జంటగా ఉన్నారు అయినా ఎప్పుడూ ఒంటిగానే ఉంటారా వాళ్ళు! ఎప్పుడూ కలిసి పాడుకుంటారు

వాళ్ళు ఒంటిగా జంటగా ఉంటారు కాబోలు

ఇంతే!

★

గీతిక

మంగళాంబిక (గురజాడ)

నాటి పున్నమ రేయి
కోటి వెన్నెలలోయి
మధుర భావమ్మేదో
మనసులో మెరిసింది !
నాటి

తోటలో సుమతరులు
కోటి పూవులు విచ్చె
నా బ్రతుకులో ఒక్క—
నవ పరిమళము దరిసె !
నాటి

పొదరింటి ఛాయలో
సొదలాడు ఏటిదరి
దివ్య శబ్దమ్మేదో
భవ్యమయె నాలోన !
నాటి

కనువిచ్చి చూతునా
కళల సామివి నీవు
చూపు వెన్నెల ప్రేమ
రూపింప తోచావు !
నాటి

ప్రేమ వెలిగెడు మోము
ప్రియము తొణికెడి మూర్తి
నీ మ్రోల వాలగా
నీవేల నిలబడవు !
నాటి

పలుకరించెద మన్న
ప్రభు ! ఏ కడకుబోదు,
ఏల నీ దర్శనము
ఏల నీ ప్రణయమ్ము !
నాటి

ఒంటిగా నను జేసి
కంటికే కనబడవా
జంటగా నను జేర్చి
సాగవా మనదారి
నాటి

పరమ సుందరములే
పదములని ప్రభునీవి
మరచి నేమనగలన
హిమజలధి సదృశగురూ !

నాటి పున్నమ రేయి కోటి వెన్నెలలోయి
మధుర భావమ్మేదో మనసులో మెరిసింది

★

(86 వ పేజీ తరువాయి)

నాలుగు రోజులయింది వాళ్ళిద్దరూ పాడుకుంటూ బయలు దేరారు

"మీరు ఇప్పుడు ఒంటిగా లేరా" అని అడిగాను "లేదు తల్లీ ! మేమిద్దరము లగ్నం చేసుకున్నామండీ" అన్నారు "వాళ్ళిద్దరూ భార్యాభర్తలయ్యారా" అని నాన్నగారిని అడిగాను "అవును తల్లీ" అన్నారు

వాళ్ళిద్దరూ ఇప్పుడు జంటగా ఉన్నారు అయినా ఎప్పుడూ ఒంటిగానే ఉంటారా వాళ్ళు ! ఎప్పుడూ కలిసి పాడుకుంటారు

వాళ్ళు ఒంటిగా జంటగా ఉంటారు కాబోలు.

ఇంతే !

★

చితాభస్మము

రచన
శ్రీ పి నారాయణ్

అనువాదం
ఆర్ సోమసుందర్

క్రీస్తు శకం 1857

బిరూరు ధుంధుంపంత్ నానా సాహెబ్, ఆంగ్లేయుల రాజ్య నిర్మాణాన్ని నిర్మూలించుటకు, వారిని భారతావని నుండి పారద్రోలుటకు నిశ్చయించాడు. తాంతియా అతని ప్రతినిధిగా పల్లెపల్లెలూ నగర నగరాలూ తిరిగి అక్కడి భారతీయ జనతను ఉద్రేకించుటలో నియుక్తుడైనాడు. కాని వీరిరువురిదీ భిన్న దృక్పథం—నానా హింసతోనైనా విజయ రంభను వరించాలనీ, తాంతియా అహింసతోనే తమ కార్యాన్ని కొనసాగించాలని ఒకనాడు నానా యిలా అన్నాడు—"మన స్వాతంత్ర్యానికీ, భావి ఔన్నత్యానికి ప్రాణహత్య యేవిధమైన హింసా, పాపకార్యమూ కాదు స్వాతంత్ర్య సుఖమయ జీవుల ఆశీర్వాదంతో దాని ప్రాయ శ్చిత్తం తీరినట్లౌతుంది." దీనికి తాంతియా యిలా అన్నాడు—"అహింసా పూర్వకముగా చేకొన్న శాంతి, స్వాతంత్ర్యమూ నిర్దుష్టమై, శాశ్వతమై యుంటుంది" వీ రిరువురి మనస్తత్వాలు యెంత భిన్నమైనా వీరు ఒకరి నొకరు గాఢంగా ప్రేమించుకొన్నారు వీరిరువురి లక్ష్యమూ ఒక్కటేకదా!

మైనా నానాగారి యేకైక పుత్రిక తాంతియా మొదటి నుండీ ఆమెకు సన్నిహితంగా వుంటూవచ్చాడు. ఆమె బాల్యావస్థలో ఆమెతో ఆటలాడినాడు ఆమెకు బువ్వ తినిపించినాడు పెద్దదైన తరువాత ఆమెకు అస్త్ర విద్యయు తుపాకి కాల్చుటను నేర్పించాడు తాంతియాకు మైనాపై అమితమైన అనురాగం, వాత్సల్యం ఆమెను కన్న బిడ్డకన్నా యెక్కువగా ప్రేమించాడు, ఆదరించాడు ఆమెకూడ యితనిపై అపరిమితమైన శ్రద్ధా భక్తులు ఆమె యితనిని గురువుగా భావించింది నానా కొద్దిగా ముక్కోపి. అప్పుడప్పుడు మైనాపైకూడ చిడిముడి పడుతూ వుంటాడు. అప్పుడామె తాంతియావద్ద కెడు తుంది. అతడామెను ఓదార్చుతాడు, బుజ్జగిస్తాడు. మైనా బాల్యమందే తల్లిని కోల్పోయింది

*　　*　　*

ఫ్రాన్సు దేశంయొక్క మేటి గజదొంగయైన మైకేయర్, అబ్దుల్, తదితరులు కూడ ఆంగ్లేయులకు బద్ధవిరుద్ధులై అరాజ కాన్ని పెంపొందింపజేస్తూ వచ్చారు వీరు నానాను కూడ కలుసుకొన్నారు ఆంగ్లేయులను యెల్లాగైనా భారతదేశం నుండి పారదోలాలనే నానాయొక్క సంకల్పం మైకేయర్ కూడ దీనినే కోరినాడు అతని మనస్సులో యింకొక దురా లోచనకూడ వుంది ఆంగ్లేయులను పారదోలి పార్శీ ప్రభు త్వాన్ని హిందూదేశంలో స్థాపించాలని అతడు నియుక్తుడై నాడు. ఈ విషయం నానాకుగాని, తాంతియాకుగాని మరె వ్వరికీగాని తెలీదు నానా తన సంకల్పసిద్ధికై మైకేయరునకు తగిన ప్రోత్సాహ మిచ్చినాడు కోరినంత ధన, జన, సహాయం కూడా చేశాడు మైకేయర్ అదను చిక్కినపుడెల్లా ఆంగ్లే యులను, వారి ఆలుబిడ్డలను హతమార్చుతూ వచ్చాడు.

తాంతియా అహింసావాది. మైకేయర్ చేయు రక్త పాతక కృత్యాలు అతనికి లేశమైనా నచ్చలేదు

ఒక రోజు రాత్రి మైకేయర్, అబ్దుల్ తదితరులు నానాను కలుసుకొనుటకు వెడలినారు వారు కలుసుకొను గుప్తస్థానం తాంతియా తెలుసుకున్నాడు. ఆంగ్లేయులకు విశ్వాస పాత్రుడైన రామపాలుకీ విషయం తెలిపాడు. రామపాలు సిబ్బందితో సిద్ధమై వచ్చాడు నానాకు ఈ విషయం తెలీదు తాంతియా వెడుతూనే తుపాకులు ప్రేలినాయి పొగలెగసినాయి పొగలణగిన తరువాత ఒక మూల మైకేయర్ మొదలగువారి శవాలను, మరొక మూల తాంతియా రామపాలురను నానా కనుగొన్నాడు. తాంతియాను చూడగానే దీనికంతటికీ యితడే కారణమని నానా గ్రహించాడు అతనికి యెక్కడాలేని కోపం

వచ్చింది తక్షణం కరవాలాన్ని ఒరనుండి దూసి తాంతియాను సమీపించాడు

"దేశద్రోహీ! నీ వింతటి నీచుడవని నేను తెలుసుకోలేక పోయాను నీవంటి కులనాశకుల వలననే భారతదేశం దాస్యానికి లోబడి సంకెళ్లను ధరించియుంది నీవంటి నీచుడు పవిత్ర భారతంపై జీవించి యుండడంకూడ పాపకరం ఛీ"—నానా యిక పలుకలేక పోయాడు ఇదే సమయానికి మైనాకూడ అక్కడికి వచ్చింది తండ్రిగారి కోపాన్ని శమింపజేయుటకు యత్నించింది

నానా ఒక్కసారిగా రోషాయుత నేత్రుడైనాడు అతని క్రోధానలం నాల్కలను చూచింది పళ్లు పటపటమని గీకుతూ అన్నాడు—"నా సంతానమే నాకిలా అపకీర్తి తెస్తుందని నేను భావించలేదు. నా గృహంలో నేనొక విషసర్పాన్ని పెంచుతున్నానని గ్రహించలేదు. ఓసీ! చండాలినీ, వెళ్లు దూరం నీ ముఖాన్ని నాకిక చూపకు

ఆ రోజునుండీ మాతృ విహీనురాలైన మైనా తన తండ్రి అనురాగానికి కూడా దూరమైపోయింది

౨

పున్నమరేయి, గగన వీధిని నిండు జాబిల్లి కలకలలాడుతూన్నాడు. నానా సాహెబ్‌గారి రాజమహాలునకు యెదురగా వుండు వనవాటికలో యిరువురు వ్యక్తులు సంభాషిస్తున్నారు.

"మైనా! ఈ రోజు నాకు సెలవివ్వాలి నీవు కొన్ని రోజుల పర్యటనానికై వెడుతున్నాను నేను, ప్రయాణం చాలాదూరం. ఇంకా మేమెంత కార్యం చేయాలో నీకు తెలుసుకదూ? నేనిక్కడనుండిన కార్యం కొనసాగదు ప్రజలకు తగిన ప్రేరణ లేనిదానివల్ల వారి ఉత్సాహం మందగిస్తూవుంది మన స్వాతంత్ర్య దినం యింకా యెంత దూరమో లేదు మైనా!"

"మరి నన్నెవరివద్ద విడిచి వెడుతారు?"

"భయపడకు మైనా, నేను త్వరలోనే నిన్ను కలుసుకొంటాను కదూ."

"నేనొక్కతెనే యెలాగుండగలను? నాన్న నన్ను చూడ్డానికి కూడ ఇష్టపడరు మీరు నా బాల్యంనుండీ నన్ను పెంచారు, తెలివి వచ్చిన తరువాత గురుదేవులైనారు తండ్రి అలుక వహించిన తరువాత రక్షకులైనారు మీరు కూడ నన్ను వదలి వెళ్లుదురా?"

"నీ హృదయాన్ని యిలా చిన్నబుచ్చితే యెలాగు తల్లీ? వీర పితా పుత్రికవై కూడ యిలా అధీరతకు పాల్పడవచ్చునా? నేను వెళ్లి తీరాల్సిందే మైనా నన్ను అడ్డగించి నీవు కించిత్తైనా నీ మాతృభూమికి సేవ చేయలేవు ఏం, నీ జన్మభూమిపై లేశమైనా నీకు అనురాగంలేదూ?"

మైనా నయనకమలాలనుండి అశ్రుధారలు జలజలా రాలాయి తాంతియాకేమి చేయడానికీ తోచలేదు ఒకవైపు విశాలదేశంయొక్క కర్తవ్యం, మరొకవైపు మైనా వాత్సల్యం

"ఏడ్వకు మైనా నీవు భారతావనియొక్క వీర బాలికవు. నేను కొద్ది రోజులు మాత్రమే నీకు దూరముంటాను. ఆ తరువాత నీ వద్దనే వుంటాను కదూ.

మైనా నుండి జవాబు రాలేదు.

తాంతియా మళ్లీ అన్నాడు—"ఝాన్సీ లక్ష్మీబాయి నుండి నాకొక లేఖ వచ్చింది ఝాన్సీరాణి నన్ను రమ్మన్నది ఒకసారి గ్రామాలన్నీ తిరిగిన తరువాత ఆమెను కలుసుకోవాలనుంది నేడు పున్నమ రాబోవు పున్నమనాటి రాత్రికి తప్పకుండా నిన్ను యిక్కడే కలుసుకుంటాను. కాని నా వెంబడి నీవు రావాలని కోరితే ఝాన్సీకి వెళ్లునపుడు నిన్నుకూడా తీసుకెడుతాను రాణిగూడా నిన్ను గూర్చి చాలా ప్రశంసించింది అక్కడ నిరాపదంగా కాలక్షేపం చేయగలవు"

మైనా మనస్సు కుదుటబడింది. భారతమాత సంకటంలో ఆమె దెన్నోవంతు?

"మీ పవిత్ర సంకల్పాన్ని కొనసాగించండి గురుదేవ్. ఇంతవరకూ స్వార్థంతో, మనో దుర్బలతతో వెక్కి వెక్కి యేడ్చాను, మీ ప్రయాణాన్ని నిరోధించాను మీరిక

వెళ్లండి గురుదేవ్ ప్రసన్నతా పూర్వకముగా వెళ్లండి మీ మార్గం నిరాటంకమగుగాక. భగవానుడు మీ పవిత్ర కార్యాన్ని ఫలితం చేయుగాక భారత స్వాతంత్ర్యానికై నేనొక్కతినేగాక సహస్ర మైనాలు మృతినొందినా పరవా లేదు ''

" మైనా, నీ వెందుకలా భావిస్తావు ?''

" నే నెందుకలా భావిస్తున్నానో నాకే తెలీదు ఎందుకో నేడు నా మనస్సు అదోలాగుంది. బహుశా మిమ్మల్ని మళ్లీ కలుసుకోలేనేమో.''

తాంతియా ఆమెను బుజ్జగించాడు—" పిచ్చిపిల్లా, ఏమిటీ అపశకునమైన మాటలు ? త్వరలోనే నిన్ను కలుసుకొంటానుకదూ మరి వెళ్లాలి నేను. ఇప్పటికే ఆలస్యమై పోయింది ఆఁ. జ్ఞాపకముంచుకోవాలి. రాబోవు పున్నమనాటి రాత్రికి తప్పకుండా నేనిక్కడ వుంటాను. తరువాత నిన్ను ఝాన్సీకి తీసుకెడుతాను. తప్పకుండా తీసుకెడుతాను.''

మైనా దుఃఖాన్ని దిగమ్రింగుతూ అతని పాదధూళిని తలపై నిడుకొంది. తాంతియా దీవించాడు ఆ తరువాత బయలుదేరాడు వెడుతూ వెడుతూ మళ్ళీ అన్నాడు— " రాబోవు పున్నమనాటి రాత్రికి నీ విక్కడ వుండాలి సుమా... మరచిపోకేం ..?''

" తప్పకుండా వుంటాను గురుదేవ్ ''—రుద్ధకంఠంతో మైనా అన్నది.

వెల్లి విరిసిన వెన్నెల్లో తాంతియా వెడుతున్నాడు. అతడు దృష్టికి దూరమగువరకూ మైనా అక్కడే నిలిచింది. తరువాత రాబోవు పున్నమనాటిని గూర్చి ఆలోచిస్తూ ప్రాసాదంవైపు నడకను సాగించింది

3

కాన్పూరులో ఘోరమైన విప్లవం రేకెత్తింది. జనతలోని నిద్రించిన ఆవేశం ఒక్కసారిగా మేల్కొన్నది. ఎటు చూచినా నెత్తురు కాల్వలే ఎటుచూచినా పీనుగ పెంటలే! భారతీయులు ఆంగ్లేయుల నామరూపనాశనానికి కంకణ బద్ధులైనారు వేలకొద్ది స్త్రీ పురుషులను, బాలబాలికలను హత్యకావించారు ఆంగ్లేయులుకూడ తమ రాజ్యాన్ని నిల బెట్టుకొనుటకు, పితూరిని నిర్మూలించుటకు తమ విరోధులను హతమార్చినారు

ఈ విప్లవానికీ, ప్రథమ స్వాతంత్ర్య సమరానికీ నాయకుడు, నానా సాహెబ్ ఇతనిపై తమ పగను తీర్చుకొనుటకు తెల్లవారు తీర్మానించుకొన్నారు. నానా రాజమహలును నాశమొనరించుటకు ఆజ్ఞనిచ్చినారు

విప్లవం రెండవరోజున జనరల్ హే ఆధిపత్యంతో ఆంగ్ల సేన నానా సాహెబ్ ప్రాసాదాన్ని నలుదిక్కులూ ముట్టడించిరి జనరల్ హే తన కార్యాన్ని యెలా మొదలు పెట్టాలో ఆలోచిస్తున్నాడు ఇంతలోనే మహలు మేడపై నుండి ఒక స్త్రీ కంఠం వినబడింది, దూరమగుటవలన ఆమె మాటలు స్పష్టంగా యెవ్వరికీ వినబడలేదు జనరల్ హే మహలును సమీపించాడు. బాలిక ఆంగ్లభాషలో అతనితో యిలా అన్నది—" మీరు ఈ భవనాన్ని రక్షింపలేరూ ? ఇది మా తండ్రియొక్క యేకమాత్ర చిహ్నము . ఇదే నా ఆశ్రయం. "

జనరల్ హే హైందవ బాలిక ఆంగ్లములో భాషించుటచూసి అచ్చెరువొందినాడు. ఆతడు గంభీరంగా పలికినాడు—" ఇది అసంభవం నానా యొక్క అంతిమ చిహ్నాన్నికూడా శేషముంచుటకు మా అధికారులు నిరాకరించారు నేను వివశుడను ''

" మీరు నన్ను గుర్తించలేదేమో ? కాని మిమ్మల్ని నేను మరువలేదు. మీరు జనరల్ హే కదూ ? మేరీ మీ కొమార్తెకదూ ? మరణించుటకు పూర్వం మేరీ నాకొక లేఖను మీ కిమ్మని యిచ్చింది. కాని కొన్ని కారణాంతరాలచే మీ కందజేయుటకు వలను పడలేదు నేడు సమయం దొరికింది—" అంటూ బాలిక ఒక జాబును క్రిందికి వేసింది.

జనరల్ హే ఉత్సాహంతో ఆ లేఖనందుకొని చదువుకొన్నాడు. అందులో ఈ విధంగా వ్రాయబడింది—"ఎప్పుడైనా సమయంవస్తే మైనాకు సహాయం చేయాలి." లేఖను ముగించి హే విస్మృత చరిత్రను స్మరించినాడు. " ఓ

ఇప్పుడర్థమైంది నీవు మేరీ బాల సఖివికదూ? నీపైకూడ నాకు వాత్సల్యంముంది ఇప్పుడు మేరీ లేదు మేరీ లేకున్నా నేను కృతఘ్నుడను కాజాలను నాపై విశ్వాసముంచు మైనా. నానుండి నీ కేలాటి హానీ ప్రాప్తించదు ఎంత వరకూ సాధ్యమో అంతవరకూ నీకు సహాయం చేస్తాను."

జనరల్ హే తన అసమర్థతను పై అధికారులకు వెల్ల డిస్తూ తిరోహితుడైనాడు మైనా మహాలులో కెళ్లింది.

మరొక సేనాపతి మైనాను బంధించి తెచ్చుటకు సైని కులకు అజ్ఞనిచ్చినాడు మహాలునంతా సైనికులు శోధించి నారు కాని మైనా యెక్కడా కానరాలేదు

సేనాపతి అజ్ఞతో ఫిరంగి గుండ్లు ఒక్కుమ్మడిగా ప్రేలి నాయి దట్టమైన పొగలు క్రమ్ముకున్నాయి పొగలు అణగిన తరువాత శిధిలమైందిన కట్టడంమాత్రం వారి యెదుట నిలబడింది

౪

శుక్లపక్షం. నవమి చంద్రుని శుభ్రజ్యోత్స్నలు ప్రపం చాన్ని పులకిస్తున్నాయి. నిశా సమయమందలి ప్రశాంత నీరవతలో నానాగారి భగ్న ప్రాసాదం నిదురవోయింది. దూరంగా ఆంగ్ల సైనికులు శిథిలాలను పరిశీలిస్తున్నారు.

పశ్చిమ దిశనుండి ఒక ఛాయామూర్తి శిథిల మందిరం వైపు మందగతితో నడుస్తూవుంది. విప్పారిన కేసరాలతో చింతాక్రాంత స్వాంతయైన ఒక బాలికామణి ఆ—మూర్తి శుధాంశు మాలికా మంద ప్రభలలో ఆమె దేవబాలవోలె అగుపడుతూవుంది.

భగ్న ప్రాసాదం ప్రవేశించి అందొక సమున్నత శిలపై ఆమె కూర్చున్నది ఉన్నట్లుండి ఆమె కనుకొనకుల నుండి కన్నీర్లు కారింది. ఇదే సమయానికి ఆంగ్ల సేనాపతి భగ్న ప్రాసాదాన్ని సమీపించాడు. ఆమె అతనిని చూచినా భయపడలేదు నిశ్చలంగా మౌనముద్రను వహించింది.

అతడామెను సమీపించి ప్రశ్నించాడు—"నీ వెవరు దేవీ?"

"మైనా"

సేనాపతి ముఖం వికసించింది—"నీవు మైనావా? నానా కుమార్తెవా?"

"ఆఁ నానా సాహెబ్ గారి కుమార్తెనే"

"ఐతే నిన్ను బంధించాలి నీకై యిన్ని రోజులూ వెతికాము ఈ శిథిలాలపై నీకు గల మోహం నిన్ను యిక్కడికి తెస్తుందని మేమంతా ఆశించాము మే మను కొన్నట్లుగానే జరిగింది ఇక ఆలస్యం చేయడానికి వీలు లేదు. నాతో రావాలి నీవు"

మైనా యీ మాటలకు చలించలేదు "అలాగే కానీ నా దొక మనవి. నా కోరికను చెల్లించగలరా"యని అన్నది.

"ఏమిటా కోరిక?"

"ఓ గంటసేపు నా తనివితీరా యేడ్వాలి నేను. నా కిక యెవ్వరూలేరు. ఈ నిర్జీవ భగ్న ప్రసాదం నా ప్రేమను చూరగొన్నది. ఈ శిథిలాలతోగూడ సెలవు తీసుకొంటాను ఆ తరువాత నేనీ శిథిలాలను చూడలేను"

మైనా కోరిక నిరాకరింపబడింది. గాంభీర్య శాంతాలతో ఆమె సేనాపతిని అనుసరించింది.

౫

పౌర్ణమి శుభ్రాంశువు నీలాకాశంలో నవ్వుచున్నాడు. ప్రకృతిలోని ప్రతి అణువూ సుధాపానములో సంతృప్తి పొందింది నలు దిక్కులూ పిండారబోసిన వెన్నలే ఆ వెన్నెల్లో దట్టమైన చెట్లు, చక్కని నీలి నీడల్ని విరజిమ్మి నాయి. తాంతియా సన్యాసి వేషంలో యెవ్వరి కొరకో ఆతురతతో ప్రతీక్షిస్తున్నాడు

నేడు పూర్ణిమ ఈ దినమే తాంతియా ఝూన్సీకి ప్రయాణమవ్వాలి. కాని మైనా కిచ్చిన మాట ప్రకారం అతడు యిక్కడికి వచ్చినాడు మైనాను కూడ ఝూన్సీకి తీసుకెళ్లుటకు నిశ్చయించినాడు

తాంతియా రామపాలునకుకూడ కబురంపినాడు రామ పాలు శత్రుపక్షమైనా తాంతియాకు అతనిపై నమ్మక

మెప్పుడు. రామపాలు అన్ని విషయాలనూ తాంతియాకు తెలుపుతూ వుంటాడు

నియమిత సమయానికి రామపాలు వచ్చినాడు. అతడు తాంతియాకు ప్రణామాల్ని అర్పించాడు. తాంతియా అతని కభివాదన మిస్తూ యిలా అడిగినాడు—"రామపాల్, ఇక్కడ విషయా లేమిటి ?

"ఎవ్వరి విషయం గురుదేవ్ ?"

"నానా సాహబ్‌గారి విషయం."

"విప్లవం తరువాత నానా తన అనుచరులతో పలాయన మొనరించాడు వారెక్కడ దాగి యున్నారో యెవ్వరికీ తెలీదు. వారి రాజప్రాసాదం ఫిరంగి గుండ్లతో శిధిల మొనర్పబడింది ఇదిగో, మీ యెదుట నుండునది ఆ శిధి లాలే"

"మరి మైనా యెక్కడ ?"

"మైనా మైనా"—మైనా విషాద మరణాన్ని స్మరిస్తూ రామపాలు కనుగవలు చెమ్మగిల్లినాయి అతని కంఠం గద్గతిక నొందింది.

తాంతియా యేమిటో అనుమానించాడు అధీరతతో అతడు మళ్ళీ ప్రశ్నించాడు—"మైనా యెక్కడ, రామ పాల్ ?"

"మైనా యిప్పుడిక్కడ లేదు."

"మైనా యిక్కడ లేదా ?"

"లేదు"

"తన తండ్రితోపాటు వెళ్లినదా ?"

"లేదు"

"మరీ విశదంగా యెందుకూ చెప్పవు ? త్వరగా చెప్పు రామపాల్ ?"

"భౌతిక దేహంతో మైనా యిప్పుడీ జగతిలో లేదు"

"మైనా మరణించినదా ? యేమిటి చెబుతున్నావు నీవు ?"

"నిజమే చెబుతున్నాను, గురుదేవ్"

రామపాలు కడపటి మాటలు తాంతియాను ఒక్కసారిగా స్తంభీభూతుణ్ణిగా చేసినాయి అతని హృదయాన్ని శోకా ర్తితో ముంచెత్తినాయి తాంతియా మైనాను వదిలి ఒక్క మాసమేయైంది ఒక్క మాసంలోనే యెన్నెన్ని మార్పులు! అతడు వెళ్లిన తరువాత క్షణక్షణానికీ మార్పులే!

తాంతియా మైనాను అమితంగా ప్రేమించాడు ఆమెతో సెలవొందిననాడు ఆమె పలికిన పలుకులు ఇప్పుడు కూడా అతని చెవుల్లో గింగురు మంటున్నాయి—"తండ్రి గారు నన్ను చూడ్డానికి కూడా యిష్ట పడరు మీరు నా బాల్యంనుండీ నన్ను పెంచారు తెలివి వచ్చిన తరువాత నా గురుదేవులయినారు. తండ్రి అలుక వహించిన మీరే రక్షకు లయినారు నేడు మీరు కూడ నన్ను వదిలి వెళ్ళుదురా ?" ఆమె అశ్రుధారలూ, నిరాశాంకిత దృక్కులూ, దీనవదనం అతని కళ్లకు కట్టింది అతని ఆశ నిరాశయైంది అతని మైనా శాశ్వతముగా అతనికి దూరమైంది తాను వెళ్లినందుకే కదా యిదంతా జరిగిందని ఆతడు తన్ను తానే నిందించు కొన్నాడు

చాలాసేపు వరకూ తాంతియా రామపాలురు మౌనంగా వున్నారు.

"రామపాల్, విశదంగా యేం జరిగిందీ చెప్పవూ ?"— నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ తాంతియా అన్నాడు

"మహాశయా, అలజడి జరిగిన రెండవదినమే నానా తన అనుచరులతో యెక్కడికి వెళ్లినాడో యెవ్వరికీ తెలీదు."

"మరి మైనా ? ఆమె అతనివెంట వెళ్ళలేదూ ?"

"లేదు బహుశా నానా ఆమెను కూడ పిలిచి యుంటాడు ఆమె వెళ్ళలేదు ఒకనాడు నానాగారి శిధిల ప్రాసాదంవద్ద మైనా బధింపబడింది

"తరువాత ?"

"నానా తరువాత మైనాయే పితూరికి నాయకత్వాన్ని వహించి యుండునని ఆంగ్లేయులు సందేహించారు. దానికి కొన్ని నిదర్శనాలు కూడా దొరికాయి మీ లేఖలు కొన్ని

(తరువాయి 95 వ పేజీలో)

సీరియల్ నాటిక

భక్తిలీల

శ్రీ లంక శ్రీనివాసరావు

[ఇంతవరకు జరిగిన కథ —మధుసూదనుఁడు, శాంత బీదబ్రాహ్మణదంపతులు వారికి ఒక బిడ్డ యాయవారం వారి జీవనోపాధి శాంత సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను మోహించిన రెడ్డి, వారికొక ఆవును దూడను కానుకగాయిచ్చి, భర్త యింటలేనిసమయమున శాంతను బలవంతపరచ పోగా త్రినాథులు వ్యాఘ్ర రూపములు దాల్చి శాంతను రక్షింతురు ఆవు దూడతప్పిపోగా మధుసూదనుఁడు వెదకుచున్నాఁడు]

రంగము ౨

[ప్రదేశము మార్గము
ప్రవేశము మధుసూదనుడు—ఆవును వెదకుచుండును]

మధుసూదనుడు

సీ॥ ఆధార మూర్తివై । యత్యద్భుతంబుగ
జగముల గాంచెడి । నిగమ వేద్య !
ఎల్ల దిశాతతి । సెనలేని దీప్తిని
ప్రసరింప జేయు ప్ర । భావ చరిత !
సకల చరాచర । సఖుడవై తండ్రివై
గురుడవై జరియించు । పరమ పురుష
కార్య కారణ భావ । కలితుండవై విశ్వ
పాలన జేసెడి । పావ నాత్మ !
తే॥ గీ॥ సర్వ శబ్ద వాచ్యుడవైన । సర్వ మయుడ !
చిత్త శాంతిని ఘటియించు । చిన్మయుండ !
హేతు భూతాధి నాయక । పూత చరిత !
పాహి మాం ! పాహి మాం ! దేవ ! పాహి ! పాహి !

దేవా ! ఇంకనైన కరుణ గలుగదా ! ఆవు జాడయే దోచుటలేదు. వేళ మిగులుచున్నది నా పసిపాప యాకటి బాధకు "అమ్మా !"యని ఎంత విలపించుచుండెనో— ఆవు దూడ "అంబా !"అని ఎంత అరచు చుండెనో ! (మార్గమును దిలకించి) అదుగో ! ఆ వచ్చుచున్న బాటసారి నడిగి ఆవుజాడ దెలిసికొందును.

(ప్రవేశము బాటసారి)

మధు అయ్యా ! నీకొక ఆవు కనిపించినదా ?

బాట ఏంటీ ! ఆవా ?

మధు ఔను

బాట కర్రి చారేనా ?

మధు ఆ ! అదే నాయనా ! ఎటు వెళ్ళినదో చెప్పుము.

బాట నెత్తిపై మచ్చవుంటుంది—సూది కొమ్ములదికదూ ? కలవ తోక కూడా వుంటుంది

మధు ఔను, అదే నాయనా ! అదే !

బాట నిన్ననో మొన్ననో చూచి నట్టుయింది ఏమో ! వెతుకు ఎక్కడకు పోతుంది ?- వెతికితే / అదే దొరుకు

తుంది. (పోవును) (మధుసూదనుడు కొంచెము దూరము నడచి పోవును)

[తిరిగి మధుసూదనుడు ప్రవేశించును]

మధు

తే॥ గీ॥ చండ భానుని కిరణ ప్ర। చండ ధాటి
భూ నభోంతర మెల్లను। బొంగి పొరలి
కఠిన మగు ఎండ మావుల। గాల్చుచుండె
జగతి భరియింప జాలక। బొగులు చుండె

ఆహా ఎండ మిక్కుటముగా గాచుచున్నది. కొంచెమేని గాలి వీచుటలేదు శిరస్సు మండి పోవుచున్నది పాదములు కాలి బొబ్బ లెక్కినవి ఒక అడుగైనను వేయ జాలను. ముచ్చెమటలు గారి తాపమతిశయించు చున్నది దాహము, దాహము. నాలుక తడియారుచున్నది ఎక్కడ నొక చెట్టైనను గనిపించుట లేదు. —ఉదయమున కుటీరమును విడిచి తిని అచ్చట నా భార్యా బిడ్డలగతి ఏమి జరిగనో తెలియదు ఎట్టి యిక్కట్టుల ననుభవించు చుండిరో! దూడకు పాలులేవు పిల్లవానికి పాలు లేవు—తిరుగని ప్రదేశములు తిరిగితిని. ఆవుజాడ చిక్కుటలేదు హా! దైవమా! ఇంకను కష్టముల పాలుజేసి పరీక్షించు చుంటివా?

(ఒక బాటసారి త్రోవను బోవుచుండ వానితో)

అయ్యా! నీకొక యావు కనుపించినదా?

బాట లేదు ఈ దినం జరుగుతూన్న సంతలో వెతికితివా?

మధు లేదు

బాట అయితే, యిలా వెళ్ళు ఇక్కడికి కొంచెం దూరములో సంత జరుగుతూంది సంతలో వెతికితే దొరకవచ్చు

మధు అట్లే, వెళ్ళెదను [నిష్క్రమింతురు]

(తెర వ్రాలును) [సశేషము]

★

(93 వ పేజి తరువాయి)

మైనావద్ద లభించినాయి ఆ లేఖలలో మీరేమి వ్రాశారో చెప్పలేను. కాని మైనా అపరాధముపై విచారణ జరిగింది ఆమెను సజీవముగానే అగ్ని జ్వాలలకు ఆహుతి చెయ్యాలని తీర్మానమైంది. ఆమెను ఒక కొయ్యకు కట్టి సజీవముగానే అగ్ని దాహం చేశారు. —“రామపాలు కంఠం గద్గదికమై పోయింది అతడిక పలుకలేక పోయాడు.

“హే భగవాన్”—అంటూ తాంతియా శోకాతిరేకంతో ఒక దీర్ఘనిశ్వాసాన్ని వదిలినాడు—“రామపాల్, మైనా దహింపబడ్డ స్థానానికి నన్ను తీసుకెళ్లు”

“ఇలారండి”—అంటూ రామపాలు సమీపంగానే వున్న ఒక స్థలానికి వెళ్లి అక్కడ నిలబడినాడు, మైనా ఇక్కడే సజీవంగా దహింప బడింది చితి చల్లారి యుంది. చితాభస్మం, అస్థి పంజరం మాత్రం అక్కడే చెదిరివుంది ప్రదేశం నిర్జనమై, నిశ్శబ్దమై, నిశ్చల నీరవతను మూర్ఛపోయింది

తాంతియా నలుదిక్కులూ తన శూన్య దృక్కులను ప్రసరించాడు తరువాత రుద్ధకంఠంతో అన్నాడు—మైనా నా బిడ్డా నేడు పూర్ణిమ నేడే నిన్ను కలుసుకొనుటకు మాట యిచ్చియుంటిని. ఇదిగో, నేను వచ్చాను మైనా నేను వెళ్లునపుడు ‘ఎందుకో నేడు నా మనస్సు ఆదోలాగుంది బహుశా మిమ్మల్ని మళ్లీ కలుసుకో లేనేమో’ అని నీవన్నావు. నీ మాటలను నేను నమ్మలేదు అర్థం చేసుకోలేదు. అబ్బా నేనెంత మంద బుద్ధుడను! మైనా నీకు నాపై యెంత ప్రేమవున్నదీ నాకు తెలుసు అందుకే మీ తండ్రితో కూడ వెళ్ళుటకు నిరాకరించినావు. మైనా, నన్ను నీవు మళ్ళీ కలుసుకోలేననునది నేను గ్రహించియున్న, నిన్ను ఆ రోజే నా వెంట ఝాన్సీకి తీసుకెళ్లి యుందునే”


తాంతియా శోకార్తితో విహ్వలుడై నాడు. కొన్ని క్షణాలకు రామపాలు కన్నీటిని తుడుచుకొంటూ అన్నాడు—“మీ దుఃఖాన్ని దిగ మ్రింగండి గురుదేవ్ మీ శోకాన్ని, తిలకించి మైనా ఆత్మకు శాంతి కలుగుతుంది

“మైనా నీవే లోకంలో వున్నా సుఖంగా వుండు తల్లీ నీ వృద్ధ గురుదేవుని క్షమిస్తావు కదూ? మైనా నీ తండ్రి యిక తన జీవితాంతం వరకూ నిన్నే స్మరిస్తూ నీకయి వేదన పడుతూవుంటాడు నీవు నా కిక లేవు నీ చితా భస్మమే యిక నా జీవితానికి ఆదర్శ ప్రాయమౌతుంది. ఇందులోనే నీ దర్శనాన్ని పొందుతుంటాను”

తాంతియా కన్నీరును తుడుచు కొన్నాడు. అమితమైన శ్రద్ధాభక్తితో ఓ పిడికెడు చితా భస్మాన్ని తీసుకొని తన రుమాలులో బంధించాడు.

[హిందీ మాసపత్రిక ‘సరస్వతి’ నుండి]

★



అందమైన
ఆట దుస్తులు

కో-ఆప్టెక్సు

కో-ఆప్టెక్సు వస్త్రాలతో కుట్టిన సూట్లు, శ్లాక్‌లు, షర్టులు చురుకుదనం యిస్తాయి ఆ దుస్తుల ఆకారం చెడిపోకుండా వాటి ఆకర్షణను అట్లే పెట్టుకుంటాయి ఎండకు వెలసిపోని రంగుతో సొంపారుతూ పురుషులకు నచ్చుబాటైన రకములలో కో-అప్టెక్స వస్త్రాలు ప్రత్యేకంగా తయారుచెయ్యబడ్డవి

అతి మృదువుగా, మడతలు మడిగిపోకుండా ప్రత్యేక నాణ్యంకలవి వీటితో చల్లదనం, హాయి, ఆనందం కలుగుతాయి పరిశుభ్రంగానూ, అపురూపంగానూ కూడా వుంటాయి ఇంత చేసికూడా వీటి ధర సరసం

మా ఎంపోరియములలో దొరకును

మద్రాసు హాండ్‌లూం వీవర్సు ప్రొవిన్షియల్ కో-ఆపరేటివ్ సొసైటీ, లిమిటెడ్

"హాల్‌వేస్ గార్డెన్సు", 34, పాంధియన్ రోడ్డు, ఎగ్మూరు, మద్రాసు

భిన్నాభిప్రాయాలు

"దేవి"

[జరిగిన కథ రామం, రఘుపతి, మోహన్ అను ముగ్గురు సహాధ్యాయులు విద్యానంతరం, రఘుపతి ధనాధికురాలిని, రామం విద్యాధికురాలిని, మోహన్ సంఘ సేవాపరాయిణిని కోరి వివాహం చేసుకుంటారు ముగ్గురు సంసారాలను గూర్చి యిక ముందుచదువుతాం]

రాము యిల్లు చిన్నది రెండు గదులు శుభ్రముగా అమర్చినవో టేబిలువద్ద కూర్చొని రామం, సుభద్ర ఆఫీసు పని జేస్తున్నారు.

"మంచి పర్సనల్ అసిస్టెంటునే సంపాదించాను సుభద్రా! నాలుగు సంవత్సరాలు దీక్షతో సేవ జేసిన నా కళ్లు తక్కువ లాభాన్ని పొందలేదు. రాత్రి పన్నెండైనది. ఈ వ్రాత కోతలలో నీ వెందుకు యిదయిపోతావు?"

"'కార్యేషు దాసి' అన్నారండి పెద్దలు మన భాగ్య దేవత ప్రసాదించిన యీ గుమాస్తాగిరి వరాన్ని యిద్దగము అనుభవించిన నాడే యీనాడు మేముకోరే సమాన హక్కులను బొందినదాన నౌతాను"

"ఇలాంటి హక్కులను గోరితే మా పురుష ప్రపంచం లెక్కకు మించినన్ని బ్రసాదించుటకు సర్వ సంసిద్ధులము దానికేమిగాని నాకొక సంశయ మప్పుడప్పుడు కలుగుతుంది సుమీ!"

"ఏమిటండీ? చెప్పదగినదేనా?

"చదువుకున్న స్త్రీలంతా నీలాగే ప్రవర్తిస్తే యీ కాకిగోల యెందుకు బుట్టిందా అని—చదువుకున్న పిల్లను జేసుకుంటానంటే 'ఓరి నీ ఖర్మమేమిరా? నీ బ్రతుకు నెందుకురా నాశనము జేస్తావు?' అని అంటారు"

"మీకు గూడ యీహితబోధ జరిగిందా?"

"నాకేమైన కొమ్ము లొచ్చాయా?" సుభద్ర కండ్ల ముందు తన కాలేజి వొక్క మారు తళుక్కున మెఱసింది స్త్రీలు యెంత చదివిన వానిని జేసుకొంటే అంత గౌరవమని భావిస్తారు. పురుషులేమో యెంత చదువు తక్కువదానిని జేసుకుంటే అంత గౌరవమని భావిస్తారు గాబోలు. స్త్రీలకు యీ చదువు వద్దంటారు భౌతికశాస్త్రము, గణితశాస్త్రము, స్త్రీలకేమి వుపయోగమని వాదిస్తారు స్త్రీలు యిల్లు చక్కబెట్టుకుంటే చాలదా అంటారు. ఆ వాదనలన్నీ నిజమైనవే గణిత శాస్త్రము, తదితర శాస్త్రాలు, కేవలము వుద్యోగాలిచ్చుటకే వుపకరిస్తున్నవా? అంతకన్న ఆ విజ్ఞాన ప్రపంచమునకు యెక్కువ విలువలేదా? మానవునియొక్క వాంఛ ఆకలి దీర్చుకొనుటయేనా? విజ్ఞానోపార్జన ప్రతి మానవునియందు నిబిడీకృతమైన వాంఛ మానవునియొక్క తెలివి తేటలనుబట్టి వసతులను బట్టి యీ వాంఛను తృప్తి పరచుకుంటాడు ఈ వాంఛకు లింగభేదము లేదు. ఇట్టి విజ్ఞానోపార్జన భిన్న రీతులుగ నుండవచ్చును కృషి జేయవలసిన మార్గములు వేరు గావచ్చును కాని ఆ మార్గములు స్త్రీలకు వెక్కు ప్రత్యేక కళాశాలలు స్థాపించి జూపువరకు విజ్ఞాన ప్రపంచములో వీరికి గిరి శిఖరాలనందుకునే ప్రజ్ఞ నాస్తిజేసిన యెడల మానసికాభి వృద్ధి వీరిలో సంకుచితమైపోదు? చదువుకున్న స్త్రీలు డబ్బు వ్యయము జేయుదురనుట వితండవాదము. ఖర్చు జేయు వారికి చదువను బురఖా అవసరములేదు.

"సుభద్రా, యేమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?"

"ఏమీ లేదండి"

* * *

మోహన్ ఆనాడే జీత మందుకున్నాడు "సునీతి యివిగో జీతపురాళ్లు. ఎలా పొదుపు చేస్తావో. నీ దీపావళి చీరగూడ యీ డబ్బులోనే కొనాలి."

"దీపావళి చీరేమిటండీ. సంక్రాంతి బట్టలకు కూడ దాచనూ! కాలేజీ రోజుల్లో అన్నీ తియ్యని మాటలే సునీతి జీవితము రోజాపూలపాన్పు. కోరిన వస్తువులకు కొరవ లేదు

అవన్నీ ఆనాటి కబుర్లు. ఈ వయసులో సుఖపడక పోతే ముసలివారమైన తరువాత పొందుతారూ బ్రహ్మానందం? ఇంటివద్ద పదెకరాల రాబడి ఆడబడుచుల చీరెలకు సారెలకు, అత్తగారి ఖర్చులకు సరిపెట్ట మనండి ఇక్కడ మాకు కాణీ కాణికి పిసినిగొట్టు వారిలా ఖర్చుకు భయపడుదాము ''

"అమ్మయ్య, పూర్తి జేశావు సునీతీ, యెలాగూ నీవు బి యస్. సి చదివావు? నేనేదో హోటలులో దింటూ మూడు సంవత్సరాలు గడుపుతాను. యం యస్ సి అనిపించు కుంటివా ఓ కాలేజిలో లెక్చరరువౌతావు వెలలేని రత్నాన్ని సరస్వతి దేవికి కానుక నిచ్చిన కీర్తి దక్కుతోంది నాకు ఏమంటావు లెక్చరర్ జీ?''

"చాల్లెండి మీ వాదాలు సినీమాకు టైమైనది లేవండి" మోహన్ సినిమాకు బోవాల్సిందే సునీతి అలంకారము పూర్తిజేసుకొని హాలులోకి వచ్చింది ఇంకేముంది? ఒక చిన్న సైన్యమనవచ్చు కుర్చీలనిండా వున్నారు. సినిమాకు వెళ్లనివ్వక యీ గుంపు యెక్కడినుంచి వచ్చిందా అని విసుగుతో సునీతి అలాగే ద్వారమునకు జేరబడి నిలబడి పోయింది

"సునీతీ, సురేంద్ర నిన్ను అధ్యక్షురాలుగా నుండుటకు వొప్పుకొనమని, నన్ను రెకమెండు జేయ మంటున్నాడు. ఇదేమిటో కాస్త వాడిగోలవిను

"చెప్పవోయ్ సురేంద్రా ఆమె వొప్పుకుంటే నాకేమి అభ్యంతరములేదు ''

"మా యూనియను ప్రారంభోత్సవము జరుప బోతున్నామండి మీరు విద్యావతులు గనుక, సంఘ సేవయనిన మీ దంపతుల కభిమానము గనుక, మా యూనియన్ తరపున మిమ్ములను అధ్యక్షత వహించమని వేడుకొంటున్నాను"

"ఎప్పుడండీ సమావేశము?''

"రేపు సాయంకాలము''

"రేపు వుదయాన జెబుతానండి''

"సంతోషం. నిరుత్సాహపరచకండి'

అధ్యక్షుని వేట తేలికగా ముగిసినని సంతోషంగా వెళ్లి పోయాడు సురేంద్ర.

"ఏం సునీతీ, పాపంవాళ్ళ ప్రార్థన నేమి జేస్తావు?"

"అంతకన్నా నాకు పనియేమున్నది మరి? మొన్న మా స్త్రీల మీటింగు జరుగుతుంటే వీళ్లుజేసిన అల్లరి అంతింత గాదు నాలుగు అడిగి వెళ్లిపొమ్మని జెబుదామనుకొన్నాను గాని - రేపు మీరే చెప్పి వేయండి వీల్లేదని సినిమా కాలస్యమై పోయినది వీళ్ళ పుణ్యమాయని ''

మరునాడు సురేంద్ర మోహన్ యింటికి వెళ్ళగానే మోహన్ వీల్లేదన్నాడు సునీతి అంగీకరించదని సురేంద్రకు తెలుసు మొన్న మొన్నటివరకు అతను, అనుచర బృందమూ ఆమె బండి చుట్టుజేరి 'మిస్. స్టెలో' అంటూ బండి యిల్లు జేరేవరకు మొఱిగేవారు ఇంతలోనే ఆమె అవన్నీ మరచి పోయి యుంటుందా! ప్లాను తారుమారైంది

"మోహన్, సుభద్ర నడిగి చూస్తాను ఆమేమంటుందో మాతో కాలేజిలో చదివింది మేము యూనియన్ల ప్రారంభోత్సవాల్లో యున్నాము గాని ఆమె యెప్పుడో డిగ్రీ బుచ్చుకొన్నది"

రామం యింటికి వెళ్ళి సురేంద్ర 'రామం, రామం' అంటూ కేకవేశాడు సుభద్రచూచి సహపాఠిని ఆహ్వానించింది.

"వచ్చిన పని మీతో నేనండి కాని రామం వుంటే యెంతో బాగుండేది"

"ఏమిటి విషయము?'' వచ్చిన పని జెప్పాడు సురేంద్ర.

"మీకభ్యంతరము లేకపోతే ఆఫీసుకు వెళ్లి మీవారి పర్మిషను దెస్తాను"

"ఇదేమంత కాని పని గాబట్టి మావారి పర్మిషను గావాలీ సురేంద్రబాబు? నాకు వచ్చుట కిష్టములేదు"

"మీ అభ్యంతరము?"

"ఇవన్నీ పురుషులకు సంబంధించిన పనులని నా వూహ. మీకు కావలెనంటే భీష్మాచార్యులవంటి జగద్గురువులు సంఘ సేవకై జీవితాలను ధార పోసిన పురుషోత్తములు దొరకక బోరు యువతులు ప్రపంచ జ్ఞానము అట్టేలేని వారు భయపడుతు, సిగ్గుపడుతు ఆస్థానాన్ని అలంకరించడము దేనికి చెప్పండి?"

భిన్నాభిప్రాయాలు

"పురుషులకు సంబంధించిన పనులంటూ మీరు మీటింగులలో పాలిటిక్సులో యేమి జోక్యము కలిగించు కోనేట్లు లేదే మీరు కాలమెట్లు గడచుచున్నది? క్లబ్బుకైనా వెళ్ళుతారా?"

"క్లబ్బులంటే నాకసహ్యములేదు పదిమంది స్త్రీలు కలుసు కోవడానికి అది మంచి యేర్పాటేగాని నాకు వెళ్ళుటకు వీలుగాదు క్లబ్బు మా యింటికి రెండు మైళ్ళ దూరమున యున్నది నడిచి వెళ్ళలేను అద్దె బండియనిన పెద్ద ఖర్చు రామం జీతముతో యింత పెద్దఖర్చు వారిపై రుద్దడము నా కిష్టము లేదు"

"మీరు ప్రొద్దుబుచ్చడమెలా? ఇంటి పనులు జేసినా బోలెడంత కాలము మిగిలి పోతుందే?"

"మాలాంటి వారికి మహాత్ముని దివ్య సందేశముండనే యున్నది కదండీ నిర్మాణాత్మకమైన సంఘ సేవ జేయాలంటే—అజ్ఞానము, బీదరికము తాండవించే మన దేశంలో యెక్కడబడితే అక్కడే వీలౌతుంది మా యిల్లే ఒక చిన్న క్లబ్బు. రామం ఆఫీసుకు వెళ్లిన తరువాత మా యింటిచుట్టు నున్న నాలుగు కుటుంబాల స్త్రీలు వస్తారు. అంతా పేద వారే గనుక వారికి నా మిషను యిచ్చి వారికి కుట్టు నేర్పు చున్నాను ఒక్కొక్కరు నెలకు చిన్నచిన్న ఖర్చులకు సరి పడు డబ్బు సంపాదించుకొను చున్నారు. భర్తలు సంపాదించే దానికి వారి సంపాదన జేర్చి సుఖపడు చున్నారు. అదేగాక వారు కాలయాపనకై చేయు పొరుగింటి ముచ్చట్లను మాన్పించాను మా ప్రక్కింటి రమణయ్యగారి కూతురు పదిహేను సంవత్సరాలకే ముండమోసింది ఆ అమ్మాయిని ఆంధ్ర మెట్రికులేషను పరీక్షకు కోచింగు యిస్తున్నా ఇలా నాచేతనయిన సహాయం జేస్తు కాలము చాలా ఆనందముగ గడుపుచున్నాను"

"ఇంతకు మీరు వొప్పుకోనన్నారు ఈ రోజు అధ్యక్షునికై యెవరెవరిని బ్రతిమాలవలెనో!"

"బ్రతిమాలడ మెందుకు? అడిగితే ఆనందముతో వచ్చే వారు మన ప్రొఫెసర్లలోనే యున్నారు. వెళ్ళిపిలవండి"

* * *

రఘు గొప్పవారి బిడ్డ సరళ కాపురానికి వచ్చి రెండు నెలలైనది. పట్టణవాసపు హడావిడి నెరుగక, తల్లిదండ్రుల వద్ద నతిగోముగ పెరిగినదామె సరళ యెంత దయాస్వరూపిణో అంత పెంకి పిల్ల కాలేజి పిల్లలనుజేసుకుంటే యింటికి రచ్చకు అట్టే భేదముండదని భావించిన రఘుపతికి సింహద్వారము వైపుజూడని భార్య దొరికింది ఎవరు చూచిన అంత చక్కని సంసారము మరియొకటి లేదంటారు కాని రఘుముఖం జూస్తె తీరని అసంతృప్తి గోచరమౌతుంది దేనికి కొదువ?

"సరళమ్మా, యీ పూట గూడ అన్నము తినక పోతే అయ్యగారితో జెప్తా మరి నీయిష్టం"

"సీతమ్మా, నువ్వుగాని జెప్పితివా నేను ఊరెట్టుకు జస్తా నా జోలి నీ కెందుకు?"

"సినిమాకు యీ రోజు గాదన్నా రేపో తానం మానడం, అన్నం మానడం, ఏమిటమ్మా గొప్పోరింటి పడుచు జేయాల్సినపనేనా? చింపిరి జుట్టు జూస్తే ఆ బాబు గారి కెంత కోపమో దెలుసు గదా?"

"ఓస్! వారికి కోపమొస్తే నా కెంత భయం?"

సరళ మూర్ఖత్వాన్ని సీతమ్మ (దాది) యెన్నో విధాల కప్పిపుచ్చేది. సరళకు సీతమ్మకు వాదోపవాదాలు జరగడం రఘు వొక్కొక్కనాడు విన్నా పట్టించుకునే వాడుగాడు సీతమ్మ కొడుకు జ్వరంతో మంచ మెక్కినాడని విని ఆమె స్వగ్రామం వెళ్ళిపోయింది సరళకు ఆమె పెద్దలు యింటి పనులేమి నేర్పలేదు సీతమ్మ లేనందున ఇంటి పనులు జూచుకోవాలి, వంటజేయాలి. శుభ్రము విషయములో రఘును తృప్తిపరచడము కష్టము ఇల్లు అద్దమువలె నుండునట్లు సీతమ్మ యజమాని అభిరుచి నెరిగి తీర్చేది సరళకు గూడ యెన్నిమారులో జెప్పెడిదికాని సరళ ఆ మాటలను బట్టించుకోలేదు

ఒకనాడు రఘు బజారునుంచి పన్నెండు గంటలకు యిల్లు జేరాడు తన యిల్లో కాదో అనే సంశయము వచ్చేటట్లు సామానంత చెల్లా చెదరుగ వేసి యున్నది ఎక్కడ బట్టినా కాగితాలు, వార్తా పత్రికలు చీదర గలిగించు చున్నది సరళ యేమి జేస్తున్నదో చూద్దామని వంటయిల్లు జేరెను పొడుకట్టెలు మండిచస్తేగా ఎలాగో అన్నము వండినది కాని కూరలు జేసేదెలా. వస్తువులన్ని చిందరవందరగ ఇంటి

నిండా పరచినట్లున్నవి మండు వేసవిలో యింటికి వచ్చే సరికి గృహిణి నిపుణతకు కోపము వచ్చింది రఘుకు

"సరళా, నీ తల్లి తండ్రులు పదహారు సంవత్సరాలు యింటిలో వుంచుకొని, చదువు నేర్పించలేదు సరికదా వంట గూడ నేర్పలేదే ఇల్లుజూస్తే రైలుప్లాటు ఫారాన్ని కన్నా అధ్వాన్నంగా వున్నది. సీతమ్మ లేక పోతే ఈ యింటి గతేమిటో"

అసలు పొగతో కళ్లు చింతనిప్పులై పోయి భరించరాకున్నవి. దానికితోడు రఘు మాటలు "మీకంత కష్టంగా వుంటే మావారి దగ్గరకు బంపి వేయండి నావల్లగాదీచాకిరి జేయను వంట జేసే సీతమ్మకున్న గౌరవము గూడ లేక పోయిన యీ యింటిలో నేను కాపురము చేయ్యాలని మా అమ్మ నన్ను పెంచలా" అన్నది

"మరిదేనికి బెంచారేమిటి? హద్దు మీరి మాట్లాడుతున్నావుగాని"

"నేనేమి హద్దులుమీరి తిరుగలేదు. మీ మోహనరావు భార్యలాగ వేషాల బొమ్మలాగ వీధుల వెంబడి తిరుగలేదు నన్నెందుకలా యెంచుతారు?"

"ఈ యెడ్డి మృగము వేషాలు, పెంకిజవాబులకు యేమి ఫరవాలేదుగాని భర్త నన్నివిధాల సుఖ పెట్టి వీధిలో నడిచి పోతే తప్పు!"

ఇట్టి వాదోపవాదాలు వారికీనాడు క్రొత్తగాదు మాటమాటకు జవాబు లిచ్చుట రఘు మనస్సుకు బాధ కలిగిస్తుందని సరళ గమనించలేదు ఆమె లేత హృదయము ఆజ్ఞలకు లోబడదని, చల్లని స్నేహము పెంపొందించుకుంటే వారానందంగా జీవించవచ్చని సైకాలజీలో ఫస్టుక్లాసు దెచ్చుకున్న రఘు గుర్తించలేక పోయాడు. సంసారములో శాంతి లేక పోతే యెంత సంపదున్నా యేమిలాభము?

కొన్ని మాసాలనుంచి రఘు ముఖములో గనుపించుచున్న విచార రేఖలను గుర్తించిన రాము మనస్సు కరిగి పోయినది. గృహస్థుడు గాబట్టి కొంతవరకు కారణము గూడ వూహించాడు. ఒకనాడీ స్నేహితులు నది గట్టునజేరి యేదోకబుర్లు ప్రారంభించారు.

"ఎలాగున్నది రామూ నీ వుద్యోగము? మనము యిలా తీరుబడిగా కూర్చొని మాట్లాడుకొని అప్పుడప్పుడే సంవత్సరమయినది సుమీ"

"ఇంత మధురమైన సంవత్సరము నా జీవితములో గడపలేదురా, కాలేజి విద్యార్థిగా నున్నప్పుడు సుఖంగా వుండేవాణ్ణేగాని యిదొక రకమైన ఆనంద జీవితము"

"అదృష్టవంతుడివి."

"నిన్ను నేనామాట మందనలేదా"

"ఆనంద మయుడివి గాబట్టి అదృష్టవంతుడవు కాని నేనెట్లవుతాను?"

"నీ యిల్లు బంగారముగాను, నీకు యేమిలోటనిరా యీ యేడుపు?"

"కడుపు జించుకుంటే కాళ్లమీద బడుతుంది"

"రఘు, నీకు నేను పరాయివాణ్ణా? అసలు నీవింత బాధపడుటకు కారణమేమో నాకు దాచక చెప్పు"

"సరళకు నాకు వొక్క విషయములో గూడ పొత్తు గుదరడము లేదు. అది యెడ్డి మృగము. ఎప్పుడు అమ్మ, నాన్న ధోరణేదప్ప తన సంసారమనే మాటేలేదు పసిపిల్లా అలా బెంగెట్టుకోను? ఈ వేషాలంతా జూస్తే నాకేమో అనుమానంగా యున్నది"

"ఛీ, ఛీ, మొదటినుంచి నీ బుద్ధి యిలాగేయేడుస్తోంది. పల్లెటూరి పిల్లగాబట్టి నవనాగరిక లక్షణాలలబడి యుండవు. సంశయించి హింసిస్తున్నావన్నమాట!"

"హింసించడము కూడానా? నా మనస్సులోని వులుకు స్నేహితుడవు గాబట్టి నీతో అంటున్నాను"

రామం దీర్ఘంగా ఆలోచించ సాగాడు సుభద్ర వీరిరువురి మధ్య స్నేహాన్ని పెంపొందించ గలదని నిశ్చయించుకొని రఘుతో జెప్పెను.

"అంతైతే అనుకోవడ మెందుకురా? ఒకరితో స్నేహము జేసేపాటి గూడానా?"

"ఒరే నీవు వ్యాపారములో దిగి శుద్ధ పశువ్వై పోయావు సైకాలజీ పూర్తిగా మరచిపోయావల్లే యున్నది సృష్టిలో స్నేహము వాంఛించని జంతువులు గూడ లేవు."

భిన్నాభిప్రాయాలు

సరళ సుభద్రలీనాడు స్నేహితులు తరచు వొకరింటి కొకరు రాకపోకలు సాగిస్తున్నారు సుభద్రకు రఘు వేయి నమస్కారాలు జెప్పకుంటున్నాడు. వారిల్లిపుడొక స్వర్గ ధామం అప్పుడే సరళ యింటికి పేరంటానికి వెళ్లి వచ్చిన సుభద్ర భర్తకేవో కబుర్లు జెప్పుచున్నది

"అయితే సుభద్ర, వారి మధ్య యీ కీచులాటకు కారణమేమంటావు? ఆ వెధవ ఆమె శీలాన్నిగూడ శంకించాడు"

"మగవారికి చేతనైనపని అదొక్కటేనండీ. నేనుజూస్తు ను పల్లెటూరినుండి వచ్చే ధనవంతుల పిల్లలందరు పెమించు యిదే ధోరణి ఇంటిలోని అమ్మమ్మలు ఈ బెంచుతారు పిల్లలు గోరిన వస్తువు లివ్వడము దప్ప ఫర్తలు నేర్పరు. పని నేర్పరు చదువుగూడ బాలికల ఎసారము. పిల్లలు పెంకి వారయి పోతారు వారి కి జవాబులు అమ్మమ్మలు విని ఆనందిస్తారు భర్తలు ఎని సాధిస్తారు నిరసనంటే యేమిటో యెఱుగని బాలిక వొక్కమారు ఓ డజను ఆర్డర్లను భర్తవద్దనుంచి పొందగానే అన్నీ కాదు పొమ్మంటుంది తెలివిగల మగవాడైతే నెమ్మదిగా నచ్చ జెబుతాడు భర్తల హక్కులని ప్రత్యేక ప్రపంచములో గిరిగే మీ మిత్రుడివంటి వారైతే ఆ బాలిక మనస్తత్వము గ్రహించలేడు మాటమాటకు వాదాలు, కలహాలు సరళ చాలా మంచిపిల్ల వేనేది నవనాగరికతా లక్షణయుం టానో నావలెనే ఆమె చేయను ప్రయత్నము జేస్తున్నది ఆమెకున్న తెలివి తేటలలో నాకు సగము కూడా లేదు మరి నేడు యింకొకరికి జెప్పగలిగానంటే మీరు నా మనస్తత్వాన్ని గమనించి పెంచుతున్నారు. సునీతిని అందరు గౌరవిస్తున్నారంటే ఆమె భర్త ఆమె అభిరుచులకనుగుణంగా సంచరించుచున్నాడు వారు సుఖముగానున్నారు సునీతి విప్లవకారిణే వొక్కొక్కమారు ఆమె సంఘము యొక్క అవినీతిని బాహాటంగా గర్హిస్తుంది ఆమె భర్తను వొక్క యెదురు మాట జెప్పమనండి, మరునాడు సంఘమామెను కాకుల్లా పొడిచి వేస్తుంది మీ రఘుపతి గారికి జెప్పండి కాస్త తన కోపాన్ని తగ్గించుకోమని అప్పుడు వారికన్న సుఖజీవులుండరు"

★

కవి

శ్రీ కాండూరి నరసింహాచార్యులు

ఓ కళా తపస్వీ
ఓ ప్రియవచస్వీ

ఆకాశ సౌధంలో
ఆనంద హంసవై
ఆడుతూ పాడుతూ
ఎగిరి పోదువు నీవు
ఓ కళా తపస్వీ

అమృతంపు ఝురులలో
క్రొందేన సోనలో
ఆనంద సౌధంలో
ఆటలాడెద వీవు
ఓ కళా తపస్వీ

భావనా తీతవశా
మధుర భావంబులను
మంజులంబుగ నీవు
రంజిల్ల చేయుదువు
ఓ కళా తపస్వీ

నవ వసంతము జిల్కు
ప్రకృతి పుంజమ్ములా
కలము చేతను బట్టి
పరిపూర్ణ చంద్రికలు పరిఢ
విల్లగ జేతు
ఓ కళా తప

ప్రేయసీ!

చెఱుకుమిల్లి భాస్కరరావు

ప్రేయసీ! ప్రేయసీ! ప్రియుడనే—
నిండు పున్నెమ రోజు
పండు వెన్నెల లోన
ఆనాటి ఆపాట
అంతరించిం దేమొ
మరిపాడు టెప్పుడో
మనసు తీరుట ఎపుడో!

ప్రేయసీ! ప్రేయసీ! ప్రియుడ నే—
మరువలేనే నీదు
మనసు కదిపే ఆట
మందహాసము తోటి
మరులు గొలిపే మాట
మరి పర్వ మెప్పుడో
మది సుఖించుట యెపుడో!

ప్రేయసీ! ప్రేయసీ! ప్రియుడనే—
ప్రతి భాగ మెదలోన
ప్రజ్వలించే అగ్ని
అనురాగమున గాని
అణగి పోదోయేమో
మరిరాగ మెప్పుడో
మదిశాంతి పడుటెపుడో!

ప్రేయసీ! ప్రేయసీ! ప్రియుడనే—
మల్లెపూవుల సెజ్జ
మరచి పోయావేమొ
విడిపోని జంటగా
నడయాడి పాడేము
మరిమసలు టెప్పుడో
ముదము కలుగుట ఎపుడో!

ప్రేయసీ! ప్రేయసీ! ప్రియుడ నే—
మతిమాలె నీ ప్రియుడు
మనసు నిలుపగలేక
మందులేని వ్యాధి
మధువుతో నయమౌను
మరితేలక రెప్పుడో
మధువు చిలుకుట ఎపుడో!

ప్రేయసీ! ప్రేయసీ! ప్రియుడనే—
మనము వేరై యున్న
మనసు లొకటై యున్న
మచ్చలేని ప్రేమ
మాసి పోలేదెపుడు
మరిపయన మెప్పుడో
మనము కలియుట ఎపుడో!

ప్రేయసీ! ప్రేయసీ! ప్రియుడనే—

చిన్నకథ

దిశాంబరి

*** శ్రీమతి తాడికొండ రాధావసంత ***

౧

ఉత్తర విశాఖపట్నం జిల్లాలో, తాటివలస గ్రామంలో, ఊరిమధ్య ఉన్న రామన్న పంతులు ఇంటిలో రామన్న పంతులూ, అతని భార్యా, అతని ముదుసలి తల్లిదండ్రులూ, ఒక వెధవాడబడుచూ, ఆరుగురు పిల్లలూ అందులో పెద్దబ్బాయికి భార్యా ఇద్దరు బిడ్డలూ, రామన్నపంతులు ఆరుగురు పిల్లల్లో నలుగురు మగవాళ్ళు, ఇద్దరు ఆడపిల్లలూ మొత్తం పదునాలుగు ప్రాణాలు కాపరం ఉంటున్నారు

రామన్నపంతులుకి చెరువు క్రింద నాలుగెకరాల మాగాణి, పన్నెండెకరాల మెరకా ఉంది పెద్దకొడుక్కు చదువు ఫస్టుఫారంతో పూర్తి రెండోవాడు ఇంటరుమిడియటు విజయనగరంలో చదువుతున్నాడు తెలివయినఘటం అతనిపేరు జగన్నాథం మూడవ వాడు విజయనగరంలో ఫిఫ్తుఫారం చదువుతున్నాడు.

౨

రామన్నపంతులు ఆవీధిబడికి ఏకైకోపాధ్యాయుడు ఆ వీధిబడి రాబడి ప్రభుత్వంవారి ధర్మం వల్ల ఎనభై నాలుగు రూపాయల అయిదణాల నాలుగు పైసలు భూములవల్ల రాబడి పన్నుపోను రెండునూర్ల ఎనభై ఇది ఆ మహాకుటుంబానికి ఆధారం.

ఆ వూరు దరిద్రపూర్ణము. చదువుకొనే పిల్లలందరు మహా కుచేలోపాఖ్యాన పాత్రలు

విజయనగరంలో చదువుకునే పిల్లలిద్దరూ వారాలుచేసీ, చందాలు వసూలుచేసీ, చదువుకొంటున్నారు అందులో పెద్దవాడు చాలా తెలివయిన వాడు ఇంటరు పరీక్షకు వెడుతున్నాడు అఖిలాంధ్ర విశ్వవిద్యాలయంలో అతడు మొదటిగా విజయంపొందుతాడని అందరి ఆచార్యుల ధృఢనమ్మకం

౩

చీకటిని చీల్చుకు ఒక్క వెన్నెల కిరణం ప్రత్యక్షమయింది కాలం ఒకలా ఉండదు జీవితంలో ప్రయాణం చెయ్యగా చెయ్యగా ఎప్పటి కయినా దారికనిపిస్తుంది ఎన్ని కష్టాలు ఉన్నా ఓర్పు, ఆనందమూ ముఖ్యావసరం ధృఢమైన నమ్మకాలతో మనకు రాబోయే అదృష్టాన్ని ఊహించుకుంటూ నిత్యానందమూర్తిగా వికసించిపోయే వ్యక్తికి ఫలం ప్రత్యక్షమవుతుంది జగన్నాథం అద్భుతమయిన వ్యక్తి, తన అదృష్టం నందు, మనస్సునందూ, తనుచేయగల పనుల యందు నమ్మకంతో భగవంతునియందు విశ్వాసంతో జీవితంలో ఉత్తమగతిని ప్రయాణం చేసే గంభీర హృదయుడతడు అనుకోకుండా జగన్నాథం జీవితంలో చంద్రికా మధుర మందహాసం స్పందించింది

జగన్నాథం తెలివి తేటలు చూసి, రూపురేఖా విలాసాలు చూసి, ఒక భాగ్యవంతుడు, నరసింహారావు పంతులు తన పుత్రిక విద్యా

సుందరిని యిచ్చి ఆ బాల్యుణ్ణి ఇల్లరికం ఉంచుకుందామని ధృఢ నిశ్చయం చేసుకున్నాడు అతని కూతురు ఫిఫ్తుఫారం చదువుతోంది ఇతడా అమ్మాయికి ఇంటి దగ్గర చదువు చెప్తాడు అతనికి పదిహేను రూపాయిలు యిచ్చే వాడు నరసింహారావు పంతులు

నరసింహారావుపంతులు రామయ్య పంతులు గారితో ఈ విషయం మాట్లాడి సంబంధం నిశ్చయము చేసికోడానికి, ఉభయ ఖర్చులు తానే పెట్టడానికి, మొదలయిన పెళ్ళిషరతుల్ను తనపట్టు కోటు జేబులో దాచి పురోహితుణ్ణీ ఇద్దరు స్నేహితుల్నీ తీసుకొని బయలుదేరాడు

వారు ఊళ్ళోకి వచ్చారు ఆ విషయం కబురువచ్చి రామయ్య పంతులు భయ పడ్డాడు సంతోషంతో ఆకాశము అంటాడు

౪

సాయంకాలానికి కాబోయే వియ్యాల వారు వచ్చారు వూరిలో పెద్దలువచ్చారు రామయ్య పంతులు వీధిబడిలోని చాపలన్నీ తెప్పించి మండువాలో వేయించాడు

చివరకు తాంబూలాలు పుచ్చుకున్నారు వియ్యపరాలుగారేరీ అన్నారు

వంటింటి పక్కగదిలో గొణ్ణెంపై ఉన్న ఒక్క చీరా ఆరవయిచు కున్నది ఆ ఉత్తమా ఇల్లాలు అది ఆరలేదు ఏవో చిరుగులు పాత చుట్టబెట్టుకు తిరిగి వియ్యాలవారు రాగానే గది లోకి పరుగెత్తి తలుపు వేసుకున్నారు

పెద్ద అబ్బాయి వచ్చి "అమ్మా! తలుపు తీయవే! రావే! జగ్గిగాడి కాబోయే మామ గారు వెళ్ళిపోయి వచ్చారు నిన్ను చూస్తారట" అన్నాడు

"అబ్బిగా! నా చీర ఆరిందేమో చూచి పట్టుకురా! ఆరకపోయినా పట్టుకురా! మడిలో ఉన్నాను అని చెప్పకుంటాను" అని అంటూ ఆ ఇల్లాలు చిరిగిన పాత చుట్ట బెట్టుకుని తలుపు తీసింది ఆమె కళ్ళనుంచి మహానదులు ప్రవహిస్తున్నవి

పెద్దకొడుకు ఆరీ ఆరని చీర తీసుకు వచ్చినాడు అది కట్టుకుని మొగం తుడుచుకుని రూపాయంత కుంకుమబొట్టు పెట్టుకుని వస్తే ఆ తల్లి దరిద్రతలో నన్నా గంభీరంగా ఉంది మండువా లోపలి గుమ్మం దగ్గరనుంచొని "అన్నగారూ! నా మనస్ఫూర్తిగా మా జగన్నాథానికి మీ అమ్మాయి నివ్వడం నాకు ఇష్టమేనండి" అని చెప్పి లోపలకు వెళ్ళింది లోపలికివెళ్ళి "తల్లీ! సీతాదేవీ! ఈ దేశంలో అందరికి బట్టలియ్యి తల్లీ!" అని ప్రార్థించింది

ఆమె హృదయం దుఃఖంతో, కరుణతో స్పందించి పోయింది

ఓం తత్ సత్.

राम రామ్ - రాముడు
मंदिर మందిర్ - దేవాలయము
पेड़ పేడ్ - చెట్టు
आदमी ఆద్మీ - మనుష్యుడు
औरत ఔరత్ - స్త్రీ
लड़का లడ్కా - బాలుడు
सूरज సూరజ్ - సూర్యుడు
जंगल జంగల్ - అడవి.
तालाब తాలాబ్ - చెఱువు
छाया ఛాయా - నీడ
मेज़ మేజ్ - బల్ల
कुर्सी కుర్సీ - కుర్చి
चिड़िया చిడియా - పక్షి
किताब కితాబ్ - పుస్తకము
पुस्तक పుస్తక్ - పుస్తకము
फूल ఫూల్ - పువ్వు
घण्टा ఘంటా - గంట
मैदान మైదాన్ - మైదానము
बादल బాదల్ - మేఘము
भूख భూఖ్ - ఆకలి
प्यास ప్యాస్ - దాహము
स्याही స్యాహీ - సిరా
तस्वीर తస్వీర్ - పటము
पत्थर పత్థర్ - రాయి

थैली థైలీ - సంచి

పాఠము 4

క్రియలు-వర్తమానకాలము.

సర్వనామములు

ఏకవచనము	బహువచనము.
मैं మైం - నేను.	**हम** హమ్ - మనము, మేము
तू తూ - నీవు.	**तुम** తుమ్ - మీరు
	आप ఆప్ - తమరు
यह యహ్ - (యే) - ఇతడు, ఈమె, ఇది.	**ये** యే - వీరు, ఇవి
वह వహ్ (వో) - అతడు, ఆమె, అది	**वे** వే - వారు, అవి

సహాయక క్రియలు

ఏకవచనము	బహువచనము
मैं हूँ మైం హూం - నేను వున్నాను	**हम हैं** హమ్ హైం - మనము (లేక మేము) వున్నాము.
तू है తూ హై - నీవు వున్నావు.	**तुम हो** తుమ్ హో - మీరు వున్నారు
	आप हैं ఆప్ హైం - తమరు వున్నారు

సర్వనామములు

यह है యే హై - ఇతడు వున్నాడు, ఈమె వున్నది, ఇది వున్నది. **ये हैं** యే హైఁ - వీరు వున్నారు, ఇవి వున్నవి.

वह है వో హై - అతడు వున్నాడు, ఆమె వున్నది, అది వున్నది **वे हैं** వే హైఁ - వారు వున్నారు, అవి వున్నవి.

मैं కర్తగా నున్న **हूँ**, **तू, यह, वह** కర్తగా నున్న **है**, **तुम** కర్తగా నున్న **हो**, **हम, आप, ये, वे** కర్తగానున్న **हैं** వాడబడును "వారు" అను బహువచన శబ్దమును మర్యాదకుగాను తెలుగులో ఏకవచనమునందుపయోగించు నట్లు హిందీలో '**वे**' అను శబ్దమునుపయోగింతురు అనగా ఆయన ఎవరు! వారు ఎవరు! అను నట్లు హిందీలో **वे कौन हैं** అందురు

వర్తమానకాలమందు తెలుగులో క్రియతో గూడ "చు" చేర్చునట్లు హిందీలో **ता, ते, ती** చేర్చెదరు.

కర్త పుంలింగ ఏకవచనములో నున్నప్పుడు క్రియకు '**ता**'

కర్త పుంలింగ బహువచనములోనున్నప్పుడు క్రియకు '**ते**'

కర్త స్త్రీలింగ ఏకవచన, బహువచనములలోనున్నప్పుడు క్రియకు '**ती**' యును చేర్చి, అవసరమగు సహాయక క్రియ చేర్చిన వర్తమానకాలమగును

ఉదా —**लड़का आ + ता (आता) है** = బాలుడు వచ్చుచున్నాడు
लड़के आ + ते (आते) हैं = బాలురు వచ్చుచున్నారు
लड़की आ + ती (आती) है = బాలిక వచ్చుచున్నది
लड़कियाँ आ + ती (आती) हैं = బాలికలు వచ్చుచున్నారు.

పుంలింగము

ఏకవచనము	బహువచనము
मै आता हूँ నేను వచ్చుచున్నాను	**हम आते हैं** మనము (లేక మేము) వచ్చుచున్నాము.
तू आता है నీవు వచ్చుచున్నావు	**तुम आते हो** మీరు వచ్చుచున్నారు
	आप आते हैं తమరు వచ్చుచున్నారు.
वह आता है అతడు వచ్చుచున్నాడు.	**वे आते हैं** వారు వచ్చుచున్నారు
यह आता है ఇతడు వచ్చుచున్నాడు.	**ये आते हैं** వీరు వచ్చుచున్నారు.

స్త్రీలింగము.

ఏకవచనము	బహువచనము
मैं आती हूँ నేను వచ్చుచున్నాను	**हम आती हैं** మనము (లేక మేము) వచ్చుచున్నాము.

तू आती है నీవు వచ్చుచున్నావు. **तुम आती हो** మీరు వచ్చుచున్నారు.

आप आती हैं తమరు వచ్చుచున్నారు.

वह आती है ఆమె వచ్చుచున్నది. **वे आती हैं** వారు వచ్చుచున్నారు.

यह आती है ఈమె వచ్చుచున్నది. **ये आती हैं** వీరు వచ్చుచున్నారు.

"ఆ" కారాంతములగు పుంలింగ నామవాచకములు, విశేషణములు, భూత భవిష్యత్ వర్తమాన క్రియారూపములు, కడపటి '**आ**' కారమును '**ए**' గా మార్చిన బహువచనములుగను, '**ई**' గా మార్చిన స్త్రీలింగములుగను అగును. ఈ నియమమును **आ–ए–ई** నియమమందురు. ఇది హిందీ వ్యాకరణములో ముఖ్యముగా గమనింపదగినది.

విధ్యర్థకము. (ఆజ్ఞ)

విధ్యర్థకము మధ్యమ పురుషయందే వాడబడును. అనగా దీనిలో **तू, तुम, आप** కర్తలుగానుండును.

హిందీలో తెలుగులో వలెనే ధాతురూపమే విధ్యర్థకమగును. విధ్యర్థకములు మూడు విధములు.

మొదటిది నీచార్థకము. దీనిలో '**तू**' (నీవు) కర్తగానుండును. ధాతురూపమే క్రియాపదమగును.

ఉదా:—**तू पढ़** నీవు చదువుము.

సాధారణ వ్యవహారమునందు దీనిని వాడకుండుట ఉచితము. దీనికి బదులు '**तुम**' వాడవలెను.

రెండవది—చిన్న వయస్సువారితోను, ఎక్కువ పరిచయముగల వారితోను, మాటలాడునపుడు మధ్యమ పురుష బహువచనము వాడుదురు. అపుడు ధాతురూపమునకు '**ओ**' చేర్చవలెను. దానికి '**तुम**' (మీరు) కర్తగానుండును.

ఉదా:—**तुम (पढ़ + ओ) पढ़ो** మీరు చదువుడు.

కాని—**तुम (दे + ओ) दो** మీరు యిండు. (**दे** = ఇచ్చు; **ले** = తీసుకొను).

మూడవది—

గౌరవ వాచకమగు '**आप**' కర్తగానున్నపుడు విధ్యర్థకములో ధాతురూపమునకు "**इये**" చేర్చవలెను.

ఉదా:—**आप (पढ़ + इये) पढ़िये** తమరు చదవండి.

కాని **दे** (ఇచ్చు), **ले** (తీసికొను), **पी** (త్రాగు), **कर** (చేయు), **हो** (అగు)—ఈ క్రియలకు మాత్రము **आप** కర్తగానున్నప్పుడు క్రమముగ ఈ క్రింది రూపములు వాడబడును:—

आप दीजिये తమరు యివ్వండి. **आप लीजिये** తమరు తీసికొనండి. **आप पीजिये** తమరు త్రాగండి.

आप कीजिये తమరు చేయండి. **आप हूजिये** తమరు (అగుడు) కండి.

"**मत**" (వద్దు) వ్యతిరేకార్థవిధి. ఇది క్రియాపదమునకు పూర్వము వ్రాయబడును.

ఉదా :—**तू मत लिख** నీవు వ్రాయకు. **तुम मत लिखो** మీరు వ్రాయకుడు.

आप मत लिखिये తమరు వ్రాయకండి.

మహాత్ముని ప్రవచనాలు

१. परमेश्वर का साक्षात्कार जीवन का एक-मात्र योग्य ध्येय है। जीवन के दूसरे सब कार्य यह ध्येय सिद्ध करने को होने चाहिए। जो प्रवृत्तियाँ इस ध्येय की विरोधी मालूम हों, स्थूल दृष्टि से उनका फल कितना ही ललचानेवाला और लाभदायक जान पड़ने पर भी उन प्रवृत्तियों को त्याज्य समझना चाहिए।

1. భగవంతుడి సాక్షాత్కారము పొందటమే జీవితానికి ఉచితమైన ఏకైక పరమావధి. ఇంక మిగతా పనులన్నీ ఆ పరమావధిని సాధించటానికి చేసే సాధన మాత్రాలుగానే వుండాలి. స్థూలదృష్టిలో ఎంత లాభదాయకముగా ఆశలు రేకెత్తించేవిగావున్నా పై జీవిత లక్ష్యానికి విరుద్ధంగా, ప్రతిబంధకంగా వుండే ప్రవృత్తులు వర్జనీయమని గ్రహించాలి.

२. जो चित्त की शुद्धि न करे, मन और इन्द्रियों को वश में रखना न सिखाये, निर्भयता और स्वावलंबन पैदा न करे, निर्वाह का साधन न बताये और गुलामी से छूटने और आज़ाद रहने का हौसला और सामर्थ्य न उपजाये उस शिक्षा में चाहे जितनी जानकारी का ख़ज़ाना, तार्किक कुशलता और भाषा-पांडित्य मौजूद हो वह शिक्षा नहीं है या अधूरी शिक्षा है।

2. చిత్తశుద్ధికి వుపకరించనిది, మనసును ఇంద్రియాలను వశములో వుంచుకోవటం నేర్ప లేనిది, నిర్భయతాస్వావలంబనలను కలిగించలేనిది, జీవనానికి వుపయోగించనిది, దాస్య విముక్తి కలిగించి స్వతంత్రంగావుండే సామర్థ్యాన్ని నేర్పును యివ్వలేనిది, పరిపూర్ణమైన విద్య అనిపించు కోదు. విజ్ఞానమే యిమిడివుండనివ్వండి, తర్కపూర్ణమే కానివ్వండి, భాషాపాండిత్యమే కలిగివుండ నివ్వండి, ఆ విద్య అసంపూర్తివిద్య అనిపించుకుంటుది.

३. संगीत, कथा-वार्ता, चित्रकला, नृत्य, नाटक, सिनेमा आदि ललित-कलाएँ यदि उचित सीमा में रहें तो वे जन-समाज के निर्दोष मनोरंजन, ज्ञान-प्राप्ति तथा भावना-विकास के साधन हो सकती हैं; मर्यादा के बाहर चली जायँ तो शराब, अफीम-जैसे हानिकर व्यसन बन जाती है।

3. సంగీతం, కథలు-కబుర్లు, చిత్రకళ, నృత్యం, నాటకాలు, సినిమాలు, మొదలయిన లలితకళలిన్నీ తగుపాటి మోతాదులోవుంటేనే ప్రజలకు నిష్కల్మషమయిన ఆనందాన్ని, జ్ఞానాన్ని

మనోవికాసాన్ని పెంపొందించే సాధనాలుగా వుపకరించుతయ్. కాని ఆ లలిత కళలే హద్దు పద్దు లేకుండ మితి మీరిపోతే నల్లమందు సారాల మాదిరి హానికరమైన దుర్వ్యసనాలుగా పరిణమించుతయ్.

४. रामराज्य में स्त्री का पद पुरुष के समान ही होना चाहिए।

4. రామరాజ్యములో స్త్రీస్థానం పురుషునితో సరిసమానంగా వుండాలి.

మహాత్మా గాంధీ.

✶ बच्चों के बारे में विश्वकवि श्री रवीन्द्रनाथ ठाकुर ✶

పిల్లలను గురించి విశ్వకవి రవీంద్రనాథ ఠాకూర్ భావన

※ అనువాదం అచ్యుతుని గిరిజ ※

१. क्या कोई जानता है कि जो मधुर कोमल लावण्यता बच्चे के अंगों में विकसित हो रही है वह इतने दिनों तक कहाँ छिपी हुई थी? हाँ, जब माँ किशोर अवस्था में थी तब यह अप्रकट रहस्यमय मृदु प्रेम बनकर उसके हृदय में व्याप्त थी। यही मधुर कोमल लावण्यता बच्चे के अंगों पर विकसित हुई है।

1. పసిపాపడి సర్వాంగాలలోను వికసితమై నిండివున్న ఆ మధుర కోమల లావణ్యం ఇంతకాలం ఎక్కడదాగివున్నదో ఎవరికైనా తెలుసా? ఓ! అమ్మ చిన్న అమ్మాయిగా వున్నప్పుడు యీ లావణ్యత కనిపించని రహస్య మధుర ప్రేమాకృతి దాల్చి ఆమె హృదయములో విలీనమై పోయింది. ఆ కోమలమైన మధుర లావణ్యమే పసిపాపడిలో ఆ పాద మస్తకం మనకు కనుపిస్తు వుంటుంది.

२. क्या कोई जानता है कि बच्चे की आँखों में निंदिया कहाँ से आती है? हाँ, एक जनश्रुति है कि उसका निवास वन की घनी छाया के बीचोंबीच स्थित एक परियों के देश में है, जहाँ जुगनुओं का मन्द प्रकाश रहता है और जहाँ जादू की दो कोमल कलियाँ लटकनी रहती हैं। यहीं से वह बच्ची की ऑखों को चूमने आती है।

2. చిన్నిపాప కళ్లమీదికి నిద్ర యెట్లా వస్తుందో తెలుసా? అనుశ్రుతంగా వచ్చే జనశృతి చెపుతాను—ఒక దట్టమైన నట్టడవిలో దేవతలు నివసించే దేశం వుందిట అక్కడ మిణుగురు పురుగుల లేత వెలుగులో కోమలమైన రెండు ఇంద్రజాలపు మొగ్గలు వేలాడుతు వుంటయిట. ఆ మొగ్గలు అబ్బాయి కళ్ళను ముద్దుపెట్టుకోవటానికి అక్కడినుంచి వస్తయ్. అదే పాపాయి నిద్ర.

३. क्या कोई जानता है कि सोते हुए बच्चे के ओठों पर जो मुस्कान प्रकट होती है वह कहाँ से आई? हाँ, एक जनश्रुति है कि दूज के चन्द्रमा की एक नवीन पीत किरण किसी जाते हुए शरद्मेघ की कोर से छू गई। बस यहाँ प्रथम बार शिशिर-शुचि-प्रभात की स्वप्न अवस्था में मुस्कान का प्रथम जन्म हुआ। यही मुस्कान सोते हुए बच्चे के ओठोंपर प्रकट होती है।

పిల్లలను గురించి విశ్వకవి రవీంద్రనాథ ఠాకూర్ భావన

3. నిద్రపోతువుండే బుజ్జివాడి పెదవులమీద తొణికిసలాడే చిరునవ్వు ఎక్కడినుంచి వస్తుందో తెలుసా? అంతా అనుశ్రుతిగా యిట్లా చెప్పుకుంటారు—విదియనాటి చంద్రుడి లేత పసిడి కిరణమొకటి అట్లా ఎక్కడికో వెళ్తున్న శరత్ మేఘపు అంచుకు తగిలిందట. అంతటితో శిశిరప్రభాతపు స్వప్నావస్థలో మొదటి చిరునవ్వు మొలకెత్తిందిట. ఆ చిరునవ్వే నిద్రపోయే పాపాయి పెదవులమీద నాట్యమాడుతుంది.

४. मेरे बच्चे, जब मैं तुम्हारे लिये रंगबिरंगे खिलौने लाता हूँ, तब मैं जान सका हूँ कि बादल इतने रंग-बिरंगे क्यों हैं, पानी की तरंगों और झरनों में रंग-बिरंगी रेखायें क्यों झिलमिल करती हैं, और फूल पत्तों में इतना वर्ण-वैचित्र्य क्यों है?

4. పిల్లలారా! మేఘాలు యింత రంగురంగులుగా యెందుకు వుంటున్నవో, నీటి తరంగాలలో సెలయేళ్లలో వన్నెవన్నెల చాళ్లు యెందుకు మిలమిల మెరుస్తు కనిపించుతవో, పూలల్లో ఆకుల్లో చిత్రవిచిత్రమైన రంగులు ఎందుకు గోచరించుతవో, నాకు యిప్పుడు—మీకు రంగురంగుల ఆటవస్తువులు తీసుకు వచ్చేటప్పుడు అర్థమవుతున్నది.

५. बच्चे, जब मैं गीत गाकर तुम्हें नचाता हूँ तब मैं यथार्थ में जान पाता हूँ कि पत्तियों में संगीत क्यों है, और संसार के रसिक श्रोताओं के हृदय में समुद्र की तरंगों से अनेक स्वरों और रागों से परिपूर्ण गीतों का क्यों प्रादुर्भाव होता है।

5. ఆకుల్లో సంగీతం ఎందుకు దాగివున్నది, సముద్రపు తరంగాల్లలో అనేక స్వరరాగాలతో కూడివున్న గీతాలు రసికులయిన శ్రోతలకు ఎందుకు వినిపించుతయ్ అనే విషయాలు యథార్థంగా పిల్లలారా! నాకు యిప్పుడు—పాట పాడి మీచేత నృత్యంచేయించే సమయంలో తెలుస్తున్నది.

६. बच्चे, जब मैं तुम्हारे ललचते हाथों में मिठाई देता हूँ तब मैं जानता हूँ कि पुष्प में मधु क्यों है और फलों में मधुरस गुप्तरीति से क्यों भरा है।

6. పువ్వుల్లో తేనె యెందుకువున్నదీ, పండ్లలో తీయనిరసం అతి సహజంగా యెందుకు నిండివున్నదీ కూడ నాకు యిప్పుడు—ఆశతో జాపే మీ చిట్టిచేతులకు మిఠాయి అందించేటప్పుడు తెలుస్తున్నది.

७. प्रिय, जब मैं तुम्हारे मुख को हँसाने के लिये चूमता हूँ तब मैं विश्वासपूर्वक समझ लेता हूँ कि वह कौन-सा सुख है जो आकाश से प्रातःकालीन प्रकाश में प्रवाहित होता है, और वह कौन-सा आनन्द है जिसे वसन्त समीर मेरे शरीर में उत्पन्न करती है।

7. ముద్దు పాపల్లారా! మీ చిన్ని ముఖాలమీద చిరునవ్వు చూడటానికి మిమ్ములను ముద్దు పెట్టుకునేటప్పుడు నాకు చక్కగా అర్థమవుతున్నది—ప్రాతఃకాలాన ఆకాశంలో కనిపించే కాంతిలో యేలాంటి సుఖం వున్నదీ, వసంతకాలంలో చల్లని పిల్లగాలులు శరీరానికి యే ఆనందాన్ని కల్పించ గల దీని. ఇందులో యెంతమాత్రం అబద్ధం లేదు.

[గీతాంజలి నుండి]

★

సరోజినీ!

శ్రీ కనకమేడల వెంకటేశ్వరరావు, సాహిత్య విశారద

చం॥ స్థిరముగ భారతాంబ కభిషేకము చేసియు నీవునీకవి
త్వరసపవిత్రధార కవితాఘనరాజ్య సువర్ణ పీఠమం
దురుతర కీర్తివై నిలిపి యుగ్ర విషాదము కల్గజేసి మా
కరిగితివా దయా హృదయ! ఖ్యాతి విరాజిని!
ఓ సరోజినీ!

సీ॥ తీయని రాగాలు తీసేటి కోయిల
గాన మాధురి నీదు కవిత కలదు
అందాలు చిందు రాయంచల సుందర
గమనమ్ము నీ మృదు కవిత కలదు
పర్వతోద్భూత ప్రవాహమ హోరువే
గము నీదు రసపూర్ణ కవితకలదు
చంద్రికాస్నాపిత సమయమ్మొసంగు సౌ
ఖ్యమ్ము నీ చక్కని కవిత కలదు.
సత్కవిత్వ ప్రధాన లక్షణములన్ని
కలవు నీ సరస మధుర కవనమందు
విశ్వ కవయిత్రి యను చెంతో పేరుకన్న
రాణి వీవు కవిత్వ సామ్రాజ్యమునకు

సీ॥ సాహితీ జవనాశ్వ వాహనమ్మెక్కి జ్ఞా
నావధులను దాటి యరిగినావు
జీవితాంతర్గత చింతలంకుములు న
భాగ్యుల బాధల బాపినావు
దారితప్పినచోట పారెడిసెలయేటి
నీటిపాటువగుచు నిల్చినావు
నోటినిండ భుజింప నోచికోనని
వారిప్రతి నిధివై నీవు పలికినావు
ప్రకృతి సాగర స్థితమహా వస్తుజాల
మేర్చియిచ్చి యానందమ్ము కూర్చినావు
ప్రాచ్య పాశ్చాత్య ఖండాల భారతీయ
సాహితీ సంస్కృతుల నీవుచాటినావు.

గీ॥ భవదుదార పవిత్ర భావాలనెంచి
నీవు చూపిన మార్గాన నిన్నుతలచి
ఏర్చి కూర్చెద మమ్మ రో నేర్చినట్లు
సకలలోక కళ్యాణ గీతికలనింక!

కం॥ భారత జాతీయ సమర
వీరాగ్రణి! నిరుపమాన విజ్ఞానఖనీ!
నారీ లోకా ధరో త్త
దార సరోజిని! కొనంగద నమస్కృతులన్!

★

సుఖ భయాలు

శ్రీ అ వెంకటేశ్వర రావు, బి కామ్ (హానర్సు)

పున్నమ రేయి
పండు వెన్నెల
నిండు ఏటిలో
మలయ మారుతము
పూల దోనెలో
చిరు నగవులలో
కేరింతలలో
వలపు కౌగిలి
సుఖదము కాదా

కాళ రాత్రి
పెను చీకటి
మెరుపు లుఱుములు,
కొండ పోతలు
గాలి హోరులు
కీచుల మ్రోతలు
గూబల కూతలు
ఎండిన డొక్కల
మాడిన ప్రేగుల

ఒంటరి తనము
భయావహ మ్మగా!

★

రే వే ల్పు

శ్రీ వాడ్రేవు జోగిపంతులు

నీలాలనింగిలో
తేలియాడేవు
నినుజూసి
నామనసు
నిండిపోనాది !

కల్వకాంతల
తోడక్రీడ
సలిపేవు నీ
క్రీడకనిమనసు
పురకలేసింది !

మొయిలుకన్నెల
తోడదోబూచు
లాడేవు నీ
ఆటకనిమనసు
ఆడిపోనాది !

అటుచూసి
ఇటుచూసి
మారిపోయావు
జాడతెలియగరాక దిగ
జారిపోయాను !

చుక్కకన్నెల
తోడకూడి
పాడేవు నీ
పాటవినిమనసు
పొంగిపోనాది !

చందమామేడంటు
చుక్కల్ని అడిగాను
చుక్కలన్నీ కలసి
బిక్కమొగమేశాయి !

నగుమోముతో
నాడుపలకరించావు నేడు
నాతోటిమాటాడె
నాజూకువారెవరు ?

★

సినిమా ప్రేక్షకులు

శ్రీ కె వి రెడ్డి బి ఎస్ సి (హానర్సు)

సినిమాలు చూడ్డానికి జనం యెంత ఉత్సాహంగా వెళతారో చూడండి. హాల్సులోకి ప్రవేశం కలిగేదాకా ఎండయినా వానయినా లక్ష్యంచేయక వరసలో నుంచుని ఎంత సహనంతో వేచి ఉంటారో చూడండి. అందులో పిల్లలు, పెద్దలు, పండితులు, పామరులు, స్త్రీలు విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగిస్తులు ఎందరో ఎన్ని అభిరుచులవారో ఉంటారే! వీరినందరినీ అక్కడి కాకర్షించే ఏకభావం ఏమిటి?

మహర్షులు మొదలు పసిపిల్లలదాకా అందరిలోనూ ఒకే వొకకాంక్ష వ్యక్తంగానో, అవ్యక్తంగానో వుంటుంది. అది ఆనందంకోసం ఆరాటము. ఏమిటో యెన్నాళ్లో యీ జీవితం! హాయిగా నలుగురితో కలిసి సందడిగా నవ్వుకొంటూ మధురమైన ఛలోక్తిగా గడిపి వేసికోవాలనే తీయని కోరిక ప్రతివారిలో ఒకచక్కలిగింతగా వుంటుంది. ఇది తీరేదెక్కడ?

మన నిత్య జీవితంలో మనల్ని చుట్టుకొన్న స్వార్థాలూ, అసూయలూ, ఆవేశాలూ, దారిద్ర్యాలూ—ఈ జంజాటాల్లో అటువంటి మధురక్షణం ఒకటీ దొరక్కనే అందరూ ఒకకల్పనా ప్రపంచాన్ని ఎంతో మనోహరంగా సృష్టించుకొని ఆరాధిస్తారు. ఈ సృష్టించే వారూ ఆరాధించే వారు ఎంతో అన్యోన్యంగా ఆనందించే సరసగోష్ఠి సినిమా.

అంతేకాదు తాతగారు మొదలు మనుమరాలిదాకా వొక కుటుంబములోని వారంతా కలిసి ఛలోక్తులతో, నర్మోక్తులతో, సరసోక్తులతో ఇష్టాగోష్ఠి వినోదకాలక్షేపం చేసినప్పుడు ఎంత సభ్యతను, నాగరీకతను, సంస్కారాన్ని, ప్రయోజనాన్ని కూడా పాటించాలో, ఈసినిమా కాలక్షేపంలో కూడా అంత లక్ష్యం ఉండాలి. చిత్రనిర్మాతలకూ ప్రేక్షకులకూ ఇంత చక్కని సంబంధం ఉంది.

ఈ బాధ్యతని చిత్ర నిర్మాత ఎలా కాపాడుకుని కృత కృత్యుడౌతాడు! కాలం మారుతూ వుంటుంది. ప్రేక్షకుల అభిరుచులు మారుతూ వుంటాయి. ఏమిమారినా మారక కూడనిది చిత్ర సృష్టి, కల్పనాశిల్పం. కవిత్వం, శిల్పం కలకాలం నిలిచేవి. కనుక నిర్మాతలు ఎటువంటి చిత్రాల్ని తీయాలి, ప్రేక్షకుల కెటువంటి చిత్రాలు కావాలి? అంటే యెవరు చెప్పుతారు. చెప్పటం సాధ్యమవుతుందా? ఒక చిత్రం తీసి అది ప్రేక్షకుల ఆమోదం పొందితే, నిర్మాతలు అటువంటి చిత్రాలు తీయాలి. ప్రజల కటువంటి చిత్రాలు కావాలి అని తేలుతుంది. అప్పటికీ, ఎప్పటికీ అంతే. ఈ సూత్రం సూక్ష్మంలో సూక్ష్మం. ఈ సూత్రాన్ని తెలిసికొన్న విజ్ఞానీ, శిల్ప చతురుడు, శిష్టుడు కావాలి నిర్మాత. అప్పుడేమాట దక్కుతుంది. ఎలా దక్కించుకోటం అంటే ప్రేక్షకులకు కావలసింది పౌరాణికాలా, భక్తుల

జీవితాలా, వీర పురుషుల చరిత్రలా, జానపద గాథలా, సాంఘికాలా ఏవైనాసరే, ప్రేక్షకులు శ్రమపడకుండా కేవలం సహజ వివేకంతో వినోదించి ఆనందించ గలిగేటంత సులభంగా, మనోజ్ఞంగా వుండాలి. హాస్యాలుగానీ, నాట్యాలుగాని మోతాదు మిగిలి జుగుప్స కలిగించ కుండా ఉండాలి. దృశ్యాలూ, మాటలూ, పాటలూ కంటికీ చెవికీ నాటుకు పోయేట్టుగా వుండాలి. అలా వుందీ లేందీ ప్రేక్షకులే చెప్పుతారు.

విసుగు విరామమూ లేకుండా చూచిన వారే చూస్తూ యేచిత్రానికైనా జన బాహుళ్యంలో చక్కని ప్రచారం వచ్చిందంటే ఆ చిత్రం ఆరోగ్యకరమైన విశిష్ట లక్షణాలన్నీ కలదని అర్థం. ఈ సత్యం గ్రహించక సొంత సిద్ధాంతాలతో కొలిచి, సొంత ఆశయాలతో ముడిపెట్టి, ఇది చెడు అని చెప్పటంగాని, ప్రేక్షకులు మరీ చెడిపోతున్నారు, నిర్మాతలు వాళ్లని పట్టి అవివేకులినిజేసి కొల్లగొడుతున్నారని దూరటం కాని విమర్శకుల లక్షణం కాదు. లక్షలాది ప్రజల బాధ్యతను తానే వహించి వాళ్ళు చూడవలసిన చిత్రాలివికావు అని చెప్పేటంత సాహసం ఒక వ్యక్తి చూపరాదు. అది పట్టి దురహంకారం. అంత జన ప్రచారాన్ని గణించిన లక్షణం, ఆ చిత్రంలో ఏమిటో పరిశోధించి, గ్రహించ లేని వారికి వివరించటం వివేకవంతులయిన విమర్శకుల లక్షణం.

★

చిత్ర సమీక్ష

'హేరెస్' లో నటించిన ఒలవియా


హేరెస్ అయిన కాథరిన్ ప్రతీకారంచేసినందుకు గర్వపడుతూండేకాని, ఆగర్వంలో సంతోషంలేదు. కాని హేరెస్‌గానటించిన ఒలివియా, డైరక్టర్ విలియం వైలర్ సంతోషపూరితంగా గర్వపడదగ్గవారే.

పారమౌంటు పిక్చర్సువారి 'హేరెస్' అనే ఇంగ్లీషు సాంఘికచిత్రంలోని కథావస్తువు హెన్రీజేమ్స్ రచించిన వాషింగ్‌టన్ స్క్వేర్, అనేనవలనుండి గ్రహింపబడింది. ఒకధనవంతుడైన డాక్టరుయొక్క ఏకైక పుత్రిక కాథరిన్ (ఒలివియా) ఒట్టి అమాయిక, విద్యావిహీన, అందవిహీన. నలుగురిల్లో కలసిమెలసి తిరగడంచేత కాదు. తల్లిదండ్రుల అదుపాజ్ఞలలోనే అయినా, రూపంవల్ల, తెలివితేటలవల్ల యువతీ యువకులు పరస్పరం ఆకర్షించుకొని వివాహాలుచేసికొనే న్యూయార్కసమాజంలో కాథరిన్‌కు వివాహం అసంభవమని తండ్రి (సర్‌రాల్ఫ్) నిస్పృహచెందుతాడు. ఆమె ధనం మాత్రమే పురుషుని (రిచర్డ్‌సన్) ఆకర్షించగలదని తండ్రి విశ్వసిస్తాడు.

తండ్రిఆస్తికంతటికీ తానేవారసురాలు. మారిస్ అనేఒక పనిపాటులేని యువకుడు ధనాపేక్షల్లో కాథరిన్‌ను వివాహమాడగోరుతాడు. కాథరిన్ తండ్రి మారిస్ భావాన్ని కనిపెట్టి కాథరిన్‌ను మందలిస్తాడు. మారిస్‌ను వివాహమాడితే తన ఆస్తిలోపీసంకూడ కుమార్తెకుచెందనీనని బెదిరించడంతో మారిస్ కాథరిన్‌ను మోసగించి పలాయనం చేస్తాడు.

చిన్నప్పటినుండి అమాయిక భయస్థురాలు అయిన కాథరిన్, మారిస్ తనధనాన్నే ప్రేమించాడన్న సంగతి తెలిసికొని అతనిపై ప్రతీకారానికి కడంగుతుంది. ఇప్పటి గంభీరమైన కాథరిన్‌కు, చిన్ననాటి అమాయికపు కాథరిన్‌కు ఏవిధమైన పోలిక కన్పడదు. కాథరిన్‌గా నటించిన ఒలివియా తనపాత్రను అత్యద్భుతంగా పోషించింది.

(మిగతా 118 వ పేజీలో)



ప్రకాశ్ ప్రొడక్షన్సు వారి,

మొదటి రాత్రి

డైరెక్షన్. ప్రకాశరావు

రచన: తాపి. కెమెర. రంగ. సౌండు: రంగస్వామి. మ్యూజిక్. పెండ్యాల. ఆర్టు. ఘటక్.

ఆంధ్ర, రాయలసీమలు — నవయుగ ఫిల్మ్సు, విజయవాడ.

మైసూరు — ప్రకాష్ పిక్చర్సు, బెంగుళూరు.

నైజావ్ — కర్ణాటక ఫిల్ముసు లిమిటెడ్., బెంగుళూరు.

వివరములకు :— ప్రకాష్ ప్రొడక్షన్సు, శాంథోమ్, మదరాసు.

ఒలివియా డిహావిలెండ్ జపానులో జన్మించింది. చిన్నతనంలోనే తండ్రి మరొకస్త్రీని వివాహమాడడం వల్ల ఒలివియా తల్లి కుమార్తెతో సహా కాలిఫోర్నియాకువచ్చి అచ్చట మరొకనిని వివాహం చేసుకుంది.

ఒలివియాకు చిన్నప్పటినుండి నటించడ మంటే చాల ఇష్టం. కాని మారుతండ్రి కట్టుబాట్లలో ఉండడంవల్ల ఆకోరిక చాలరోజులవరకు కొనసాగలేదు. 1934 లో మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్‌లో, ఒకచిన్న పాత్రఇచ్చారు. ఒలివియా సరిగ్గాసమాయానికి, ప్రధాన నాయికగాని, ఉప నాయికలుగాని రాకపోవడంవల్ల, ఒలివియాయే నాయికగా నటించ వలసివచ్చింది. చిత్రంలో ముఖ్యపాత్ర వహించడం అదే మొదలు. "హోల్డ్ బ్యాక్ ది డాన్"లో నటించడంతో ఒలివియా చిత్ర జగత్తులో మంచి పేరుప్రఖ్యాతులు సంపాదించుకుంది.

1946లో 'టు ఈచ్ హిస్ ఓన్' చిత్రంలో అద్భుతంగా నటించినందుకు ఆస్కార్ బహుమానాన్ని పొందిరెండి. తిరిగి ఇప్పుడు హేరస్‌గా నటించినందుకు రెండవసారి ఆస్కార్‌ను పొందింది.

ఒలివియా సహజసౌందర్యవతి, తెలివితేటలు గలదని వేరచెప్పనే పనిలేదు. అటువంటిఆమె హేరస్‌లో ఒక సామాన్య అమాయికపు బాలికగా నటించిచడమే మెచ్చుకో తగ్గది. అన్నిపాత్రలకు అందమయినవారే అవసరంలేదని ఆమె అభిప్రాయం.

ఒలివియా 1946లో రచయితయైన మార్కస్ గుడ్‌రిచ్‌ను వివాహమాడింది. పెండ్లినాటికి ఒలువియాకు 30 సం॥ భర్తకు 48. ఆమెకిప్పుడొక బిడ్డ.

ఒలివియా ఇప్పుడు, ఏడైరక్టరువద్ద లేకుండా, తనకు నచ్చిన పాత్రలను మాత్రమే ధరిస్తూఉంటుంది. డైరక్టర్ వైలర్ ఆమెవద్దకువచ్చి హేరస్‌గా నటించమని కోరితే ఎంతో సంతోషంతో ఒప్పుకుందట.

"పాత్రరసవత్తరంగా ఉంటేచాలు, నటిస్తాను" అంటుంది.

మ. రా.

★

బి. ఎ. సుబ్బారావు & శోభనాచలవారి

'పల్లెటూరి పిల్ల'

కథావస్తువు:—కంపన దొర క్రూరు పగగల ప్రజాకంటకుడు. అతనివద్ద పనిచేస్తూఉంటాడు జయంతు.

ఒకపల్లెలో శాంత, వసంతుఅనే ఇద్దరు యువతీ యువకులు సోదరీ సోదర్శుల బిడ్డలు పెరుగుతూ ఉంటారు. కంపన దొరఆజ్ఞప్రకారం జయంతు ఆపల్లెపైకి దాడివెడలి ధ్వంసం కావిస్తుంటాడు. ధనధాన్యాలను కొల్లకొడుతూ ఉంటాడు. ఈ అమానుష మృగచర్యలను చూస్తూసహించలేక శాంత పట్టరాని అసహానంలో అతన్ని ఒకచెంప పెట్టుపెడుతుంది. "రక్తపుకూడుతినందే మీకుతృప్తిలేదా?" అనిప్రశ్నిస్తుంది. అన్నం పున్నం ఎరుగని అమాయకుల్ని దోచుకోవడం అన్యాయమూ, పౌరుషహీనమూ అంటుంది. రక్తపాతము, క్రూరత్త్వమూ నిరశిస్తూ జయంతుని ముఖంపై ఉమ్మేతుంది. ఇదే జయంతునిలో బ్రహ్మాండమైన పరివర్తన కలుగించుతుంది!!!

ఈమార్పుతో కంపనదొర ఆగ్రహానికి గురియై, పల్లెను రక్షించటానికి పల్లెవాసులను జేరుతాడు జయంతు.

జయంతును పల్లెపడుచు అయిన శాంత ప్రేమిస్తుంది. శాంతను అంతకు పూర్వమే ప్రేమించిన ఆమె బావ వసంతు శాంత ప్రేమకోసం త్యాగంచేసి, జయంతు శాంతను ప్రేమించేటట్టు చేస్తాడు. జయంతునీ, ఆపల్లెనూ నాశనం చేయడానికి చిన్న సైన్యంతోవచ్చి కంపనదొర యుద్ధంలో ఓడిపోగా కుట్రపన్ని జయంతుని బంధిస్తాడు, కంపనదొర జయంతుపై పగసాధించడంకోసం మంత్రి మార్తాండ్. కంపనదొర ప్రియురాలి సహాయంతో జయంతు విముక్తుడౌతాడు. వసంతు జయంతుని విడిపించడానికి వచ్చి చేచిక్కిన కంపనకు ప్రాణభిక్ష పెడతాడు. కంపనలో కొద్ది మార్పువస్తుంది. కానిచివరకు వసంతు జయంతుని కుమారుని కంపన బారినుండి రక్షించడంలో తనప్రాణాలు కోల్పోతాడు.

కంపనదొరలో పశ్చాత్తాపం కలిగి పల్లెప్రజలకు హాని చేయనని వాగ్దానంచేస్తాడు.

పైకథ మెలికలుతిరిగి అహింస, ఆత్మరక్షణ ఆవశ్యకతను ప్రబోధిస్తుంది. కంపన దొరదగ్గర కొలువున్న జయంతు ధర్మం, న్యాయం వైపుమొగ్గి కంపనదొరను విడచి సర్వ సౌఖ్యాలను, అధికారాన్ని త్యాగం చేసిరావడం, జయంతు శాంతల ప్రేమకోసం తాను చిన్ననాటినుండి నిర్మించుకున్న ప్రేమరాజ్యాన్ని త్యాగంచేసి, వసంత ఉత్తమశీలాన్ని ప్రదర్శించడం, చేజిక్కిన కంపనదొరను పల్లె ప్రజసౌశీల్యాన్ని నిరూపిస్తూ జయంతు చివరకు విడిచిపెట్టడం—ఈ చిత్రంలో పేర్కొనదగిన అంశాలు. పల్లెలకు ప్రాధాన్యమిస్తూ, పల్లెలే దేశానికి ఆయువు పట్టని సూచిస్తూ, పల్లె ప్రజల అమాయకత్వము, త్యాగశీలము, అహింసా నియమము, ఐక్యతా భావమును కండ్లకు గట్టినట్టు చూపిస్తూ, స్త్రీపురుషులు, బాలవృద్ధులు, అందఱు ఆత్మరక్షణ యందు శిక్షితులు కావలసిన ఆవశ్యకతను నిరూపిస్తూ, ఉద్రేకముతో కదలునట్టి ఒక కథను చిత్రించిన శ్రీ తాపీ అభినందనీయులు. దర్శకులు బి. ఎ. సుబ్బారావు చాలాచక్కగా కథను నడిపించారు.

సంభాషణలు ఉద్రిక్తంగాను, సజీవంగాను ఉన్నవి. సంగీతం బాగాలేదు. కొన్ని పాటల్లో హిందీ పాటల అనుసరణఉన్నది కాని అపస్వరాలుగా వినిపించాయి. ఛాయాగ్రహణం ఏమాత్రం బాగుండలేదు. మొదటినుండి చివరివరకు చిత్రంలో ఈలోపం బాగాకనిపిస్తుంది. కళ సామాన్యంగా ఉన్నది. కంపనదొర గృహనిర్మాణం మెచ్చుకో తగ్గది.

అంజలి శాంతగాను, నాగేశ్వరరావు వసంతుగాను, రామారావు జయంతుగాను, బేబిమల్లిక శశిగాను చక్కగా నటించారు. భావయుక్తంగా మనోవికారాలు చూపించ కలిగారు. కంపనదొరగా ఎ. వి. సుబ్బారావు ఏమాత్రం రాణించ లేకపోయాడు. వేషధారణ తప్పితే అతనిలో మరేమి అగుపించదు.

జి. ప్రభ.

★

విజయా ప్రొడక్షన్స్ వారి ‘షాహుకారు’

మనతెలుగు చలనచిత్రకళా పరిశ్రమలో నూతనంగా వెలసినది విజయాప్రొడక్షన్స్. వారి ప్రథమ సాంఘికచిత్రము షాహుకారు :

కథావస్తువు :-షాహుకారు కథ సామాన్యంగా ఉన్నది. చివరికి చిత్రంలో ముఖ్యమైనవిషయం ‘షాహుకారు’లో పరివర్తన. మొదటినుండి అసలు విషయంలోకి వస్తే చెంగయ్య, రామయ్య ఇరుగు పొరుగువారు, స్నేహితులు. చెంగయ్య కొడుకు సత్యం పట్నంలో చదువుకుంటుంటాడు. రామయ్య సామాన్య వ్యవసాయదారుడు. ఇతని సంతానం సుబ్బులు, నారాయణ. చెంగయ్య స్నేహభావంచేత డబ్బు ఇస్తాడు. ఆడబ్బుతో రామయ్య పొలంకొని స్వంత వ్యవసాయంచేస్తాడు. దానిలో లాభం వస్తుంది. చిన్ననాటి నుండి, సుబ్బులు చెంగయ్య ఇంటికి వస్తూపోతూ చివరికి నలుగురిచేత చెంగయ్యకు రాబోయే కోడలు అనిపించుకుంటుంది.

ఆ వూరి సత్రం గురించి వచ్చిన తగాదా విచారణలో రామయ్య, ఆ సత్రం ధర్మ సత్రంకాని, దానిని అద్దెకు ఇతరులకు ఇవ్వడానికి చెంగయ్యకు అధికారము లేదని నిజం పలుకుతాడు. దీనితోటి రెండు కుటుంబాల మధ్య విరోధం వస్తుంది. చెంగయ్య కొడుకు సత్యం, తండ్రి మూర్ఖతకు విచారిస్తాడు. పట్నం వెళ్లిపోతాడు.

అప్పటినుండి చెంగయ్య, రామయ్యమీద కత్తికట్టి అనేక విధముల సాధిస్తాడు. రౌడీ రంగయ్య మాటలు విని, రామయ్య కొడుకు నారాయణను, దొంగ సాక్ష్యం చెప్పి ఖైదుకు పంపుతాడు. అటు సత్యం కూడా ఒక కేసులో చిక్కడంవల్ల అతనికి జైలు ప్రాప్తి కలుగుతుంది. జైలులో సత్యం, నారాయణలు కలిసికొని ఒకరి విషయాలు ఒకరు చెప్పుకుంటారు. చెంగయ్య కొడుకును విడిపించేటందుకు వస్తాడు. కాని కొడుకు నాలుగు మాటలు అని పంపిస్తాడు. దానితో చెంగయ్యలో మార్పు కలుగుతుంది. రౌడీ రంగడు

చిత్ర సమీక్ష

చెంగయ్యా ఇంటిని దోస్తూవుంటే, సుబ్బులు, రామయ్యా చెంగయ్యను రక్షిస్తారు. అప్పటినుండి రెండు కుటుంబాల నడుమ ఎప్పటిమైత్రి ఏర్పడుతుంది. కథసుఖాంతము.

దైనందిన గ్రామజీవితము కథాంశమైంది. నారాయణను జైలుకు పంపడం గ్రామాల్లో ఈ రోజుల్లో జరిగే సామాన్య సంఘటనేగాని, సత్యాన్ని పంపిన విషయం అసహజంగా అతికించినట్లుంది. సత్యం గదిలో చూపిన మాణిక్యం నృత్యం, చేష్టలు చాల అసహ్యంగా ఉన్నవి. నారాయణ పాత్ర ధరించిన శివరామ్, చాకలిపాత్ర ధరించిన కనకం, షావుకారుగా సుబ్బారావుగారు రంగడి పాత్రధరించిన రంగారావు అద్భుతంగా నటించారు. కనకం తనప్రజ్ఞను చక్కగా చూపకలిగింది. జానకి నటన మొదటిమారు గనుక కొంచెం బెదురుతూంది.

చక్రపాణిగారి సంభాషణలు, దీపావళి పండుగ నాటి దృశ్యాలు, ఫోటోగ్రఫీ చక్కగా ఉన్నవి. సంగీతంబాగానే ఉన్నది. చిత్రంలో ఉన్న చిన్న చిన్న లోటు పాట్లను సరిచేసుకున్నట్లయితే ఇంకా బాగా రాణించేది. జి. ప్రభ.

★

స్త్రీవిద్య

"సత్య"

"దేశీయుల్లోగల విద్యావికాసాలపైన, ఆదేశసభ్యతా సంస్కృతు లాధారపడి ఉంటాయ"నేది విశ్వజనీనమైన సార్వకాలిక సత్యం. విద్యా విజ్ఞానాలు లేకుండా సంస్కృతి లభిస్తుందనుకోవడం ఉపకరణాలు లేకుండా ఉత్పత్తిజరుగు తుందనుకోవడం వంటిది. నాగరికతాజీవితవృక్షానికి "విద్య" మూలమయితే, సంస్కృతి ఫలంవంటిది. మూలరహితమైన వృక్షమూ తద్వారాఫలమూ ఎట్లు శూన్య ములో, అట్లే విద్య లేనిజాతికి సభ్యతా, సంస్కృతీ అందని మ్రానిపండ్లు. కనుకనె విద్యకూ విద్యార్థికి అనాదినుండీ అఖండ గౌరవ ప్రతిపత్తులున్నాయి. చతుస్స ముద్ర ముద్రిత భూవలయ సామ్రాజ్యాధిపతి అయినా సరే విద్యావంతుని ముందు శిరస్సువంచి భక్తినమ్రతలు ప్రదర్శిస్తాడంటే విద్యకుగల ప్రాధాన్యత ఎంతటిదో గుర్తించవచ్చు. మనపూర్వీకులు విద్యకుగల ప్రాముఖ్యతను గ్రహించబట్టే "విద్యలేనివాడు వింతపశువు" అనేసూక్తి జన్మించింది. ప్రప్రథమముగా వ్యక్తిగతజీవితానికి సౌఖ్యాన్నిచ్చి, తదుపరి సంఘమునకూ దేశమునకూ జాతికీ మేలుకూర్చేది విద్య. వ్యష్టి సమిష్టి జీవితాలకు సౌఖ్యాన్నిచ్చు విజ్ఞానాన్ని ప్రసాదించే విద్యను అభ్యసించడానికి, కులాలు, వర్గాలు, మతాలు ఏవిధంగానూ అడ్డంకులు కావు. ప్రతివ్యక్తీ విద్యనభ్యసించిననాడే, జాతికి విజ్ఞానోదయమై సభ్యతా ప్రపంచంలో విశిష్టస్థానం లభిస్తుంది.

ప్రస్తుతప్రపంచంలో నిరక్షరాస్యత ప్రబలంగాఉన్న దేశాల్లో మన భారతదేశం మొట్ట మొదటది. పూర్వం, విద్యా నిలయం అని పేరొందిన భరతఖండంలో, నానాటికి విద్యా సక్తి నశించి, నేటికీ పరిణామాన్ని చెందింది. ఒకనాడు ఖండ ఖండాంతరాలనుంచి విద్యాభ్యాసానికి, మనతక్షశిలా విద్యాలయాలకీ, మన నలందా విశ్వవిద్యాలయాలకీ, విద్యార్థులు తరిలి వచ్చేవారు. అట్టి మహోన్నిత విద్యానిలయమేనా నేడు విద్యాగంధశూన్యుల కాలవాలమై ప్రపంచ దృష్టిలో అవహేళనగా చూడబడుతూ ఉన్నది? దీనికి కారణం?

భారత మహిళను విద్యా నిలయాలనుంచి దూరము చేశాము.

అదేలోపం. ఏనాడైతే, "స్త్రీకివిద్య అనవసరము, స్త్రీది వంటింటిజీవితం, ఆ 'పాకజీవితానికి' విద్య అవసరంలేదు, విద్య పురుషునిసొమ్ము, అతనిననుసరిస్తూ అతనిఛాయల్లో నడచేస్త్రీకి విద్యాభ్యాసానికి అర్హతలేదు" అనేమూర్ఖపు భావాలు భారతీయుల హృదయాల్లో ప్రవేశించాయో ఆనాడే భారతీయ విజ్ఞానశ్రీ పతనానికి నాందివాచకం పలకబడింది. ఆనాడే భారత సంస్కృతీ యశోలలా మనెన్నొసట కళంక పంకరేఖ పులుమబడింది. ఏమంటే.

బాలురు, జాతిఉజ్వల భవిష్యత్పథనిర్మాతలు. వారిలో కలిగేవికాసాలపైనా, వారికి లభించే విద్యావిజ్ఞాన సంపత్తిపైన, వారిని పెంచి భావిపౌరులుగా తయారు చేయడానికి అవలంబించే వివిధ మార్గాలపైనా జాతి భవిష్యత్ ఆధారపడి యుంటుంది. జాతి అభ్యుదయానికి బాలురను భావి పౌరులుగా తయారు చేయడం అత్యంత దుర్ఘటమైనకార్యం. పిన్న వారికి ఆవయస్సులో (అంటేఐదారుసంవత్సరముల వయస్సులో) ఉపదేశించిన విషయాలే, నేర్పినఅలవాట్లే, బోధించిన నీతినియమాలే బీజములై వారివారివ్యక్తిగత జీవితానికి ఆధార భూతములయ్యేవి. ఆవయస్సులో బాలురకు అత్యంత సన్నిహితంలో ఉండేదిస్త్రీ (తల్లి) మాత్రమే! అంటే ఈ పైబాధ్యతలు అన్నీ ఆమెపై ఉంటాయన్న మాట - ఆమె పిల్లలను పెంచే పద్ధతిపైనా ఆమె బాలురకు గఱపే శిక్షణపైనా జాతి భవిష్యత్తు అంతా ఆధారపడి యుంటుంది. దీనినిబట్టి స్త్రీయొక్కపాత్ర, దేశీయ సంస్కృతీ చరిత్రలో ఎంతటి ప్రముఖమైనదో గ్రహించ వచ్చు. అట్టి స్త్రీయేకనుక విద్యా విహీనయై "వంటింటి జీవితా"నికే అలవాటుపడి తక్కిన ప్రపంచాన్ని గుర్తించలేని అయోమయస్థితిలో ఉంటే ఇంక ఆమె తన పిల్లలను ఆదర్శమూర్తులుగాపెంచి, భావిదేశీయ చరిత్రను

అభ్యుదయపథగామిగా చేయడానికి ఏవిధంగా సహకరించగలదు ?...............

కనుక "స్త్రీకివిద్య అనవసరము" అనేభావమే, మన పెద్దల మస్తిష్కాలలో ప్రవేశించి, వారిని క్షమించరాని దోషులుగాచేసింది అనేదిప్రస్ఫుటము. వారి యీ సంకుచితభావమే, యీ తప్పుదారే, మన భారత సంస్కృతీ నిలయాన్ని పడగొట్టి, నేడు తక్కిన ప్రపంచంలో భారతీయుల స్థితిని ఇంత అధ్వాన్నముగా చేసింది———

ఇప్పటికైనా కన్ను తెరిచి, అనాదిలో భారతనారికి గల విద్యావికాసాలు జ్ఞప్తికితెచ్చుకొని, ఈమధ్యకాలంలో పెద్దలు అవలంబించబడ్డ వక్రగతిని గుర్తించి. మహిళలకు విద్యాభ్యాసానికి అవకాశములు కల్పించిన సంస్కర్తలకు మనమెల్లరమూ హృదయపూర్వక భక్త్యంజలులు సమర్పింపవలసినదే !

అయితే, మనము ఆశించినంతగా, మనము కలలుగన్నంతగా పరిస్థితులు ఇంకా పరిపూర్ణ పరిపక్వపరిణామము చెందలేదు. ఇంకా తలిదండ్రులు తమస్త్రీసంతానాన్ని విద్యానిలయాలకు పంపడానికి జంకుతున్నారు. పాఠశాలల్లో కూడ విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే విద్యార్థినుల సంఖ్య అత్యల్పము. వారైనా నిర్భీతిగా విద్యాభ్యాసము చేస్తున్నట్లు నాకు విశ్వాసములేదు వీటన్నిటికీ కారణమేమిటి ? ఈ వి సమూలంగా, కూలంకషంగా, పరిశీలించి పరిష్కరిస్తేనే గాని మనం ఆశించినంతగా స్త్రీవిద్య మనదేశంలో అభివృద్ధి చెందలేదు - చెందదు.

పెద్దలు వెనుకాడుటకు కారణం, గ్రుడ్డిసంఘం ఏదో అంటుదని, లోకం ఆక్షేపించి అనవసరమైన అపనిందలు తమపై ఆరోపిస్తుందనీ భయపడటం తప్పిస్తే వేరుగా కనుపించటంలేదు. ఇతరుల అనవసర విమర్శనలకు గురికానిపక్షంలో నేటి యీ తల్లిదండ్రులలో యెంతమంది తమ స్త్రీసంతానానికి విద్యాభ్యాసానికి అవకాశాలు కల్పిస్తారన్నది కూడా విమర్శించవలసిన విషయమే ! అయితే 'సంఘవిమర్శన' అనేది లేనిపక్షంలో పరిస్థితి ఆశాజనకంగా మారుతుందనేది మాత్రం నిర్వివాదాంశము.

కనుక ప్రజల్లోగలభయాన్నీ, స్త్రీవిద్యయందు సంఘమునకుగల విముఖతనీ మార్చడానికి, ప్రబోధప్రచారాలు అత్యవసరము. స్త్రీవిద్యాభ్యాసముచేసినంతలో ఆమెకు ఎట్టికళంకమూ లేదని చెప్పిఒప్పించి సంఘమునకు కనువిప్పు కల్గించాలి. క్రమేపీ మహిళా విజ్ఞానమువలన లభించేసత్ఫలితాలవలన లోకంలో నేడు ఉన్నమూర్ఖత సడలి పరిస్థితులు ప్రస్ఫుటంగా ప్రదర్శితమౌతాయి. ఇందుకు, ఉపన్యాసాలకన్న, కొందరువ్యక్తులు ప్రప్రథమములో ముందునిలిచి ఆచరణ జరిపితేమంచిది. ఇచ్చేఉపన్యాసాల్ని ఉపయోగంలోనికి తేలేనినాడు ఆఉపన్యాసాలకు విలువ నశిస్తుందనేది అందరకూ తెలిసిన విషయమేకదా !

విద్యార్థినులు నిర్భయంగా పాఠశాలలకు పోయి విద్యనభ్యాసించడానికి విముఖత చూపుతున్నారంటే దీనికి కారణం పూర్తిగా సోదర విద్యార్థుల ప్రవర్తనయే !

విద్యార్థులు క్షమిస్తే,

విశాలహృదయులమనీ, విజ్ఞానవంతులమనీ విఱ్ఱవీగే విద్యార్థులు సోదరీ విద్యార్థినుల పట్లప్రవర్తించేనడవడి, అనాగరికుడైన అడవి జాతిమనిషికి కూడ అసహ్యమనిపిస్తుంది. మీటింగులలోనూ, ఉపన్యాసవేదికలమీదా, బల్లగుద్ది, గొంతుచించుకొని "సోదరీమణులారా !" అంటూ చెప్పే వాక్యాలకూ, చేసేకార్యాలకు సహస్రాంతం భేదముంటోంది. వేదికదిగేవరకూ, ఉపన్యాసంలో ఉపసంహారము పల్కేవరకూ ఉన్నభావాలూ ఆశయాలూ, ఒక్కమాటు హటాత్తుగా ఉపన్యాసం ముగించగానే మటుమాయమౌతాయేమో !

• •

పాఠశాలకు వచ్చింది మొదలు తిరిగి వెళ్ళేవరకూ, ప్రతినిత్యమూ ఇల్లుకదిలి స్కూలుకు వెళ్ళి తిరిగి వచ్చేవరకూ విద్యార్థినులు తమప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని, ఏ విద్యార్థి అసభ్యంగా ప్రవర్తిస్తాడోఅని భయపడుతూ బెదురుతూ ఉండవలసినంత శోచనీయస్థితి ఎందుకు ఏర్పడాలి ? ప్రతివిద్యార్థీ (అందరూ అనికాదు. నూటికి 90 మంది) ఏదోఅవకాశాన్ని పురస్కరించుకుని తోటి విద్యార్థినిని హేళనచేయటానికీ, అవమానించడానికీ

స్త్రీ విద్య

ప్రయత్నించి ఆమె మనస్సుని బాధ పెడతాడుగదా, అతని కానిరంకుశత్వపు హక్కు ఏవిధంగా లభించిది? ఏ విద్యార్థి అయినా ఈవిషయాన్ని గుండెలపై చేయివేసుకొని ప్రశ్నించుకున్నాడా? అట్లేచేసిన పక్షంలో మరు క్షణం నుంచి అతడు మారితీరుతాడు. కనుకప్రస్తుతం పాఠశాలల్లో గల పరిస్థితులుకూడా మారితేనేగాని స్త్రీవిద్య ఆశాజనకంగా అభివృద్ధిచెందదు. యిందుకు విద్యార్థుల నిష్కళంక హృదయ పరివర్తన ఎంతో అవసరము.

చదువుకొనే బాలికలలోకూడ (ఇదియువతులలో ఎక్కువ) లోపాలు లేకపోలేదు. వీథిలో ఎదురు వచ్చే ప్రతివ్యక్తీ తనవైపేచూస్తునాడని ఊహించుకొని అనవసరమైన కంగారుతో మనోనిశ్చలతలేకుండా భయంతో ప్రవర్తించడం తగదు. తగినంతగా మనోధైర్యాన్ని వహించి నిర్భీతిగా ఉండటం అవసరం. మరొక్కవిషయం - ఇతరులదృష్టిని ఆకర్షించాలనే అభిప్రాయంతో అలంకరించుకొని పాఠశాలకు బయలుదేరడం, విద్యార్థినులు కొందరిలో ఉన్నగొప్ప లోపం. అందువలన కూడా విద్యార్థులు, విద్యార్థినులపట్ల విపరీతంగా ప్రవర్తిస్తారంటే సోదర విద్యార్థినులు అనవసరంగా ఆగ్రహించరని ఆశ! ఏమంటే లోపాలుపూర్తిగా విద్యార్థులలోనే లేవు-కొంతపాలు విద్యార్థినులలో కూడా ఉన్నవి. ఇదిఎల్లరకూ తెలిసినవిషయమే! మనకున్నలోపాలు మనమే విమర్శించుకొని సరిచేసుకోవడం ఉత్తముల లక్షణం.

కనుక ఇతరదేశాల్లో మనభారత దేశానికి పూర్వంగల విశిష్టస్థానాన్ని సంపాదించాలంటే, స్త్రీ విద్యను ఇతోధికంగా ప్రోత్సహించి ఉన్నతస్థానానికి తీసుకురావాలి. అందుకుగాను పైన పేర్కొన్న పరిస్థితులు గమనించి స్త్రీ విద్యకు నిష్కంటకమైన రహదారి నేర్పరచాలి - నాడే మహిళాభ్యుదయం! నాడే దేశాభ్యుదయం!! ఆనాడే మానవాభ్యుదయం!!!

★






ఆంధ్రమహిళాసభ - 1950 మార్చిలో కాశీ ఎడ్మిషన్ పరీక్షకు వెళ్లిన విద్యార్థినులు, ఉపాధ్యాయవర్గం.



ఆంధ్రమహిళాసభ 1949-50 పారిశ్రామిక శాఖ

Regd. No. 4753

ఆంధ్ర చలనచిత్ర జగతిలో
ఒక నూతన శకమును ప్రారంభించిన
అపూర్వ జానపద చిత్రము...



వాహినీ వారి

గుణసుందరి కథ...

ఇప్పుడు ప్రతి కేంద్రమందును
శత దినోత్సవములనందుకొనుచున్నది..

డైరెక్టర్... కె.వి.రెడ్డి, B.Sc. (HONS) స్టూడియో.. వాహిని

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.
Printed by M. Satyanarayana at the H. Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras